UNIVERSAL
LIBRARY
OU_204136
UNIVERSAL
LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T891.231 S69K Accession No. P. G. T2614

Author సోమదేవభట్ట.

Title కథా సరిత్సాగరము. సం-1. 1-23 తరం

This book should be returned on or before the date last marked below.

1 ముద్రు-1930

కథా సరిత్సాగరము

(సంపుటము: 1)

శ్రీ సోమదేవ భట్ట ప్రణీతము

(1–23 తరంగములు)

తల్లావజ్ఝుల శివ శంకర శాస్త్రి
తల్లావజ్ఝుల కృత్తివాస తీర్థులు
సంస్కృతమునుండి తెలిగించినది

2½ రూ

ప్రచురణకర్తలు: అడ్డేపల్లి అండ్ కో
సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

సర్వస్వామ్యములు ప్రకాశకులవి :
ప్రథమ ముద్రణము 1950

Saraswathi Power Press, Rajahmundry
Printed and Published by
A. Nageswara Rao
For Addepally & Co., Educational Publishers
Order No. 3434/1950



క్రీ. శే. శ్రీ అద్దేపల్లి లక్ష్మణస్వామి నాయడుగారు

(ప్రకాశకులు)

అద్దేపల్లి కులాంభోధి
శశినే, రసచేతసే,
గ్రంథప్రణయినే, దత్తా
లక్ష్మణ స్వామినే కృతిః.

మవుతుంది. అందులో పంచతంత్ర శేతాళ పంచవింశతికలు లేవు. వీటిని అతిక్రమించకుండా కవి సరవాహనదత్తచరిత్ర రచించినా డట. అందులో మదనమంచుకను రాజపుత్రికను చేసినాడు.

ఈకథను బుధస్వామి నేపాళదేశములో ముడిపెట్టినాడు. ఆర్ సర్గలకు బదులు ప్రస్తుతము ఆరుభాగాలు మాత్రమే ఉన్నవి. పైశాచీ మాతృకలో సరవాహనదత్తుని వ్యాపారాలే ఉన్నవట. ఆర్ భాగాలుగా శ్లోకసంగ్రహములో ఉపకథలు లేవు. కాశ్మీరపాఠముల వర్ధతికీ, ఇందులో అనుక్రమణికకూ కొంత భేదము ఉన్నది. పైశాచీగ్రంథమును బుధస్వామి సముఖాన ఉంచుకొని సంస్కృతీకరించినట్లు తోస్తుంది.

గోవర్ధనాచార్యుడు, యశస్తిలక చంపూకర్త సోమదేవసూరి, ధనంజయుడు, త్రివిక్రమభట్టు, బృహత్కథను పొగడినారు. క్రీ. శ. ౮౭౫ సంవత్సరములో కాంబోడియా దేశములో ఒకానొక శాసనములో గుణాఢ్యుని నామధేయమూ, ఆయనకు ప్రాకృతభాషమీది విరక్తీ లిఖించి ఉన్నవి.

క్రీ. శ. ౭ శతాబ్ది పూర్వార్ధములో రాజ్యము చేసిన గాంగవంశ ప్రభువు అవినీత మహారాజు కుమారుడు దుర్వినీతుడు బృహత్కథను సంస్కృతీకరించినట్లు శాసనములవల్ల తెలుస్తుంది. జైనాచార్య డయిన పూజ్యపాదునికి దుర్వినీతుడు శిష్య డట.

"కువలయానంద" వరికరప్రకరణములో — "చిత్రార్థాం న బృహత్కథా మచకథం" అని కనబడుతుంది. "అతిదీర్ఘజీవిదోషా ద్వ్యాసేన యశోపహరితం హన్త కైర్నిచ్ఛేత గుణాఢ్యః స ఏవ జన్మాంతరావన్నః"

"శ్రీ రామాయణ భారత బృహత్కథానాం కవీన్ నమస్కుర్మః" అని గోవర్ధనాచార్యుని ఆర్యాసప్తశతిలోనూ; "రామాయణాది చవిభావ్య బృహత్కథాం చ" అని ధనంజయుని దశరూపకములోనూ;

"శశ్వద్బాణ ద్వితీయేన సముదాకార ధారిణా ధనుషేన గుణాఢ్యేన నిశ్శేషో రంజితో జనః" అని త్రివిక్రముని దమయంతీకథా చంపువులోనూ; "భూతభాషామయీం ప్రాహు రద్భుతార్థాం బృహత్కథాం" అని క్రీ. శ. అష్టమశతాబ్దిలో ఆచార్యదండి విరచిత కావ్యాదర్శములోనూ; "బృహత్కథారంభైరివ శాలిభంజికోత్పత్తైః" అని క్రీ. శ. సప్తమ శతాబ్దిలో సుబంధుకవి విరచిత వాసవదత్తలోనూ;

"సముద్దీపిత కందర్పా కృతగౌరీప్రసాధనా హరలీలేవ నో కస్య విస్మయాయ బృహత్కథా!" "బృహత్కథాకుశలైన-" అని క్రీ. శ. సప్తమ శతాబ్దిలో, నర్మదాతీరవాసి అయిన భట్టబాణుని హర్షచరిత, కాదంబరీ గ్రంథాలలోనూ; "ప్రద్యోతస్య ప్రియదుహితరం వత్సరాజోఽత్ర జహ్రే; ప్రాప్తా వన్తీ నుదయన కథాకోవిదగ్రామ వృద్ధాన్;" అని క్రీ. పూ. ప్రథమశతాబ్దిలో కాళిదాస కవీంద్రుని మేఘదూతములోనూ కనబడుతున్నవి.

క్రీ. పూ. ద్వితీయ శతాబ్దిలో ఉన్న భాసకవి బృహత్కథను అనుసరించి ప్రతిజ్ఞాయౌగంధరాయణము, స్వప్న వాసవదత్త మొదలయిన నాటకాలు రచించినాడు. బృహత్కథలోని నోమఖుడు యౌగంధరాయణుడుగానూ, మదనమంచుక వసంతసేనగానూ, భాసుని రచనలలో మారిపోయినారు. పైన ఉదహరించిన సంగతులను బట్టీ, ఇతర చారిత్రాంశములను బట్టీ గుణాఢ్యుడు క్రీ. పూ. 300 మొదలు 0౫౦ సంవత్సరప్రాంతాలలో వర్ధిల్లినా డని పురాతత్త్వవేత్తలు నిర్ధారణ చేసినారు.

3

మహామాహేశ్వరు డయిన జయద్రథుడు తన హరచరిత చింతామణిలో, 22 ప్రకాశములో శబ్దశాస్త్రావతార ఘట్టములో గుణాఢ్యునికథ లిఖించినాడు. క్షేమేంద్రుడూ సోమదేవుడూ గుణాఢ్యుని చరిత్ర వ్రాసినారు. వారి వ్రాతలన్నిటిలో గుణాఢ్యునిది దైవమానుష జన్మగా కనిపిస్తుంది. అయనతల్లి బ్రాహ్మణకన్య, తండ్రి నాగప్రభువు, శాతవాహనప్రభువుల రాజధాని అయిన ప్రతిష్ఠాన (సుప్రతిష్ఠిత) పురములో అయన జననము.

అప్పటిరాజు శాతకర్ణి కావచ్చు. కథాపీఠలంబకములో రాజు జలక్రీడా వృత్తాంతములో సంస్కృత వ్యాకరణ ప్రశంసాదులనుబట్టి రాజు హాలుడై ఉండవలె. విమర్శకు ఈవిషయము నిలవదు. కథలో కొన్ని విషయాలు సునంగతముగా లేవు. గ్రంథాంతరంగ పరీక్షవల్ల గుణాఢ్యుడు ఉజ్జయినీ పురవాసి అని తేలుతుంది.

గుణాఢ్యుడు కాశ్మీరకుడా, నేపాలీయుడా, ఆంధ్రుడా? నేపాళము వారు ఆయన తమదేశీయు డన్నారు. అది అసంగతము. డాక్టర్ Winter Nitz మతప్రకారము గుణాఢ్యుడు కాశ్మీరకుడు. దానికి తగిన కారణాలు కనపడవు. ఇక ఆంధ్రవాదము మిగిలింది.

పాటలీ పుత్ర ప్రభువు నందుడూ, సుప్రతిష్ఠిత (ప్రతిష్ఠాన) ప్రభువు సాతవాహనుడూ సమకాలికులు. గుణాఢ్యునికీ సాతవాహన ఆంధ్ర రాజుకూ చాలా సంబంధము ఉండడము స్పష్టము. కాబట్టి గుణాఢ్యుడు ఆంధ్రుడు కావడానికి ఎక్కువవీలు కనబడుతున్నది.

బృహత్కథా విధానము, రామాయణ మహాభారతముల ధోరణిని పోలి ఉన్న దట. బృహత్కథా బీజాలు క్రీ. పూ. చాలా శతాబ్దులు వెనుకకు వెళ్ళుతవి. వివిధకథలను సంగ్రహించి, ప్రణాళిక ఏర్పరిచి, పైశాచీభాషలో రచించినాడు గుణాఢ్యుడు.

బృహత్కథ గద్యాత్మకమా, పద్యాత్మకమా? వచనరూపములోనే రచన జరిగిం దని ప్రాన్సుదేశ పండితుడు Lacote అన్నాడు. అయితే, ఇన్నిలక్షల గ్రంథము చేస్తినాడు అని కథాపీఠలంబకములో ఉన్న మాట లకు గతి యేమిటి? సంస్కృతభాషలో గ్రంథము అంటే 32 అక్షరాల పద్యసముదాయము. ఒకవేళ దానిని వచనానికికూడా అన్వయించ వచ్చు నేమో.

గద్య మయినా పద్య మయినా బృహత్కథ ఆదినుంచీ ఆదరమే పొందింది. కవులు, లాక్షణికులు, (వ్యంగ్యముగా) కవితయములో వాల్మీకి, వ్యాస, గుణాఢ్యులను ప్రశంసించారు.

గుణాఢ్యునిప్రభావము చాలామంది గ్రంథకర్తలమీద పడ్డది. ముఖ్యముగా దండ్యాచార్య, కల్హణపండిత ప్రభృతులమీద ప్రస్ఫుటము.

పైశాచీభాష ప్రాకృతభాషలలోదో,

౪

పైశాచీమాతృక కానీ, అందులో భాగాలు కానీ, ఇప్పుడు లభ్యము కావడము లేదు. క్రీ. శ. తొమ్మిదవ శతాబ్దివరకూ పైశాచీగ్రంథమున్నట్టు బుధస్వామివల్ల తెలుస్తుంది. హ్రేమేంద్రుడు కాని, సోమదేవుడు కాని, పైశాచీమాతృక చూచారా అని సందేహము. ఈకవులిద్దరికీ లభించినది గుణాఢ్యకృతి కాదని పాశ్చాత్యవిజ్ఞుల మతము. పైశాచీమాతృకను ఆధారము చేసుకొని, మూలములో ఉన్న కొన్ని విషయాలు తీసివేసి, కొన్ని నూతనాంశాలు చేర్చినగ్రంథ మది అనవచ్చు. అయితే అది పైశాచీలో ఉన్నదా, ఆనాటి కాశ్మీరీభాషలో ఉన్నదా? కథాపీఠలంబకములో ఉన్న విషయా లన్నీ యథార్థము అనడానికి వీలు లేదు. హ్రేమేంద్ర సోమదేవులు బుధస్వామిగ్రంథమునో, కాశ్మీరీ అనువాదమునో చూచినా రని భావించవచ్చు.

హ్రేమేంద్రుడు ఉత్తమగ్రంథాలను సంగ్రహించి రామాయణమంజరి, భారతమంజరి, బృహత్కథామంజరి రచించినాడు. ఆయనకు కథాదృష్టి కన్న ధర్మదృష్టి ఎక్కువ కావడముచేత రచనలో స్వారస్యము తక్కువ. హ్రేమేంద్రుడు అనుసరించిన కాశ్మీరకపాఠములో పంచతంత్రము, బేతాళపంచవింశతి మొదలయినవి ఉన్నవి. గుణాఢ్యునికృతిలో అవి లేవట.

౫

కథాసరిత్సాగరములో ౧౮ లంబకములు, ౧౨౪ తరంగములు, ౨౪,౦౦౦ శ్లోకములూ ఉన్నవని Arthur Macdonell మహాశయుని లెక్క. ౨౧, ౫౦౦ అని మరికొందరి గణన. కవి విశేష భాగము అనుష్టుభ్ఛందస్సులో గ్రంథము నడిపినాడు. అక్కడక్కడ

ఇతర సంస్కృతవృత్తాలుకూడా తగులుతూ ఉంటవి. పుస్తకమంతా పురాణధోరణిలో కాఠిన్యము లేకుండా, సరళరీతిలో సాగిపోయింది. ఇందులో ద్వితీయ తృతీయ చతుర్థ లంబకాలు ఒకశ్రేణిలో ఉంటవి. పంచమ అష్టమ లంబకాలకూ కథాగమనానికీ సందర్భశుద్ధి తక్కువ. ఆరవ లంబకము ధోరణి చూస్తే, తగినంత ప్రాతివదిక లేకుండా నూతన కథా ప్రారంభ మయినట్లు కనిపిస్తుంది. ఏడు తొమ్మిది పదకొండు లంబకాలకు కూర్పుబిగువు తక్కువ. అవి వివాహాలతో మాత్రము సమాప్తి పొందుతవి. ౧-౨, ౧౩ లంబకాలు సునంగతము లయినప్పటికీ ౧౪-౧౫, ౧౭-౧౮ లంబకాల తర్వాత ఉండడము ఉచితము. ౧౬ లంబకాన్ని విభజించవలె. పూర్వభాగము ఆరవలంబకానికి పీఠిక అవుతుంది. ఉత్తర భాగము సరిగా అతకదు.

సోమదేవుడు ఆరవ లంబకమునుంచీ ఉపకథలు చేర్చి, నాయకుని వీర కృత్యములు వివరించి స్వారస్యము సమకూర్చినాడు. అవాంతరకథలలో సామాన్యజనుల విశ్వాసాలు ద్యోతకమవుతవి. కాశ్మీరదేశములో ఉండే కొన్ని మూఢవిశ్వాసాలు కవి ఇందులో కూర్చినాడు. బౌద్ధుల జాతక కథాంశములు, మాంత్రికులచేష్టలు, పిట్టకథలు, మొదలయినవి కూడా చాలా చేరినవి. గ్రంథానికి ఏకవాక్యత సమకూర్చడానికి కవి కష్టించినాడు. సోమదేవుడు గాణాపత్యునివలె కనబడతాడు. విశేషముగా గణపతిస్తుతి చేసినాడు. శివస్తుతికూడా వెంటవెంటనే ఉంటుంది. గ్రంథములో చాలాచోట్ల వింధ్యవాసినీదేవి ఆరాధన కనిపిస్తుంది. ఆకాలపువారికి కొండదేవతమీద దండిగా భక్తి ఉండాలి.

మానవచరిత్రలు దుఃఖభూయిష్ఠము లనీ, దివ్యుల చరిత్రలు సుఖమయము లనీ, అందుచేత వైచిత్రికి లోపు తక్కువ అనీ, ఈ గ్రంథములో దివ్యమానుష కథలు కవి వర్ణించినాడు. కథాపీఠములోనే ఈ ప్రతిజ్ఞ ఉండడముచేత చదువరులకు సంశయనా విరహము కలగదు.

సంభావ్యశ్రేణి దాటనికథలూ, ఘట్టములూ అనేకము కథాసరిత్సాగర
ములో కలిసిపోయినవి. రాజచరిత్రలే కాకుండా, బ్రహ్మ క్షత్రియ
వైశ్యుల కథలూ, కర్మకారుల కష్టసుఖ వృత్తాంతములూ, వణిక్పుత్రుల
వ్యాపారవిశేషాలూ, సముద్రయానపరుల సాహసకృత్యాలూ, ద్వీపాం
తర వాసుల స్థితిగతులూ, విచిత్ర చరిత్రలూ విరివిగా ఇందులో పొందు
పరచి కవి రాజపత్ని సూర్యమతీదేవికి నమోన్మాదము నమకూర్చినాడు.

ఇందులో కథలను పోలినకథలను సంస్కృతములో కొందరు రచించినారు.
దక్షిణాపథమున మహిళాపురమును క్రీ. శ. ఆరవ శతాబ్దిలో పరిపా
లించిన అమరశక్తి ప్రభుకుమారులకు విష్ణుశర్మ పంచతంత్రము చెప్పినాడు.
ధవళచంద్రప్రభువు ఆనతిప్రకారము నారాయణుడు 'హితోపదేశము'
చేసినాడు. కొద్దిమార్పులతో అది పంచతంత్రమువలెనే ఉంటుంది.

విక్రమార్కుడు నాయకుడుగా 'బేతాళ పంచవింశతి' వల్లభదాను
వ్రాసినా డని కొందరూ, జంభదత్తుడు చేసినా డని కొందరూ అన్నారు.
"విక్రమార్క చరిత్రము" నందికేశ్వరుడు (నందికేశ్వరుడో?)
రచించినది.

"శుకసప్తతి" క్రీ. శ. ఏకాదశ శతాబ్దికి పూర్వమే ఉన్నట్టు ఊహ.
ఈ కథాసరిత్సాగర పఠనమువల్ల వినోదమే కాకుండా వివిధవిషయ
జ్ఞానముకూడా కలుగుతుంది.

ఇతి శివమ్!

సాహితీ సమితి
రాజమహేంద్రవరము
౧ అక్టోబరు, ౧౯౪౫

శివశంకర శాస్త్రి

విషయానుక్రమణిక

1. కృతి
2. ప్రకా. విజ్ఞప్తి
3. పీఠిక

తరంగము: ౧ [కథాపీఠలంబకము]

జ్వాలాలింగ కథ 2
దక్షయజ్ఞము 3
పుష్పదంతాదుల శాపవృత్తాంతము 4
ప్రమథులు 5

తరంగము: ౨

వరరుచి కాణభూతిని చూచుట 6
కాణభూతి వృత్తాంతము 7
వరరుచి కాణభూతికిబృహత్కథచెప్పుట 8
వరరుచి జననము ,,
వ్యాడి, ఇంద్రదత్తుడు, కలిసికొనుట 9
వ్యాడి ఇంద్రదత్తుల వృత్తాంతము ,,
వర్షోపాధ్యాయుల కథ 10
వ్యాడి, ఇంద్రదత్తుడు వరరుచిని వర్షోపాధ్యాయుని వద్దకు కొనిపోవుట 11
వ్యాడీంద్రదత్త కాత్యాయనుల విద్యాభ్యాసము 12

తరంగము: ౩

పాటలీ పుత్రకథ 13
బ్రహ్మదత్తుని కథ 15
పాటలీ పుత్రకుల గాంధర్వము 17

తరంగము: ౪

వరరుచి ఉపకోశను దర్శించుట 19
పాణిని కథ 20
ఉపకోశ పాతివ్రత్యము 21
ఉపకోశ సమయస్ఫూర్తి 22
వరరుచి వార్తికములు చేయుట 24
ఇంద్రదత్తుని పరకాయప్రవేశము 25
యోగనందుడు శకటాలుని చీకటి నూతిలో పెట్టించుట 26
యోగనందుని సామ్రాజ్యము 27

తరంగము: ౫

శకటాలుడు మంత్రిఅగుట 28
వరరుచి యింగితజ్ఞానము ,,
శుష్కమత్స్యము నవ్వుట 29
యోగనందుడు వరరుచిని సంహరింప శకటాలుని కోరుట 30
రాక్షసుడు—గంగాదేవి 31
మంత్రి శివశర్మకథ 32
వరరుచి హిరణ్యగుప్తుని శాపముతీర్చుట 34
చాణక్యుడు యోగనందుని సంహరించుట 36
వరరుచి దివ్యగతి పొందుట 37

తరంగము: ౬

గుణాఢ్యుని కథ 39
ఎలుక పెట్టి కథ 40
సామవేది మూఢునికథ 42
జీవికృతోద్యాన కథ 43
సాతవాహనుని పూర్వవృత్తాంతము 44
అతనిని రాణి అవమానించుట 46
శర్వవర్మ సాతవాహనుని సంస్కృత విద్వాంసుని చేయుట 47

తరంగము : ౭

శర్వవర్మకు స్వామి ప్రసన్నుడయిన విధము 50

పుష్పదంతునికి ఆపేరువచ్చిన కారణము 52

దేవదత్తునికి పంచశిఖుడు తోడ్పడుట 54

శిబిచక్రవర్తి కథ 55

మాల్యవంతునికిఆపేరుకలిగిన కారణము 57

తరంగము : ౮

గుణాఢ్యుడు బృహత్కథను సాతవాహనునికి పంపుట 58

తరంగము : ౯

శతానీకుని కథ 61

శతానీకుడు దేవేంద్రునికి తోడ్పడుట ,,

శతానీకుడు మృగావతిని వివాహమాడుట 63

మృగావతిని పక్షి తన్నుకొని పోవుట ,,

మృగావతి జమదగ్ని ఆశ్రమమున నిక్షేపించుట 65

వసుసేమి ఆసేనాగుని ఉదయనుడు రక్షించుట 66

తరంగము : ౧౦

శ్రీదత్తుని కథ 67

శ్రీదత్తుడు విద్యుత్ప్రభను వీక్షించుట 69

రాక్షసీశాప విమోచనము 72

శ్రీదత్తుడు మృగాంకవతిని హరించుట 73

శ్రీదత్తుడు శబరకన్యను వివాహమాడుట 76

మృగాంకవతి సమాగమము 77

శ్రీదత్తుడు శూరసేనరాజకన్యను పెండ్లియాడుట 79

సహస్రానీకుడు మృగావతిని కలుసుకొనుట 80

తరంగము : ౧౧

చండమహాసేనుని చాత్యము 82

చండమహాసేనుని ప్రభావము 84

తరంగము : ౧౨

యంత్రగజము 87

వత్సరాజు వానవదత్తకు గాంధర్వ విద్య నేర్పుట 89

కూగంధరాయణుడు ఉజ్జయినికి పోవుట ,,

బ్రహ్మరక్షస్సు యౌగంధరాయణునకు మిత్రమగుట 90

యౌగంధరాయణ వత్సరాజుల సమాశ్లేషము ,,

లోహజంఘుని కథ 92

లోహజంఘుడు లంకచేరుట 93

విభీషణుడు లోహజంఘుని సత్కరించుట 94

లంకానిర్మాణము 95

లోహజంఘుడు విహాగారూఢుడై మధురాపురము చేరుట 96

లోహజంఘుడు వేశ్యమాతకు శాస్తి చేయుట 97

తరంగము : ౧౩

వాసవదత్త హరణము 99

దేవస్మిత కథ 102

అమ్లాన కమలములు 104

సిద్ధకరి ప్రజ్ఞ 105

పరివ్రాజిక యౌగకరండికపన్నాగము 10

వసీకర్కు మారులకు శిక్ష 108
కీర్తిమతి కథ 110
దేవస్మితకటాహ ద్వీపమునకు పోవుట ,,

తరంగము : ౧౪

వాసవదత్తా వివాహము 113
బాలవినష్టకుని కథ ,,
బంధుమతీపరిణయము 115
రురుడుండుభ కథ 116

తరంగము : ౧౫

[లావాణకలంబకము]

దిగ్విజయాలోచన 118
మహాసేన ప్రభవకథ ,,
వైశ్యకన్యా హూనవ్రతులకథ 120
ఉన్మాదినీ దేవసేనులకథ 123
యజ్ఞిల్లకుని కథ 124
పుణ్యసేనుని కథ 125
తిలోత్తమ కథ 127

తరంగము : ౧౬

వాసవదత్తా మందిరదాహనము 129
వాసవదత్తను పద్మావతిసన్నిధికి పంపుట ,,
పద్మావతీ వివాహము 132
వాసవదత్తా ఉదయనుల పునస్సమాగమము 135

తరంగము : ౧౭

ఊర్వశీ పురూరవుల కథ 137
ఆహితసేనుని కథ 139
సోమప్రభా గుహాచంద్రుల కథ 141
ఆవల్యా వృత్తాంతము 145
దిగ్విజయాలోచన 146

తరంగము : ౧౮

ఉదయనుడు కౌశాంబిలో ప్రవేశించుట 147
నిధిలాభము 148
విదూషకుని కథ 151
విదూషకుడు విద్యాధరికడకు పోవుట 161

తరంగము : ౧౯

దేవదాసు కథ 171
దిగ్విజయము 174

తరంగము : ౨౦

సోమదత్తుని కథ 177
కుమార సంభవకథ 181
కాళరాత్రి కథ 182

తరంగము : ౨౧

నారదునికథ 189
పింగళిక వృత్తాంతము 190
దేవదత్తుని కథ 191
పింగళిక వృత్తాంతము 194
శివానుగ్రహము 196

తరంగము : ౨౨

వాసవదత్తా గర్భదోహదము 197
జీమూతవాహనుని కథ ,,
జీమూతవాహనుని జన్మాంతరగాథ 200

తరంగము : ౨౩

వాసవదత్తా స్వప్నము 211
పతివిరోధిని ,,
సంగమపరాక్రమునికథ 213
మంత్రికుమారుల జననము 214
నరవాహనదత్తజననము ,,

కథా పీఠ లంబకము

తరంగము ౧

శ్రియం దిశతు వ శ్శంభో
శ్శ్యామః కంఠో మనోభువా
అంకస్థ పార్వతీ దృష్టి
పాశై రివ విశేష్టితః!

సంధ్యానృతోత్సవే తారాః
కరే ణోద్భాయ విఘ్నజిత్
సీకా-రకీకరై రన్యాః
కల్పయ న్నిక పాతు వః!

మనసిజుని కోర్కి-చే అగు మాడ్కి-దోచు
నేది యంకస్థ పార్వతీదృష్టిపాశ
బలయితం బయి, అమహేశ్వరుని నీల
గళము చూపునుగాక మంగళము మనకు!

సాంధ్యనృతోత్సవమున హస్తమ్ములోడ
చిమ్మి తారల, సీకా-రకీకరముల
నన్యతారల గల్పించు నట్లుతోచు
శ్రీగణేశుడు మనల రక్షించుగాక!

కథావతరణము

కిన్నర గంధర్వ విద్యాధరులకు నివాసమైన హిమవత్పర్వతానికి ఉత్తరశిఖరము కైలాసగిరి. ప్రమథగణాలు, సిద్ధవిద్యాధరులూ సేవలు చేస్తూఉండగా, నమస్తచరాచరప్రపంచాలకు ప్రభువై నమహేశ్వరుడు అంబికాదేవితో ఆశిఖరముమీద నివాసము చేస్తూ ఉంటాడు. ప్రాణ

ప్రియ అయిన శ్రీభవానీదేవి ఒకనాడు ఏకాంతప్రదేశాన ఈశ్వరుణ్ణి స్తుతి వాక్యాలతో ప్రసన్నుని చేసుకున్నది. శశిశేఖరుడు ఆమెను అంకతల మున కూర్చోబెట్టుకొని, "కిం తే ప్రియం కరోమి? నీకు ఇష్టమైనది ఏది చెయ్యను!" అన్నాడు. అప్పుడు పార్వతి, "నాథా, నాకు మనోహర మైన అద్భుతకథచెప్పండి" అన్నది. అందుకు పరమేశ్వరుడు "ప్రేయసీ, నీకు తెలియని భూతభవిష్యద్వర్తమానములు ఏమున్నవి?" అన్నాడు. అలా అన్నప్పటికీ పార్వతి పరమశివుని నిర్బంధపెట్టింది. మానవతులమనస్సు ప్రియానురాగాన్ని పరీక్ష చెయ్యవలె ననేకోరికతో ఉండడము సహజమే. మహేశ్వరుడు ఆమె హృదయానికి ఉల్లాసము కలిగించి, తనప్రభావాన్ని ప్రకటించే ఈచిన్నకథ చెప్పినాడు.

జ్వాలాలింగ కథ

పూర్వము నాదర్శనార్థము బ్రహ్మవిష్ణువులు బయలుదేరి భూలోకసంచారము చేస్తూ, హిమవత్పర్వతమూలము చేరి, అక్కడజ్వాలాలింగాన్ని చూచినారు. దానిఅంతు తెలుసుకోడానికి ఒకరుపైకి, ఒకరు కిందికీ వెళ్ళినారు. ఎంతదూరము పోయినప్పటికీ అంతము అగపడలేదు. ఇద్దరూ తిరిగి వచ్చి తపస్సు చేసి నన్ను మెప్పించారు. నేను వాళ్ళకు ప్రత్యక్షమై, "వరములు కోరుకోండి" అన్నాను. తనకు నేను పుత్రుడు గా పుట్టవలెనని బ్రహ్మ అడిగినాడు. తాను సర్వోత్కృష్టుడు కావలె నని అడిగిన యీవరమువల్ల బ్రహ్మకు లోకములో పూజలు లేకుండా పోయినవి! "స్వామీ, మీకునేను శుశ్రూష చేస్తూ ఉండేలాగ వరము దయచెయ్యండి" అనికోరడముచేత విష్ణువు నాశరీరములో అర్ధ భాగముగా జన్మించినాడు. ఆనారాయణుడవు నీవే. పూర్వజన్మలో నీవు నాభార్యవు.

శంకరుడు ఈప్రకారము చెప్పగానే, "వెనక జన్మలో మీకు నేను ఎలా భార్య నయినాను?" అని పార్వతి ప్రశ్నించింది. మహేశ్వరుడు కథ మొదలు పెట్టినాడు.

దక్షయజ్ఞ కథ

దేవీ, పూర్వము దక్షప్రజాపతికి నీతోపాటు చాలామంది కూమార్తలు పుట్టినారు. నేను నీపాణి గ్రహించాను. ఒకసారి నీ తండ్రి యజ్ఞము చేస్తూ, అల్లుళ్ళను అందరినీ ఆహ్వానించి నన్ను మాత్రము పిలవలేదు. అప్పుడు నీవు "మీఅల్లుడుగారిని పిలువలేదేమి?" అని నీతండ్రిని అడిగావు. "నీభర్త కపాలమాలిక కంఠహారంగా ధరిస్తాడు. అటువంటివాణ్ణి యజ్ఞంలోకి ఎలా ఆహ్వానించను?" అన్నాడు దక్షుడు. ప్రియా, ఆయన అన్నమాటలు నీచెవులకు శూలాయమానము లయినవి. "నాతండ్రి పాపాత్ముడు! ఇటువంటివాడికి జన్మించిన యీ పాడు శరీరము నా కెందుకు!" అని నీవు కోపముతో ఆదేహము త్యజించావు. కొంచెము జ్ఞాపకము చేసుకో. నేను హిమాలయానికి తపస్సుకోసము వచ్చాను. హిమవంతునికి నేను అతిథిని. నాశుశ్రూష చెయ్యడానికి ఆయన నిన్ను నియమించినాడు. తారకాసురుని సంహారించ గల కుమారుడు నాకు కలగడముకోసము దేవతలు మన్మథుని ప్రేరేపించారు. ఆప్రేరణవల్ల మదనుడక్కడికి వచ్చాడు. నీవు నాసన్నిధానములో ఉన్నప్పుడు తరుణము చూచుకొని నామీదికి పుష్పబాణము విడిచాడు. నేను మూడోకన్ను తెరిచేసరికి పంచబాణుడు భస్మీభూతు డైనాడు. తరువాత నీవు కఠోరతపస్సు చేసి నన్ను ప్రసన్నుని చేసుకొన్నావు. పూర్వజన్మలో నీవు నా ప్రేయసివి. ఇంతకన్న ఏమి చెప్పమన్నావు?

మహేశ్వరుడు ఇలా అనేసరికి పార్వతీదేవికి అలక వచ్చింది. "ఎందుకిలా వంచన చేస్తారు? వేడుకొన్నప్పటికీ చక్కనికథ చెప్పరే!

మీహృదయం ఎప్పుడూ అన్యానక్తమే. గంగమ్మను నెత్తిమీద ఎక్కించుకొని సంధ్యాదేవికి మీరు ప్రణామము చేయడం నాకు తెలియదా?" అని వెక్కిరించింది. శివుడు ఆమె అలక తీర్చి దివ్యకథ చెప్పడానికి అంగీకరించాడు. ఆమె ప్రసన్నురాలైంది. లోపలికి ఎవరినీ అడుగు పెట్టనీయవద్దని పార్వతీదేవి నందీశ్వరునికి ఆజ్ఞాయిచ్చింది. నందీశ్వరుడు ద్వారమును కావలా కాస్తూ ఉండగా ఈశ్వరుడు ఈకథ చెప్పడము మొదలు పెట్టినాడు:

పుష్పదంతాదుల శాప వృత్తాంతము

దేవీ! దేవతలు నిరంతరభోగులు. వారిచరిత్రలు సుఖాంతాలు. మానవులు దుఃఖభాజనులు. అందువల్ల దేవమానవచరిత్ర సుఖదుఃఖమిళితమై మనోహరముగా ఉంటుంది. విద్యాధరులకథ విను అని శివుడన్నాడు.

ఇంతలో పుష్పదంతుడనే ఈశ్వరభృత్యుడు ద్వారము దగ్గరకు వచ్చినాడు. శివారాధననిమిత్తము అతడు ఇంటిలోకి వెళ్లవలసి ఉన్నది. ద్వారదేశములో ఉన్ననందీశ్వరుడు అతన్ని ఆటంకపరచినాడు. నిష్కారణముగా సన్ను అడ్డుకొంటా వేమి అని, పుష్పదంతుడు యోగమాయవల్ల అదృశ్యుడై శివనన్నిధానము చేరి మహేశ్వరుడు చెప్పుతున్న విద్యాధరులవిచిత్రచరిత్రలు విన్నాడు. తరువాత తనభార్య జయదగ్గరికి వెళ్లి ఆకథ లన్నీ పూన గుచ్చినట్లు ఆమెకు చెప్పినాడు. ధనముగాని రహస్యము గాని స్త్రీల దగ్గర దాగదు. ఆడవాళ్లనోళ్లలో నువ్వుగింజ నానదు అనేమాట నిజము. కుతూహలముతో తాను ఆకర్ణించిన అద్భుతకథలను జయ పార్వతీదేవికి చెప్పింది. మహేశ్వరుడుతనకు అపూర్వము లైన కథలు చెప్పుతానని పురాణములు, శ్రుతపూర్వములు అయినవే చెప్పినాడేమా అనుకొని తరువాత భర్తతో, "స్వామీ

మీరు నాకు చెప్పినకథలు జయకుకూడా తెలుసు" అన్నది. మహేశ్వరుడు యోగదృష్టివల్ల సర్వమూ గ్రహించి అమ్మవారితో "దేవీ! నీకు నేను కథలు చెప్పేసమయములో పుష్పదంతు డనే నాభక్తుడు యోగశక్తివల్ల లోపల ప్రవేశించి అదృశ్యుడై ఉండి విద్యాధర చరిత్రలు విని వెళ్లి తనభార్యకు చెప్పినాడు" అన్నాడు. ఈవాక్కులువిని పార్వతి కోపోద్దీపితురాలై పుష్పదంతుని పిలిపించి నీవు మనుష్యజన్మ ఎత్తవలసిం దని శాప మిచ్చింది. పుష్పదంతుని క్షమించ మని అక్కడ ఉన్నప్రమథుడు మాల్యవంతుడు అమ్మవారిని వేడుకొన్నాడు. అమ్మవారు ఆగ్రహించి నీవుకూడా మనుష్యుడవై పుట్ట మని మాల్యవంతుని శపించింది. ఆతరువాత పుష్పదంతుడు తనభార్య జయతోను, మాల్యవంతునితోను కలిసివచ్చి మొర పెట్టుకొన్నాడు. అప్పటికి అమ్మవారి హృదయము కరిగింది. అప్పుడు పార్వతీదేవి శాపవిమోచనము ఈవిధముగా అనుగ్రహించింది: "పుష్పదంతా! కుబేరునిశాపముచేత సుప్రతీకుడు అనేయక్షుడు పిశాచరూపము ధరించి వింధ్యారణ్యములో కాణభూతి అనేపేరుతో ఉన్నాడు. నీవు ఆపిశాచరూపము ఎప్పుడు చూస్తావో అప్పుడు పూర్వజన్మస్మరణ కలుగుతుంది. వాడికి ఈ కథ చెప్పు. వెంటనే నీకు శాపవిమోచనము అవుతుంది. మాల్యవంతుడు కాణభూతివల్ల ఈకథవింటే కాణభూతి శాపవిముక్తు డౌతాడు. ఈకథ లోకములో ప్రకటిస్తే మాల్యవంతుని శాపము తొలగిపోతుంది."

పార్వతీదేవి ఈప్రకారముగా అనుగ్రహించినమీదట పుష్పదంతుడు, మాల్యవంతుడు అదృశ్యులైనారు.

ప్రమథులు

కాలము గడిచింది. ఒకనాడు గౌరీదేవి శంకరుని చూచి "దేవా! నేను శపించిన ఆప్రమథులు ఇద్దరూ ఎక్కడ జన్మించినారు?" అని

జాలిగాఅడిగింది. "ప్రియా! భూలోకములో కౌశాంబి అనేనగరమున్నది. పుష్పదంతుడు అక్కడ వరరుచినామముతో ఉన్నాడు. మాల్యవంతుడు సుప్రతిష్ఠితము అనేనగరములో గుణాఢ్యుడనేపేరుతో ఉన్నాడు. ఇది సంగతి" అని చంద్రశేఖరుడు చెప్పినాడు. తనభక్తులకు శాపమిచ్చి కష్టపెట్టినందుకు విచారపడుతున్న పార్వతీదేవిని ఈశ్వరుడు కైలాససానువులలోను, కల్పలతా నికుంజాలలోను సుఖగోష్ఠిలో తేల్చుచూ కాలము గడపినాడు.

తరంగము : 7

వరరుచి కాణభూతిని చూచుట

వరరుచి, కాత్యాయనుడు అనేనామాంతరాలతో పుష్పదంతుడు భూలోకములో మానవజన్మ ఎత్తినాడు. ఆయన నందరాజువద్ద మహామంత్రిగా ఉన్నకాలములో గొప్పవిపత్తు సంభవించింది. వరరుచి వింధ్యవాసినీదేవి దర్శనార్థము వింధ్యాటవికి వెళ్లినాడు. తపస్సు చేసి అమ్మవారిని ప్రసన్నురాలినిగ చేసుకొన్నాడు. దేవి అతనిస్వప్నములో ప్రత్యక్షమై వింధ్యారణ్యములో ఉన్నకాణభూతిని దర్శించమని ఆజ్ఞ ఇచ్చినది. వరరుచి మహారణ్యము ప్రవేశించి పెద్దమర్రిచెట్టుకింద పిశాచగణపరివేష్టితుడై కొలువు దీర్చిఉన్న మహోన్నతశరీరుని కాణభూతిని చూచినాడు. కాణభూతి వెంటనే లేచి ఎదురువెళ్లి వరరుచిపాదములకు ప్రణామముచేసి ఆయనను సుఖాసీనుని చేసినాడు. వరరుచి "కాణభూతీ! నీనడవడి ఉత్తమముగా ఉన్నది. నీకీపిశాచత్వము ఎందుకు వచ్చింది?" అని ప్రశ్నించినాడు. ఆచల్లనిమాటలకు సంతోషించి కాణభూతి ఇలా చెప్పినాడు :

కాణభూతి వృత్తాంతము

మహానుభావా! న్యాయముగా నాకు పూర్వజన్మ జ్ఞానము లేదు. అయితే ఒకసారి ఉజ్జయినిలో రుద్రభూమిలో ఈశ్వరునివల్ల విన్న మాటలు చెపుతాను. పార్వతి మహేశ్వరునితో, "నాథా! కపాల మాలలు, స్మశానసంచయము మీకు ఎందుకు ఇంపుగా ఉంటవి?" అన్నది.

ప్రళయకాలములో ప్రపంచము జలమయము అయింది. ఆసమయం లో నాతొడ చీరి రక్తచిందువులు కిందికి రాల్చాను. అవి నీటిలోపడి అండమైనవి. ఆఅండము రెండుభాగాలు చేశాను. పురుషుడు పుట్టి నాడు. సృష్టినిమిత్తము ప్రకృతిని సృజించాను. వారుభయులూ ఇతర ప్రజాపతులను ప్రజలను సృష్టించారు. అందువల్ల ఆపురుషుని పితామహు డన్నారు. అతడు చరాచరప్రకృతిని కల్పించి గర్వించినాడు. వెంటనే అతనిశిరస్సు ఖండించినాను. తరువాత నాహృదయము వెన్నవలె కరి గింది. జాలిగుండెతో కపాలము ధరించి స్మశాన వాసినై మహావ్రతము లో మగ్నుడను అయినాను. దేవీ, ఆఅండభాగాలు రెండూ భూమ్యా కాశాలు. అందువల్ల భువనము ఈకపాలమూపాన నాహస్తములో ఉన్నది. అని మహేశ్వరుడు చెప్పినాడు.

పార్వతీపరమేశ్వరులు ఇంకేమి ప్రసంగిస్తారో విందామని కుతూ హలాయత్తచిత్తుడను అయినాను. "పుష్పదంతుడు మన నన్నిధికి ఎప్పుడు వస్తాడు?" అని పార్వతి అడిగింది. "కుబేరసేవకు డైనవీడు స్థూలశిరుడనే రాక్షసునితో చెలిమి చేసినాడు. ఈసంగతి తెలిసి కుబే రుడు కోపోదీప్తుడై, 'వింధ్యాటవిలో పిశాచమై పుట్టు' అని శపించినాడు. వాని సోదరుడు దీర్ఘజంఘుడు వెళ్లికుబేరునిపాదాలమీద పడి శాపాం శు కోనము ప్రార్థించినాడు. "శాపవశాన భూలోకములో పుష్ప

దంతుడూ, మాల్యవంతుడూ మానవజన్మ ఎత్తినారు. పుష్పదంతునివల్ల మహాకథ విని, మాల్యవంతునికి వీడు చెప్పినతర్వాత ముగ్గురికీ మళ్ళీ దివ్యత్వము వస్తుంది అని కుబేరుడు అనుగ్రహించినాడు. పుష్పదంతునికి నీవుకూడా శాపమోక్షము అలాగే విధించావు. జ్ఞాపకముచేసుకో" అని శివుడు చెప్పినవాక్కులు విని చాలా సంతోషించి ఇక్కడికి వచ్చినాను. పుష్పదంతుని దర్శనము అయితే గాని నాశాపవిముక్తి కాదు.

వరరుచి కాణభూతికి బృహత్కథ చెప్పుట

ఈమాటలు వినేసరికి వరరుచి నిద్ర మేలుకొన్నట్టయి పూర్వజన్మస్మృతి కలిగి "ఆపుష్పదంతుడను నేనే. ఆబృహత్కథ చెపుతాను విను" అని ఏడులక్షల పరిమితి కలిగిన ఏడుభాగాలు చెప్పినాడు. కాణభూతి ఆశ్చర్యము పొంది, "మహానుభావా, నీవు సాక్షాత్ రుద్రుని అవతారానివి! కాకపోతే ఇటువంటి మహాకథలు ఎవరు చెప్పగలరు? నీ అనుగ్రహముచేత నాశాపము క్షీణించినట్టే తోస్తున్నది. నాకు చెప్పడానికి మీకు అభ్యంతరము లేకపోతే పుట్టినది మొదలు నేటివరకు నీయావద్వృత్తాంతమూ తెలిపి నన్ను కృతార్థుని చెయ్యాలి!" అని వేడుకొన్నాడు. వరరుచి తనచరిత్ర సవిస్తరముగా ఇలా చెప్పడము ప్రారంభించినాడు:

వరరుచి జననము

కౌశాంబీనగరములో ఒకబ్రాహ్మణుడుండేవాడు. అగ్నిశిఖుడనీ, సోమదత్తుడనీ, ఆయనకు రెండుపేర్లు. ఆయనభార్య వసుదత్త. వెనక జన్మలో ఆమె మునికన్య; శాపవశాన మానవజన్మ ఎత్తింది. నేను వారి పుత్రుడను. నాశైశవములోనే మాతండ్రి పరమపదించినాడు. మా తల్లి చాలా కష్టపడి నన్ను పెంచింది.

వ్యాడి, ఇంద్రదత్తుడు, వరరుచిని కలిసికొనుట

ఒకరోజున ఎవరో ఇద్దరు బ్రాహ్మలు చాలా దూరప్రయాణము చేసి మాయింటికి వచ్చి మద్దెలచప్పుడు చేసినారు. ఆశబ్దము విని మా అమ్మ మానాయనగారిని తలచుకొని "అబ్బాయీ, మీతండ్రిగారి స్నేహితుడు నందుడు అనేనటుడు ఈరోజు నృత్యముచేస్తాడు" అన్నది. "అమ్మా, నన్ను వెళ్ళ నిస్తావా? చూచి వస్తాను. ఆపాట నీకు విని పిస్తాను, ఆటనీకు చూపిస్తాను" అన్నాను. నామాటలువిని ఆబ్రాహ్మణు లిద్దరూ ఆశ్చర్యపడ్డారు. "నిజమే. మాకుర్రవాడు ఒకసారివింటేనే ధారణ చేస్తాడు" అని మాఅమ్మ వారితో అన్నది. నన్ను పరీక్షించా లని వాళ్ళు నాయెదట వేద ప్రాతిశాఖ్య చదివినారు. విని ఆగ్రంథము యావత్తూ వెంటనే అప్పగించాను. అతర్వాత వాళ్ళవెంట నాట్యానికి వెళ్ళి చూచి, వచ్చి, అది అంతా మాఅమ్మయెదుట ఆడి పాడినాను. వా రిద్దరిలో ఒక ఆయన పేరు వ్యాడి. ఆయన నన్ను శ్రుతధరునిగా నిర్ణయించి, మాఅమ్మగారికి ప్రణామము చేసి ఇలా చెప్పినాడు:

వ్యాడి, ఇంద్రదత్తుల చరిత్ర

అమ్మా, వేతసపురములో దేవస్వామి, కరంధకుడు అని ఇద్దరన్న దమ్ములు ఉండేవారు. ఒకరిని చూస్తే ఒకరికి ఎంతో ప్రీతి. ఒకాయన కుమారుడు ఈఇంద్రదత్తుడు; రెండవఆయన కుమారుడను నేను, వ్యాడిని. నేను పుట్టగానే మానాయన చనిపోయినాడు. ఆదుఃఖము భరించ లేక ఇంద్రదత్తునితండ్రి మహాప్రస్థానయాత్ర చేసినాడు. అవిచారముచేత మాశిక్షలులు దేహాలు చాలించారు. ధన మున్నప్పటికీ మాకు దిక్కు లేదు. విద్యనీమిత్తము కుమారస్వామిని గురించి తపస్సు చెయ్యడానికి

బయలుదేరినాము. స్వామిమాకు స్వప్నములో సాక్షాత్కరించి "నంద మహారాజు పాలించే పాటలీపుత్రములో వర్షుడనే విప్రుడున్నాడు. అక్కడికి పొండి. ఆయనవల్ల మీకు సమస్తవిద్యలూ సంక్రమిస్తవి" అని అనుగ్రహించినాడు. తర్వాత మేము పాటలీపుత్రానికి వెళ్ళి వర్షుని కోసము చాలా విచారణచేశాము. వర్షుడనే బ్రాహ్మణుడైతే ఉన్నాడు. ఆయన వట్టిమూర్ఖుడు. ఆపేరు గలవిద్వాంసుడు లేడు అని తెలిసింది. మాకేమీతోచక వీధులవెంట తిరిగి తిరిగి చివరకు వర్షుని యింటికి చేరుకొన్నాము. ఆయింటికి ఎటు చూచినా ఎలికకన్నాలు, చీమలపుట్టలు. గోడలు బీటలు వేసినవి. ఇంటికప్పు సరిగా లేదు. కళావిహీనమైన ఆయింట్లోకి వెళ్ళి చూస్తే వర్షుడు ధ్యాననిష్ఠలో ఉన్నాడు. ఆయనభార్య కనిపించింది. ఆమె చాలా చిక్కిపోయింది. చినుగుల పాత చీర కట్టుకొని ఉన్నది. మూర్తీభవించిన దరిద్రదేవత వలె తోచింది. ఆమెమమ్మల్ని కూచో మన్నది. మేము ఆమెకు సాష్టాంగదండప్రణామాలు చేశాము; చేసి మావృత్తాంతము, వర్షుని మాధ్యమునుగురించీ ఆమెతో చెప్పినాము. ఆసాధ్వి "నాయనలారా, మీరునాబిడ్డల లాంటి వాళ్ళు. మీదగ్గర దాచడమెందుకు? నిజస్థితి చెపుతాను" అని ఈకథ ప్రారంభించింది:

వర్షోపాధ్యాయుల కథ

ఈనగరములోనే శంకరస్వామి అనే విప్రుడు ఉండేవాడు. నాభర్త, ఉపవర్షుడూ ఆయనకుమారులు. నాభర్త మూర్ఖుడు, దరిద్రుడు. ఉపవర్షుడు బుద్ధిమంతుడు, ధనవంతుడు. వర్షాకాలము వచ్చినప్పుడు ఈనగరములో స్త్రీలు బెల్లము పిండి కలిపి పిండివంట వికారరూపము వచ్చేలాగున చేసి, మూర్ఖబ్రాహ్మడికి దానము చేస్తారు. వివేకు లెవరూ ఆదానము పట్టరు. ఆదానమువల్ల స్త్రీలకు శీతాకాలములో స్నాన

శ్రమ కాని, వేసంకాలములో తాపబాధ కాని కలగవు. మాతోడి కోడలు దక్షిణతోనహా ఆదానము నాభర్తకు ఇచ్చింది. అదిపట్టుకొని నాభర్త ఇంటికి పచ్చాడు. నాకు చాలా అనహ్యం వేసింది. నేను వినుక్కున్నాను. తనవిద్యావిహీనతకు ఎంతో విచారించి నాభర్త కుమార స్వామివారి పాదపద్మాలే శరణ మని యెంచి వెళ్ళి తపస్సు చేసి స్వామిని మెప్పించినాడు. స్వామి ప్రసన్నుడై, మావారికి సమస్తవిద్యలూ అనుగ్రహించి "ఏకసంధాగ్రాహి అయినబ్రాహ్మణకుమారునికే ఈ విద్యలు చెప్పవచ్చు. ఇతరులకు చెప్పవద్దు" అని ఆదేశించినాడు. దేవ తాప్రసాదము పొంది స్వగృహానికి తిరిగి వచ్చి, సంతోషపూర్వకముగా నాతో విశేషా లన్నీ చెప్పి, అప్పటినుంచీ నిరంతర ధ్యానములో ఉంటున్నారు. మీరువెళ్లి శ్రుతధరుని (ఏకసంధాగ్రాహిని) ఎవరినైనా తీసుకు రండి. మీసర్వాభీష్టాలు సిద్ధిస్తవి.

వ్యాడి, ఇంద్రదత్తుడు వరరుచిని వర్షోపాధ్యాయుని వద్దకు కొనిపోవుట

వర్షనిధర్మపత్నికి వందవరహా లిచ్చి అక్కడినుంచి మేము దేశము తిరిగీ తిరిగీ చివరకు మీయింటికి వచ్చినాము. ఏకసంధాగ్రాహి ఇప్పటికి మాకు లభించినాడు. ఇతనిని మాకు ఇస్తే మేమందరమూ వెళ్లి విద్యలు సాధిస్తాము అని వ్యాడి చెప్పినమాటలకు ఆమె ఇలా అన్నది: "మీ మాటలలో నాకు సంపూర్ణ విశ్వాస మున్నది. వీడు పుట్టగానే అశరీర వాణి ఈసంగతులు సూచించింది. వీడు శ్రుతిధరుడవుతాడు. లోకములో వ్యాకరణశాస్త్రము ప్రతిష్ఠిస్తాడు. లోకములో ఏదేది వరమో ఉత్తమమో) అది యావత్తూ వీనికి రుచిస్తుంది. కాబట్టి వరరుచి అని పేరు నస్తుంది. వీడు ఎదిగినప్పటినుంచీ ఆవర్షోపాధ్యాయులవారు ఎక్కడ

ఉన్నారో అని నేనూ ఆలోచిస్తూనే ఉన్నాను. మీమాటలు వింటే చాలా ఆనందముగా ఉన్నది. మీరు మీతమ్ముని లాంటివాడు. తీసుకు వెళ్ళండి. ''

మాఅమ్మ అంగీకరించినందుకు వ్యాడీంద్రదత్తులు హర్షపరవశులయిపోయి ఆరాత్రి మేలుకొని ఇష్టాగోష్ఠిలో కాలము గడిపినారు. నాకు వేదాధికారము కలగడానికి ఉపనయనము చేయించి మాఅమ్మకు ధనముకూడా ఇచ్చి నన్ను తీసుకొని బయలుదేరుతుంటే ఆమె కన్నీళ్లు ఎలాగో ఆపుకొని అనుజ్ఞ ఇచ్చింది. వ్యాడీంద్రదత్తులు ఆమెకు శాంత వచనాలు చెప్పినారు.

వ్యాడి, ఇంద్రదత్త కాత్యాయనుల విద్యాభ్యాసము

ప్రయాణము చేసి చివరకు మేము వర్షోపాధ్యాయులవారి యింటికి వెళ్ళినాము. గురువు నన్ను వాత్సల్యముతో స్వీకరించినాడు. మర్నాడు ఆయన పవిత్రప్రదేశాన నన్ను ఎదురుగా కూర్చోబెట్టుకొని మొదట ప్రణవము (ఓంకారము) ఉచ్చరించినాడు. తక్షణమే ఆయనకు షడంగములతోసహా వేదాలన్నీ స్ఫురించినవి. వెంటనే గురువు మాకు వేదాధ్యాపనము ప్రారంభించినాడు. ఒకసారి వినేసరికి నేను, రెండోమారు వినేటప్పటికి వ్యాడి, మూడోపర్యాయానికి ఇంద్రదత్తుడు వేదములు గ్రహించినాము. అపూర్వమైన వేదఘోష విని విప్రులు వచ్చి చాలా ఆశ్చర్యపడి వర్షోపాధ్యాయులవారికి సాష్టాంగదండప్రణామాలు చేసి స్తోత్రనమేతముగా పూజ చేసినారు. ఆదృశ్యము చూచి ఉపవర్షుడు తప్ప తక్కినవారంతా ఆనందించినారు. ఈవిషయాలు నందమహారాజుకు తెలిసి, కుమారస్వామివారి వరప్రభావమువల్ల జరిగినట్లు గ్రహించి ప్రభువు మాగురువుగారికి సమస్తసంపదలూ సమకూర్చి ధన్యుడయినాడు.

తరంగము: 3

వరరుచి చెపుతూ ఉంటే కాణభూతి ఏకాగ్రచిత్తముతో వింటున్నాడు. స్వాధ్యాయ మయినతర్వాత ఒకనాడు ఉపాధ్యాయులవారితో "స్వామీ, ఈనగరము లక్ష్మీ సరస్వతులకు నిలయము కావడానికి కారణ మేమిటో" అని మేము అన్నాము. ఆయన ఇలా చెప్పినారు:

పాటలీపుత్ర కథ

నాయనలారా, గంగాద్వారము లో కనఖలము అనేపుణ్యతీర్థమున్నది. కాంచనపాతము అనే దేవతాగజము ఉశీనరపర్వతప్రస్థము భేదించి, గంగానది కిందికి ప్రవహించేలాగున చేసింది. ఆతీర్థక్షేత్రములో కణ్వదేశబ్రాహ్మణుడు భార్యతోకూడా తపస్సు చేస్తున్నాడు. ఆయనకు ముగ్గురుపుత్రులు పుట్టినారు. కొంతకాలానికి తల్లితండ్రులు చనిపోతే ఆముగ్గురుకుమారులూ విద్యాభ్యాసము నిమిత్తము రాజగృహము అనే నగరానికి వెళ్ళినారు. వాళ్లు విద్యావంతులయి, దిక్కు లేకపోవడము చేత దక్షిణావ కుమారస్వామి దర్శనార్థము బయలుదేరి సముద్రతీరాన చించినీపురము చేరి, భోజికు డనేబ్రాహ్మణునియింట్లో దిగినారు. తనకు పుత్రసంతానము లేకపోవడముచేత కుమార్తెలను ముగ్గురినీ ఆముగ్గురికీ ఇచ్చి వివాహము చేసి, ధనముకూడా వారికిచ్చి, తపస్సు చేసుకోడానికి గంగాతీరానికి వెళ్లినాడు. వాళ్ళు మామగారియింట్లో సుఖముగా ఉంటున్నారు. కొన్నాళ్ళకు కరువు వచ్చింది. అందరూ అల్లాడిపోయినారు. ఆభర్తలు భార్యలతోచెప్పకుండా దేశాంతరము వెళ్ళిపోయినారు. కఠినహృదయాలకు బంధుప్రీతి ఉంటుందా? ఆకుమార్తెలలో పడిమిఆమె గర్భవతి. తనతండ్రి మిత్రుడైన యజ్ఞదత్తునియింటికి

ముగ్గురుస్త్రీలూ చేరుకొని భర్తలను ధ్యానిస్తూ కష్టముమీద కాలము గడుపుతున్నారు. నెలలు నిండినతర్వాత గర్భవతి కుమారుని కన్నది. ఆపిల్లవానిని అక్కాచెల్లెళ్ళు ముగ్గురూ చాలాముద్దుగా పెంచుతు న్నారు. ఒకనాడు మహేశ్వరుడు ఆకాశమార్గాన వృషభవాహనము మీద వస్తూ ఉండగా, ఆయనఒడిలో కూర్చున్న పార్వతీదేవి ఆ పిల్ల వానిని చూచి, "నాథా, ఆక్రూరుడు పెరిగి పెద్దవాడై రక్షిస్తా డని ఆముగ్గురుతల్లులూ ఆశ పెట్టుకున్నారు. బాల్యములోనే ఆబిడ్డడు వాళ్ళను సంరక్షించేలాగున మీరు అనుగ్రహించాలి" అన్నది. వరదు డైనమహేశ్వరుడు, "దేవీ, నీకోరికప్రకారము వీనిని అనుగ్రహిస్తాను. వెనకజన్మలో వీడు భార్యతోకూడా శివారాధన చేసినాడు. అందుచేత వీడు ఈజన్మలో మహైశ్వర్యము అనుభవిస్తాడు. వీనిభార్య పాటలి అనే పేరుతో మహేంద్రవర్మకు కుమార్తెగా పుట్టింది. ఈజన్మలో అదివీనికే భార్య అవుతుంది" అని సెలవిచ్చినాడు. తర్వాత ఈశ్వరుడుఆ ముగ్గురు తల్లులకూ స్వప్నములో కనిపించి "మీపిల్లవానికి పుత్రకుడు అనే పేరు పెట్టండి. ప్రతిదినమూ వీనితలగడకింద (దిండుకింద) లక్ష్మవరహా లుంటవి. వీడు ప్రభువుకూడా అవుతాడు" అని అనుగ్రహించినాడు. తెల్లవారినతర్వాత ఆపతివ్రతలు పిల్లవాడు నిద్ర లేవగానే దిండుతీసి చూస్తే లక్ష్మవరహాలు కనబడినవి. చాలా ఆనందించారు. అచిరకాలము లోనే సువర్ణరాశివల్ల పుత్రకుడు రాజ్యస్థాపన చేసినాడు. శివాను గ్రహముంటే సంపదల కేమి కొదవ? ఒకనాడు యజ్ఞదత్తుడు పుత్రకు నితో "రాజా, నీతండ్రులు కరువుకాలములో చెప్పకుండా దేశాంత రము వెళ్ళిపోయినారు. నీవు బ్రాహ్మణులకు ఎప్పుడూ దానధర్మాలు చేస్తూ ఉంటే వాళ్ళు విని ఇక్కడికికూడా రావచ్చును. దృష్టాంత మొకటి వినుము.

బ్రహ్మదత్తుని కథ

పూర్వము వారణాసిలో బ్రహ్మదత్తు డనేరాజు ఉండేవాడు. ఆయన ఒకరాత్రి ఆకాశాన తళతళలాడే రెండుబంగారపుహంసలను చూచినాడు. వాటిచుట్టూ వందలకొద్దీ రాజహంసలున్నవి. వాటిని చూడవలెనని రాజుకు కోరిక పుట్టింది. ఆయన మంత్రులతో ఆలోచించి సరోవరము తవ్వించి అక్కడికి వచ్చే పక్షులను ఏమీ బాధించకూడదని కట్టడి చేసినాడు. త్వరలోనే ఆహంసలు సరస్సుకు రావడము చూచి రాజు వాటిని మచ్చిక చేసి సువర్ణదేహము రావడానికి కారణము అడిగినాడు. హంసలు మనుష్యవాక్కులతో "రాజా, మేము వెనకజన్మలో కాకులము. బలి వేసే ఆహారముకోసము పోరాడి శూన్యమైన శివాలయాన ద్రోణిలో (అరణిలో) పడి చనిపోయినాము. పుణ్యస్థలములో పోవడముచేత పూర్వజన్మ జ్ఞానముతో బంగారు హంసలమై పుట్టినాము" అని స్పష్టముగా చెప్పినవి. రాజు వాటిని చూస్తూ చాలా ఆనందించినాడు.

అదేప్రకారము నీవు దానధర్మాలు చేస్తూ ఉంటే నీతండ్రులు క్రమేణ లభిస్తారు." యజ్ఞదత్తుడు చెప్పినమాటలు విని పుత్రకుడు బ్రాహ్మణ సమారాధన ప్రారంభించినాడు. భావించినట్టే బ్రాహ్మణులు అక్కడికి వచ్చి నమస్తమూ తెలుసుకొని, భార్యలూ కుమారుడూ లభించగా బహుసంతోషముతో కాలముగడిపినారు. కొన్నాళ్ళకు వాళ్ళకు దుర్బుద్ధి పుట్టింది. వాళ్ళే రాజ్యము చెయ్యా లని సంకల్పించి పుత్రకుని సంహరించడానికి ఎత్తు ఎత్తినారు. వింధ్యవాసినీదేవి దర్శనార్థము పోదామని వంక పెట్టి పుత్రకునికూడా తీసుకుపోయినారు. అమ్మవారిదర్శనము మొదట అతనినే చెయ్యమని గర్భగుడిలోకి పెళ్ళమన్నారు. నిశ్శంకగా అతడులోపలికి పోయినాడు. అదివరకే అక్కడ నియుక్తులయిన హంతకులు అతనిని చంపడానికి మాదికి పోయినారు. వింధ్య

వాసిసేదేవి రాజుమీద అనుగ్రహముచేత ఆహంతకులకు మతిభ్రమకల్పించింది. వాళ్లు తికమకపడ్డారు. "ఎందుకు నన్ను చంపుదామనుకున్నారు?" అని పుత్రకుడు అడిగితే. వాళ్ళు "మహాప్రభూ, మీతండ్రులు మాకు బంగార మిచ్చి ఈపని చెయ్యనలసిం దని ఆజ్ఞాపించారు" అని విన్న వించినారు. "సరే. మీరు నన్ను పదిలి పెట్టితే అమూల్యమైన ఈరత్నాలంకారా లిస్తాను. మీగుట్టు బయట బెట్టను. దేశాంతరము వెళ్ళిపోతాను" అని రాజు చెపితే వాళ్ళు నమ్మతించి ఆభరణాలు పుచ్చుకొని వెలుపలికి వచ్చి "రాజును చంపివేశా" మని చెప్పి వాళ్ళు వెళ్ళిపోయినారు. బంధువుల మీద విరక్తి పుట్టి పుత్రకుడు వింధ్యారణ్యానికి వెళ్ళినాడు.

రాజతండ్రులు పట్నములోకి వచ్చినతర్వాత హత్యావిషయము బయలు పడ్డది. రాజద్రోహు లనీ, పుత్రహంతకుల నీ, వాళ్ళనుమంత్రులు ఉరితీయించినారు. దుర్మార్గులకు దుర్గతి తప్పదుకదా!

పుత్రకుడు వింధ్యారణ్యములో వెళుతూ ఉంటే ఇద్దరు ముష్టి యుద్ధము చేస్తున్నారు. మీరు ఎవరయ్యా అని పుత్రకుడు అడిగితే వాళ్ళు, "మేము మయాసురుని కుమారులము. ఈపాత్ర, కర్ర, పావుకోళ్ళు మా తండ్రి ఇచ్చినవస్తి. మాలో ఎవరు బలవంతుడో వానికి ఇవిసంక్రమిస్తవి అని యుద్ధము చేస్తున్నాము" అని చెప్పినారు. పుత్రకుడు నవ్వి "ఈ అల్పవస్తువులకోసము యుద్ధమా?" అన్నాడు. "ఈపావుకోళ్ళు తొడుక్కుంటే ఆకాశములో వెళ్ళవచ్చు. ఈకర్రతో భూమిమీద ఏరూపము చిత్రిస్తే అది సత్య మవుతుంది. తలుచుకుంటే ఈపాత్రలోకి అమృతమువంటి ఆహారపదార్థాలు వస్తవి" అన్నారు వాళ్ళు. అప్పుడు పుత్రకుడు ఆలోచించి "వీటికోసము యుద్ధ మెందుకు? పరుగులో ఎవరు గెలిస్తే వారివి అని పందెము వేసుకోండి" అని సలహా ఇచ్చినాడు. అంగీకరించి వాళ్ళు పరుగెత్తినారు.

ఆమందబుద్ధులు కొంతదూరము పోగానే పుత్రకుడు ఆపావుకోళ్ళు తొడుక్కొని, కర్ర, పాత్ర, తీసుకొని ఆకాశమార్గాన శీఘ్రగమనముతో వెళ్ళి ఆకర్షిక అనేపట్నములో దిగినాడు. "వేశ్యలు మోసము చేస్తారు. వైశ్యులు లోభులు. ఎవరియింట్లో దిగితే బా గుంటుంది" అనుకుంటూ ఒకానొక వృద్ధస్త్రీని చూచి, ఆమెకు కొంతధన మిచ్చి ఆమెజీర్ణగృహ ములో రహస్యముగా ఉండడము మొదలు పెట్టినాడు. మునలమ్మకు ఇతనిమీద చాలా అభిమానము కలిగింది. ఒకనా డామె "నాయనా, నీకు తగిన యిల్లాలు లేదని నాకు చాలా విచారము కలుగుతున్నది. ఈనగర మేలేప్రభువుకు పాటలి అనేపుత్రిక ఉన్నది. ఆమెను అంతఃపుర ములో పై మేడలో భద్రంగా ఉంచారు" అనిచెప్పింది. వెంటనే పుత్ర కుని మనస్సులోకి మన్మథుడు ప్రవేశించినాడు.

పాటలీపుత్రకుల సమ్మేళనము

పాటలిని ఆరాత్రివేళనే చూడడానికి నిశ్చయించుకొని పుత్రకుడు పావుకోళ్ళు తొడుక్కొని ఆఅంతఃపురానికి వెళ్ళి పెద్దకిటికీలోనుంచి లోపలికి ప్రవేశించి ఒంటరిగా నిద్రపోతున్న పాటలిని చూచినాడు. ఆమెను లేపడము ఎలాగా అని అతడు ఆలోచిస్తూ ఉండగా, గస్తీ తిరుగుతున్న యామికుడు హఠాత్తుగా ఈగీతిక పాడినాడు.

ఆలింగ్య మధురహుంకృతి,
మలసోన్మిషదీక్షణం రహఃకాన్తామ్
యదోద్బోధయన్తి సుప్తాం
జన్మని యూనాం త దేవ ఫలమ్.

ఉపగూహనము చేసి యుపకుడు, మధుర
హుంకృతిం, బ్రియ నలసోన్మిషన్నేత్ర,
నీకాంతమున లేపుటే నిద్రనుండి
ఇవజన్మఫల మని యెంచుకోవలయు!

ఈవాక్కులు విని ఉత్సాహము పొంది అవయవాలు కంపిస్తూ ఉండగా పుత్రకుడు పాటలిని కౌగిలించుకొన్నాడు. ఆమెకు మెళుకువ వచ్చి, ఆశ్చర్యమూ, సిగ్గూ పెనవేసుకొన్నవి. క్రమక్రమముగా ఉభయులూ సంభాషణలోకి దిగి, చివరకు గాంధర్వవివాహము చేసుకొన్నారు. తెల్ల వారుజామున ప్రియురాలిని వీడ్కొని, పుత్రకుడు వృద్ధస్త్రీయింటికి వచ్చినాడు.

ఈవిధముగా పుత్రకుడు రాత్రిళ్ళు వస్తూ పోతూ ఉన్నాడు. ఒక నాడు ఆమెశరీరమున సంభోగచిహ్నాలు గమనించి రక్షకస్త్రీలు భయ పడి రాజుగారికి విన్నవించినారు. రహస్యము కనిపెట్ట మని రాజు ఒక తెను పాటలిభవనములో దాగి ఉండ మని చెప్పినాడు. ఆరాత్రిపుత్రకుడు వచ్చి నిద్రపోయేటప్పుడు, అతని ఉత్తరీయముచెంగున ఆస్త్రీ లాక్షా రసముతోగుర్తువేసి, మర్నాడురాజుతోచెప్పింది. ఆగుర్తు చెప్పి చారుల చేతపట్టమంతావెతికిస్తే, పుత్రకుడు దొరికినాడు. భటులు అతనిని పట్టు కొని వెళ్ళి ప్రభునమక్షములో ఉంచినారు. రాజుకు చాలాకోపము వచ్చింది. పుత్రకుడు పావుకోళ్ళు తొడుక్కొని వెంటనే పాటలిదగ్గరికి ఎగిరిపోయి "ప్రియా, మనరహస్యము బయట పడ్డది. లే, వెంటనే వెళ్ళు దాము" అని ఆమెను ఒడిలో కూర్చోబెట్టుకొని ఆకాశాన దూరము ఎగిరిపోయి గంగాతీరాన దిగినాడు. అలసట చెందినభార్యకు తలపుచేత పాత్రలో ఉదయించిన అమృతాహారము పెట్టి శ్రమ పోగొట్టినాడు. తర్వాత ఆమెకోరికమీద చతురంగబలసమేతముగా కర్రతో నగర చిత్రము గీసినాడు. అది సత్యమై సజీవమైనది. పుత్రకుడు మహాప్రభు వయి, మామను లోపరచుకొని సుఖముగా రాజ్యము చేసినాడు. ఆదివ్య నగరమే ఇది. పాటలి పుత్రకులపేర పాటలీపుత్రము అని ప్రసిద్ధి చెంది, లక్ష్మీసరస్వతులకు నిలయ మయినది. కాణభూతీ, వర్షోపాధ్యాయుల కారివల్ల ఇది విని మేము చాలా ఆశ్చర్య పడ్డాము.

తరంగము : ౪

వరరుచి ఉపకోశను చూచుట

ఈప్రకారముగా వరరుచి కాణభూతికి అవాంతరకథ చెప్పి, ప్రకృత వృత్తాంతము ఇలా చెప్పడము ప్రారంభించినాడు :

నేను వ్యాడీంద్రదత్తులతో అక్కడనే నివసిస్తూ కాలక్రమేణ విద్యా పారంగతుడ నయినాను. ఒకనాడు మిత్రులతో కలిసి ఇంద్రోత్సవము చూడడానికి వెళ్ళినాను. అక్కడ ఉపవర్షునికొమార్తె ఉపకోశ మాకు కనబడ్డది. ఆమె చెలిక త్తెలద్వారా నాసంగతి తెలుసుకొని అనురాగ రసము ఉట్టిపడే క్రీగంటతో నవిలాసముగా నన్ను చూచి, కష్టముమీద నిజగృహానికి మరలింది. నామనస్సులో ఆమెరూపశోభావిలాసాలు అంకి తము కావడముచేత రాత్రి నిద్ర పట్టలేదు. ఆమె వదనమునూ, బింబా ధరమునూ ధ్యానిస్తూ జాగరణము చేసినాను. తెల్ల వారుజామున ఎలాగో కాస్త కునుకు పట్టేసరికి స్వప్నము వచ్చింది. అందులో, శ్వేతవస్త్ర ధారిణి అయిన దేవత మెడలో మల్లెదండలు సువాసనలు వెదజల్లు తుండగా ప్రత్యక్షమై, కృపావీక్షణము నామీద ప్రసాదిస్తూ, చల్లని వాక్కుతో, "నాయనా, ఉపకోశ నీపూర్వజన్మలో ప్రేయసి. ఈగుణ వతి నిన్ను తప్ప ఇంకెవరినీ వరించదు. సంశయించకు. నీరసనాగ్రవర్తిని నయిన సరస్వతీదేవిని నేను. భయపడకు. నీవిచారము పోగొట్టడానికి వచ్చాను" అని చెప్పి అంతర్ధాన మయినది.

తెల్ల వారినతరవాత లేచి దేవి ఆనతిచ్చిన వాక్యాలు తలుచుకొంటూ నాప్రియురాలి భవనానికి ఎదురుగా ఉన్న తిత్యుమామిడి గున్న కింద ఒంటరిగా కూర్చున్నాను. ఇంతలో ఉపకోశ చెలిమిక త్తె నావద్దకు వచ్చి, ఆమె పొందుతున్న పరితాపమునుగురించి చెప్పింది. నాతా పము వెంటనే ద్విగుణీకృతమయింది. "సఖీ, నీకు మాఅనోన్యానురాగ

విషయము తెలిసింది. తల్లిదండ్రులు ఆమెను నా కిస్తారో ఇవ్వరో అని సందేహము. రహస్యముగా ఉపకోశను కలుసుకోవడము యుక్తము కాదు. అపకీర్తివస్తే తర్వాత చేసేదేమీ ఉండదు. నీవు నేర్పుతో ఆమెతల్లిదండ్రులకు సచ్చజెప్పి మాకు కల్యాణము చేయించాలి" అని బతిమాలుకొన్నాను. ఆమె ఉపకోశతల్లికి నిపుణముగా చెప్పింది. ఆమె భర్తతో చెప్పింది. ఉపవర్షులు వర్షాచార్యులవారితోచెప్పినారు తర్వాత వివాహనిశ్చయమయింది. వ్యాడి కౌశాంబికి వెళ్ళి, మాఅమ్మగారిని త్వరగా తీసుకువచ్చినాడు. నాకు వివాహ మయింది. భార్యాభర్తలము సుఖముగాఉంటూ, మాఅమ్మగారికి ఉపచారాలు చేస్తున్నాము.

పాణిని చరిత్ర

వర్షునికి కాలక్రమేణ శిష్యసమూహము హెచ్చింది. అందులో పాణిని అనే మందబుద్ధి ఉన్నాడు. ఉపచారాలు చెయ్యలేక ప్రాణము విసిగి పోయిన పాణినిని వర్షునిభార్య పంపివేసింది. వాడు హిమాలయానికి వెళ్ళి తపస్సుచేసి మహేశ్వరుని మెప్పించి శివానుగ్రహమువల్ల నూతనవ్యాకరణము లభించగా తిరిగి వచ్చి, సన్నే వాడానికి పిలిచినాడు! ఏడురోజులు వాగ్వాదము జరిగింది. ఎనిమిదోరోజు పాణిని ఓడిపోయినాడు. ఆసమయాన ఆకాశమునుంచి మహేశ్వరుడు భయంకరముగా హుంకారము చేసినాడు. దానితో మాఐంద్రవ్యాకరణము ఈ లోకములో లేకుండా పోయింది! పాణిని జయించినాడు. మేము మంద బుద్ధుల మయినాము. నేను చాలా విచారపడి కుటుంబనిర్వహణానికి కావలసిన ద్రవ్యము హిరణ్యగుప్త డనేవర్తకునికి నిర్ణయించి ఇచ్చి ఉపకోశకు తెలియజేసి, శివునిగురించి తపస్సు చేయడానికి హిమాలయానికి వెళ్ళినాను. ఉపకోశ నాశుభకాంక్షతో ప్రతిదినమూ గంగాస్నానమూ, వ్రతాలూ చేస్తూ ఇంట్లోనే ఉంటున్న దట.

ఉపకోశ పాతివ్రత్యము

వసంతఋతువులో ఒకనాడు ఉపకోశ గంగానదికి వెళ్ళుతూ ఉంటే రాజపురోహితుడు, కొత్వాలు, కుమారమంత్రి వరసగా చూచారు. ఆ నాడు ఉపకోశ చాలాసేపు స్నానము చేసింది. ఆమె ఇంటికి మరలి వస్తూ ఉండగా కుమారమంత్రి అడ్డగించినాడు. ఉపకోశ సమయస్ఫూర్తితో "భద్రా, నీ కెంత యిష్టమో నాకూఅంతయిష్టమే. నేను కుల స్త్రీని. భర్త దేశాంతరము వెళ్ళినాడు. ఇప్పుడు ఎవరైనా మనను చూస్తే తలవంపులు! పౌరులు వసంతోత్సవములో మగ్నులయి ఉండగా నీవు రాత్రి ప్రథమయామములో మాయింటికి రా" అని సంకేతము ఏర్పాటు చేసింది. కొంచెము దూరము పోగానే రాజపురోహితుడు ఆమెను అడ్డగిస్తే, రాత్రి ద్వితీయయామము ఆయనకు సంకేతము ఏర్పాటు చేసింది. ఈఘటనలకు దిగులుపడి ఆమె మరికొంతదూరము పోతుంటే కొత్వాలు వచ్చి అడ్డము నిలిచినాడు. అతనికి మూడవజాము ఏర్పాటు చేసి తప్పించుకొని యింటికి పోయి చాలా ఆందోళన పడ్డది. ప్రోషితభర్తృకలు పాపాత్ముల కళ్ళయెదుట పడడముకంటె చనిపోవడము చాలా మేలు. అని విచారపడి చెలిమిక తైలను పిలిచి కర్తవ్యము ఆలోచించింది. బ్రాహ్మణపూజార్థము కొంచెము ద్రవ్యము కావాలని ఉపకోశ హిరణ్యగుప్తునికి వార్త పంపితే వాడు వచ్చి రహస్యముగా "చాలారోజులనుంచీ నీమీద నాకు మనసు! నాకోరిక తీర్చు. నీభర్త నావద్ద దాచిపెట్టినడబ్బు యావత్తూ ఇచ్చేస్తాను"అని చెప్పినాడు. వానివద్ద నేను ఉంచిన ధనానికి సాక్ష్యము లేకపోవడమువల్ల ఉపకోశ విచారపడి, వచ్చినకోపము అణుచుకొని రాత్రి నాలుగోజాము సంకేతము ఏర్పాటు చేసి వానిని పంపివేసింది.

పిమ్మట ఉపకోశ చెలిమిక తైలతో చెప్పి కాటుక తెప్పించి నూనెలో రంగరించి, కస్తూరి కుంకుమ లయిన సువాసన ద్రవ్యములు కలిసి, ఆ

కాటుకనూనె గూనలో పోయించింది. తర్వాత నాలుగు కొపీనములు చింపించి, గూనలో ముంచి, బోషాణము ఖాళీ చేసి, వెలుపల గడియ వేసి భద్రముగా ఉంచింది.

ఉపకోశ సమయస్ఫూర్తి

ఉజ్జ్వలవేషము ధరించి కుమారసచివుడు రాత్రి మొదటిజాములో ఉపకోశయింటికి వచ్చినాడు. అతనినిచూచి ఆమె, "నీవుస్నానముచేసి వస్తేనే తప్ప నిన్ను ముట్టుకోను. లోపలికి వెళ్ళి బాగా స్నానము చేసి రా" అని చెప్పింది. ఆమందబుద్ధి నమ్మతించినాడు. ఆమె చెలిమి కత్తెలు వానినితీసుకు పోగా చీకటిగా ఉన్నప్రదేశాన అతని వస్త్రాలంకారాలు తీసివేయించి, గోచీ యిచ్చి కూచోబెట్టి కాటుకనూనె బాగా పట్టించి దరువులు వేస్తూ శరీరము మర్దన చేశారు. ఇంతలో రెండవ జాము అయింది; పురోహితుడు వచ్చినాడు. ఆస్త్రీలు "అయ్యో! వరరుచిగారిమిత్రులు పురోహితులవారు దయచేసినారు. ఏమి గతి! నీవు ఇందులో దాగి ఉండు" అని చెప్పి, వానిని బోషాణములోకి దింపి గడియ వేసినారు. రాజపురోహితునికూడా ఆప్రకారముగానే చీకటికోణములోకి తీసుకుపోయి గోచీ పెట్టించి శరీరమంతా దట్టముగా కాటుక పట్టించి కాలజ్ఞానము లేకుండేలాగున ఒళ్ళు పరవశ మయ్యే లాగున నేర్పుతో దరువులువేస్తూ తల అంటినారు. మూడవయామములో కొత్వాలు వచ్చినాడు. అతని ఆగమనానికి భయపడినట్లు నటించి ఆస్త్రీలు పురోహితుని భయపెట్టి ఆబోషాణములోకి దింపి గడియ వేసినారు. కొత్వాలునుకూడా నూనెగోచీపాతరాయనిచేసి ఒళ్ళు మర్దించి వర్తకుడు రాగానే భయపెట్టి బోషాణములోకి దింపి గడియ వేసినారు. అందులో ఉన్న ముగ్గురూ ఒకరికి ఒకరు తగులుతూ ఉన్న ప్పటికి నోరు విప్పకుండా కూర్చున్నారు. తర్వాత ఉపకోశ దీపము

వెలిగించి వర్తకుని తీసుకు వచ్చి "నాభర్త సీవద్ద ఉంచినధనము" తే అని అడిగింది. "ఇస్తా నని ఇదివరకే చెప్పినాను కాదా?" అన్నాడు శ్రేష్ఠి. ఉపకోశ బోషాణమును సంబోధించి "దేవతలారా; హిరణ్యగుప్తునిమాట విన్నారుకదా?" అని దీపము ఆర్పివేసి ఉపకోశ వర్తకుని చెలిమిక త్తెలకు అప్పగించింది. వాళ్ళు అతనికి గోచీ యిచ్చి అభ్యంగనము మొదలుపెట్టి కొంతసేపటికి "పోయి తెల్లవారింది" అని నెట్టినారు. వాడు వెళ్ళక సందేహిస్తూ ఉండగా మెడపట్టి వీధిలోకి నెట్టివేసి తలుపు మూసినారు. గత్యంతరము లేక వర్తకుడు ఆ గోచీతో ఆ కాటుకనూనె పట్టినశరీరముతో మధ్య మధ్య కుక్కలు వెంట బడుతూ ఉండగా ఎలాగో స్వగృహము చేరినాడు. నౌకర్లు అతని ఒళ్ళు రుద్ది స్నానము చేయించినారు. స్నానవేళ హిరణ్యగుప్తుడు ముఖముపైకెత్తి వాళ్ళకేసి చూశ్నైనా చూడలేదు. దుష్కార్యానికి. ఫలితము దున్నహము కదా!

ఇంట్లో పెద్దలకు ఈసంగతులు చెప్పకుండా ప్రాతఃకాలమే ఉపకోశ చెలిక త్తెలతో మహారాజుమందిరానికి వెళ్ళి ప్రభువుతో "దేవా, నాభర్త తనవద్ద దాచి పెట్టినధనమును హిరణ్యగుప్తుడనేవర్తకుడు అపహరించినాడు" అని విన్నవించింది. రాజు వెంటనే వర్తకునికి వార్త పంపినాడు. ఆతడు రాగానే ప్రభువు ఈవిషయము అడిగితే "నాదగ్గర ఈమెధనము ఎంతమాత్రమూలేదు" అని అనత్యము చెప్పినాడు. ఉపకోశ "మహాప్రభూ సాక్షులున్నారు. నాభర్త దేశాంతరము వెళ్ళేటప్పుడు గృహదేవతలను ముగ్గురిని మందనములో పెట్టి వెళ్ళినారు. మాయింట్లో జరిగే విషయా లన్నింటికీ ఆమంజూషలో ఉన్నయిలు వేలుపులే సాక్షులు. దేవర విచారించవచ్చును" అనివిన్నపము చేసింది. వెంటనే రాజు సేవకులను పంపి ఆబోషాణము తెప్పించినాడు. ఉపకోశ ఆమందనముకేసి తిరిగి "దేవతలారా ఈవర్తకుడు మీకు వినబడే

లాగున ఏమి అంగీకరించినాడో చెప్పి మీరు సుఖముగా ఇంటికి వెళ్ళి పోదురుగాని. మాటాడకపోయినా నిజము చెప్పకపోయినా మిమ్మలిని నిలువునా నీరు చేయిస్తాను" అని గట్టిగా అన్నది. మంజూషలో దాగి ఉన్న ముగ్గురుధూర్తులూ భయపడి స్పష్టనాక్కులతో "ఈమె చెప్పినది సత్యము : వర్తకుడు తనవద్ద ఈమె భర్తధనమున్నట్లు మాయెదుట అంగీకరించినాడు" అని బిగ్గరగా అన్నాడు. వర్తకుడు పెలపెల బోయినాడు. కుతూహలము కలిగి ప్రభువు బోషాణము తెరవమని ఉపకోశను కోరినాడు. మూత తెరిచేసరికి మూర్తీభవించిన అంధకారమువంటి ముగ్గురుమనుష్యులు వెలుపలికి వచ్చినారు. రాజు మొదట వారిని గుర్తించలేదు. కుమారమంత్రి, పురోహితుడు, దండాధిపతి అని గ్రహించిన సభ్యులు చప్పట్లు కొట్టి కోలాహలము చేసినారు. ఆశ్చర్యపడి రాజు యీవద్వృత్తాంతమూ చెప్ప మని ఉపకోశను అడిగినాడు. జరిగిన సంగతు లన్నీ ఆమె నవిస్తరముగా తెలిపింది. పతివ్రత అయిన ఆకుల కాంతను అందరూ ప్రశంసించారు. ప్రభువు ఆధూర్తుల సంపదలు శిక్షకింద రాజకోశానికి చేర్పించి వాళ్ళను దేశములోనుంచి బయటికి వెళ్ళగొట్టించినాడు. ఉపకోశను రాజు ధర్మసహోదరిగా భావిస్తా నని చెప్పి ధనాదులిచ్చి ప్రీతితో ఇంటికి పంపినాడు. వర్షోపవర్షులు ఈవృత్తాంతము విని చాలా సంతోషించి ఉపకోశను ఆదరించినాడు. నగరజనులు ఆశ్చర్యానందములు పొందినారు.

వరరుచి వార్తికములు చేయుట

నేను శీతాచలసానువులమీద తీవ్రతపస్సు చేసి, ప్రమథినాథుని ఆరాధించినాను. పరమేశ్వరుడు పాణినీయశాస్త్రమునే నాకు ప్రసాదించినాడు. ఈశ్వరేచ్ఛచేతనూ, అనుగ్రహముచేతనూ వ్యాకరణశాస్త్రము వ్యూహించేసినాను. పరమేశ్వరప్రసాదామృతము లభించడము

చేత ఏవిధ మైనశ్రమ లేకుండా ఇల్లు చేరి, పెద్దలకు మొక్కి, ఉపకోశ పాతివ్రత్యకథ విని ఆశ్చర్యానందభరితుడ నయినాను. వర్షోపాధ్యాయులు నూతనవ్యాకరణము నావల్ల వినగోరితే కుమారస్వామివారే ఆయనకు వినిపించినారు.

ఇంద్రదత్తుని పరకాయప్రవేశము

వ్యాడీంద్రదత్తులు గురుదక్షిణ ఇస్తా మని విన్నవించగా ఉపాధ్యాయులు కోటివరహాలు అడిగినారు. గురువాక్యము స్వీకరించి వాళ్ళు నాతో ఇలా అన్నారు. "నందమహారాజును గురుదక్షిణకోసము యాచింతాము. ఇం కెక్కడా ఇంత సువర్ణము లభించదు. అతనికి తొంభై తొమ్మిదికోట్లు ఉన్నవి కాదా! ఉపకోశను అతడు ధర్మసహోదరిగా పేర్కొన్నాడు. కాబట్టి నీవు అతనికి బావమరిదివి. నీవల్లనే మనకు కావలసిన ధనము లభిస్తుంది"

అంతట సహాధ్యాయులము ముగ్గురమూ అయోధ్యాపురములో కందకటకమునకు వెళ్ళినాము. అక్కడ మేము అడుగుపెట్టే పెట్టకముందే రాజు మృతినొందినాడు. రాజ్యములో కలిగిన కలకలమువల్ల మాకు విషాదము కలిగింది. యోగసిద్ధుడైనఇంద్రదత్తుడు, "నేను ఈమృత రాజుదేహములో ప్రవేశిస్తాను. వరరుచి వచ్చి నన్ను ధనము కోరితే యావత్తూ ఇప్పిస్తాను. నేను తిరిగి వచ్చేవరకూ నాశరీరమును వ్యాడి కాపాడుతూ ఉండాలి" అని, యోగమార్గాన నందరాజుదేహములో ప్రవేశించినాడు. రాజుబతకడమువల్ల రాజ్యములో ఉత్సవము చేశారు జీర్ణదేవాలయములో ఇంద్రదత్తునికాయము వ్యాడి కాపాడుతున్నాడు. నేను రాజాస్థానానికి వెళ్ళి యోగనందుని ఆశీర్వదించి గురుదక్షిణ కోటివరహాలు కోరినాను.

మంత్రిశకటాలునికి రాజు ఆజ్ఞ యిచ్చినాడు. మరణించినవాడు మళ్ళీ జీవించడమూ, వెంటనే యాచకుడు రావడమూ, అడిగినమాత్రాన యాచకునకు ప్రభువు అంతసువర్ణము ఇమ్మని ఆజ్ఞాపించడమూ మంత్రికి అనుమానకారణము లయినవి. ప్రజ్ఞావంతులు గ్రహించలేనిది ఏముంటుంది? కనబడినశవాల నన్నింటినీ వెంటనే దహనము చేయించవలసిం దని రాజభటులకు మంత్రి ఆజ్ఞ యిచ్చినాడు. బ్రాహ్మణునికి కోటివరహాలు ఇంకా ఇచ్చినావా ఇవ్వలేదా అని అడుగుతున్న ప్రభువుతో మంత్రి, "దేవా, పరిజనము ఉత్సవములో మగ్నులయి ఉన్నారు. త్వరలోనే ఈవిప్రునికి విత్తము ఇప్పిస్తాను" అని విన్నవించినాడు. ఇంతలో వ్యాడి వచ్చి యోగనందునితో "దేవా రక్షించాలి, రక్షించాలి. మీఉత్సవసమయములో సమాధిలో ఉన్నబ్రాహ్మణుని రాజభటులు బలాత్కారముగా తీసుకుపోయి దహించారు" అని మొర పెట్టినాడు. ఆవాక్కులు వినగానే యోగనందునికి విచారమూ, అవస్థాంతరమూ కలిగినవి. నిజశరీరము దగ్ధముకావడముచేత ఇంద్రదత్తుడు నందరాజు శరీరములోనే స్థిరమయి పోయినాడు. మహాబుద్ధిమంతుడు శకటాలుడు నాకు సువర్ణ మిచ్చినాడు.

యోగనందుడు శకటాలుని చీకటినూతిలో పెట్టించుట

యోగనందుడు ఏకాంతముగా వ్యాడితో "అన్నా, ఎందుకు నాకీ సంపదలు? బ్రాహ్మణ జన్మ మెత్తినా, శూద్రుడ నయిపోయినానే!" అని దుఃఖించినాడు. వ్యాడి సమయోచితముగా మంచిమాటలు చెప్పి దుఃఖోపశమనము చేసి "సోదరా, శకటాలుడు నిన్ను కనిపెట్టినాడు. ఈమహామంత్రి తేలికగా నిన్ను రాజ్యభ్రష్టుని చేసి, పూర్వనందుని పుత్రుని చంద్రగుప్తుని ప్రభువును చేస్తాడు. కాబట్టి ముందే జాగర్త పడి వరరుచిని ప్రధానామాత్యుని చేసుకో. అతనిశక్తివల్ల రాజ్యము నీకు

స్థిర మవుతుంది అని, గురుదక్షిణ తీసుకొని వెళ్ళిపోగానే యోగనందుడు నన్ను ప్రధానామాత్యుని చేసినాడు. నేను రాజుతో ఏకాంత ప్రదేశములో "నీకు బ్రాహ్మణ్యము పోనే పోయింది. శకటాలుడు అధికారములో ఉన్నంతకాలమూ నీసింహాసనము అస్థిరమే. కాబట్టి యుక్తిచేత ఇతనిని వదిలించుకో" అని బోధించినాను. సజీవుడైన బ్రాహ్మణుని దహనము చేయించినా డన్న నేరము మోపి, శకటాలుని అతనిపుత్రులను రాజు చీకటి నూతిలో ప్రవేశపెట్టించినాడు. ప్రతిదినమూ వారికిమూకుడు పిండి, నీళ్ళు మాత్రము నూతిలోకి దింపడానికి ఆజ్ఞ యిచ్చినాడు. "ఈపిండి ఒకనికి హాసిహాసిగా సరిపోతుంది. మీలో ఎవరు నందునిమీద పగ సాధించగలరు? ఆ ఒకడే ఈపదార్థములు పుచ్చుకుంటే తక్కినవాళ్ళము మానివేస్తాము," అని శకటాలుడు కొడుకులతోఅన్నాడు. "నాయనా, నీవే సమర్థుడవు. మాకు శక్తి లేదు. నీవే ఆహారము తీసుకో" అని కొడుకులు వేడుకొన్నారు. శకటాలుడు ఆపిండి తినినీళ్ళు తాగుతున్నాడు క్రమక్రమముగా అతని పుత్రులు మృతి చెందినారు. పగ సాధించడము కోసము (శకటాలుడు ఆకళేబరాలమధ్య ప్రాణాలు బిగబట్టిఉన్నాడు.

యోగనందుని సామ్రాజ్యము

యోగనందుడు రాజ్యములో సుస్థిరు డయినాడు. వ్యాడి ఈలోగా గురుదక్షిణ యిచ్చి వచ్చి యోగనందుని ఆశీర్వదించి తపస్సుకు వెళ్ళి పోతా నన్నాడు. రాజు గద్గదకంఠముతో, "అన్నా, నీవు వెళ్ళవద్దు. నారాజ్యములో నీయిష్టము వచ్చినట్లు సుఖముగా ఉండు" అని వ్యాడిని వేడుకొన్నాడు. "రాజ్యముగాని, దేహము గాని క్షణభంగురము. ఇవి అన్నీ ఎండమావులవంటివి. వీటికి ప్రాజ్ఞులు మోహపడగూడదు" అని బోధించి వ్యాడి తపస్సుకే వెళ్ళిపోయినాడు.

తర్వాత యోగనందుడు రాజధాని అయినపాటలీపుత్రానికి సైన్య సమేతుడై బయలుదేరినాడు. నేనుకూడా వెంట వెళ్ళినాను. ఉపకోశ నాకు ఉపచారాలు చేస్తున్నది. నేను మంత్రిపదవిలో ఉన్నాను. గంగా భవాని ప్రసన్నురాలై ప్రతిదినమూ మాకు సువర్ణము అనుగ్రహిస్తు న్నది. సరస్వతీదేవి నాలో నివసించి ఆలోచనలు చెపుతూ ఉన్నది.

తరంగము: 7

యోగనందునికి శకటాలుడు మంత్రి అగుట.

వరరుచి మళ్ళీ కథ ప్రారంభించినాడు. క్రమక్రమముగా యోగ నందుడు కామపరవశుడై మదోన్మత్త మతంగజమువలె లోకమును లక్ష్యపెట్టడము లేదు. మథ్యసిరి మానవుని తలకిందులు చేస్తుంది "ఈరాజు విచ్చలవిడిగా తిరుగుతున్నాడు. ఇతని మీది ఆలోచనతో నాధర్మము కూడా నష్టమవుతున్నది. కాబట్టి బుద్ధికుశుల డయిన శకటాలుని తెప్పించి మంత్రిని చేయిస్తాను. నే నుండగా అతడు అపకారము ఏమి చేయగలడు? అని నేను యోచించి, నందుని ఒప్పించి, చీకటినూతిలో నుంచి శకటాలుని బయటికి తెప్పించి, మంత్రి పదవిలో నియోగించి నాను. అతడు నన్ను అనుసరిస్తూ రాజకార్యాలు నిర్వర్తిస్తున్నాడు. నేను ఉండగా యోగనందుని ఏమీ చేయ లేనని ఊరుకున్నట్లు కనబడ్డది.

వరరుచి ఇంగితజ్ఞానము

ఒకనాడు రాజు నగరమువెలుపల సంచరిస్తూ గంగాతీరానికి వెళ్ళి నాడు. నదీమధ్యమునుంచి అయిదువేళ్ళు కలియబట్టినచెయ్యి కనబ డ్డది. అదేమని రాజు వెంటనే నన్ను ప్రశ్నించినాడు. నాచేతివేళ్ళు రెండు కలియబట్టి ఆవైపు చూపినాను. వెంటనే నదిలోచెయ్యి అదృశ్య

మయింది. రాజు ఆశ్చర్యపడి అది యేమిటి అని అడిగినాడు. "ఆహా స్తము అయిదువేళ్ళు బిగబట్టి, అయిదుమంది ఏకముగా ఉంటే లోకములోవారికి అసాధ్య మైనపని లేదు అని సూచించింది. నేను రెండు వేళ్ళు కలిపి చూపి, ఇద్దరు కలిస్తే చాలు. అయిదుగురు ఎందుకు ? అని సమాధానము సూచించాను." అని చెప్పినాను. "శకటాలునిముఖము చూస్తే, నన్ను బుద్ధిలో జయించలే డన్నట్లు కనిపించింది. రాజు చాలా సంతోషించినాడు.

శుష్కమత్స్యము నవ్వుట

ఒకనాడు యోగనందుని పట్టపుదేవి మేడమీద నిలుచుని వీధిలో నిలువబడి ఆమెవంక దృష్టి నిలిపిన బ్రాహ్మణునివైపు చూచింది. యోగనందుడు ఆదృశ్యము చూచి త్వరపడి బ్రాహ్మణునికి ఉరిశిక్ష విధించినాడు. ఈర్ష్యాపరునికి వివేకము లోపిస్తుంది. తలారులు అతనిని వధ్యస్థానానికి తీసుకుపోతుంటే బజారులో ఒక ఎండుచేప పకపక నవ్వింది ఈవిషయము విన్నవింపగా, ప్రభువు ఉరిశిక్ష ఆపుదల చేయించి, చేప నవ్వడానికి కారణ మేమిటి అని అడిగినాడు "తెలుసుకొని వచ్చి మీకు వివరిస్తాను" అని నేను వెళ్ళి ఏకాంతప్రదేశములో కూర్చుండి సరస్వతీదేవిని తలుచుకొన్నాను దేవి ప్రత్యక్షమై "తండ్రీ, ఈరాత్రి ఎవరికీ కనబడకుండా వెళ్ళి ఆతాడిచెట్టుమీద కూర్చో. చేప నవ్వినకారణము నీకు అక్కడ తెలుస్తుంది. అని కటాక్షించింది. నేను వెళ్ళి తాడిచెట్టుమీది కెక్కి కూర్చున్నాను. ఇంతలో భయంకరాకృతి గల రాక్షసి చిన్నపిల్ల వాళ్ళతో అక్కడికి వచ్చింది. తినడానికి ఏ మయినా పెట్టుమని అడుగుతున్న ఆబాలకులతో రాక్షసి, "కాస్త ఓపిక చెయ్యండి బాబూ రేపటి దాకా. ఉదయము మీకు బ్రాహ్మణ మాంసము తెచ్చి పెట్టుతాను. ఈవేళ అతన్ని ఉరి తియ్యలేదు." అన్నది "ఈవేళే ఆయనను ఎందుకు

ఉరి తియ్యలేదు? అన్నారు బాలకులు. "ఎందుచేత నవ్వడముచేత రాజు శిక్ష ఆపుదల చేసినాడు" అన్నది రాక్షసి. "అయితే ఎందుచేత ఎందుకు నవ్వింది?" అని అడిగారు పిల్లలు. "ఈరాణివాస మంతా చెడిపోయినవారే. అంతఃపురములో పురుషులు చాలామంది స్త్రీవేషాలతో ఉన్నారు. కాళ్ళంతా సుఖంగా ఉండగా, ఏమీ ఎరగని అమాయక బ్రాహ్మడికి ఉరిశిక్ష ఎందుకో, అని చేప నవ్వింది" అన్నది రాక్షసి. కొంతసేపటికి నేను చెట్టు దిగివచ్చి ప్రాతఃకాలమే ప్రభువుకు ఈవిషయము తెలిపినాను. అంతఃపురములో ఆడవేషాలలో ఉన్నమగవాళ్ళను కనిపెట్టి రాజు నన్ను ఆదరించి బ్రాహ్మణునిశిక్ష తప్పించినాడు.

యోగనందుడు వరరుచిని సంహరించ మని శకటాలునికి ఆన తిచ్చుట

యోగనందుని వ్యవహారాలకు నేను విచారపడుతున్నాను. అట్టిస్థితిలో చిత్రకారు డొకడు వచ్చి, రాజును రాణిని పటముమీద చిత్రించినాడు. వాక్కు, చేష్ట తప్ప తక్కినవిధానములో ఆచిత్రాలు సజీవముగా ఉన్నట్లు కనపడ్డవి. ప్రభువు చిత్రకారునికి బహుమాన మిచ్చి ఆపటమును శయ్యాగృహములో గోడకు వేలాడదీయించినాడు. ఒకరోజు నేను ఆశయ్యాగృహములోకి వెళ్ళి దేవి సర్వలక్షణ లక్షితగా ఉండడము గుర్తించి, ఒక్కపుట్టుమచ్చ ఉండవలసినచోట లేకపోవడము గమనించి, ఆమె మొలతాడుపక్కన పుట్టుమచ్చ చిత్రించి వెళ్ళిపోయినాను. తర్వాత రాజు వచ్చి ఆమచ్చ చూచినాడట; చూచి ఎవరు వ్రాసినారని అంతఃపుర పాలకులను అడిగినాడట; నేను లిఖించినా నని వాళ్ళు చెప్పినారట "రహస్యప్రదేశాన ఉన్న ఈమచ్చ నాకు తప్ప మరెవ్వరికీ తెలియదు వరరుచికి ఇది ఎలా తెలిసింది? రహస్యముగా ఇతడు అంతఃపుర ద్రోహము చేస్తున్నాడు! అందుచేతనే ఆమధ్య స్త్రీ వేషధారు

లయిన పురుషులను కనిపెట్టినాడు" అని రాజు నిర్ధారణచేసుకొని శకటాలుని పిలిపించి "అంతఃపురద్రోహి అయినవరరుచిని వెంటనే సంహరించవలెను" అని అతనికి ఆజ్ఞ యిచ్చినా డట. శకటాలుడు సరే నని ఇంటికి వెళ్ళి ఇలా ఆలోచించినాడు:

"వరరుచి మహాప్రభావము కలవాడు. అతనిని సంహరించేశక్తి నాకు లేదు. ఆయన నన్ను ఆపదలోనుంచి రక్షించిన బ్రాహ్మణోత్తముడు. కాబట్టి ఆయనను గుప్తముగా దాచి రక్షించడము ఉత్తమకార్యము"

ఈవిధముగా భావించి శకటాలుడు వచ్చి రాజుకోపమునూ తదాజ్ఞనూ తెలిపి "మరొకనిని చంపిస్తాను. నీవు మాయింట్లో దాగి ఉండు" అని నాతో చెప్పి ఆప్రకారమే చేయించినాడు. నేను అతనియింటనే రహస్యముగా ఉన్నాను. అతనినీతికి ఆనందించి "శకటాలా, మంత్రి అంటే నీవే. నన్ను హింసించేబుద్ధి నీకు పుట్టలేదు. అయినా నన్ను ఎవరూ చంపలేరు. నామిత్రుడు రాక్షసుడొక డున్నాడు. నేను తలుచుకొంటే వచ్చి ఎంతపని అయినా చేస్తాడు. ఈరాజు ఎవరో తెలుసునా? వెనుక నామిత్రుడు ఇంద్రదత్తుడనేవిప్రుడు. అందుచేత ఇతనిని సంహరించరాదు" అని చెప్పినాను. అప్పుడు రాక్షసుని చూపించమని శకటాలుడు నన్ను ప్రార్థించినాడు.

వరరుచి శకటాలునికి రాక్షసుని గంగాదేవిని చూపుట

నేను తలుచుకోగానే రాక్షసుడు వచ్చినాడు శకటాలునికి భయమూ ఆశ్చర్యమూ కలిగినవి. రాక్షసుడు వెళ్ళిపోయినతర్వాత అతడు "నీకు రాక్షసుడు ఎలా చెలికా డయినాడో చెప్పు" అని అడిగినాడు నేను ఇలా చెప్పినాను:

ఈనగరములో పూర్వము గస్తీతిరిగేకొత్వాలు రాత్రి కొకడు చొప్పున మరణించేవాడు. కొన్నాళ్ళకు రాజు నన్ను కొత్వాలుగా

నియోగించినాడు. నేను ఆరాత్రి జాగరము చేస్తూఉండగా ఈరాక్ష సుడు కనపడి, "నగరములో కల్లా సుందరాంగి ఎవరో చెప్పు" అని నన్ను ప్రశ్నించినాడు. నేను నవ్వి "వెర్రివాడా, ఎవతె ఎవనికి ప్రియురాలో ఆమె వానికి సుందరాంగి" అని ప్రత్యుత్తర మిచ్చినాను. ఆ మాటలు నన్ను రక్షించినవి! రాక్షసుడు నన్ను చంపక "జితోస్మి! నీ కొక్కనికే నేను ఓడిపోయినాను. నిన్ను మెచ్చుకొన్నాను. నేటినుంచి నీవు నాస్నేహితుడవు. నీవు తలుచుకొన్నప్పు డల్లా వచ్చేస్తాను" అని చెప్పి అంతర్ధాన మయినాడు. నేను ఇంటికి వెళ్ళినాను. నాటినుంచీ ఈ రాక్షసుడు నాకు ఆపత్కాలములో తోడునీడ అయినాడు.

తర్వాత శకటాలుడు గంగాదేవిని చూప మని నన్నుకోరినాడు. ఆమెను నేను ధ్యానించాను. గంగ దేవతాకారములో సాక్షాత్కరించింది. ఆమెను స్తుతించాను. దేవి సంతోషించి అంతర్ధాన మయింది.

ఒకనాడు నేను విచారముతో ఉన్నాను. మంత్రిపుత్రుడు "సఖా, సర్వజ్ఞుడ వయినా ఎందుకు విచారముగా ఉన్నావు: ప్రభువులకు వివేకము చాలా దూర మని తెలియదా: నీమీది అపవాదు త్వరలోనే తొలిగిపోతుంది. దృష్టాంతరము విను.

శివశర్మకథ

పూర్వకాలములో ఇక్కడ ఆదిత్యవర్మ ప్రభువు. అతనికి శివశర్మఅనే మహామంత్రి ఉండేవాడు. ఒకప్పుడు అతని రాణులలో ఒకతె గర్భవతి అయింది. రాజు అంతఃపురపాలకులతో "మేము ఈమె వద్దకు వచ్చి రెండు సంవత్సరా లయింది ఈమెకు గర్భము ఎలా కలిగింది?" అని అడిగినాడు. "దేవా పోతుటీగఅయినా ఇక్కడికి వచ్చేందుకు వీలులేదు. శివశర్మమంత్రి మాత్రము నిరాక్షేపంగా వస్తూ పోతూ ఉంటాడు" అని వాళ్ళు విన్నవించారు. శివశర్మ అంతఃపురద్రోహము చేసినాడని

భావించి, రాజు అతనిని బహిరంగముగా చంపడము భావ్యము కా దని ఉపాయము చేసి తన సామంతు డయిన భోగవర్మవద్దకు మంత్రిని పంపి రహస్యముగా అతనిని తుద ముట్టించ వలసిన దని లేఖ పంపినాడు. శివశర్మ వెళ్ళినయేడవనాడు ఆరాణి స్త్రీవేషధారి అయిన ఒకానొక పురుషునితో లేచి పోతుంటే రక్షకభటులు పట్టుకొన్నారు. మంత్రి సత్తముని వృథాగా చంపించానే అని ఆదిత్యవర్మ చాలా పశ్చాత్తాప పడ్డాడు. ఇంతలో శివశర్మ భోగవర్మరాష్ట్రానికి వెళ్ళినాడు. రాజులేఖ కూడా వచ్చింది. భోగవర్మ యేకాంతంగా శివశర్మకు ఆజాబు చూపించి అందులో ఉన్నమరణదండన తెలియ జేసినాడు. 'నన్ను వెంటనే సంహరించు; సంహరించవా, ఆత్మహత్య చేసుకుంటాను" అన్నాడు శివశర్మ. భోగవర్మ ఆశ్చర్యపడి "ఏమి విప్రోత్తమా, ఇంత లోందర పడుతున్నావు! ఇందులో ఏదో మర్మమున్నది. చెప్పు! చెప్పకపోతే ఒట్టునుమా!" అన్నాడు. రాజా, నన్ను సంహరించిన-చోట పన్నెండు సంవత్సరాలు వర్షము కురవదు" అని శివవర్మ చెప్పినమీదట రాజు మంత్రులతో ఆలోచన చేసినాడు. ఆదిత్యవర్మ దుర్మార్గుడు. మన దేశము నాశనము చేయడానికి ఈయెత్తు ఎత్తినాడు. ఈబ్రాహ్మణుని చంపించ వలెనంటే తనరాజ్యములో హంతకులు లేరా! కాబట్టి శివ శర్మను మనము వధించగూడదు; ఆత్మహత్య చేసుకోనియ్యగూడదు" అని నిర్ణయించుకొని భోగవర్మ రక్షకభటులను కావలి పెట్టి శివశర్మను తన రాష్ట్రములోనుంచి దూరప్రదేశము పంపివేసినాడు. మహామంత్రి శివశర్మ తనబుద్ధిబలముచేత బతికి మళ్ళీ స్వస్థానానికి చేరుకొన్నాడు. రాజు అతనిని నిర్దోషిగా నిరూపించినాడు. ధర్మము ఎన్నటి కయినా జయించి తీరుతుంది. నీమీది అపవాదుకూడా పోతుంది. మాయింట్లో నిశ్చింతగా ఉండు.

వరరుచి హిరణ్యగుప్తుని శాపమువిమోచనము చేయుట

శకటాలునివాక్కులకు శాంతి పొంది అతనియింటిలోనే రహస్యముగా ఉంటున్నాను. ఒకరోజు యోగనందుని కుమారుడు హిరణ్యగుప్తుడు వేటకు వెళ్ళినాడు. గుర్రము అతన్నిదూరముగా తీసుకు పోయింది. పరివారజనము ఎక్కడో దిగబడిపోయినారు. సూర్యాస్తమానముకూడా అయింది. రాత్రిగడపడానికి రాజకుమారుడు చెట్టు మీది కెక్కినాడు. ఇంతలో సింహము తరుముకొని వస్తూంటే ఎలుగుబంటి త్వరత్వరగా వచ్చి ఆ చెట్టే ఎక్కింది. తననుచూచి భయముతో వణుకుతున్న రాజకుమారునితో ఎలుగుబంటి "నీవు నాస్నేహితుడవు నీకు భయములేదు" అని చెప్పింది. భయముతీరి రాజకుమారుడు నిద్రపోయినాడు. ఎలుగుబంటి మేలుకొనే ఉన్నది. సింహముఎలుగుబంటితో "నిద్రపోతున్న ఆమనిషిని కిందికి నెట్టు. తర్వాత నేను వెళ్ళిపోతాను" అన్నది. నేను మిత్రద్రోహము చెయ్యను అన్నది ఎలుగుబంటి. తర్వాత రాజకుమారుడు మేలుకొన్నాడు. ఎలుగుబంటి నిద్రపోయింది. సింహము అతనితో "మనిషీ, ఎలుగుగొడ్డును కిందికినెట్టు" అన్నది. రాజకుమారుడు సింహాన్ని మంచి చేసుకోడానికి ఎలుగును నెట్టినాడు. కాని ఎలుగు గొడ్డుకు మెలుకువ వచ్చి కొమ్మలుపట్టుకొని కిందపడక, "మిత్రద్రోహీ, నీకు పిచ్చి యెత్తుతుంది!" అని శాపముపెట్టి, "ఎవరైనా ఈవృత్తాంతముగ్రహించి చెప్పినప్పుడు నీకుశాపమోక్షము అవుతుంది." అన్నది. మర్నాడు ఉదయము రాజకుమారుడు ఎలాగో రాజధానికి వచ్చినాడు. అతనికి పిచ్చి యెత్తింది. కుమారుని అవస్థచూచి యోగనందుడు చాలావిచారపడి "ఈనమయములో వరరుచిఉంటే దీనిహేతువు గ్రహించి ప్రతిక్రియ చేసేవాడే. అతన్ని వృథాగా చంపించాను!" అన్నాడు. శకటాలుడు ఆమాటలువిని "వరరుచిని బయటి పెట్టడానికి

ఇది చాలా మంచితరుణము ! అతడు అభిమాని. ఇక రాజుదగ్గిర ఉండడు. నామీద విశ్వాసముతో ఉంటాడు" అనుకొని రాజువల్ల అభయము పొంది "దేవా, విచారించకండి. వరరుచి సజీవుడే" అని చెప్పినాడు. తక్షణము నన్ను తీసుకు రమ్మని రాజుచెప్పగానే శకటాలుడువచ్చి తీసుకు వెళ్ళినాడు. రాజకుమారునిస్థితి చూచి, సరస్వతీదేవిని స్మరించి, ఆమెఅనుగ్రహము వల్ల జరిగినసంగతులు తెలుసుకొని, రాజుతో "వీడు మిత్రద్రోహము చేసినాడు" అని జరిగినసంగతులు చెప్పినాను. రాజకుమారుని శాపమోక్షమయింది. అతడు మనశ్శాంతి పొంది నన్ను స్తోత్రము చేసినాడు. "నీ కీవృత్తాంతము ఎలా తెలిసింది ?" అని యోగనందుడు నన్నడిగినాడు. బుద్ధికుశలతఉంటే ఊహవల్ల, కొన్నిలక్షణాల వల్లగ్రహించవచ్చు. రాణి పుట్టుమచ్చనంగతి తెలిసినట్టే ఇదీ తెలిసింది" అని నేను చెప్పినాను. రాజుసిగ్గుపడి, పశ్చాత్తాపము పొందినాడు.

తర్వాత యోగనందుడు చేసినసత్కారాలు స్వీకరించకుండా అక్కడినుంచి వెళ్ళినాను. నామీదిఅపవాదు తొలిగిపోవడమే నాకుముఖ్యము. నేను స్వగృహము చేరగానే ఇంట్లోవాళ్ళంతా రోదనము చెయ్యడము మొదలుపెట్టినారు. ఏమితోచక దిగ్భ్రమ చెందినతాతో ఉపవర్షాచార్యులు విచారముతో "యోగనందుడు నిన్నుచంపించినా డనేవార్తవిని నీభార్య అగ్నిప్రవేశము చేసింది. నీతల్లి గుండె పగిలిచనిపోయింది" అన్నాడు. ఆదుఃఖవార్తలకు నేను చాలా కుంగిపోయినాను. వర్షాచార్యులవారు వచ్చి "నాయనా, సమస్తమూ అనిత్యము. మాయాస్వభావము తెలిసికూడా ఎందుకుఇలా అజ్ఞానములో పడతావు ?" అని మంచిమాటలు చెప్పినమీదట నేనుకొంతవరకు తెప్పరిల్లినాను. పిమ్మట విరక్తిచేత సర్వసంగపరిత్యాగము చేసి ప్రశాంతికోసము తపోవనము ఆశ్రయించాను. కొంతకాలము గడిచిన మీదట ఒకనాడు అయోధ్యనుంచి బ్రాహ్మణుడు ఒకడు అక్కడికివచ్చినాడు. నేనుయోగనందుని

వార్తలు అడిగాను. అతడు నన్ను ఆసనాలు పట్టి, విచారముతో ఇలా చెప్పినాడు :

చాణక్యుడు యోగనందుని సంహరించుట

మీరు వెళ్ళినతర్వాత నందునిగతి ఏమయినదో తెలిసిందా ? శకటాలుడు అతనిని ఉపాయముగా నాశము చెయ్యవలెనని చూస్తున్నాడు. ఒకనాడు తోవలో నేలతవ్వుతున్న చాణక్యుని చూచి "ఎందుకయ్యా, నేల తవ్వుతావు ?" అని అడిగినాడు. "ఈదర్భ నాకాలికి తగిలింది ; అందుచేత నిర్మూలము చేస్తున్నాను" అన్నాడు చాణక్యుడు. ఆవిప్రుడు మహాకోపీ, దృఢనిశ్చయుడూ అని యెంచి యోగనందుని సంహారానికి మంచిసాధన మవుతా డని భావించి నామధేయము తెలుసుకొని 'విప్రోత్తమా, నందమహారాజుగారియింట నీకు త్రయోదశీశ్రాద్ధము ఇప్పిస్తాను. చాలాదక్షిణ దొరకుతుంది. అగ్రభోజనము నీది" అని చెప్పి శకటాలుడు అతనిని తనయింటికి తీసుకు వెళ్ళి శ్రాద్ధమునాడు నందమహారాజుకు చాణక్యుని చూపించినాడు. రాజుసమ్మతించినాడు. చాణక్యుడు వెళ్ళి శ్రాద్ధకర్మలో అగ్రస్థానములో కూర్చున్నాడు. సుబంధువనే మరొకబ్రాహ్మణుడు అక్కడ కూచోబోయినాడు. శకటాలుడు ఈవిషయము మహారాజుకు విన్నవించినాడు. "సుబంధువే అగ్రస్థానానికి అర్హుడు. ఇంకొకడు పనికిరాడు" అని రాజు నిర్ణయించినాడు. శకటాలుడు చాణక్యునివద్దకు భయపడుతూవచ్చి, రాజాజ్ఞ తెలిపి, అందులో తనదోషము లేదని మనవి చేసినాడు. చాణక్యుడు కోపోద్దీప్తుడై జుట్టుముడివిప్పి "ఈనందుని ఏడవరోజు చాటకుండా నాశనముచేసి, తర్వాతనే జుట్టు ముడివేసుకుంటాను" అని ప్రతిజ్ఞ చేసినాడే కాని రాజభయము వల్ల వెంటనే పలాయనము చేసినాడు. శకటాలుడు అతనిజాడలు కనిపెట్టి తెచ్చి, తనయింట్లోనే

రహస్యముగా దాచిపెట్టినాడు. ప్రయోగానికి కావలసిన సామగ్రులు అన్నీ మంత్రి తెప్పించినాడు. చాణక్యుడు యోగనందునిమీద ప్రయోగము చేసినాడు. దాహజ్వరముచేత యోగనందుడు ఏడవ నాడు మరణించినాడు. మంత్రి, రాజకుమారు డయిన హిరణ్యగుప్తు నిచంపించి, పూర్వనందుని కుమారు డయిన చంద్రగుప్తునకు రాజ్యాభి షేకము చేసి, చాణక్యుని ప్రార్థించి మంత్రిగా ఏర్పాటు చేసినాడు. తనపుత్రుల మృతికి కారకు డయిన యోగనందుడు చనిపోవడముచేత వగ తీరి కృతార్థుడై శకటాలుడు, పుత్రశోకము పొంగి రాగా తపో వనానికి వెళ్ళినాడు.

వరరుచి దివ్యగతి పొందుట

కాణభూతీ, ఆవిధ్రువు చెప్పినమాటలవల్ల నమస్తమూ అనిత్య మని స్పష్ట మయింది. చాలా విచారము కలిగి వింధ్యవాసినీదేవిని దర్శించ డానికి వచ్చి, నిన్ను చూడగలిగినాను. నిన్ను చూచేటప్పటికి పూర్వ జన్మస్మరణా దివ్యజ్ఞానమూ కలిగినవి. మిత్రమా, నీకు బృహత్కథ చెప్పినాను. నాశాపము ఇప్పటికి తీరింది. ఇక దేహము చాలిస్తాను. మూడుభాషలలో మాటాడ నని శపథము పట్టిన గుణాఢ్యుడు శిష్య సమేతముగానీనన్నిధికి వస్తాడు. అంతవరకూ నీవిక్కడే ఉండు. అతడు మాల్యవంతు డనేప్రమథుడు. నాకోసము పార్వతీదేవిని ప్రార్థించి శాపగ్రస్తుడై మనుష్యజన్మ మెత్తినవాడు. మహేశ్వరప్రోక్తమైనయీకథ అతనికిచెప్పు. మీ ఉభయులకూ శాపవిముక్తి అవుతుంది.

వరరుచి ఈవృత్తాంతము యావత్తూ కాణభూతికి చెప్పి, దేహము చాలించడానికి బదరికావన పుణ్యభూమికి వెళ్ళుతు గంగాతీరాన శాకాహారి అయిన మునిని చూచినాడు. అతని చేతికి దర్భ గుచ్చుతో పదమువల్ల రక్తము కారుచున్నది. అతనికి ఎంత అహంకార మున్నదో

పరీక్ష చెయ్యడానికి వరరుచి ఆరక్తమును శాకరసముగా మార్చివేసినాడు. రక్తము శాకరసముగా మారిపోవడము గమనించి సిద్ధుడనైనా నని ఆముని గర్వము పొందినాడు. అప్పుడు వరరుచి మందహాసము చేసి అతనితో "ఆర్యా" పరీక్షార్థము నీరక్తాన్ని శాకరసము చేశాను. ఇప్పటికీ నీఅహంకారము పోలేదు. జ్ఞానమార్గానికి అహంకారము గొప్ప ఆటంకము కదా! జ్ఞానము లేకుండా ఎన్నిప్రకారాలు చేసినా నిష్ఫలము. అహంకారము విడిచి పెట్టు" అని బోధించినాడు. ఆముని వరరుచికి నమస్కరించి, స్తోత్రము చేసినాడు. తర్వాత వరరుచి బదరికాశ్రమానికి వెళ్ళినాడు. మానవదేహము త్యజించేకోరికతో గౌరీదేవిని దృఢభక్తితో ఆశ్రయించినాడు. పార్వతి ప్రత్యక్షమై అగ్నిధారణ బోధించింది. ఆ అగ్నితో వరరుచి శరీరము దగ్ధము చేసి దివ్యగతి పొందినాడు.

కాణభూతి గుణాఢ్యునికోసము వింధ్యారణ్యములో ఎదురు చూస్తున్నాడు.

తరంగము : ౬

మాల్యవంతుడు పార్వతి శాపమువల్ల మనుష్యజన్మ యెత్తి గుణాఢ్యుడు అనేపేరు పొంది, సాతవాహనరాజును సేవించి, ప్రభుసముఖములో చేసిన ప్రతిజ్ఞవల్ల సంస్కృతము మొదలయిన మూడుభాషలు విడిచి పెట్టి విచారముతో వింధ్యవాసినీదేవిని దర్శించడానికి వచ్చినాడు. దేవీఆకృతిప్రకారము కాణభూతిని చూచి, పూర్వజన్మ జ్ఞప్తికి వచ్చేసరికి తాను విసర్జించిన మూడుభాషలకంటె విలక్షణమైనపైశాచీభాషలో కాణభూతికి తనపేరు చెప్పి "మిత్రమా, పుష్పదంతునివల్ల నీవు విన్నదివ్యకథ నాకు చెప్పు. మన కుభయులకూ శాపవిమోచన మవుతుంది" అన్నాడు. ఆమాటలకు కాణభూతి సంతోషించి వెం

న్కరించి, "అలాగే చెపుతాను కాని నాకుతూహలము తీర్చాలి. జన్మమొదలు నేటివరకూ నీపవిత్రచరిత్ర నాకు వినిపించాలి" అని వేడు కొన్నాడు. గుణాఢ్యుడు ఇలా చెప్పినాడు.

గుణాఢ్యుని చరిత్ర

ప్రతిష్ఠాన ప్రదేశములో సుప్రతిష్ఠిత మనే పట్నము ఉన్నది. అక్కడ నివసించే సోమశర్మకు వత్సుడు, గుల్మకుడు అని యిద్దరు కొడుకులూ శ్రుతార్థ అనేకూతురూ కలిగినారు. కాలక్రమేణ ఆవిప్రుడూ ఆయనభార్యా చనిపోయినారు. ఆ అన్నదమ్ములు చెల్లెలిని సంరక్షిస్తు న్నారు. ఆమె హఠాత్తుగా గర్భవతి అయింది. పరపురుషులు ఎవరూ అక్కడ లేకపోవడముచేత వాళ్ళకు ఒకరిమీద ఒకరికి అనుమానము కలిగింది. అసంగతి గ్రహించి శ్రుతార్థ "అన్నలారా, నాగరాజయిన వాసుకితమ్మునికి కీర్తిసేను డనేకుమారు డున్నాడు. ఒకనాడు నేను స్నానానికి వెళుతూ ఉంటే అతడు నన్ను చూచి మోహించి, తన కులగోత్రాలు తెలిపి గాంధర్వవిధిని వివాహము చేసుకొన్నాడు. ఈ గర్భమునాకు బ్రాహ్మణజాతివల్లనే కలిగింది" అని చెప్పింది. ఆమాటలకు అన్నదమ్ములు దృష్టాంతరము చూపించ మని చెల్లెలితో అన్నారు. ఆమె ఏకాంతములో నాగకుమారుని తలుచుకొన్నది. అతడు వచ్చి వత్సగుల్మకులను చూచి "మీచెల్లెలు అప్సరస. శాపమున్నల్ల మానవజన్మ ధరించింది. మీరుకూడా శాపము వల్ల ఈలోకములో పుట్టినారు. ఈమెకు కుమారుడు కలు గుతాడు. దానితో మీకు ముగ్గురికీ శాపమోక్షము అవు తుంది" అనిచెప్పి అంతర్ధాన మయినాడు. కొద్దిరోజులలో ఆమెకు పుత్రుడు పుట్టినాడు. ఆసమయములో ఆకాశవాణి "ఈబాలుడు

ప్రమథుని అవతారము. గుణాఢ్య డనేపేరుతో లోకములో ప్రసిద్ధు డవుతాడు" అని పలికింది.

తర్వాత కొంతకాలానికి నాతల్లీ మేనమామలూ శాపవిముక్తులయి దేహాలు చాలించారు. బాలుడ నయినప్పటికీ నేనుదక్షిణాపథము వెళ్లి విద్యాభ్యాసము చేసి, క్రమక్రమముగా పేరుప్రతిష్ఠలు సంపాదించి, చాలాసంవత్సరాలకు స్వదేశానికి శిష్యవరమేతముగా వచ్చాను. సుప్రతిష్ఠితనగరము అపూర్వశోభతో కనిపించింది. ఒకచోట సామగానము జరుగుతున్నది. ఒకచోట విప్రులు వేదార్థవాదము చేస్తున్నారు. జూదరులు 'నిపుణునిచేతిలో నిధి ఉన్నది' అని ద్యూతమును పొగడుతున్నారు. ఒకప్రదేశములో వైశ్యులు తమవ్యాపారదక్షతను ప్రశంసిస్తున్నారు. వారిలో ఒకడు తనచరిత్ర ఇలా చెప్పినాడు:

ఎలుకసెట్టి కథ

మూలధనము ఉండి దానివల్ల ధనము సంపాదించడము ఏమి గొప్ప? చేతిలో పైసా లేకుండా పూర్వము నేను ధనము సంపాదించినాను. నేను మా అమ్మకడుపులో ఉండగానే మాతండ్రి చనిపోయినాడు. దుర్మార్గులైన దాయాదులు మాఆస్తి యావత్తూ హరించినారు. మాతాతగారి మిత్రుడైన కుమారదత్తుని ఇంట్లో మా అమ్మ నివాసము చేయడము ప్రారంభించింది. ఇంతలో నేను పుట్టినాను. ఆమె అష్టకష్టాలూ పడి, నన్ను పెంచి పెద్దవాణ్ణి చేసింది; వీధిబడిపంతులను ఆశ్రయించి నాకు వ్రాతపోతలూ, లెక్కలూ నేర్పించింది. ఒకనాడు మా అమ్మ నాతో "నాయనా, నీవు కోమటిబిడ్డవు. వ్యవకము చెయ్యడము మనధర్మము. ఈదేశములో విశాఖలుడు అనేవైశ్యశిఖామణి ఉన్నాడు. వేదవారైన గొప్పయింటి కోమటిబిడ్డలకు ఆయన వ్యవకనిమిత్తము ధనసహాయము చేస్తాడట. నీవూ వెళ్లి ఆయనను

మూలధనము అడుగు" అని చెప్పింది. నేను వెంటనే బయలుదేరి ఆయనవద్దకు వెళ్లినాను. ఆనమయూన విశాఖలుడు ఒకానొక వైశ్య కుమారుని "అబ్బాయీ, ఈ చచ్చిన యెలుకను చూడు తెలివి కల వాడు దీనినికూడా సరుకు చేసుకోగలడు. నీవు ఎందుకూ పనికి రావు! ఎన్నిసార్లు నీకు ధన మిచ్చాను! వడ్డీమాట అలా ఉంచి అసలే పాడు చేశావు!" అని మందలిస్తున్నాడు. ఆమాటలు విని నేను "ఆర్యా, ఈయెలుక నాకు మూలధనముగా ఇచ్చి, లెక్క వ్రాయించండి" అన్నాను. ఆయన నవ్వుతూ ఉంటే నేను ఎలుకను తీసుకు పోయినాను. ఒకానొక వర్తకుని పిల్లికోసము ఆయెలుకను రెండుదోసిళ్ల సెనగలకు అమ్మినాను. ఆసెనగలు వేయించి మంచినీళ్లకుండ దగ్గర పెట్టుకొని గ్రామమువెలుపల మార్గముపక్కన చెట్టునీడలో కూర్చున్నాను. ఆమార్గాన దప్పిగొని వచ్చేకట్టెమోపులవాళ్లకు కాసిని కాసిని సెనగలు పెట్టి మంచిమాటలు చెపుతూ మంచినీళ్లు పోసినాను. ఒక్కొక్కరు రెండేసికర్రలచొప్పున నాదగ్గర పడవేసి వెళ్లినారు. అవి బజారు పట్టుకుపోయి విక్రయించి, వచ్చినడబ్బుతో సెనగలు కొని వెనకటికోజువలెనే మోపులవాళ్లకు పెట్టి, కట్టెపుల్లలు తీసుకొన్నాను. కొన్నాళ్లు ఇలాగే చేసి, చాలా వంట్లచెరుకు సంపాదించి, క్రమముగా కట్టలమోపు లన్నీ నేనే కొని భద్రము చేసినాను. ఇంతలో వర్షము కురిసి, ఇతరప్రదేశాలనుంది కట్టెలు రావడము కష్ట మయింది. అప్పుడు నానరుకు చాలా లాభానికి విక్రయించి, ఆడబ్బుతో దుకాణము పెట్టి క్రమేణ ధనికుడను అయినాను. ఒకనాడు బంగారముతో ఎలుకను చేయించి విశాఖలునివద్దకు వెళ్లి "ఆర్యా, ఇదుగో మీ రిచ్చినమూల ధనము. వడ్డీకూడా కలిపినాను" అని చెప్పి యిచ్చినాను. ఆయన చాలా సంతోషించి తనకూమార్తెను నాకిచ్చి వివాహము చేసి, కూతురికి వినోదార్థము ఆబంగారుమూషికమును బహుమానము చేసినాడు.

నాకు ఎలుక సెట్టి అని పేరు రావడానికి ఇదే కారణము. చేతిలో ఏమీ లేకుండా ఇంతధనము సంపాదించాను. ఈకథ విని అక్కడినవర్తకులు ఆశ్చర్యపడ్డారు. ఆధార మేమీ లేకుండా చిత్తరువు వ్రాస్తే ఆశ్చర్యము కలగదా?

మందమతి అయిన సామవేది కథ

సామవేదము చెప్పుకొన్న బ్రాహ్మణుడు ఒకచోట ఎనిమిదిమూడల బంగారము దానము పట్టినాడు. ధూర్తవిటు డొకడు ఆవిప్రుని వంచన చేతా మనుకొని "బ్రాహ్మణోత్తమా, నీకు భోజనము ఎక్కడనైనా దొరుకుతుంది. కేవలవైదికుడవు. లోకయాత్ర అభ్యసిస్తే నీవు మంచి నేర్పరి వవుతావు" అన్నాడు. ఆవెర్రిబ్రాహ్మణుడు "నా కెవరు నేర్పుతారు!" అన్నాడు. "అదుగో వేశ్యయిల్లు. అందులో ఉన్న చతురికవద్దకు వెళ్లితే అది నేర్పుతుంది" అన్నాడు ఆవిటుడు. "అక్కడికి వెళ్లి నే నేమి చెయ్యాలి?" అన్నాడు బ్రాహ్మణుడు. "బంగార మిచ్చి దాన్ని రంజింపజెయ్యి. సామవాక్యాలు ప్రయోగించు" అని ధూర్తవిటుడు చెప్పేనరికి సామవేదము నేర్చిన ఆవిప్రుడు వెంటనే చతురికయింటికి వెళ్లినాడు. వేశ్య ఆయనకు ఎదురు వచ్చి మర్యాద చేసింది. బ్రాహ్మణుడు కూర్చుని "ఈబంగారము పుచ్చుకొని నాకు లోకయాత్ర నేర్పు" అన్నాడు. అక్కడ ఉన్నవాళ్లంతా నవ్వినారు. ఆవెర్రిబ్రాహ్మణుడు చేతులు ఆవుచెవిలె పట్టి బిగ్గిరగా సామగానము ప్రారంభించినాడు. ఆచమత్కారము చూడడానికి వీటులు మూగినారు. "ఈజంబుకము (నక్క) ఇక్కడి కెందుకు వచ్చింది? దీనికంతానికి ఒక్కఅర్ధచంద్రము ఇచ్చి పంపివెయ్యండి" అన్నారు కొందరు. అర్ధచంద్రమంటే బాణ మనుకొని బ్రాహ్మణుడు భయపడి, తెలిసింది లోకయాత్ర అని కేకలు వేస్తూ, ప్రథమములో

తనను అక్కడికి పంపించిన ధూర్తవిటునివద్దకు వచ్చి, జరిగినసంగతులు వివరించినాడు. "వెర్రిబ్రాహ్మడా, సామము అంటే వేదము కాదు, మంచిమాట లాడ మని నాఅభిప్రాయము. వేశ్యానడనములో వేదము ఎందుకయ్యా!" అని, అతనిని చతురికదగ్గరకు తీసుకుపోయి, "ఉద్విపాత్సపుకు బంగారము గడ్డివలె విసిరి పడవెయ్యి" అని చెప్పినాడు. వేశ్య నవ్వుతూ అతనిబంగారము అతనికి ఇచ్చింది. ఒతుకు జీవుడా అని ఆ బ్రాహ్మణుడు సంతోషిస్తూ నిజగృహానికి వెళ్లినాడు.

ఇటువంటి వినోదాలు చూస్తూ దేవేంద్రభవనమువంటి రాజమంది రానికి వెళ్లినాను. ముందుగా శిష్యులచేత లోపలికి వార్త పంపినాను. శర్మవర్మ మొదలయిన పెద్దలు చుట్టూ ఉండగా, రత్నసింహాసనము మీద కూర్చుని ఉన్న సాతవాహనమహారాజును నందర్శించి, ఆశీర్వదించి, ఉచితాసనముమీద కూర్చున్నాను. రాజు నన్ను గౌరవించినాడు. శర్వవర్మాదులు నన్నుగురించి రాజుతో "దేవా, ఈయన జగత్ప్రసిద్ధ కలవాడు, సకలవిద్యావిశారదుడు గుణాఢ్యుడు అనేసార్థకనామము కలవా డయినాడు" అని స్తుతించినారు. ప్రభువు సంప్రీతుడై, నన్ను వెంటనే మంత్రిపదవిలో నియోగించినాడు. అప్పటినుంచీ నేను రాజ కార్యాలు చక్కబెట్టుతూ, శిష్యులకు పాఠాలు చెపుతూ, వివాహము చేసుకొని, సుఖముగా కాలక్షేపము చేస్తున్నాను.

దేవీకృత—ఉద్యాన చరిత్ర

ఒకనాడు సాయంకాలము వినోదార్థము గోదావరీతీరానికి వెళ్లి, అక్కడ దేవీకృతి అనే ఉద్యానము చూచి, దానివైభవానికి ఆశ్చర్యపడి, అది ఎలా నిర్మాణమయినదో అని వనపాలకుని అడిగినాను. వాడు ఇలా చెప్పినాడు :

"స్వామీ, పెద్దలుచెప్పకోగా విన్నాను. పూర్వము ఒక బ్రాహ్మడు ఆహారము మాని వేసి, మౌనము పూని, ఈదివ్యోద్యానమూ, ఆలయమూ నిర్మాణము చేయించాడు. ఈవిచిత్రం చూడడానికి వచ్చిన బ్రాహ్మలు గుచ్చి గుచ్చి అడిగితే ఇలా చెప్పాడట:

నర్మదాతీరాన భరుకచ్ఛపము అనే దేశము నాజన్మస్థానము. నేను బీదవాడను, పైగా సోమరిపోతును. ఎవరూనాకు బిచ్చము పెట్టేవారు కారు. చివరకు ప్రాణము విసికి, తీర్థయాత్రకు బయలుదేరి, చాలా పుణ్యక్షేత్రాలు సేవించి, క్రమేణ వింధ్యవాసినీదేవిని దర్శించి, "జన సామాన్యము అమ్మవారికి మేకలు మొద లయినవి బలి యిచ్చి వరాలు పొందుతున్నారు. పశుప్రాయుడ నయిన నన్నే బలి యిచ్చు కొంటాను" అని నిశ్చయించుకొని, కంఠము నరుకుకొనడానికి కత్తి యెత్తినాను. నామీద అనుగ్రహము కలిగి దేవి ప్రత్యక్షమై "వత్సా, ఆత్మ హత్య వద్దు. నీవు సిద్ధుడవయినావు. నా సన్నిధానములోనే ఉండు" అని అనుగ్రహించింది. నాకు దేవత్వము ప్రాప్తించింది. ఆకలి దప్పికలు పోయినవి. తర్వాత కొన్నాళ్లకు అమ్మవారు, "వత్సా, ప్రతిష్ఠానమునకు పోయి, రమణీయమైన ఉద్యానము నిర్మించు" అని ఆన తిచ్చి దివ్యబీజమును ప్రసాదించింది. ఆగింజ యిక్కడ నాటినాను. దానిమహిమవల్ల ఈ ఆరామము సిద్ధ మయినది. దీనిని మీరు సంరక్షించవలె" అంటూ ఆయన అంతర్ధానమయినాడు. స్వామీ, దేవి మహాత్మ్యమువల్ల ఈక్షోట సృష్టిజరిగింది. ఉద్యానపాలకునివల్ల ఈకథ విని సంతోషించినాను.

సాతవాహనుని పూర్వచరిత్ర

ఈచరిత్ర విని కాణభూతి మహారాజుకు సాతవాహను డనేపేరు ఎందుకు వచ్చిందో చెప్ప మన్నాడు. గుణాఢ్యుడు ఇలాచెప్పినాడు:

దీపకర్ణి అనేరాజుకు శక్తిమతి అనే భార్య ఉండేది. ఆమె అంటే రాజుకు చాలా యిష్టము. ఒకరాత్రి పాము కరిస్తే ఆమె చనిపోయింది. సంతానము లేకపోయినా దీపకర్ణి బ్రహ్మచర్యవ్రతము అవలంబించినాడు. తన తదనంతరము రాజ్యానికి వచ్చేవాడు లేడే అని విచారిస్తూ ఉన్న రాజుకు ఒకరాత్రి స్వప్నములో మహేశ్వరుడు సాక్షాత్కరించి, "రాజన్, ఈఅరణ్యములో సింహముకెక్కిఉన్న బాలుడు నీకుకనపడతాడు. వానిని ఇంటికి తెచ్చుకో వాడేనీకు పుత్రప్రాయుడు" అని అనుగ్రహించినాడు. రాజు ఆస్వప్నమును స్మరిస్తూ ఆనందిస్తూ ఉండేవాడు. కొన్నాళ్లకు దీపకర్ణి ఒకనాడు వేటకు వెళ్ళి, చాలా దూరము తిరిగి తిరిగి పద్మనరోవరముదగ్గర సింహముమీద కూర్చున్న బాలుని మధ్యాహ్నసమయములో చూచినాడు. వెంటనే స్వప్నము సంగతి జ్ఞప్తికి వచ్చింది. ఇంతలో సింహము బాలుని దింపి సరోవరములో నీరు తాగడానికి వెళ్ళింది. దీపకర్ణి సింహముమీదికి బాణము విడిచినాడు. వెంటనే ఆసింహము మానవాకారము ధరించింది. రాజు ఆశ్చర్యపడి ఏమిది అని అడిగితే అతడు "రాజా, నేను కుబేరమిత్రుడను; సాతుడు నానాముము. పూర్వము, గంగానదిలో స్నానము చేస్తున్న మునికన్యను చూచాను; ఆమెకూడా నన్ను చూచింది. మాయిద్దరికీ అనురాగము కలిగింది. గాంధర్వవిధిని వివాహము చేసుకొన్నాము. ఆసంగతి తెలిసి ఆమె బంధువులు "మకోన్మత్తులై స్వేచ్ఛాచారులయిమీరు సింహాలయి పుట్టండి" అని శపించారు. ఆమెకు కుమారుడు పుట్టేవరకూ, నాకు నీబాణము తగిలేవరకూ శాపావధి. మేము సింహదంపతులుగా పుట్టినాము. కాలక్రమేణ నా భార్య ఈబాలుని కని, చనిపోయింది. సింహాలపాలతో నేను వీనిని పెంచి పెద్ద చేశాను. నీబాణము తగలగానే నాశాప మోక్షమయింది. వీడు నత్త్వనంపన్నుడు. వీనిని పుత్రునిగా స్వీకరించు. ఇలా అవుతుం

దని పూర్వమే ఆమునులు నిర్ణయించారు," అని చెప్పి అంతర్ధాన మైనాడు. దీపకర్ణి ఆబాలుని ఇంటికి పిలుచుకొని పోయి, సాతుడు వానికి వాహనము కావడముచేశ సాతవాహను డని పేరు పెట్టి కాల క్రమేణ పట్టాభిషేకము చేసి తపస్సుకోసము వనానికి వెళ్ళిపోయినాడు. అప్పటినుంచీ సాతవాహనుడు రాజ్యము చేస్తున్నాడు.

కాణభూతికి గుణాఢ్యుడు ఈఅవాంతర కథ చెప్పి తరవాత వృత్తాంతము ప్రారంభించినాడు:

రాణి సాతవాహనుని అవమానించుట

తర్వాత కొంతకాలానికి సాతవాహనుడు వసంతకాలములో ఆదేవీ కృతోద్యానానికి వెళ్ళి రాణి వాసములో చాలసేపు వనవిహారము చేసి జలక్రీడార్థము పద్మసరోవరములో ప్రవేశించినాడు. స్త్రీలు అతిమోద వినోదముగా నీళ్లు చల్లుతున్నారు. రాణి జలక్రీడలో అలిసిపోయి రాజు తనమీద నీళ్ళు చల్లుతుంటే తట్టుకోలేక, "దేవ, మోదకైర్మాం పరితాడయ" అని సంస్కృతములో అన్నది. రాజు వెంటనే చాలా మోదకములు (తీపికుడుములు) తెప్పించినాడు రాణి నవ్వుతూ 'దేవ! నీటిలో మోదకా లెందుకు? మా ఉదకైః పరితాడయ: అంటే నీళ్ళతో కొట్టవద్దు (గట్టిగా చల్ల వద్దు) అని వేడుకొన్నాను. మాశబ్ద ఉదకశబ్దాలకు సంధి మీకు తెలియలేదు. సందర్భముకూడా మీరు గ్రహించలేదు" అన్నది. వ్యాకరణము చదువుకొన్న ఆరాణి మాటలకు పరివార జన మంతా నవ్వినారు. రాజు చాలా సిగ్గుపడి వెంటనే జలక్రీడ ఆపి నిరుత్సాహముతో బయలుదేరి రాజధానికి వెళ్ళినాడు. చింతాక్రాంతుడై భోజనము మాని ఎవరేమి అడిగినా సమాధానము చెప్పక పానుపుమీద పరుండి నాకు సంస్కృత పాండిత్యమో, చావో ఏదో ఒకటి శరణ మని తలపోస్తూ బాధపడుతున్నాడు. ఆక

స్మృకముగా రాజుకు కలిగిన ఈ అవస్థ చూచి పరివారము ఏమీ తోచక దిగులుపడి ఊరు కొన్నది.

శర్వవర్మ సాతవాహనుని సంస్కృత విద్వాంసుని చేయుట

నాకూ శర్వవర్మకూ ఆవార్త తెలిసింది. ఆరోజు గడిచింది. రాజుకు ఆరోగ్యము కలగలేదని విని, రాజహంసు డనే రాజభటుని పిలిచి ప్రభువుస్థితి ఎలా ఉన్నదని అడిగాను. వాడు 'దేవరవారికి ఎన్నడూ ఇంతటి మనోవ్యధ కలగలేదు. విష్ణుశక్తికూతురు చదువుకొన్నదాన ననే గర్వంతో ప్రభువువారిని ఏమోమాట లన్న దని తక్కినరాణులు సెల విచ్చారు' అని వాడు విన్నవించినాడు. సంశయము కలిగి శర్వవర్మతో 'రాజుకు వ్యాధి అయితే వైద్యుల్ని పిలిపించేవారు. మనోవ్యాధికి కారణం కనపడదు. శత్రువులు లేరు. ప్రజలు అనురక్తులు. ఏ లోపమూ కనపడదు. ఈయనకు ఇంత మనోవ్యధ ఎందుకుకలిగిందో!" అన్నాను. బుద్ధిమంతు డయిన శర్వవర్మ ఇలా అన్నాడు: 'తెలిసింది. తనకు సంస్కృతము రానందుకు రాజు విచార పడుతున్నట్టు తోస్తుంది. తాను పండితుడు కావలె నని తరుచుగా అంటూ ఉండేవాడు. రాణి అన్నమాటలకు తనవిద్యాలోపము గ్రహించుకొని ప్రభువు మంచము పట్టినాడు.'

ఇలా ఒకరితో ఒకరము కూడ బలుకుకొని ఆరాత్రిగడిపి, మర్నాడు ఉదయము రాచనగరికి వెళ్ళినాము. ఎవరూ లోపలికి వెళ్ళడానికి వీలు లే దని రాజాజ్ఞ అని తెలిసినా, ఉపాయము చేసి లోపలికి వెళ్ళినాము. నేను రాజుదగ్గరికి పోయి కూర్చుని "దేవా, ఎందుకు ఇలా వృథాగా బాధపడుతారు?" అని అడిగినాను. ఆయన ఏమీ మాటాడలేదు. తర్వాత శర్వవర్మ ఇలా అన్నాడు: "మీకు పాండిత్యము కావలె నని తరుచు అంటూ ఉండేవారు. రాత్రి నాకు స్వప్నము వచ్చింది. ఆకాశము

నుంచి కమలము రాలింది. దివ్యబాలుడు ఒకడు దానిని ఏకసింప జేసినాడు ఆకమలములోనుంచి ధాన్యవస్త్రధారిణి అయిన దివ్యస్త్రీ పైకివచ్చి మీనోటిలో ప్రవేశించింది. నాకు వెంటనే మెళుకువ వచ్చింది. ఆమె సరస్వతీదేవి అనే నావిశ్వాసము.''

సాత్వవాహనుడు సంతసముచిడిచి సాభిప్రాయముగా నాతో ''ఆర్యా, శ్రద్ధతో విద్యాభ్యాసము చేయిస్తే ఎంతకాలములో పురుషునకు పాండిత్యము కలుగుతుంది? విద్యలేని సంపదవల్ల ఏమీ శోభ లేదు'' అన్నాడు. ''సమస్తవిద్యలకూ మూలమయిన వ్యాకరణశాస్త్రము పన్నెండు సంవత్సరములలో పట్టుపడుతుంది. నేను మీకు ఆరుసంవత్సరాలలో బోధించగలను'' అన్నాను నేను. అందుకు శర్వవర్మ ''సుఖపడుతున్న ప్రభువుకు ఆరుసంవత్సరాలు విద్యాభ్యాసక్లేశము దున్నపాము. దేవా, నేను మిమ్ములను ఆరుమాసములలో పండితునిచేస్తాను.'' అన్నాడు. వీలూ చాలూ లేని యీమాటలకు నాకు కోపము వచ్చి ''రాజుగారికి నీవే ఆరుమాసాలలో పాండిత్యము సమకూర్చితే నేను లోకవ్యవహారములో ఉన్న సంస్కృతము, ప్రాకృతము, దేశభాష— ఈ మూడింటిని విసర్జిస్తాను'' అని శపథము చేసినాను. ''నామాట నిర్వహించలేకపోతే నీపాదరక్షలు పన్నెండేళ్ళకాలము శిరస్సుమీద పెట్టుకొని మోస్తాను'' అని శర్వవర్మ ప్రతిజ్ఞ చేసినాడు. మాప్రతిజ్ఞల వల్ల తనకోరిక నెరవేరుతుం దని రాజు భావించినాడు.

తాను చేసిన విషమప్రతిజ్ఞ తలుచుకొని శర్వవర్మ దిగులుపడి భార్యతో చెప్పుకొన్నాడు. ఆమెకూడా చాలా విచారపడి ''నాథా, ఈ అవస్థలో మనకు కుమారస్వామి కన్న వేరే దిక్కులేదు'' అన్నది. శర్వవర్మ కృతనిశ్చయుడై, నిరాహారుడై, ఆరాత్రి నాలుగోజామున కుమారక్షేత్రానికి ప్రయాణ మయినాడు. ఆసంగతి తెలిసి తెల్లవార గానే నేను ప్రభువునన్నిధికి వెళ్లి చెప్పినాను. రాజు ఆలకించి, ఫలితము

ఏమిటా ? అని ఆలోచిస్తున్నాడు. నిరంతరము ప్రభువు మేలు కోరే సింహగుప్తు డనే రాజపుత్రుడు వచ్చి "దేవా, దేవర విచారగ్రస్తులై ఉండడముచేత నాకూ చాలా దుఃఖము కలిగి నగరమువెలుపలి చండికా దేవి ఆలయానికి వెళ్ళి, తమశ్రేయస్సు కోసమై నన్ను అమ్మవారికి బలి యిచ్చుకోడానికి శిరస్సు ఖండించుకో బోయినాను. అంతలో ఆకాశవాణి, "పుత్రా, త్వరపడి సాహసించకు. నీప్రభువుకోరిక త్వరలోనే సిద్ధిస్తుంది" అని అనుగ్రహించింది. నేను ఈ విషయము తమకు విన్నవించడానికి వచ్చాను" అని నివేదించి, సెలవు తీసుకొని ఇద్దరుచారులను శర్వవర్మ వెంట పంపినాడు. శర్వవర్మ మౌనవ్రతము వూని, వాయుభక్షణము చేస్తూ, కుమారక్షేత్రము చేరి ఘోరతపస్సుచేసి స్వామిని సంప్రీతుని చేసినాడు. కుమారస్వామి కోరినవరములు అతని కిచ్చినాడు. శర్వవర్మ ప్రయత్న సాఫల్యాన్ని సింహగుప్తుని చారులు వచ్చి రాజుకు విన్నవించినారు. ప్రభువుకు ప్రమోదము, నాకు విచారమూ కలిగినవి.

తర్వాత శర్వవర్మ స్వామి వరప్రభావముచేత రాజును విద్యావంతుని చేసినాడు. ఈశ్వరానుగ్రహ ముంటే ఏపని కాదు ? రాజుకు విద్యా లాభము కలిగినందుకు ప్రజలు ఉత్సవము చేశారు. ప్రతి యింటినీ దాజండాలు ఎత్తినారు. సాతవాహనుడు శర్వవర్మను గురువుగా వేరొక్కని, నమస్కరించి, రాజోచితము లైన మణి కనక వస్తువాహనాదులు నమర్పించి, నర్మదాతీరాన ఉన్న భరుకచ్ఛప్రదేశానికి ప్రభువును చేసినాడు. సింహగుప్తుని మహైశ్వర్యవంతుని చేసినాడు. విద్యాప్రోత్సాహకారకురాలయిన విష్ణుశక్తి కుమారై్తను పట్టపురాణిని చేసినాడు.

తరంగము : 8

నేను మౌనం అవలంబించి రాజసన్నిధికి వెళ్ళినాను. అక్కడ ఒకానొక బ్రాహ్మణుడు తాను రచించిన శ్లోకముచదివినాడు. రాజు దాని

అర్థము సంస్కృతభాషలో వివరించినాడు. అందరూ సంతోషించినారు. కుమారస్వామి ఏవిధముగా ప్రసన్నుడయినాడో చెప్పమని రాజు శర్వవర్మను వినయపూర్వకముగా అడిగినాడు. అతనిలా చెప్పినాడు:

స్వామి ప్రసన్నుడయిన విధము

దేవా ఇక్కడనే స్నానము చూని నిరాహారుడనై బయలుదేరినాను. తీవ్రతపస్సువల్ల మార్గములో మూర్ఛపోయినాను. చేతులో బల్లెము పట్టుకొన్న మహానుభావుడు కనబడి 'వత్సా, లే. నీఅభీష్టము నెరవేరుతుంది' అని అభయమిచ్చినాడు. ఆమాటలకు నేను మూర్ఛదేలి, ఆకలి దప్పికలు పోయి, హాయిగాలేచినాను. క్రమేణ కుమారస్వామి ఆలయానికి వెళ్ళి భక్తిపారవశ్యముతో గర్భగుడిలో ప్రవేశించినాను. స్వామి నాకు దర్శనము అనుగ్రహించినాడు. నాలోటికెంట సరస్వతి నాశరీరములో ప్రవేశించింది. స్వామి ఆరునోళ్ళతోనూ స్పష్టముగా "సిద్ధోవర్ణ సమామ్నాయః" అని సూత్రము ఉచ్చరించినాడు. నేను ఊరుకోలేక మానవ చాపల్యముచేత ఊహించి రెండవసూత్రము పలికినాను. షణ్ముఖుడు (కుమారస్వామి) నన్ను చూచి, "ఓరీ, నీవు రెండవసూత్రము ఉచ్చరించకుండా ఉంటే నీశాస్త్రము పాణినీయ వ్యాకరణశాస్త్రమును అణగదొక్కివేసేదే. నీచాపలమువల్ల ఇది స్వల్పతంత్రమై 'కాతంత్రము' అనే పేరుపొందుతుంది. నావాహనమైన నెమలిపేరిట దీనికి 'కాలాపము' అనికూడా సంజ్ఞ ఉంటుంది" అని, నవీనమైన శబ్దశాస్త్రమును నాకు క్షణములో అనుగ్రహించి, "వత్సా, నీప్రభువు వెనకజన్మలో ఋషి; భరద్వాజుని శిష్యుడు; మహాతపస్వి. అప్పుడు కృష్ణుడు అనిపేరు. కృష్ణుడు ఒకానొక మునికన్యనుచూచి మోహించినాడు. ఆమెకూ మోహము కలిగింది. ఋషులు శపించారు. వా రిద్దరూ మానవ జన్మ మెత్తినారు. అతడే సాతవాహనుడు, ఆమునికన్యకే విష్ణుశక్తి కూతురు.

నిన్ను చూచినతర్వాత నియమించినానుసారముగా రాజుకు సకలవిద్యలూ సంక్రమిస్తవి. పూర్వజన్మ సంస్కారమువల్ల నీవాత్మోత్కర్షలకు ఉత్తమార్థాలు శ్రమ లేకుండా ఈజన్మలోలభిస్తవి" అని అంతర్ధాన మయినాడు. గర్భగుడిలోనుంచి నేను ఇవతలకు వచ్చినతర్వాత ఆగుడి అర్చకులు నాకు బియ్యము ఇచ్చినారు. నేను ప్రయాణములో వండుకొంటూ ఉన్నా బియ్యము తరగనే లేదు!

ఈ వృత్తాంతము విన్నతరువాత రాజు మూడ్యాహ్నిక స్నానము కోసము సభ చాలించి లేచినాడు. నేను మౌనవ్రతము అవలంబించడము చేత రాజకార్యాలు ఏవీ చూడలేక, తల పంచి రాజువద్ద సెలవు తీసుకొన్నాను. నేను రాజ్యము విడిచి వెళ్ళడము ఆయనకు ఎంతమాత్రమూ ఇష్టము లేకపోయినా ఇద్దరుశిష్యులతో బయలుదేరి, శవమును చేతామని వింధ్యవాసినీ దేవివద్దకు వచ్చినాను. అమ్మనారు స్వప్నములో కనబడి నీవద్దకు వెళ్ళమని సెలవిచ్చింది. నీకోసము ఈ ఘోరారణ్యములో ప్రవేశించినాను. దైవవశాత్తు ఒకానొక పుళిందుడు కనబడి నాకు బీడాడు చూపించినాడు. దానివెంట ఇక్కడికి వచ్చేసరికి పిశాచులు కనబడినారు. దూరమునుంచి వాళ్ళసంభాషణలు విని పైశాచీభాష గ్రహించాను. ఈభాష రావడముచేత మౌనము విడిచినాను. నీవు ఉజ్జయినికి వెళ్ళినావని విని, నీవు వచ్చేవరకూ ఇక్కడనే నీకోసము కనిపెట్టుకొని ఉన్నాను. నిన్ను చూచి భూతభాషలో కుశలప్రశ్న వెయ్యగానే నాకు పూర్వజన్మజ్ఞానము కలిగింది. ఇది నావృత్తాంతము.

గుణాఢ్యుడు ముగించగానే కాణభూతి ఇలా అన్నాడు: "నీవు వచ్చినట్టు ఆరాత్రే నాకు ఎలా తెలిసిందో చెపుతాను. భూతివర్మ అనే రాక్షసుడు నామిత్రుడు. అతనికి దివ్యదృష్టి ఉన్నది. ఉజ్జయినిలో నాఉద్యానవనానికి వెళ్ళి నా శాపాంతము ఎప్పుడని అతనిని అడిగాను. పగటివేళ తనకు శక్తి లేదనీ, రాత్రిదాకా ఆగమనీ భూతివర్మ

అన్నాడు. రాత్రి కాగానే అక్కడ పరుగు లెత్తుచున్న పిశాచుల సంగో పానికి కారణ మేమి టని ప్రస్తావపశాన అడిగాను. పూర్వము మహే శ్వరుడు బ్రహ్మకు చెప్పిన విషయము నాకు చెప్పినాడు. సూర్యప్రభా వమువల్ల పగటి వేళ యక్ష రాక్షస పిశాచులకు శక్తి లేదు; రాత్రివేళ వీళ్ళకు వండగ. దేవతలకు పూజలు జరగని ప్రదేశాలలో బ్రాహ్మణులు ఉచితా చారాలు నిర్వర్తించని-చోటా, విధివిరుద్ధముగా భోజనములు జరిగేతావులలో వీటి ప్రభావము మెండు. మాంసము తినని వానిదగ్గి రికీ, పతివ్రత దగ్గిరికీ, జ్ఞానులజోలికీ శూరులజోలికీ వీళ్ళు వెళ్ళరు.

"ఇక వెళ్ళు నీ శాపమోక్షానికి కారణభూతు డయిన గుణాఢ్యుడు వచ్చినాడు." అని భూతిశర్మ చెపితే వచ్చినాను. పుష్పదంతుడు చెప్పిన కథ నీకు చెప్పుతాను. ఆయనకు పుష్పదంతు డనీ, నీకు మాల్యవంతు డనీ పేర్లు రావడానికి కారణము వినవలెనని కుతూహలము.

: పుష్పదంతునికి ఆపేరు వచ్చిన కారణము :

కారణభూత కుతూహలము తీర్చడముకోసము గుణాఢ్యుడు ఈప్రకా రము చెప్పినాడు:

గంగాతీరమున బహుసువర్ణక మనే అగ్రహారములో గోవిందదత్తుడు అనే బ్రాహ్మణవిద్వాంసుడు ఉన్నాడు. అగ్నిదత్త అనే ఆయనభార్య మహాసాధ్వి. కాలక్రమేణ వారికి అయిదుగురు కుమారులు కలిగినారు. వారు మూర్ఖులు. అందగాళ్ళ మని వాళ్ళకుగర్వము. ఒకనాడు వైశ్వా నరు డనే అతిథి వారింటికి వచ్చి కుమారులకు నమస్కారము చేసినాడు. వాళ్ళు ప్రతి నమస్కారము చెయ్యక నవ్వడము మొదలు పెట్టినారు. వైశ్వానరునికి కోపము వచ్చి బయలుదేరాడు. గోవింద దత్తు అతిన్ని ఆపి బతిమాలుకోగా "నీకుమారులు మూర్ఖులు, పతితులు. మీఇంట్లో భోజనంచేస్తే ప్రాయశ్చిత్తము చేసుకోవలసి వస్తుంది." అన్నాడు వైశ్వా

నరుడు తుచ్ఛభోగాలను ఇక ఎన్నడూ ముట్టుకోను అని గోవిందదత్తు శపథము చేసినాడు. అగ్ని కూడా అతిథిని చాలా బతిమాలింది. చివరకు వైశ్వానరుడు వారి ఆతిథ్యము స్వీకరించినాడు. ఆయన పుత్రులలో దేవదత్తు డనేవాడు అదంతా చూచి పశ్చాత్తాపము పొంది, తన జీవితము వ్యర్థమని ఎంచి, విరక్తి నొట్టి బదరికాశ్రమానికి తపస్సు నిమిత్తము వెళ్ళినాడు. కొంతకాలము ఆకులు అలములూ తిని, కొంత కాలము భూమము పీల్చి, చాలాకాలము మహేశ్వరుని గురించి తపస్సు చేసినాడు. ఆతని ఉగ్రతపస్సుకు మెచ్చి మహేశ్వరుడు ప్రత్యక్షమైనాడు. ఈశ్వరునకి తాను అనుచరుడుగా ఉండేలాగున అనుగ్రహించ వలసిన దని అతడు వరము వేడినాడు. "విద్యలు సేర్చుకో. భూలోకములో భోగాలు అనుభవించు. శర్వాణి నీ అభీష్టము నెరవేరుతుంది" అని ఈశ్వరుడు వరము దయచేసినాడు.

పిమ్మట అతడు బయలుదేరి పాటలీపుత్రములో వేదకుంభుడు అనే గురువువద్ద యథావిధిగా విద్యాభ్యాసము చేయడము ప్రారంభించినాడు. ఒకనాడు గురుపత్ని అతనిని పిలచి భోజనము చేసింది. దేవదత్తుడు పాటలీపుత్రము పిడిచి ప్రతిష్ఠానపురము వెళ్ళి, వృద్ధభార్య ఉన్న గురువును ఆశ్రయించి విద్యలు అభ్యసించినాడు.

విద్వాంసుడు, సుందరమూర్తి అయిన దేవదత్తుని ఆ నగరప్రభువయిన సుశర్మ కూతురు శ్రీదేవి ఒకనాడు చూడడము సంభవించింది. వాతాయనము దగ్గర ఉన్న శ్రీదేవిని అతడు చూచినాడు. సరి, ఇద్దరికీ వలపు తలపుగాక లయించింది. అతనిని కిటికీదగ్గిరికి, రమ్మని రాజకుమారి వేలితో సంజ్ఞచేసింది. దేవదత్తుడు నమస్కరించగానే శ్రీదేవి దంతముతో పుష్పమును ఎగజిమ్మింది. అసంకేతాభిప్రాయము గ్రహించలేక అతడు లోలోపల కుములి, ఇంటికి వచ్చి నేలమీద దొర్లడము మొదలు పెట్టినాడు. బుద్ధిమంతుడయిన గురువు శిష్యుని అవస్థ గ్రహించి

యుక్తిపూర్వకముగా జరిగిన వృత్తాంతము సంపూర్ణముగా విన్నాడు; విని రాజకుమారి దంతముతో పుష్పమును ఎగజిమ్మి సంకేతస్థానము సూచించింది. పుష్పదంత మనేదేవళములో నాకోసము ప్రతీక్షించు. ప్రస్తుతము వెళ్ళిపో, అని ఆమెఅభిప్రాయము" అని చెప్పినాడు. దేవదత్తుడు విచారము విడిచి దేవాలయానికి వెళ్ళినాడు. రాజపుత్రి అప్పటినుంచి వ్రతమనే నెపముతో దేవదర్శనార్థము ఒంటరిగా గర్భగుడిలోకి వెళ్ళింది. ద్వారబంధమునెక్కి నిలిచిఉన్న దేవదత్తుడు ముందుకు వచ్చి ఆమె కరము కొరికించుకొన్నాడు. "నేను చేసిన సంజ్ఞనీవెలా గ్రహించావు?" అని ఆమె ఆశ్చర్యముతో అడిగింది. "నాకు తెలియలేదు. మాగురువు గారు విప్పి చెప్పినారు" అని దేవదత్తుడు చెప్పేసరికి శ్రీదేవి "నన్ను విడు. నీవు రసికుడవు కావు" అని చిరాకుతోనూ, రహస్యము బయలు పడుతుం దనే భయముతోనూ త్వరత్వరగా వెళ్ళిపోయింది.

: దేవదత్తునికి పంచశిఖుడు తోడ్పడుట :

చేతికి దొరికి జారిపోయిన ప్రియురాలి కోసము దేవదత్తుడు చాలా మనోవ్యథ చెంది ప్రాణత్యాగము చేయబోయినాడు. పూర్వమే అతనికి వరము అనుగ్రహించిన మహేశ్వరుడు పంచశిఖు డనే ప్రమథుని పిలిచి దేవదత్తునికి సహాయము చెయ్యవలసిన దని ఆజ్ఞ యిచ్చినాడు. పంచశిఖుడు వచ్చి దేవదత్తుని ఓదార్చి, అతనికి స్త్రీవేషము వేసి, తాను వృద్ధబ్రాహ్మణవేషము ధరించి శ్రీదేవి జపకుడయిన సుశర్మవద్దకు అతనిని తీసుకుపోయి "దేవా, నాకుమారుడు దేశాంతరము వెళ్ళినాడు. ఈపిల్ల నాకోడలు. ఈమెను నీవద్ద ఉంచి, కుమారుని వెదకడానికి వెళ్లుతాను. అతడు దొరికినతర్వాత వచ్చి ఈమెను తీసుకుపోతాను. అంతవరకూ ఈమెను సంరక్షించాలి" అని విన్నవించినాడు. అంగీకరించకపోతే కోపముఎచ్చి బ్రాహ్మణుడు శపిస్తాడని భయపడి, రాజసమ్మతించి,

స్త్రీ వేషధారి అయిన దేవదత్తుని భద్రముగా ఉంచడముకోసము తన కుమార్తె అంతఃపురానికే పంపినాడు. పంచశిఖుడు వెళ్ళిపోయినాడు.

తర్వాత దేవదత్తుడు తనప్రియురాలి సమీపములోనే నివసిస్తూ, ఆమెకు విశ్వాసము బాగా కలిగించి, ఒకరాత్రి ఏకాంతసమయములో నిజస్వరూపము బయటపెట్టినాడు. ఆమెకు ఆమోదము కలిగింది. ఉభయులకూ గాంధర్వ వివాహము జరిగింది.

ఆమె గర్భవతి అయినతర్వాత దేవదత్తుడు పంచశిఖుని తలచుకొన్నాడు. అతడు వచ్చి ఎవరికీ తెలియకుండా అంతఃపురములోనుంచి దేవదత్తుని తీసుకుపోయి అతని స్త్రీవేషము తీసివేసి, తాను వృద్ధ బ్రాహ్మణవేషము ధరించి, ఆతనిని వెంటబెట్టుకొని సుశర్మసన్నిధికి వెళ్ళి, "దేవా, ఇదుగో నాకుమారుడు దొరికినాడు. ఇక్కడ ఇల్లలుముంచిన నాకోడలిని పంపించు" అని అడిగినాడు. అంతఃపురములో విచారణ చేస్తే ఆయువతి రాత్రి కనబడకుండా ఎక్కడికో పోయిందని తెలిసి రాజు బ్రాహ్మణశాపానికి భయపడి మంత్రులతో ఆలోచన చేసినాడు.

శిబిచక్రవర్తికథ

రాజు అమాత్యులతో, "ఆర్యులారా, ఇతడు సామాన్యబ్రాహ్మణుడు కాడు; ఎవరో దేవుడని తోస్తుంది. నన్ను పరీక్షించడానికి ఈరూపములో వచ్చినాడు. ఇటువంటి సంఘటనలు పూర్వమూ ఉన్నవి. శిబిమహారాజు అందరినీ రక్షిస్తూ, దయాదానధర్మాలకు చాలా ప్రసిద్ధి చెందినవాడు. ఆయనను పరీక్షించడానికి ఇంద్రుడు డేగరూపము ధరించి, పావురము రూపము తాల్చిన యమధర్మరాజును తరుముకుంటూ శిబిదగ్గరికి వచ్చినాడు పావురము భయభ్రాంతమై శిబిచక్రవర్తి ఒడిలో దూరింది. డేగ మనుష్యవాక్కుతో "మహాప్రభూ, నాకు చాలా ఆకలిగా ఉన్నది. ఈపావురము నాకాహారము. దీనిని విడిచిపెట్టు. విడువక

పోతే నాప్రాణాలు ఇవ్వాడే పోతాయి. నీకు పాపము చుట్టుకుంటుంది" అని చెప్పింది. "ఈ పాపురసము నన్ను శరణుచొచ్చింది. దీనిని విడవడానికి వీలులేదు. దీనికి సరిఅయినసమాంసము నీకిస్తాను" అన్నాడు చక్రవర్తి. "అయితే నీ మాంసమే నాకు కావాలి" అన్నది డేగ. అని అంగీకరించి తనమాంసము కోసి త్రాసులో ఎంత వేసినా, పాపురసమువైపే మొగ్గుగా ఉన్నది. చక్రవర్తి తాను సర్వము యావత్తూ త్రాటాలోకి వేసి మొగ్గు తూచ వలసిం దన్నాడు. అప్పుడు అకాశమందు శిబి! మెచ్చుకొని పూలవర్షములు చేసింది. ఇంద్ర యమలు సంతుష్టులై పక్షిరూపాలు విడిచి నిజరూపాలతో ప్రత్యక్షమయి శిబికి నమస్కారాలూ, దీవెనలూ ఇచ్చి అంతర్ధానమయినారు. ఆలాగే నన్ను పరీక్షించడానికి ఎంతో దూరమునచ్చి నాడు." అని చెప్పినాడు.

సుశర్మ మంత్రులతో ఇలా చెప్పుచుండగా అని, బ్రాహ్మణునితో బహిరంగముగా "ఆర్యా, మీరు మాకు అభయము ఇయ్యవలెను. నీ కోడలిని గతరాత్రి ఎవరో అపహరించుకు పోయినారు. ఆశ్చర్యకరమైన మేము కనిపెట్టి ఉన్నా వీరిచోడలు అదృశ్యురాలు అయింది" అని విన్నవించినాడు. బ్రాహ్మణుడు మొగట కోపించి, క్రమముగా శాంతించి చివరకు, "రాజా, నా కుమారునిమీద నీ ఖడ్గమాత్రని ఝుళిపించు" అన్నాడు. బ్రాహ్మణ శాపానికి వెరచి సుశర్మ సపరివారుడై శ్రీదేవిని దేవదత్తునికిచ్చి వివాహము చేసి, అల్లుని తన వద్దనే ఉంచుకొన్నాడు. బంచశిఖుడు కైలాసానికి వెళ్లిపోయినాడు. దేవదత్తునికి బహిరంగముగా ప్రియరాలు లభ్యమయింది. పుణ్యపురుషుడు చేసే మహాయజ్ఞాది సంపదయావత్తూ ఆతనికే దక్కింది. శ్రీదేవికి కలిగినకుమారునికి రాజ్యమిచ్చి సుశర్మ తపస్సు నిమిత్తము వనానికి వెళ్ళినాడు.

కాలక్రమేణ దేవదత్తుడు కుమారుని అభిషిక్తుని చేసి ఆనందించి, భార్యతోకూడా తపోవనానికి వెళ్లిపోయినాడు. అక్కడ ఈశ్వరారాధన

చేసి, శివానుగ్రహమునల్ల మానవదేహము విడిచి మళ్ళీ ప్రమథగణములో చేరినాడు. తనప్రియురాలు దంతముతో పుష్పమును ఎగజిమ్మిననంజ్ఞి గ్రహించక పోవడముచేత ఆతనికి ప్రమథగణములో పుష్పదంతుము అని పేరు పడ్డది. ఆతనిభార్య జయ అనే నామధేయముతో పార్వతీ దేవికి ప్రతీహారి అయినది. అతనికి పుష్పదంతు డనే పేరు రావడానికి ఇది గాధ.

మాల్యవంతునికి ఆపేరు వచ్చిన కారణము

ఇక నాకథ చెపుతాను. దేవదత్తునితండ్రి గోవిందదత్తు కదా! ఆయన పుత్రులలో నే నొకడను. నన్ను సోమదత్తు డనేవారు. మా నాయనగారికి నామీద వాత్సల్యము లేకపోవడముచేత విచారము కలిగి, నేను హిమాచలానికి వెళ్ళి మాల్యములతో శివపూజ చేస్తూ తపస్సు చేసినాను. మహేశ్వరుడు ప్రసన్నుడై దర్శన మిచ్చినాడు. నేను ఏభోగములూ కోరక ప్రమథగణత్వమే వేడితే స్వామి అదే ప్రసాదించినాడు. మానవులు అమగు పెట్టలేని అరణ్యప్రదే శాలనుంచి నీవు పుష్పములు తెచ్చి మాల్యములు గుచ్చి పూజ చేయ డముచేత నీకు మాల్యవంతు డనే నామధేయము ఉంచుతున్నాను" అని శివుడు అనుగ్రహించినాడు. నేను మానవశరీరము విడిచి ప్రమథుడ నయినాను. ఈశ్వరానుగ్రహముచేత నాకు మాల్యవంతుడనే పేరు ఈవిధముగా వచ్చింది.

కాణభూతీ, దురదృష్టవశాన పార్వతీదేవి శాపముతగిలి నేను మానవ లోకములో జన్మించాను. హరప్రోక్తమైన ఆ దివ్యకథ ఇకచెప్పు. మన కుభయలకూ శాపమోక్షము వుతుంది.

తరంగము : ౮

గుణాఢ్యుడు బృహత్కథను సాతవాహనునికి పంపుట

ఈవిధముగా గుణాఢ్యుడు అముగగా ఏడుఖండాలుగా ఉన్న ఆదివ్య కథను కాణభూతి తనభాషలోనే చెప్పినాడు. గుణాఢ్యుడు ఆకథను ఏడు సంవత్సరాలలో ఏడులక్ష శ్లోకాలలో రచించినాడు. అరణ్యములో సిరాదొరకక పోవడమువల్ల ఆమహాకవి తనరక్తముతోనే గ్రంథము లిఖించినాడు. విద్యాధరులు కథను అపహరిస్తారేమో అన్న భయముచేత కథను అలా గ్రంథస్థము చేసినాడు. అప్పటికి కథ వినడానికి వచ్చి ఆకాశాన నిలిచిన విద్యాధరాములు పందిరికి చాందినీ కట్టినట్టున్నారు. కథను చూచి కాణభూతి దివ్యగతి పొందినాడు. అతనివెంట ఉన్న తక్కినపిశాచాలుకూడా కథవిని స్వర్గానికి వెళ్ళినారు.

ఈ మహాకథను భూలోకములో నిలపవలె. అప్పటికి శాపమోక్షమని దేవి సెలవిచ్చినది. దీనిని ఎలా ప్రకటించను? ఎవరి కివ్వను? అని గుణాఢ్యుడు ఆలోచిస్తున్నాడు. ఆయనతోకూడా వచ్చిన గుణదేవుడు నందిదేవుడు అనేశిష్యులు "ఈకావ్యమును గ్రహించడానికీ, అర్పించడానికీ తగినవాడు శ్రీ సాతవాహన మహారాజు. ఆయన రసజ్ఞుడు. పుష్పపరిమళమును మారుతము వహించేలాగున ఆ ప్రభువు ఈ కావ్యాన్ని వహించగలడు" అని చెప్పినారు. సమ్మతించి గుణాఢ్యుడు శిష్యులకు కావ్య మిచ్చి మహారాజునన్నిధికి పంపి, తాను ప్రతిష్ఠాన పురము వెలుపల ఉన్న దేవీకృతోద్యానములో సంకేతస్థానము ఏర్పాటు చేసి కూర్చున్నాడు. శిష్యులు మహారాజును దర్శించి గుణాఢ్యుడు రచియించినా డని ఆగ్రంథము సమర్పించినారు. సాతవాహనుడు వారి పిశాచాకృతి గమనించి, పుస్తకము తెరిచి, పైశాచీ భాషలో ఉండడము గ్రహించి, అసహ్యించుకొని విద్యాగర్వముతో,

"ఏమి! నీరసమైన పైశాచీభాష! రక్తముతో వ్రాసినగ్రంథము! వీడు లక్షలశ్లోకాలు! పాడుకథ!" అని నిరసించినాడు. శిష్యులు గ్రంథసమేతముగా వెళ్ళి జరిగినసంగతి గురువుకు విన్నవించినారు. ఆయన విచారపడినాడు. గుణగ్రహణశక్తి కలవాడే నిరసిస్తే ఎవరికి విచారము కలగదు?

తర్వాత గుణాఢ్యుడు సమీపపర్వతముపైకి వెళ్ళి ఏకాంతరమ్యస్థానములో అగ్నికుండము చేసి కూర్చుని ఒక్కొక్క పత్రమే చదివి శిష్యులూ, మృగాలూ, పక్షులూ కన్నీరు విడుస్తూ ఉండగా అగ్నిలో పడవేస్తున్నాడు. ఈప్రకారముగా ఆరులక్షల శ్లోకాలగ్రంథము అగ్నిహోత్రునికి ఆహుతి అయిపోయింది. సరవాహనదత్తచరిత్ర మాత్రము మిగిలింది. గుణాఢ్యమహాకవి ఆప్రకారముగా గ్రంథము చదివివేళ లేళ్లు, వరాహములు, మహిషములు మొదలైనజంతువులు బారులుతీర్చి చుట్టూ నిలిచి, ఆహారము మాని, కన్నీళ్ళతో నిశ్చలముగావిన్నవి.

ఇంతలో సాతవాహన మహారాజుకు జబ్బు చేసింది. సారము లేని మాంసము తినడమేకారణ మని వైద్యులు నిర్ణయించినారు. వంట వాళ్ళను రాజు గట్టిగా అడిగితే వేటకాండ్రు తెచ్చి యిచ్చినమాంసమే తాము వండినట్లు చెప్పినారు. వేటగాండ్లను అడిగితే, "మహాప్రభూ, ఇక్కడ ఒకబ్రాహ్మడు కథ చదువుతూ ఒక్కొక్కపత్రమే అగ్గిలో వేస్తున్నాడు. జంతువులు మేత మాని వింటూ ఉండడముచేత నీరసించి పోయినవి. వాటి మాంసం నీరసం అయిపోయింది." అని వాళ్లు విన్నవించుకొన్నారు. కుతూహలము కలిగి రాజు వాళ్ళను ముందు నడవ మని, వెంట వెళ్ళి గుణాఢ్యుని చూచినాడు. శిష్యులూ, మృగాలూ, చుట్టూఉండగా మధ్య కథ వినుపిస్తున్న మహాకవికి రాజు నమస్కారము చేసి వృత్తాంతము యావత్తూ చెప్ప మన్నాడు. పుష్పదంతునిశాపము మొదలుకొని అప్పటివరకూ జరిగిన విషయా లన్నీ పైశాచీభాషలో మహాకవి చెప్పినాడు.

గుణాఢ్యుడు ప్రమథావతారు మని తెలుసుకొని మహేశ్వర ముఖో ద్గత మైన ఆమహాకథను తనకు దయచేయవలసినదని సాతవాహనుడు కవీశ్వరునికాళ్ళమీద పడినాడు.

"రాజా, ఆరులక్షల శ్లోకాల కథలు, ఆరు అగ్నిపాలైనవి. ఈకథ లక్షగ్రంథము మాత్రము మిగిలినది. తీసుకో. నాశిష్యులు వచ్చి వివ రిస్తారు." అని గుణాఢ్యుడు చెప్పి, రాజుకు సెలవిచ్చి, యోగమార్గాన నిజదేహము విడిచి దివ్యపదవికి వెళ్లినాడు.

గుణాఢ్యుడు ప్రసాదించిన బృహత్కథను తీసుకొని రాజు నిజ నగరమునకు బయలుదేరిపోయినాడు. ఆ సరవాహనదత్త చరిత్రను వివరించి వ్రాసిన కవిశిష్యులు గుణదేవ నందిదేవులకు సాతవాహన మహారాజు మణి కనక వస్త్రవాహనాలూ, గృహములూ, ధనమూ, అగ్రహారములూ ఇచ్చి సత్కరించినాడు. రాజు ఆశిష్యులతోసహా కథావిభాగముచేసి పైశాచీభాషలోనే కథావతారమును తెలుపడానికి ఈ కథాపీఠము రచించినాడు. ఆమహాకథ రసవంతమై చిత్రవిచిత్ర సంఘ టనలతోకూడి దేవకథలనుకూడా మరిపించి త్రిలోక విఖ్యాతి పొందింది.

తరంగము : 1

గౌరీ నవ పరిష్వంగే
విభోః స్వేదాంబు పాతు వః
నేత్రాగ్నిభీత్యా కామేన
వారుణాస్త్ర మివ వాహితమ్.

ఫాలనేత్రాగ్నిభీతిచే పంచశరుడు
పరపు వారుణాస్త్రముభాతి, ప్రప్రథమము
గౌరి గౌగిట జేర్చు శంకరునిమేన
వోచు స్వేదోదకము మిమ్ముబ్రోచు గాక!

మహేశ్వరునివల్ల పుష్పదంతుడు వరరుచిగా జన్మించిన, ఆపుష్పదంతుని వల్ల కాణభూతి, కాణభూతివల్ల గుణాఢ్యుడు, గుణాఢ్యునివల్ల సాతవాహనుడు గ్రహించిన మహాద్భుతవిద్యాధరకథ ఆకర్ణించండి!

శతానీకునికథ

వత్సదేశానికి కౌశాంబి రాజధాని. పాండవవంశ సంభూతుడయిన పరీక్షిత్తుకు మనమడు, జనమేజయునకు కుమారుడు అయిన శతానీకుడు ఆరాజ్యమును పరిపాలిస్తూ ఉన్నాడు. ఆయన పట్టమహిషి వసుమతీదేవి. వారికి సంతానము లేదు.

ఒకనాడు శతానీకుడు వేటకు వెళ్ళి అరణ్యములో సంచరిస్తూ ఉండగా అక్కడ తపస్సు చేస్తున్న శాండిల్యమునితో పరిచయమయింది. ప్రభువు ప్రార్థించగా ముని రాజువెంట కౌశాంబీ నగరానికి పోయి పుత్రకామేష్టి చేయించినాడు. మహారాణికి మంత్రసిద్ధమైన పాయసము ఇచ్చినాడు. పాయసము తాగి వసుమతీదేవి గర్భము ధరించింది. క్రమేణ కుమారుడు కల్గినాడు అతనికి సహస్రానీకుడు అని పేరు పెట్టినారు. పెద్దవాడయిన తరువాత తండ్రి అతనికి యౌవరాజ్యాభిషేకము చేసి తాను రాజ్యభారవిచారము విడిచిపెట్టి శాంతముగా కాలము గడుపుచున్నాడు.

శతానీకుడు దేవేంద్రునికి సాయము చేయుట

కొన్నాళ్ళకు ఇంద్రునికి రాక్షసులతో యుద్ధము సంభవించినది. మాతలిద్వారా మహేంద్రుడు శతానీకునికి ఆహ్వానము పంపినాడు. శతానీకుడు తనకుమారుని యుగంధరు డనేమంత్రికి అప్పగించి, రాజ్యభారము మంత్రికి, సుప్రతీకుడు అనే ప్రధానసేనాపతికి అప్పజెప్పి మాతలితో ఇంద్రునిసన్నిధానానికి వెళ్ళినాడు. మహేంద్రుని సమక్షములోనే యము

దంష్ట్రుడు మొదలయిన అసురులను సంహరించి శతానీకుడు యుద్ధములో ప్రాణములు విడిచినాడు. ఆరాజుశవమును మాతలి భూలోకానికి తెచ్చినాడు. రాణి సహగమనము చేసింది.

తర్వాత సహస్రానీకుడు వత్సదేశానికి ప్రభు వయినాడు. ఇంద్రుడు రాక్షసులను జయించి విజయోత్సవము చేస్తూ తనమిత్రుని పుత్రుడయిన సహస్రానీకుని ఆహ్వానించినాడు. నందనవనములో అప్సరసలతో విహారాలు చేస్తూన్న దేవతలను చూస్తూ తనకు తగినభార్య లేదే అని సహస్రానీకుడు విచారపడినాడు. అతని ఆశయము గ్రహించి మహేంద్రుడు ఇలా చెప్పినాడు: "రాజన్, విచారించకు. నీకోరిక ఈడేరుతుంది. నీకు కాగల భార్య భూలోకములో పుట్టి ఉన్నది. వెనుక ఒకసారి బ్రహ్మదేవుని దర్శనార్థము వెళ్ళినాను. నేను వెళ్ళితర్వాత విధూముడు అనే వసువు వచ్చినాడు. మేమంతా అక్కడ ఉండగానే అలంబుష అనే అప్సరస వచ్చింది. దానిచీర గాలికి కాస్త తొలిగేసరికి చూచిన విధూమునికి మనోవికారము కలిగింది. అప్సరస కూడా అతని రూపసంపదకు ముగ్ధురాలు అయింది. బ్రహ్మ నాకేసి చూచినాడు. నేను ఆయన అభిప్రాయము గ్రహించి కోపించి వాళ్ళతో "మూర్ఖులారా, మీరిద్దరూ మర్త్యలోకములో పుట్టి భార్య భర్త కావలి అని శపించాను. సహస్రానీకా, శాపభ్రష్టుడయిన ఆవసువు నీవే సుమా! ఆ అప్సరస అయోధ్యాధిపతి కృతవర్మకు కూతురయి పుట్టి మృగావతి అనే పేరుతో పెరుగుతున్నది. ఆమె నీకు భార్య అవుతుంది."

ఈవాక్యములు విన్నతరవాత సహస్రానీకుడు మృగావతిమీద మమత పెంచుకుంది. అనంతరము మహేంద్రుడు అతనిని సన్మానపూర్వముగా సాగనంపినాడు. అతడు ప్రయాణము చేస్తూ ఉండగా మార్గమధ్యములో తిలోత్తమ అనే అప్సరస ప్రీతివల్ల సహస్రానీకుని ఉద్దేశించి "రాజా, ప్రయాణము ఆగు, నీకొక వార్త చెపుతాను" అన్నది. మృగావతినే ధ్యానిస్తూ

స్తున్న రాజుకు ఆమాటలు చెవికెక్కలేదు. అప్సరస సిగ్గుపడి, రోష ముతో "రాజా, నామాటలు వినిపించుకోక ఎవరెను ధ్యానిస్తున్నావో ఆమెతో నీకు పథ్నాలుగేళ్ళు వియోగము కలుగును గాక!" అని శపించింది. ఆమాటలు రాజుకు వినపడలేదు. రథము నడుపుతున్న మాతలికి మాత్రము వినబడినవి.

సహస్రానీకుడు మృగావతిని వివాహ మాడుట

రాజధాని చేరి సహస్రానీకుడు యుగంధరాది మంత్రులతో మృగా వతివృత్తాంతము చెప్పినాడు. విలంబానికి సహించలేక మృగావతి తండ్రి కృతవర్మవద్దకు అయోధ్యకు దూతలను పంపినాడు. ఆయన సంతోషించి తనరాణి కీ వివాహవిషయము తెలిపినాడు. తమబిడ్డను సహస్రానీకునికి ఇచ్చి తప్పకుండా వివాహము చేయవలసిందని, తనకు స్వప్నములో ఒకానొక బ్రాహ్మణుడు కనపడి ఇలా చెయ్యవలసిందని అన్నాడని రాణి చెప్పింది. మృగావతి రూపలావణ్యములను చూచి నృత్తగీతాదికా శలమును గ్రహించి దూతలు వెళ్ళినారు. తర్వాత మృగావతీ సహస్రా నీకులకు మహావైభవముతో వివాహము జరిగింది. వారిసమ్మేళము చాలా మనోజ్ఞ మయింది.

సహస్రానీకుని మంత్రులకు త్వరలోనే బిడ్డలు కలిగినారు. యుగంధరు నికి యౌగంధరాయణుడు, సుప్రతీకునికి రుమణ్వంతుడు హాస్యసచివునికి వసంతకుడు జన్మించినారు. మృగావతి కూడ గర్భము ధరించింది. ఆమె ముఖము తెల్లని కాంతులు వెదజల్లడము ఆరంభించింది.

మృగావతిని పతీ తన్నుకొనిపోవుట

ఒకనాడు రాజు భార్యవంక రెప్ప వాల్చకుండా చూస్తూ ఉన్నాడు. "నెత్తురుతో నిండిన దిగుడుబావిలో స్నానము చేయవలె ననే కోరిక

కలిగింది" అని రాణి విన్నవించింది. ధర్మాత్ముడైన ప్రభువు జంతు రక్తానికి బదులుగా దిగుడుబావిలో లాక్షారసము మొదలయినవి కలిపించినాడు. రక్తవర్ణముతో ఉన్ననీటిలో రాణి స్నానము చేస్తూ ఉండగా ఆకాశాన పోతున్న గరుడపక్షి మాంసకండ మనే భ్రమతో రాణిని పైకి తన్నుకుపోయింది. రాజు మూర్ఛపోయి కొంతసేపటికి తెప్పరిల్లినాడు. ఆ వృత్తాంతము దివ్యదృష్టివల్ల గ్రహించిన మాతలి ఆకాశమార్గాన వచ్చి రాజును ఓదార్చి తిలోత్తమ పెట్టిన శాపమూ, దానిఅంతమూ తెలియపరచి వెళ్లినాడు. "ప్రాణేశ్వరీ, ఆ పాపాత్ముడు రాలు తిలోత్తమ మనోరథము ఈడేరింది!" అంటూ రాజు చాలా దుఃఖించినాడు. శాపవిషయము తెలియడముచేతను, మంత్రులు ఓదార్చడముచేతను సహ్యసానీకుడు కొంతవరకు మనస్సు చిక్కబట్టి, భార్యతో మళ్ళీ సమాగమము కలుగుతుంది అనే ఆశతో ప్రాణాలు విడవకుండా ఉన్నాడు.

గరుడపక్షి మృగావతిని తన్నుకుపోయి, ప్రాణాలుఉన్న వ్యక్తి అని త్రోవలో గ్రహించి దైవయోగముచేత ఉదయపర్వతముమీద విడిచిపెట్టి, వెళ్ళింది. ఆమె భయశోకాలచేత విహ్వలచిత్తురా లయి, మనుష్యులు అడుగుపెట్టడానికి వీలులేని కొండచర్యమీద తాను ఉన్నట్టు తెలుసుకొన్నది. కట్టుబట్టతో దిక్కు లేని ఆ మృగావతిని మింగడానికి కొండచిలువ మీదికి వచ్చింది. ముందుముందు ఆమెకు సౌభాగ్యము ఉండడముచేత ఆనమయములో ఒకానొక దివ్యపురుషుడు వచ్చి ఆపామును సంహరించి, కనపడీ కనపడకుండా అంతర్ధాన మయినాడు. దుఃఖాతిశయముచేత ఆమె ప్రాణత్యాగము చేయ వలెనని నిశ్చయించుకొని అక్కడికి వచ్చిన అడవి యేనుగు కాళ్ళ ముందు వెళ్ళి పడ్డది. ఆశ్చర్యము! ఆక్రూర జంతువు ఆమెను ఏమీ చెయ్యలేదు. శివానుగ్రహము ఉంటే ఏ అశుభమూ జరగదు.

ఇంకా దుఃఖములో ఉన్న ఆగర్భవతి కొండచరియ మీదినుంచి కిందికి దుముకవలె ననుకొని, భర్తను తలుచుకొని పెద్దపెట్టున రోదనము ప్రారంభించింది.

మృగావతి జమదగ్ని ఆశ్రమమున నివసించుట

అదృష్టవశాన సరిగా ఆసమయాన నందనుడాలక్ష్యాల కొసము అక్కడికి వచ్చిన మునికుమారుడు మూర్ఛిల్లిన దుఃఖదేవతవలె ఉన్న ఆమెను ఓదార్చి నమీపము లో ఉన్న జమదగ్ని మహర్షుని ఆశ్రమానికి తీసుకొని వెళ్ళినాడు. ఆమె మహాపాదపద్మములకు మొక్కింది దయార్ద్ర హృదయుడైన జమదగ్ని దివ్యదృష్టితో చూచి, "తల్లీ, విచారపడకు. నీకుమించిన వంశోద్ధరు డయిన కుమారుడు జన్మిస్తాడు. మళ్ళీ నీకు భర్తతో సమాగమము కలుగుతుంది" అని ఓదార్చినాడు. ఆపతివ్రత ఆశ్రమములోనే నివాసము చేస్తూ భర్తను మనస్సులో ధ్యానిస్తూఉన్నది.

ఆకాశవాణి మృగావతి పుత్రుడకు ఉదయనుడని పేరుపెట్టుట

కొంతకాలానికి మృగావతికి కుమారుడు కలిగినాడు. "ఇతడు ఉదయనుడు అనేపేరుతో ప్రసిద్ధి చెందుతాడు. మహా శ్రీమంతుడు. కీర్తిమంతుడు, మహాప్రభువు అవుతాడు" "ఇతని కుమారుడు సమస్త విద్యాధర చక్రవర్తి అవుతాడు" అని ఆకాశవాణి పలుకు కర్ణోత్సవముగా వినబడ్డది. ఆశ్రమములో ఉదయనుడు దిన దినాభి వృద్ధి పొందుతున్నాడు. అతనికి పుత్రయోచితము లయిన సమస్త సంస్కారాలూ, ఉపనయనమూ చేసి, అతనికి అన్నివిద్యలూ, ధనుర్వేదమూ జమదగ్ని నేర్పినాడు.

వసునేమి అనేనాగుని ఉదయనుడు రక్షించుట

సహస్రానీకునిపేరు చెక్కిన కడియము తనచేతినుంచి తీసి మృగావతి ప్రీతితో కుమారునిచేతికి పెట్టింది. ఉదయనుడు ఒకనాడు అడవికి వేటకు వెళ్ళినాడు. శబరు డొకడు బలవంతముగా నాగుని (సర్పమును) పట్టు కొనడము చూచి, దాని అందచందాలకు జాలిపడి, దాన్ని విడిచిపెట్ట వలసిందని ఉదయనుడు శబరునికి ఆజ్ఞ యిచ్చినాడు. వాడు చేతులు జోడించి "దొరా, నేను వేదవాణ్ణి; పాములు పట్టుకోడం మాకులవృత్తి. పాములను ఆడించి బతుకుతాను. ఇదివరకు నాదగ్గర ఉండేపాము చచ్చి పోయింది. మంత్ర ఓషధుల మహిమచేత ఈ కీకారణ్యంలో దీన్ని పట్టాను." అని విన్నవించినాడు. ఉదయనుడు చేతికడియము తీసి శబరునికి ఇచ్చి సర్పమును విడిపించినాడు. కడియము పుచ్చుకొని శబరుడు వెళ్ళిపోగానే ఆనాగుడు ఉదయనునికి నమస్కరించి "రాజన్, నాపేరు వసునేమి, నేను వాసుకి సోదరుడను. నన్ను నీవు రక్షించినావు. కాబట్టి కృతజ్ఞతతో ఈ వీణను, ఈ కాంబూలపు తీగలను, వాడిపోని ఈ పుష్ప మాలికను, ఈ తిలకమును నీకు సమర్పిస్తున్నాను. ఈ వీణకు శ్రుతి విభాగము ఉన్నది, దివ్యమైన తంత్రులు ఉన్నవి. స్వీకరించు" అని సమర్పించినాడు. ఉదయనుడు స్వీకరించినాడు తర్వాత ఆనాగుడే ఉదయనుని ఎత్తుకొని ఆశ్రమములో దింపి వెళ్ళినాడు.

శబరుడు కడియమును రాజధానిలో అమ్మజూపినాడు. కడియము మీద మహారాజు సహస్రానీకుని నామాక్షరములు చూచి రాజభటులు శబరుని ప్రభువుసన్నిధికి పట్టుకుపోయినారు. మహారాజు కడియమును చూచి దుఃఖాక్రాంతుడయి, అది వానికి ఎలా దొరికినదో చెప్పవలసిన దని ఆజ్ఞాపించినాడు. ఉదయాద్రిమీద తాను పామును పట్టినది మొదలు కొని కటకము లభించినంతవరకూ జరిగిన వృత్తాంతము యావత్తూ

శబరుడు విన్నవించినాడు. ఆకటకము తాను భార్యచేతికి పెట్టినదని రాజు తెలుసుకొని చాలా ఆందోళన పడినాడు. ఇంతలో అశరీరవాణి "రాజా, నీశాపము ముగిసినది. నీభార్య మృగావతీదేవి కుమారునితోసహా ఉదయాద్రిమీద జమదగ్ని ఆశ్రమములో ఉన్నది" అని వినబడినది. రాజు భార్యమీద చింతతో ఆరోజు కష్టముమీద గడిపి, మరునాడు సైన్యమును వెంట బెట్టుకొని, శబరుని మార్గము చూపుమని జమదగ్ని ఆశ్రమానికి బయలుదేరినాడు.

తరంగము : ౧౦

అనంతరము మహారాజు చాలాదూరము ప్రయాణము చేసి అరణ్యములో ఒకప్రదేశాన సరోవరతీరాన దిగి అలసటపల్ల పండుకొని కథకుని పిలిచి, "సంగీతకా, మహారాణి దర్శనార్థియు తహతహ లాడుతున్న నాకు వీలయినా కథచెప్పి వినోదము సమకూర్పు" అని ఆజ్ఞాపించినాడు. "దేవా, ఎందుకు వృథా శ్రమపడుతారు? శాపాంతమై దేవితో తమకు త్వరలోనే సమాగమము కానున్నది కదా! మానవులకు సంయోగ వియోగాలు ఎన్నో కలుగుతూ ఉంటవి. ఉదాహరణార్థము ఈకథ ఆకర్ణించండి!" అని సంగతకుడు కథ చెప్పనారంభించినాడు.

శ్రీదత్తుని కథ

పూర్వము మాళవదేశములో యజ్ఞసేను డనే బ్రాహ్మడు ఉండేవాడు. ఆయనకు కాలనేమి విగతభయుడు అని ఇద్దరుకొడుకులు. ఉభయులూ జనరంజకులు. జనకుడు దివంగతుడయిన తర్వాత ఉభయులూ విద్యార్థము పాటలీపుత్ర నగరానికి వెళ్ళినారు. కాలక్రమేణ విద్యాభ్యాసము పూర్తికాగానే వారిగురువు తనకొమార్తెలను ఇద్దరినీ వీరికిచ్చి వివాహము చేసినాడు. ధనవంతులను చూచి అసూయచెంది

కాలనేమి వ్రతా ఘోరమాదులు చేసినాడు. లక్ష్మీదేవి ప్రత్యక్షమై "కాలనేమీ, నీకు చాలాసంపద లభిస్తుంది. నీకు రాజుకాగల పుత్రుడు పుట్టుతాడు. కాని నీకు అకస్మాత్తుగా దొంగచావు సంభవిస్తుంది. ఓర్వలేనితనముతో ఘోరాతిఘోరములు చేయడముచేత అటువంటి అంతము కలుగుతుంది" అని చెప్పి అంతర్ధాన మయినది.

క్రమేణా కాలనేమి సుఖసంపన్నుడయినాడు. కుమారుడుకూడ కలిగినాడు. శ్రీదేవి వరముచేత జన్మించిన తనయునికి శ్రీదత్తుడు అని తండ్రి పేరు పెట్టినాడు. ఆబాలుడు పెరిగి పెద్దవాడయినాడు. అతడు బ్రాహ్మణుడయినప్పటికీ మల్లయుద్ధాలలో, శస్త్రప్రావీణ్యములో అసమానుడయినాడు

కాలనేమి తమ్ముడి భార్యను పాము కరిచింది. భార్య పోయినతర్వాత విగతభయుడు నిగ్రహించి తీర్థయాత్రలకై బయలుదేరినాడు.

వల్లభశక్తి అనేరాజు చాలా యోగ్యుడు. తనకుమారుని చెలికాడుగా ఉండడానికి మల్ల విద్యా ప్రవీణుడయిన శ్రీదత్తుని ఆయన ప్రీతితో పిలిపించినాడు. రాజపుత్రుడయిన విక్రమశక్తితో శ్రీదత్తుడు సమావాసము చేస్తున్నాడు. అతనికి దేశసంభవులయిన బాహుశాలి, వజ్రముష్టి అనే యిద్దరుక్షత్రియులూ, తనతో మల్లయుద్ధములో ఓడిపోయిన మహాబలుడు, వ్యాఘ్రభటుడు, ఉపేంద్రబలుడు, నిష్ఠురకుడు అనే దాక్షిణాత్య మంత్రికుమారులు శ్రీదత్తునికి స్నేహితులయినారు. ఒకనాడు మిత్రులతో కలిసి రాజకుమారుడు విక్రమశక్తివెంట శ్రీదత్తుడు గంగాతీరానికి వెళ్ళినాడు. పరివారము విక్రమశక్తిని రాజును చేసి ఆటలాడుతూ ఉంటే, మిత్రులు శ్రీదత్తుని ప్రభువుచేసి వినోదముగా కాలక్షేపము చేసినారు. దానిమీద విక్రమశక్తి రోషముతో శ్రీదత్తుని మల్లయుద్ధానికి పిలిచినాడు. పోరాటములో ఓడిపోయి రాజకుమారుడు శ్రీదత్తుని నెమ్మదిగా కడతేర్చ వలెనను

కొన్నాడు. బుద్ధిశాలుడైన శ్రీదత్తుడు అతని అభిప్రాయమును గ్రహించి మిత్రులందరితో సహా అన్నపానీయాదులకై వెళ్ళుతూ ఉండగా, గంగాప్రవాహములో మునుగుతూ తేలుతూ ఉన్న సుందరాంగిక బయటకి

మిత్రులను బయట ఉండమని చెప్పి అతడు జలప్రవాహములోకి దూకినాడు. ఆ యువతీరత్నము కొనవెండ్రుకలు మాత్రము అతని చేతికి చిక్కినవి. అమె నీళ్ళలోకి మునిగిపోతే అతడుకూడా మునిగినాడు. ఇంతలో అక్కడ స్ఫటిక శిలానిర్మిత మైన శివాలయము గోచరించింది. గంగానది గాని ఆకామిని గాని మళ్ళీ కనబడలేదు. అతడు చాలా ఆశ్చర్యపడి అక్కడి మనుష్యులు ఎవరైనా ఉన్నారేమో అని వెతికితే ఎవరూలేరు. అందులో ఆదిదంపతులకి ప్రదక్షిణము చేసి పరమేశ్వరునికి భక్తితో మొక్కి, అనుపలు చెంది ఉండడముచేత ఆరాత్రి అక్కడ నుండరోద్యాన భాగములో విశ్రమించినాడు.

శ్రీదత్తుడు విద్యుల్లతను విడించుట

ప్రాతఃకాలానికి ఆ స్త్రీరత్నముసుందరి శివాలయానికి వచ్చి అర్ఘ్యం శేఖరుని అర్చించి తిరిగిపోతుంటే శ్రీదత్తుడు ఆమె ననుసరించి ఆమె మందిరములోకి ధైర్యము చేసి వెళ్ళినాడు. ఆమె అతన్ని చూచి ఉలికిపడి ఏమీ మాట్లాడకుండా సౌధాంతర్భాగములోపలికి పోయి స్త్రీ పట్టాలను తనయిష్టం చేసుకొని పర్యంకమునిండ కూర్చున్నది. శ్రీదత్తుడు సంశయించకుండా పోయి ఆమె పక్కన కూర్చున్నాడు. హఠాత్తుగా ఆమె మొహము మసి యేడవ సాగింది. చెలికత్తెలు ఆమెను ఊరడించారు. శ్రీదత్తుడు జాలిపడి "యువతీ, ఎవరు నీవు? సమస్త సంపదలతో నిండి మనోహ్యమైన ఈసౌధములో చెలికత్తెలతో వినోదిస్తూ ఉండక ఎందుకిలా రోదనము చేస్తావు? నీదుఃఖకారణ మేమిటి? నాతో చెపితే నేను విచారణ చేస్తాను." అని ధైర్యము

చెప్పినాడు. కొంతసేపటికి ఆమె ఊరడిల్లి ఇలా చెప్పింది: "ఆర్యా, మేమందరము బలిచక్రవర్తి మనుమరాండ్రము. వీళ్ళలోకి పెద్దదాన్ని. నన్ను విద్యుత్ప్రభ అంటారు. మహావిష్ణువు మాతాతగారిని శాశ్వతంగా పాతాళలోకాన బంధించినాడు. మాతండ్రి విష్ణువుతో యుద్ధములో మృతి చెందినాడని మమ్మల్ని విష్ణువు నగరములో నుంచి వెళ్ళగొట్టి మేము మళ్ళీ అక్కడికి వెళ్ళకుండా సింహాన్ని అక్కడ కాపలాపెట్టి నాడు. అప్పటినుంచీ ఆసింహము స్థిర నివాసము ఏర్పాటు చేసుకొన్నది. తర్వాత మేము మహావిష్ణువును ప్రార్థించాము. ఆయన మామీద దయదలచి ఈసింహము మొదట ఒకానొకయక్షుడు. కుబేరునిశాపము వల్ల ఈ ఆకారము ధరించినాడు. మానవు డెవడైనా వీనిని జయిస్తే శాపమోచనము అవుతుంది. అప్పుడు మీరు యథాప్రకారముగా నగరములోకి వెళ్ళి ఉండవచ్చును" అని అనుగ్రహించినారు. ఆర్యా, నీవు భావాబల సంపన్నుడవు. మాయందు అనుగ్రహముంచి సింహాన్ని నీవు జయించాలి. ఈపని నీవల్ల కావాలి. ఇతరులవల్ల కావడము వట్టిది! ఈ ఉద్దేశముతోనే నిన్ను ఇక్కడికి ఆకర్షించి తీసుకువచ్చాను. ఈ సింహాన్ని ఓడిస్తే నీకు మృగాంకమనే ఖడ్గము లభిస్తుంది. ఆ దివ్య ఖడ్గప్రభావమువల్ల నీకు జయము కలుగుతుంది. నీవు రాజు వవుతావు"

ఈమాటలువిని సరే అని శ్రీదత్తుడు ఆనాడు అక్కడే గడిపి మర్నాడు దైత్యకన్యలను వెంటబెట్టుకొని ఆనగరానికి వెళ్ళినాడు. సింహము అతన్ని చూచి ఒక్కగంతులో మీదికి దూకింది. శ్రీదత్తుడు ఏమీ జంకక భుజబలముతో సింహాన్ని పడగొట్టినాడు. శాపాంతము కావడముచేత సింహము పురుషాకారము ధరించి అతన్ని స్తుతించి మృగాంకమనే పేరు గల తన చేతిఖడ్గాన్ని అతనికిచ్చి అంతర్ధాన మయింది. తర్వాత అందరూ పట్టణములో ప్రవేశించారు. తనకు మహోపకారము చేసిన ఆవీరునకు విద్యుత్ప్రభ విభూతిని హరించే ఉంగరము సంతోషపూర్వకముగా ఇచ్చింది.

శ్రీదత్తుడు కొన్ని రోజులు అక్కడున్నాడు. విద్యుత్ప్రభమీద అతనికి అనురాగము కలిగింది. ఆమెగ్రహించి అతనితో "ఆ సరస్సులో స్నానము చేసి రా. అందులో మొసళ్ళు ఉండాలి. కాబట్టి నీఖడ్గము చేతిలోనుంచి విడిచిపెట్ట వద్దుసుమా !" అని చెప్పింది. చెప్పిన ప్రకారము శ్రీదత్తుడు నీటిలో మునిగి లేచేసరికి వెనక తాను గంగానదిలో దిగిన-చోట ఉన్నాడు. నాలుగుదిక్కులా చూచి ఆశ్చర్యపడి, చేతి ఉంగరమునూ కత్తినీ గమనించి వైశ్యకన్యక మోసము చేసిం దనుకొని మిత్రులను వెతుకుతూ స్వగృహాభి ముఖుడయినాడు. తోవలో నిష్ఠుర కుడు కనబడి నమస్కరించి, "నీవు మునిగినతర్వాత నీకోసము చాలా రోజులు వెతికినాము. దుఃఖాతిశయంచేత మే మంతా చచ్చిపోదామని యత్నిస్తుంటే ఆకాశవాణి "నాయనలారా, సాహసించకండి. శ్రీదత్తుడు సుఖంగా తిరిగి వస్తాడు" అన్నది. తర్వాత మేము నీతల్లిదండ్రులను చూడడానికి పోతుంటే, పూర్వపరిచితుడు ఒకడు కనబడి "మీరు నగరములోకి వెళ్ళకండి. వల్లభశక్తి చనిపోయినాడు. మంత్రులు విక్రమశక్తిని రాజును చేశారు. నిన్ననే విక్రమశక్తి కాలనేమియింటికి వెళ్ళి 'శ్రీదత్తుడు ఎక్కడున్నాడు.' అని అడిగితే ఆయన తనకు తెలియదన్నాడు. మండిపడి రాజు ఆయనను కొరతవేయించి చంపినాడు. ఆయన భార్య గుండె పగిలి చనిపోయింది. మహాదుర్మార్గుడైన విక్రమశక్తి శ్రీదత్తుని కడతేర్చా లని వెతికిస్తున్నాడు. మీరు దేశాంతరము వెళ్ళడం మంచిది" అని చెప్పినాడు. మనమిత్రులు బావుశాలి ప్రభృతులు చాలా దుఃఖించి, బాగా ఆలోచించి నీకోసము నన్ను ఇక్కడ రహస్యముగా ఉంచి స్వస్థాన మయిన ఉజ్జయినికి వెళ్ళినారు. కాబట్టి మనముకూడా అక్కడికే పోదాము. ఇక్కడఉంటే అపాయము, విధి ఇలా ఉన్నది."

రాక్షసీ శాపమోచనము

నిష్ఠురకునివల్ల ఈసంగతులు విని అతను తల్లిదండ్రుల దుర్గతికి విచారపడి పగతీర్చుకోడానికి మాటిమాటికీ కత్తి కేసి చూచాడు కాని మంచి తరుణము కాదని ఆగి, నిష్ఠురకునితో కలిసి స్నేహితులను చూడడానికి ఉజ్జయినికి ప్రయాణ మయినాడు. తాను గంగానదిలో మునిగినది మొదలు సరస్సులో స్నానము చేసిన వరకూ విశేషాలన్నీ నిష్ఠురకునికి చెప్పుతూ వెళుతూ ఉండగా మార్గములో రోదనచుచేస్తూన్న స్త్రీ కనపడ్డది "ఎందుకు ఏడుస్తూన్నావు" అని అతడు అడిగితే "మాళవదేశానికి వెళుతూ తోవ తప్పిపోయినాను" అని ఆమె చెప్పింది. దయతలచి ఆమెను వెంట రమ్మన్నాడు. ఆస్త్రీ ఎక్కువదూరము నడవలేదని జాలిచేత దగ్గరలో పాడువడ్డ పట్నములో రాత్రి బసచేసినాడు. అతనికి ఒకరాత్రివేళ మెళుకువ వచ్చి చూచేటప్పటికి ఆస్త్రీ నిష్ఠురకుని చంపి మాంసము తింటున్నది! అతడు ఖడ్గము ధరించి లేచినాడు. ఆమె భయంకర మైన రాక్షసిరూపము ధరించింది. అతడు దానిజుట్టు పట్టుకొని తల నరకడానికి కిందికి వంచినాడు. వెంటనే ఆమె దివ్య వనితగా మారిపోయి అతనితో ఇలా అన్నది "మహానుభావా, నన్ను నంహరించవద్దు; విడిచిపెట్టు; నేను రాక్షసినికాను; కాళికుని శాపమువల్ల ఇలా అయినాను. కుబేరపదవిని కాంక్షించి కాళికుడు పూర్వము తపస్సు చేస్తూఉంటే తపోభంగము చెయ్య వలసిందని కుబేరుడు నన్ను నియమించినాడు. చక్కదనముచేత ఆఋషిని ప్రలోభపెట్టలేకపోగవచ్చాను. పోనీ భయపెట్టి చూతామని భీకరాకారము ధరించినాను. కాళికుడుకోపించి "దారాభ్యరాలా, రాక్షసివై మనుష్యులను భక్షిస్తూ ఉండు" అని శాపముపెట్టి నీవు నాసిగపట్టి లాగగానే శాపాంతమని అనుగ్రహించినాడు. బహుకాలమునుంచి ఇక్కడివాళ్లను చంపి తిని నగరము నాశము చేశాను. నీవల్ల నాకు శాపవిమోచనమయింది; నీవేదైనా వరమడిగితే ఇస్తాను"

ఈమాటలకు శ్రీదత్తుడు సంతోషించి నాకు వేరేవరమెందుకు ? ఈ మిత్రుని బ్రతికించు" అన్నాడు. ఆమె సరేఅని వరమిచ్చి అంతర్ధానమయి నది. చెక్కు చెదరని శరీరముతో నిష్ఠురకుడు లేచినాడు. శ్రీదత్తుని సంతో షాశ్చర్యాలకు మేరలేదు. మర్నాడు ఉదయము ఉభయులు బయలు దేరి క్రమముగా ఉజ్జయిని చేరినారు. వీరిని చూచి లక్కడిమిత్రులంతా ఆనందించారు. శ్రీదత్తుడు వారికి తనవృత్తాంత మంతా చెప్పి బాహు శాలి అనే మిత్రుని గృహములో బసచేసినాడు. ఇతనికి బాహుశాలి జననీ జనకులు సాదరముగా ఉపచర్యలు చేస్తూ ఉండగా స్వగృహములో ఉన్నట్లు సుఖముగా ఉంటూన్నాడు.

శ్రీదత్తుడు మృగాంకవతిని హరించుట

వసంతోత్సవము ప్రారంభ మయినది. ఒకనాడు శ్రీ దత్తుడు మిత్రు లతో పుష్పోద్యానములో వేడుక చూడడానికి వెళ్ళినాడు. అక్కడ బింబకి అనే రాజకూతురు మృగాంకవతిని చూచినాడు. దర్శనమాత్రము లోనే శ్రీదత్తుని వికసితనేత్రాలవెంట మార్గము చేసుకొన్న దా అన్నట్టు మృగాంకవతి అతనిహృదయములోకి ప్రవేశించింది. ప్రథమప్రణయాన్ని సూచిస్తూ ఆమెచూపులు దూతికలవలె అతనివైపు రాకపోకలు మొదలు పెట్టినవి. రాజపుత్రి కనబడకుండా వెళ్ళేసరికి శ్రీ దత్తునికి దిగ్భ్రమ పుట్టింది. బాహుశాలి అతనిసంగతి కనిపెట్టి " వయస్యా, రహస్య మెందుకు ? నాకు తెలుసులే. రాజపుత్రిక వెళ్ళినవైపే వెళుదాము. పద " అని ఆమె ఉన్న చోటికి అతనిని తీసుకుపోయినాడు. ఇంతలోనే "అయ్యో, రాజకుమారిని పాము కరిచింది " అని కేకలు వినబడ్డవి. బాహుశాలి వెళ్ళి కంచుకిని చూచి, "నామిత్రునివద్ద విషము హరించే ఉంగరమున్నది. అతనికి మంత్రముకూడా వచ్చును" అన్నాడు. తక్ష ణము కంచుకి వెళ్ళి, శ్రీ దత్తునిపాదాలకు మ్రొక్కి, రాజపుత్రిదగ్గిరి

అతనిని తీసుకుపోయినాడు. శ్రీదత్తుడు ఆమెవేలికి అంగుళీయకము తొడిగి మంత్రము జపించినాడు. ఆమె బ్రతికి లేచి కూర్చున్నది. అందరూ ఆనందించి అతనిని పొగడుతూ ఉండగా రాజు బింబకి అక్కడికి వచ్చినాడు. తర్వాత శ్రీదత్తుడు బావుశాలియింటికి వెళ్ళినాడు. రాజపుత్రిక వేలినుంచి ఉంగరము తీసుకోలేదు. ప్రభువు పంపిన బహుమానము శ్రీదత్తుడు బావుశాలితండ్రికే సమర్పించినాడు.

నిరంతరము రాజపుత్రికను స్మరిస్తూ శ్రీదత్తుడు పడుతున్న బాధకు స్నేహితులు ఏమీ చెయ్యలేక చింతిస్తున్నారు. రాజకుమారికి సఖి అయిన భావనిక ఉంగరము తిరిగి ఇచ్చివేసే మిషతో శ్రీదత్తుని నివాసానికి వెళ్ళి, "సుందరమూర్తీ, నావయస్య ఎటువంటి అవస్థలో ఉన్నదో తెలుసునా? ఒకసారి ప్రాణ మిచ్చినసీవు పతివి కాకపోతే ఆమె ప్రాణాలు ఇకముందు నిలవవు" అని విన్నవించింది. శ్రీదత్తుడు, బావుశాలి, భావనిక, తక్కినమిత్రులూ రహస్యాలోచన చేసి, మృగాంకవతిని ఆ నగరమునుంచి గూఢముగా మధురాపురికి తీసుకుపోయి అందరూ అక్కడే నివసించేలాగున నిర్ధారణ చేసి ఏర్పాట్లుకూడా చేసుకొన్నారు. భావనిక మృగాంకవతి సన్నిధికి వెళ్ళింది.

వర్తకానికి వెళ్ళుతున్నట్టు పన్నాగము పన్ని బావుశాలి మర్నాడు ముగ్గురు స్నేహితులతో మధురాపురికి బయలుదేరినాడు. రాజకుమారి వేగముగా పలాయనము చేయడానికి వనికివచ్చే అంచెగుర్రాలను మార్గములో ఉంచినాడు. ఒకానొక స్త్రీకి, దానికొమార్తెకు బాగామద్యము పోయించి రాజపుత్రికగదిలో వాళ్ళు పడుకొనే ఏర్పాటు చేయించినాడు. అర్ధరాత్రివేళ మృగాంకవతిని రాజభవనములోనుంచి యివతలకు పంపించి ఇంటికినిప్పుపెట్టి, కనిపెట్టుకొని ఉన్న శ్రీదత్తుని కలుసుకొన్నది. అతడు ఇద్దరుమిత్రులను తోడిచ్చి, రాజపుత్రిని భావనికను ముందువెళ్ళిన బావుశాలివద్దకు పంపించినాడు. రాజగృహములో దగ్ధమైన స్త్రీని,

దానిబిడ్డను చూచి రాజపుత్రిక భావనిక, చనిపోయినా రనుకొన్నారు లోకులు. మరునటి ఉదయము శ్రీదత్తుడు యథాప్రకారముగా పట్ను ములో అందరికీ కనబడి, రెండవరాత్రి మృగాంకఖడ్గమును ధరించి మృగాంకవతిని కలుసుకోడానికి ప్రయాణమయి చాలాదూరము వెళ్ళి పొద్దెక్కేటప్పటికి వింధ్యారణ్యములో ప్రవేశించినాడు.

అక్కడ అతనికి అన్నీ అపశకునాలే. కొంతదూరము వెళ్ళేనరికి అతనికి మిత్రులు, భావనిక కనిపించారు. దెబ్బలు తిని సడలిపోయి ఉన్న స్నేహితుల అవస్థకు శ్రీదత్తుడు విచారపడ్డాడు. వారు అతనితో "మిత్రమా, మమ్మల్ని గుర్రపుదండు కొట్టిదోచుకొన్నది. మేము ఈ స్థితిలో ఉండగా ఎవరో రాతు రాజకన్యను అశ్వముమీద ఎక్కించుకు పోయినాడు. నీవా దిక్కున పెళ్ళు. ఇక్కడ ఉండనక్కరలేదు. మృగాంక వతిసంగీతి ముఖ్యము" అని అతన్ని సాగనంపినాడు. శ్రీదత్తుడు తరు చుగా వెనకకు తిరిగి వయస్యులను చూచి చివరకు ఆ గుర్రపు దండును త్వరలోనే కలుసుకొన్నాడు. వారినడుమ మృగాంకవతిని తీసుకుపోతున్న రాజపుత్రుని సమీపించి సామ వాక్యాలతో ఆమెను తనకు సమర్పించ మన్నాడు. అతడు అంగీకరించలేదు. శ్రీదత్తుడు అతన్ని కాలితో తన్ని గుర్రముమీదినుంచి కిందికి లాగి శిలాఖండముమీద వేసి చితక గొట్టి అతని అశ్వాన్నే ఆరోహించినాడు. తనమీదికి వచ్చిన రాతు లను హతము చేసినాడు. శేషించినవారు అతనిపరాక్రమానికి భయపడి పలాయనము చేశారు.

తర్వాత శ్రీదత్తుడు మృగాంకవతితోసహా స్నేహితులదగ్గిరికి బయలు దేరి కొంతదూరము వెళ్ళినాడు. మార్గములో అశ్వము అలసిపోవడము గ్రహించి ప్రియురాలితోకూడా క్రిందికిదిగినాడు. యుద్ధములో గాయ ములు తగిలిన ఆగుర్రము భూమిమీదపడి ప్రాణాలునిడిచింది. మృగాంక వతికి నోరెండి దాహ మయింది. ఆమె నక్కడ ఉంచి అతడు మంచి

నీరు తేవడానికి బయలుదేరి వెతుకుకుంటూ వెళ్ళినాడు. ఇంతలో సూర్యుడు అస్తమించినాడు. చివరకు అతనికి నీళ్లు దొరికినవి. కాని శ్రీదత్తుడు చీకటిలో తోవతప్పి, తెల్లవార్లూ విలపిస్తూ తిరిగినాడు. ప్రాతఃకాలము అయ్యేనరికి వెనుకటిరోజు మృతాశ్వము పడినచోటికి వచ్చినాడు. రాజకుమారి కనబడలేదు. ఆమె కనిపిస్తుం దేమో అని పెద్దచెట్టు ఎక్కినాడు. ఆమార్గమున వెళ్ళుతున్న శబరనాయకుడు వృక్షమూలమున పెట్టి ఉన్న ఖడ్గమును చూచి వెంటనే తీసుకున్నాడు. శ్రీదత్తుడు వృక్షారోహణము చేసేటప్పుడు మృగాంకమును చెట్టుకు ఆనించినాడు. అతన్ని చూచి శ్రీదత్తుడు చెట్టుదిగి విచారముతో ప్రియురాలి విషయమై వానిని అడిగినాడు. "మాపల్లెకు వెళ్ళు ; దగ్గరలోనే ఉన్నది. అక్కడ నీభార్య ఉంది. నేనుకూడా త్వరలోనే వచ్చి నీకత్తి యిచ్చేస్తా." అని శబరనాయకుడు చెప్పినాడు. కాంతానందర్శనకుతూహలముతో శ్రీదత్తుడు శబరనాయకుని పరివారముతో ఆ పల్లెకు వెళ్ళినాడు.విశ్రాంతి తీసుకోమని వాళ్లు అన్నారు. అతడు నాయకునియింట్లో పడుకొని అలసటచేత నిద్రపోయినాడు. మెళుకువవచ్చి చూచుకొనేసరికి కాళ్ళకు సంకెళ్లు వేసి ఉన్నవి! అతడు దైవగతికి ఆశ్చర్యపడుతూ, ప్రియురాలిని తలుచుకుంటూ అక్కడే కాలము గడుపుతున్నాడు.

శ్రీదత్తుడు శబరకన్యను పెండ్లియాడుట

మోచనిక అనే చేటిక ఒకనాడు అతనిదగ్గిరికి వచ్చి "మహాభాగా, ఎందుకు ఇక్కడికి వచ్చావు? నీకు మరణము నిశ్చయము! శబరనాయకుడు ఏదోపనిమీద గ్రామాంతరము వెళ్ళాడు. రాగానే నిన్ను అమ్మవారికి బలి యిస్తాడు. అందుకోసమే వింధ్యారణ్యమునుంచి నిన్ను ఈ పల్లెకు తీసుకువచ్చి చెరలో పెట్టినాడు. నీకు మంచిబట్టలు యిచ్చి బాగా భోజనముపెట్టి ఉపచారాలు చేయించడం ఎందుకో తెలుసునా? అమ్మ

వారికి బలి యివ్వడానికే. తప్పించుకోవలె నంటే ఒకటే ఉపాయ ముంది. నీవు ఒప్పుకుంటే చెబుతాను. నాయకుడికి సుందరి అనే కూతు రున్నది. ఆమె నిన్ను చూచినప్పటినుంచీ వలపు తలకెక్కి బాధపడు చున్నది. ఆమెను చేపట్టితే నీకు శుభము'' అని చెప్పినది. శ్రీదత్తుడు అంగీకరించి గాంధర్వవిధిని సుందరిని పెండ్లాడినాడు. సుందరి ప్రతిరాత్రి వచ్చి అతని నంకెక్లు తొలగించి సుఖముగా కాలము గడపి వెళ్లుతూ ఉన్నది. త్వరలోనే ఆమె గర్భవతి అయినది.

మోచనికవల్ల ఈ విషయ మంతా విని సుందరితల్లి రహస్యముగా శ్రీదత్తుని దగ్గిరికి వెళ్ళి అల్లుడనే అనురాగముతో, "నాయనా ! సుందరి తండ్రి మహాకోపి. శ్రీచండు డనే పేరు ఊరికే పెట్టిందికాదు—సార్థకము ! నీవు ఇక్కడినుంచి పారిపో. దొరికితే క్షమించడు. మా సుందరిని మాత్రము మరిచిపోవద్దు'' అని వేడుకొని సంకెళ్లు తీసివేసింది.

మృగాంకవతీ సమాగమము

ఆమెతండ్రి తెచ్చిన ఖడ్గము తనదని శ్రీదత్తుడు సుందరితో చెప్పి బయలుదేరి మృగాంకవతిని వెదకడానికి వింధ్యాటవిలో వెనుకటి ప్రదే శానికే వెళ్ళినాడు. అప్రాంతాన బోయవాడు ఎదురుపడితే తన కాంత సంగతి వానిని అడిగినాడు. "నీవు శ్రీదత్తుడువా'' అన్నాడు బోయవాడు. "అవును. ఆనిర్భాగ్యుడను నేనే''అని శ్రీదత్తుడు నిట్టూర్పువిడిచినాడు. అత నితో బోయ"అయ్యా,నీప్రియురాలు నీకోసముఅన్ని దిక్కులా వెదుకుతూ ఏడుస్తుంటే నేను చూచి జాలివడి మావల్లెకు ఆమెను తీసుకుపోయినాను. అక్కడి కోడెగాండ్లవల్లఆమెకు భయముపుట్టింది. ఆమె దిగులు పడుతూ ఉంటే మధురావూరి దగ్గర నాగస్థలము అనేగ్రామములో విశ్వదత్తు డనే ముసలి బ్రాహ్మణుడుగారి యింట్లో గౌరవంగా ఆమెను ఇల్లడ పెట్టాను. ఆమెవల్ల నీపేరు తెలుసుకొని నీకోసం ఇక్కడికివచ్చాను. నీవు

శీఘ్రముగా నాగస్థలానికివెళ్ళు. ఆమెను అక్కడ చూస్తావు" అని చెప్పినాడు. తక్షణమే శ్రీదత్తుడు బయలుదేరి ఆరాత్రికే నాగస్థలము చేరుకొని వెతుకొన్ని విశ్వదత్తుని యింటికి వెళ్ళి "ఆర్యా, బోయ మీవద్దఉంచిన నాభార్యను నాకివ్వండి" అనివేడినాడు. బ్రాహ్మణుడు అతనితో "ఆర్యా, మధురాపురిలో నామిత్రుడు చాలాయోగ్యుడు అయిన విప్రుడున్నాడు. ఆయన శూరసేన మహారాజుకు ఉపాధ్యాయుడు, అమాత్యుడూ. నీకాంతను ఆయనకు అప్పగించాను. ఇది కుగ్రామము. ఆమెనుసంరక్షించడము చాలాకష్టమని ఇలాచేశాను. నీవు నేటికి ఇక్కడ విశ్రాంతి తీసుకొని రేపు ఆమె దగ్గరకు వెళ్ళు" అని చెప్పినాడు.

శ్రీ దత్తుడు రాత్రి అక్కడే విశ్రమించి మర్నాడు ప్రాతఃకాలము బయలుదేరి మర్నాడు మధురాపురి చేరుకున్నాడు. గ్రామకంఠములో మంచిదిగుడు బావి కనపడ్డది. ఒంటిమీది ధూళి, ప్రయాణపుబడలిక పోవడానికి అందులో స్నానము చేసినాడు. అక్కడ చక్కని వస్త్రము పడియున్నది. దాన్ని తీసుకొని ప్రియకాంతను దర్శించవలె ననే తహ తహలో పట్నములో ప్రవేశించినాడు. రాజపురుషులు ఆవస్త్రాన్ని గుర్తుపట్టి, కొంగున ముడిచిఉన్నహారమును కూడా గుర్తించి చోరుడని శ్రీ దత్తుని కొట్వాలు నన్నిధికి కొనిపోయినారు. ఎవరో దొంగలు హారము ఆవస్త్రముచెంగున కట్టిపెట్టినట్లు అతనికి తెలియనే తెలియదు. కొట్వాలు శ్రీ దత్తుని నేరమును ప్రభువునకు విన్నవించినాడు. రాజు అతనికి ఉరిశిక్ష విధించినాడు. తలారులు తప్పెటలు వాయిస్తూ శ్రీ దత్తుని వధ్యభూమికి తీసుకొని పోతున్నారు. మంత్రిమందిరములో ఉన్న మృగాంకవతి మేడమీదినుంచి ఆ దృశ్యము చూచి తక్షణము మంత్రినన్నిధికి వెళ్ళి "నాభర్తను ఉరి తియ్యడానికి వధ్యస్థానానికి తీసుకు వెళుతున్నారు" అని సంభ్రమముతో మొరపెట్టుకొన్నది. మంత్రి తలారులను ఆపి, ప్రభువు విన్నపము చేయించి ఉరిశిక్ష తప్పించి, శ్రీ దత్తుని స్వగృహానికి

తెప్పించినాడు. శ్రీ దత్తుడు అతనిని అనవాలు పట్టి "ఏమిది ఆశ్చర్యము! వెనుక దేశాంతరము వెళ్ళిన నా పినతండ్రి శివానుగ్రహమువల్ల ఇక్కడ అమాత్యుడయినాడు" అనుకొని ఆయనపాదములమీద వాలినాడు. ఆయన విగతభయుడు; అన్నకుమారుని ఆనవాలు పట్టి పాదాలమీద నుంచి లేవనెత్తి, ఆనందముతో ఆలింగనము చేసుకొని యావద్వృత్తాంతమూ చెప్పమని అడిగినాడు. తనతండ్రి వధవిశేషాలు మొదలు కొని తాను అక్కడికి వచ్చినసంగతివరకూ శ్రీ దత్తుడు విగతభయునికి విన్నవించినాడు. ఆయన రహస్యముగా అతనితో "నాయనా, నాకు ఒకానొక యక్షిణి స్వాధీన మయినది. ఆమె నాకు అయిదువేల గుర్రాలను, అయిదుకోట్ల వరహాలను అనుగ్రహించింది. నాకు బిడ్డలు లేరు. అవన్నీ నీవే" అని చెప్పి, మృగాంకవతిని అతనికి అప్పగించినాడు. ఆ సంపదలనుస్వీకరించి, మృగాంకవతిని పెండ్లాడి, అక్కడే సుఖముగా నివాసము చేస్తున్నాడు. అయితే బావుశాలి మొదలయిన మిత్రులసంగతి మాత్రము సుధ్యసుధ్య మనస్సును బాధిస్తున్నది.

శ్రీ దత్తుడు శూరసేన రాజకుమారిని వివాహమాడుట

విగతభయుడు ఒకనాడు శ్రీ దత్తునితో రహస్యముగా "నాయనా, ఈ శూరసేన మహారాజుకు కొమార్తె ఉన్నది. ఆమె కింకా వివాహము కాలేదు. ఆయన ఆజ్ఞాప్రకారమే ఆచిన్నదానిని నేను అవంతి దేశానికి తీసుకు వెళ్ళాలి. ఉపాయము చేసి ఆమెను నీకు అప్పగిస్తాను. ఆమెకు తోడు వచ్చేసేన, నాసేన కలిస్తే, శ్రీదేవి చెప్పినట్లు నీకు త్వరలో రాజ్యము లభిస్తుంది." అని బోధించినాడు. తర్వాత రాజకుమారిని తీసుకొని విగతభయుడు, శ్రీ దత్తుడు భార్యలతోను, భటులతోను బయలుదేరి వింధ్యాటవి చేరినారు. హఠాత్తుగ దొంగలగుంపు వారిమీద పడి రాళ్ళవాన కురిపించింది. శ్రీ దత్తుని దండుకు చాలాదెబ్బలు తగిలినవి,

అతడు మూర్ఛపోయినాడు. దొంగలు యావత్తూ దోచుకొని అతన్ని కట్టివేసి పల్లెకు తీసుకు పోయి, ఘంటానాదాలతో భీకరముగా ఉన్న చండికాలయములో ఉంచారు. అమ్మవారి దర్శనము చేతా మని చిన్నికుమారునితో సుందరి అక్కడికి వచ్చింది. భర్త అయిన శ్రీదత్తుని చూచి చోరులను అవతలికి పంపి, ఆనందముతో అతన్ని తనయింటికి తీసుకుపోయింది. కుమారులు లేని శ్రీ చండుడు మరణకాలములో తనవల్లెరాజ్యము మొత్తము సుందరికి ఇచ్చివేసినాడు. అందుచేత శ్రీదత్తుడు దానికి దొర అయినాడు. వెంటనే పితసతండ్రి మొదలయిన వారిని విడిపించినాడు. అగ్నిగర్భములో పోయినధనాదులు, మృగాంకఖడ్గము మళ్ళీ అతనికి స్వాధీన మయినవి. శూరసేన ప్రభువు పుత్రికను అక్కడే వివాహ మాడి రాజ్యము చేయడము ప్రారంభించినాడు.

అనంతరము శ్రీదత్తుడు బింబకి మహారాజుకు శూరసేనమహారాజుకు దూతలద్వారా వర్తమానము పంపినాడు. వారు చాలా సంతోషించి పుత్రికలమీది అనురాగముచేత సైన్యసమేతముగా అక్కడికి వచ్చినారు. బాహుశాలి ప్రభృతులుకూడా ఆరోగ్యము పొంది అతనిసన్నిధికి చేరుకొన్నారు. శ్రీదత్తుడు మామలతోసహా తనతండ్రిని సంహరించిన విక్రమశక్తిమీదికి దండయాత్ర చేసి అతనిని తనక్రోధానలానికి ఆహుతి చేసి వేసినాడు. మహాప్రభువై మృగాంకవతితో భోగములు అనుభవించినాడు.

దేవా, ధీరులయినవారు ఈవిధముగా వియోగ సముద్రాన్ని తరించి సౌభాగ్యము పొందుతారు.

సహస్రానీకుడు మృగావతిని కలుసుకొనుట

సంగతకుడు చెప్పినకథవిని సహస్రానీకుడు ప్రియురాలికోసము కలలు కంటూ రాత్రి ఎలాగో వెళ్ళబుచ్చినాడు. ఉదయముకాగానే బయలు

దేరి జమదగ్ని ఆశ్రమానికి వెళ్ళి ముసీశ్వరునికి ప్రణామము చేసినాడు. రాజుకు అతిథి సత్కారాలుచేసి ముని మృగావతిని, కుమారుని అప్పగించినాడు. శాపము తీరినతర్వాత పరస్పరవిలోకనము చేసిన ఆదంపతుల నేత్రాలలో బాష్పాలు అమృతబిందులలాగ నిండినవి. ప్రథమ పర్యాయము చూచినపుత్రుని సహస్రానీకుడు శరీరము గగుర్పొడుస్తుండగా కౌగలించుకొన్నాడు.

తర్వాత రాజు జమదగ్ని సెలవుపొంది భార్యాపుత్రులతో బయలు దేరినాడు. తపోవనములో లేళ్ళుసహితము కన్నీళ్ళతో వారిని కొంత వరకు వెంబడించినవి. భార్యావృత్తాంతాలు వింటూ, తనవిశేషాలు ఆమెకు చెపుతూ సహస్రానీకుడు నిజరాజధాని చేరినాడు. కౌశాంబీ నగరము తోరణాలతో, జెండాలతో అలంకరించి, నగరవాసులు ప్రభు కుటుంబాన్ని పరమాహ్లాదముతో వీక్షించినారు. వెంటనే రాజు ఉదయనునకు యువరాజ్యాభిషేకము చేసి వసంతక రుమణ్వంతులనూ యౌగంధరాయణునీ కుమారునికి అమాత్యులుగా అప్పగించినాడు. "ఈ అమాత్యులనల్ల ఇతడు సార్వభౌముకు అవుతాడు" అని ఆసమయాన అశరీరవాణి వినబడ్డది. పుష్పవర్షము కురిసింది. కుమారుని యువరాజును చేసి మహారాజు రాజ్యభారము తగ్గించుకొని మృగావతితో శాంతముగా కాలక్షేపము చేస్తున్నాడు.

ఇలా కొంతకాలము గడవగా మహారాజుకు వార్తకము వచ్చింది. ఉదయనుని మహారాజునుచేసి సాహస్రానీకుడు భార్యతోను, మంత్రులతోను హిమవత్పర్వతానికి బయలుదేరి పోయినాడు.

తరంగము : ౧౧

కౌశాంబీనగరము రాజధానిగా ఉదయనుడు వత్సదేశాన్ని పరిపాలిస్తున్నాడు. కొన్నాళ్లకు రాజ్యభారము యౌగంధరాయణుడు మొద

లయిన అమాత్యులకు అప్పగించి తాను భోగపరాయణు డయిపోయి నాడు. వసునేమి యిచ్చిన ఘోషవతీవీణ వాయిస్తూ, దాని మధుర నాదానికి వశ మయినమదవుటేనుగులను పట్టి తెస్తూ, వారాంగనలు అందిచ్చే సుద్యము తాగుతూ కాలము గడుపుచున్నాడు. మంత్రులు ముఖవికాసము కోలుపోయినారు. కులరూపగుణాదులలో తనకు తగినకన్య ఎవరూ లేదనీ, వాసవదత్తఅనే రాజపుత్రి మాత్రము ఉన్నట్టు వదంతి అనీ, ఆమె తనకు లభ్యమయ్యేమార్గము ఏదనీ ఉదయనుని విచారము.

చండమహాసేనుని దౌత్యము

ఉజ్జయినీమహారాజు చండమహాసేనుడుకూడా ఇటువంటి విచార ములో పడ్డాడు! "నాపుత్రికకు తగినభర్త ప్రపంచములో లేడు. ఉద యనుడు ఒక్కడుమాత్రము ఉన్నాడు. ఊండి లాభ మేమి! అతడు నా శత్రుకోటిలోవాడు. నాకు అల్లు డయి వశవర్తి అవుతాడా! ఒక్క ఉపాయము తోస్తున్నది. అడవివీనులను పట్టే వ్యసనముచేత ఒంట రిగా అరణ్యాలలో సంచరిస్తూ ఉంటా డని తెలిసింది. ఆలోపాన్ని గమనించి యుక్తిచేసి అతన్ని పట్టి ఇక్కడికి తెప్పిస్తాను. గాంధర్వ విద్యలో విశేషనిపుణుడయిన అతనికి వాసవదత్తను శిష్యురాలుగా అప్పగిస్తాను. అతనికి అమ్మాయిమీద అనురాగము పుట్టితీరుతుంది. అల్లు డయినతర్వాత చెప్పినట్టు వినకపోతాడా! అతన్ని వశపరుచు కోడానికి మరోఉపాయము కనబడడము లేదు." ఈవిధముగా చింతించి చండమహాసేనుడు చండికాదేవి ఆలయానికివెళ్లి అమ్మవారిని పూజించి స్తుతించి ముడుపు కట్టినాడు. "రాజన్, నీఅభీష్టము శీఘ్ర కాలములోనే సిద్ధిస్తుంది" అని అశరీరవాణి పలికింది. భవనమునకు మరలి వచ్చి ప్రభువు బుద్ధదత్తు డనే అమాత్యునితో ఆలోచించినాడు. "వత్స

రాజు మహాగర్వి. అతనికి లోభము లేదు. పరివారమువా రంతా ప్రభుభక్తి పరాయణులు. స్వయముగా బలిష్ఠుడు. దేనికీ లొంగే వాడుకాడు. అయినా ముందుగా సామోపాయమే ప్రయోగిం తాము" అని చండమహాసేనుడు దూతను పిలిచి "నీవు కౌశాంబికి వెళ్ళి వత్సరాజుతో మేము మనవిచేసినట్లుగా చెప్పు. మాఅమ్మాయి వాసవదత్తాదేవి గాంధర్వవేదము ఆయనవద్ద అభ్యసించవలె ననే కుతూహలముతో ఉన్నదనీ, మాయందు అనుగ్రహ ముంచి వత్సరాజు ఇక్కడికి దయచేసి విద్య నేర్పవలె ననీ విజ్ఞాపన చెయ్యి" అని బోధించి పంపినాడు.

రాజదూత కౌశాంబీనగరానికి వెళ్ళి వత్సరాజుకు తన ప్రభుని సందేశము విన్నవించినాడు. వత్సేశ్వరుడు విని ఏకాంతముగా యౌగంధరాయణునితో "ఏమి ఇంత కావరము! ఈ కోరికలో ఇమిడిన ఉద్దేశ్య మేమిటి!" అన్నాడు. స్వామిహితము కోరే యౌగంధరాయణుడు ఇలా చెప్పినాడు: "దేవా, మీరు రాజకార్యాలు మాని వ్యసనాసక్తు లయిపోయినా రని లోకములో వ్యాపించిన అప్రతిష్ఠకు ఇది ఫలము. మీరు స్త్రీలోలురని విని వాస్తవదత్తద్వారా మిమ్మలిని ప్రలోభ పెట్టి ఆకర్షించి వశము చేసుకోవలె నని చండమహాసేనుని సంకల్పము. వేట మొదలయిన వ్యసనాలను విడిచిపెట్టండి. వ్యసనాసక్తు లయిన ప్రభువులు గోతులలో పడిన అడవి ఏనుగులలాగ తేలికగా దొరికిపోతారు."

ఈ వాక్యములు విని వత్సరాజు "వాసవదత్త నాశిష్యురాలు కావలె ననుకొంటే ఆమెను ఇక్కడికే పంపండి" అని చండమహాసేనునికి మరోదూతద్వారా సమాధానము పంపి, చండమహాసేనుని త్వరలో పట్టితెస్తా" నని కోపముతో మంత్రులతో అన్నాడు.

చండమహాసేనుని ప్రభావము

అప్పుడు రూపగంధరాయణుడు ఇలా చెప్పినాడు. "దేవా, ఇది అసాధ్యము. సైగా అనుచితము. ఆయన మహాప్రభావ సంపన్నుడు. ఆయన చరిత్ర వినండి. ఉజ్జయినిలో మహేశ్వరుడు మహాకాళస్వామి అనే పేరుతో వెలసినాడు. పూర్వము మహేంద్రవర్మ అనేరాజు అక్కడ పరిపాలనచేస్తూ ఉండేవాడు. అతని పుత్రుడు జయసేనుడు. అతని కుమారుడు మహాసేనుడు. తనకు తగిన ఖడ్గము, కాంత కావలే నని మహాసేనుడు చండికాదేవి ఆలయానికి వెళ్ళి నిరాహారదీక్ష పూని బహుకాలము అమ్మవారిని ఆరాధించి చివరకు తనశరీరము కోసుకొని మాంసము హోమము చేసినాడు. అనుగ్రహము కలిగి అమ్మవారు ప్రత్యక్షమై "పుత్రా, నీభక్తికి పరితుష్టి చెందినాను. ఇదుగో ఖడ్గము. దీని ప్రభావమువల్ల ఎవరూ నిన్ను జయించలేరు. మరొక విషయము. అంగారకాసురుని పుత్రిక అంగారవల్లరి అనే త్రిలోకసుందరి త్వరలోనే నీభార్య అవుతుంది. నీవు చండ (భయంకర) కర్మ చేయడముచేత నీకు చండమహాసేను డనే ఇకనుంచి వస్తుంది." అని సెల విచ్చి అమ్మవారు అంతర్ధాన మయింది. చండమహాసేనుడు సిద్ధసంకల్పుడై చాలా సంతుష్టచిత్తు డయినాడు.

అతనికి అమ్మవారిచ్చినఖడ్గము నడగిరి అనే మదపుటేనుగు మహేంద్రు నికి వజ్రాయుధము ఐరావతమువలె ఉన్నవి. వాటి ప్రభావమువల్ల ఆయన సుఖముగా ఉంటున్నాడు. ఒకనాడు ఆయన మహావిూకి వేటకు వెళ్ళినాడు. ఒకచోట పర్వతాకారముగల అడవిపంది కనబడ్డది. రాజు ఆమహావరాహముమీద బాణాలు ప్రయోగించినాడు. వాటిని లెక్కచెయ్యక వరాహము రథము విరగదన్ని పరుగెత్తిపోయింది. చండ మహాసేనుడు ధనుస్సు మాత్రము పట్టుకొని దానివెంట బడినాడు.

పోయి పోయి వరాహము ఒకానొకగుహలో దూరింది. రాజు కూడా అంగుళీ ప్రవేశించి చాలాదూరము వెళ్ళేసరికి చక్కని నగరము కన బడినది. గ్రామకంఠములోఉన్న దిగుడుబావిదగ్గిర రాజు ఆశ్చర్యముతో కూర్చున్నాడు. వందమంది చెలికత్తెలతో కూడి ఒక కన్యక అక్కడికి వచ్చి అతనిని అనురాగదృష్టులతో చూచి మంద మందముగా సమీపానికివచ్చి "సుందరమూర్తీ, ఎవరయ్యా మీరు? ఇక్కడికి ఎందుకు వచ్చారు." అని అడిగింది. రాజు నిజవృత్తాంతము చెప్పినాడు. ఆమె నేత్రాలనుంచి అశ్రుధారలు కురిసినవి "సుందరీ, ఎవరు నీవు? ఎందుకు రోదనము చేయుచున్నావు?" అని రాజు ప్రశ్నించినాడు. అనురాగ ప్రేరణవల్ల ఆకన్య ఇలా చెప్పింది. "ఇందులోకి మిమ్మలిని ఆకర్షించుకు వచ్చిన వరాహము అంగారకుడనే రాక్షసుడు. ఆయన నాతండ్రి. నన్ను అంగారవతి అంటారు. మహాబలవంతుడైన నాతండ్రి రాజాంతఃపురాలలో నుంచి ఈవందమంది కన్యలను అపహరించుకువచ్చి నాకు చెలికత్తెలుగా ఏర్పాటు చేసినాడు. శాపమువల్ల ఈయన అసురుడయినాడు. ఆయాసమునుచేత ప్రస్తుతము విశ్రాంతి తీసుకుంటూ మిమ్మలిని సంహరించకుండా విడిచిపెట్టినాడు. నిద్రలేచినతర్వాత మీకు అపాయము తలపెట్టి ఉంటాడు. రానున్న ఆపదకు నాకు దుఃఖము వచ్చి కన్నీరు కారుతున్నది."

ఆమాటలకు రాజు అంగారవతితో "నీకు నిజముగా నామీద ప్రేమ ఉంటే, నేను చెప్పినట్లు చెయ్యవలి. ఆయనకు మెళుకువ రాగానే నీవు వెళ్లి ఆయననమక్షములో పెద్దపెట్టున రోదనము చెయ్యి. ఎందుకు వీడుస్తున్నావని అడిగితీరుతాడు. నాయనా, నిన్ను ఎవరైనా సంహరిస్తే నాగతి ఏమవుతుందో అని దుఃఖిస్తున్నానని చెప్పు. అప్పుడు నీకూ నాకూ మేలు కలుగుతుంది" అని బోధించినాడు. ఆమె సమ్మతించి రాజును రహస్యప్రదేశాన దాచిపెట్టి, తండ్రికి మెళుకువ వచ్చే

వరకూ ఎదురుచూచి ఆయన లేవగానే బావురు మని యేడ్చింది. "ఎందుకు తల్లీ, ఏడుస్తావు?" అన్నాడు అంగారకుడు. "నాయనా, నిన్ను ఎవరైనా చంపివేస్తే ఆతర్వాత నాస్థితి ఎలా ఉంటుందో అనే భీతిచేత దుఃఖము వచ్చింది" అన్నది అంగారవతి. ఆయన మందహాసము చేసి "తల్లీ, నన్ను సంహరించగలవాడెవడు? నాది వజ్రకాయము. ఎడమ చేతిలోమాత్రము చిన్న రంధ్ర మున్నది. అయితే ధనుస్సు దానిని కాపాడుతూ ఉంటుంది కదా" అని కుమారిని ఓదార్చినాడు. రాజు చాటునుంచి ఈమాటలు పొంచి విన్నాడు. తర్వాత అంగారకుడు స్నానముచేసి మౌనముతో శివపూజ ప్రారంభించినాడు. రాజు ధనుస్సులో బాణము సంధించి ఆతనియెదుటికి పోయి యుద్ధానికి రమ్మని ఆహ్వానించినాడు. కుడిచేతితో శివపూజ చేస్తూ ఉండడముచేతను మౌనము వహించి ఉండడముచేతను అంగారకుడు ఎడమచెయ్యి ఎత్తి కొంతసేపు ఆగు అన్నట్లు సంజ్ఞ చేసినాడు. మూటిగా ఎడమచేతి రంధ్ర ములోకి రాజు బాణము విడిచినాడు. అంగారకుడు పెద్దకేక వేసి నేల మీద పడి తన్నుకుంటూ, చాలా బాధముగా ఉన్న నన్ను బాణ ముతో కొట్టినవాడు ప్రతిసంవత్సరమూ నాకు తర్పణము చెయ్యకపోతే అతని మంత్రులు ఐదుగురు చనిపోతారు!" అని అరిచి ప్రాణాలు విడిచినాడు.

చండమహాసేనుడు అంగారవతిని వెంటబెట్టుకొని ఉజ్జయిని నగరానికి వెళ్లి మహావైభవముతో వివాహము చేసుకొన్నాడు. కాలక్రమేణ ఆదంపతులకు గోపాలకుడు, పాలకుడు అని ఇద్దరుపుత్రులు పుట్టినారు. రాజు ఇంద్రోత్సవము చేసినాడు. ఇంద్రుడు సంతుష్టుడై కలలో రాజుకు కనబడి "నాప్రసాదముచేత నీకు అద్వితీయసుందరి అయిన కుమారి కలుగుతుంది." అని అనుగ్రహించినాడు. ఆప్రకారముగానే మహా లావణ్యవతి పుట్టింది. ఆసమయములో ఆకాశవాణి ఈమెకు మన్మథుడు

కుమారుడై పుట్టి సకలవిద్యాధరులకు చక్రవర్తి అవుతా'' డని పలికింది. వాసవుని (ఇంద్రుని) అనుగ్రహమువల్ల జన్మించడముచేత అబిడ్డకు తండ్రి వాసవదత్త అని పేరు పెట్టినాడు. ఇప్పుడామెకు పెళ్ళియీడు వచ్చింది. చండమహాసేనుని చరిత్ర ఇటువంటిది. ఆయన దుర్గమప్రదేశములో ఉన్నాడు. జయించడము అసాధ్యము. నిజపుత్రికను మీకు ఈయదలచి ఉన్నాడు. సగౌరవముగా తనపక్షమును వృద్ధిచేసుకోగోరినాడు. మీరు వాసవదత్తను పెళ్లి ఆడడమే శుభదాయకము.

యౌగంధరాయణుడు చెప్పిన వాక్యాలకు వత్సరాజు మనస్సు వాసవదత్తమీదికి వెళ్ళింది.

తరంగము : ౧౨

యంత్రగజము

వత్సరాజు పంపినదూత వెళ్లి నందేశము చండమహాసేనునికి విన్న వించినాడు. ఆయన ఆలోచించి "వత్సరాజు చాలాఅభిమాని. మన దగ్గరకు రాడు. మనబిడ్డను అతని దగ్గరికి పంపడానికి వీలు లేదు; పంపితే మనప్రతిష్ఠతగ్గుతుంది. ఉపాయముచేత అతనిని పట్టి తీసుకురావలెను" అని మంత్రులతో చెప్పి, పెద్ద మరయేనుగును (యంత్రగజేంద్రమును) చేయించి, వింధ్యారణ్యములో ఉంచి దాని కడుపులో భటులను దాగి ఉండ మని ఆజ్ఞాపించినాడు.

గూఢచారులు వెళ్ళి వత్సరాజుతో "దేవా, వింధ్యాటవిలో గొప్ప యేనుగు తిరుగుచున్నది. అటువంటిది ప్రపంచములో మరొకటి లేదు. వింధ్యపర్వతమే నడుస్తున్నట్లు కనబడ్డది." అని నివేదించారు. రాజు చాలా సంతోషించి వాళ్ళకు గొప్పబహుమాన మిచ్చి పంపి "దీన్ని బంధించి తెస్తినా ఇది నడగిరికి దీటు అవుతుంది. అప్పుడు

చండమహాసేనుడు వశుడై వాసవదత్తను నాకు సమర్పిస్తాడు.” అని భావించి ఆరాత్రి ఎలాగో గడిపినాడు. మంత్రులమాట చెవిపెట్టక ఆ చారులనే ముందు ఉంచుకొని, జ్యోతిష్కులు మొదట బంధనము, తర్వాత పట్టాభిషేకము ప్రయాణఫలాలని చెప్పినా లక్ష్యము చెయ్యక వత్సేశ్వరుడు వింధ్యాటవికి వెళ్ళినాడు. అడవియేనుగు బెదరకుండా ఉండడానికి తనసేనను ఒకచోట నిలిపి కొద్దిమంది చారులతో దానిని వెదకడానికి ప్రయాణమయినాడు. సాయంకాలానికి ఏనుగు గుర్తులు దొరకినవి. దూరముగాఉన్న యేనుగును చారులు చూచి ప్రభువుకు చెప్పినారు. అతడు ఘోషవతిని తీసుకొని ఒంటిగా బయలుదేరి వీణ వాయిస్తూ మనోహరగానము చేస్తూ నెమ్మదిగా దాన్ని సమీపించినాడు. తనమనస్సు పాటలో లీనమై ఉండడముచేతను, నందీచీకటి వల్లను వత్సేశ్వరుడు మాయాగజమును నిజమైన ఏనుగుగా భ్రమపడ్డాడు. ఏనుగు సంగీతానికి సమాకృష్టమై చెవులు నిక్కబెట్టుకొని సమీపానికి వచ్చినట్లు వచ్చి అవతలికి వెళుతూ, మళ్ళీ దగ్గిరికి వస్తూ, రాజును ఇలా కొంతదూరము తీసుకుపోయింది. అప్పుడు యంత్రగజము కడుపులోనుంచి ఆయుధపాణులైన భటులు దూకి వత్సరాజును చుట్టుముట్టినారు. అతడు బాకు దూసి ఎదటివారితో యుద్ధము చేస్తూ ఉండగా వెనుకనుంచి కొందరుభటులు అతనిని పట్టుకొని చేతులు గట్టివేసి, సంజ్ఞ చేయగా వచ్చిన తక్కినసేనతో కలిసి చండమహాసేనుని సన్నిధికి తీసుకొని వెళ్ళినారు. ఆయన నగరము వెలుపలికి ఎదురు వచ్చి వత్సరాజును చాలా ఆదరించి ఉజ్జయినిలో ప్రవేశించినాడు. ప్రజలు వత్సేశ్వరుని చూచి తమప్రభువు ఆయనను సంహరిస్తాడేమో అని భయపడి, ఆయనసన్నిధికి పోయి “దేవా, వత్సరాజుకు అపాయము కలిగితే మేము జీవించము” అని విన్నవించుకొన్నారు. అందుకు ప్రభువు “వత్సేశ్వరుడు హంతవ్యుడు కాడు. మాకు మిత్రకోటిలోవాడు” అని వారి ఆందోళన

పోగొట్టినాడు. తర్వాత వాసవదత్తను రప్పించి, వత్సరాజుకు అప్పగించి, "రాజన్, ఈమెకు గాంధర్వవిద్య నేర్పండి. మీకు కల్యాణ మగుగాక! మనస్సులో చింతపడవద్దు" అని సాదరముగా చెప్పినాడు.

వత్సరాజు వాసవదత్తకు గాంధర్వవిద్య నేర్పుట

వాసవదత్తను చూచేటప్పటికి వత్సరాజు మనస్సు స్నిగ్ధమయి చండమహాసేనునిమీది కోపము యావత్తూ ఎగిరిపోయింది. అతనిని చూడగానే ఆమెకు ప్రేమోదయ మయి మనస్సు వివశమయినది. వత్సరాజు ఆమెకు విద్యనేర్పుతూ ఆమెనే సదా ధ్యానిస్తూ అక్కడి సంగీతశాలలోనే నివాసము చేస్తున్నాడు. అతనితొడమీద వీణ, కంఠములో గీతస్రుతి, సముఖములో వాసవదత్త ఉండడముచేత వినోదముగా కాలము గడుస్తున్నది. అతడు ఒకవిధమైన బంధనములో ఉన్నప్పటికీ ఎడబాయని లక్ష్మీదేవివలె వాసవదత్త నిరంతర పరిచర్యలు చేసి ఉల్లాసము కలిగిస్తున్నది.

యౌగంధరాయణుడు ఉజ్జయినికి వెళ్ళుట

వత్సరాజువెంట వేటకు వచ్చినసేన కౌశాంబికి తిరిగి వెళ్ళగానే రాజును శత్రువు బంధించినాడని రాజ్యమంతటా ఆందోళన పుట్టింది. వత్సరాజు ప్రజాదరము కలవాడు కావడముచేత తక్షణమే ఉజ్జయిని మీదికి దండయాత్ర చెయ్యవలెనని కొందరు పట్టు పట్టినారు. రుమణ్వంతుడు వారితో "యుద్ధము యుక్తముకాదు. దండయాత్ర చేస్తే వత్సరాజుకు చాలా అపాయము. చండమహాసేనుడు సామాన్యుడుకాడు. ఆయనను జయించడము చాలా కష్టము. కాబట్టి నేర్పుతో మన కార్యము నెరవేర్చుకోవలె" అని హితము చెప్పినాడు. తర్వాత యౌగంధరాయణుడు రుమణ్వాదులతో "మీరంతా ఇక్కడే నిరంత

రము జాగరూకులై రాజ్యమును రక్షిస్తూ ఉండండి. అవసరము వస్తే శక్తిసామర్థ్యాలు చూపవచ్చును. వసంతకుని వెంటబెట్టుకొని నేనువెళ్ళి ప్రభువును విడిపించుకొని వస్తాను." అనిచెప్పి ఉజ్జయినికి వసంతక సమేతముగా బయలుదేరినాడు. వింధ్యప్రాంతములో వత్సరాజుకు మిత్రుడు పులిందకుడు అనే ప్రభువు గృహానికి పోయి, వత్సరాజు ఆ మార్గాన మరలి వచ్చేటప్పుడు సంరక్షణార్థము సేనతో సిద్ధముగా ఉండవలసినదని చెప్పి ఉజ్జయినిచేరి మహాకాళ శ్మశానముదగ్గర ఆగినాడు.

బ్రహ్మరాక్షసుని యౌగంధరాయణునకు మిత్ర మగుట

అక్కడ భేతాళుడు అనేకమంది గుమిగూడి ఉన్నారు. యౌగంధరాయణుని చూడగానే యోగేశ్వరుడు అనే బ్రహ్మరాక్షసుడు సంప్రీతుడై, స్వయముగావచ్చి స్నేహము చేసుకొన్నాడు. అతడు చెప్పిన మంత్రమువల్ల యౌగంధరాయణునికీ, వసంతకునికీ వికారరూపాలు వచ్చినవి. మంత్రికి బట్టకేల, గూను, ముసలితనమూ, వసంతకునికి పెద్దబొజ్జ, నోటినిండాపళ్ళు, పైకి ఉబికిన నరాలూ, ఏర్పడ్డవి.

యౌగంధరాయణ వత్సరాజుల సమాగమము

యౌగంధరాయణుడు వసంతకుని ముందుగా రాజనగరి సింహద్వారమువద్దకు పంపి, తాను వికారరూపముతో పట్నము ప్రవేశించినాడు. బాలకులు గుంపులుగా చేరి తనను వెంబడిస్తూ అందరూ వినోదిస్తూ ఉండగా అతడు రాజప్రాసాదమువద్దకు పోయి అక్కడివారికి వేడుక చూపడము ప్రారంభించినాడు. ఇతని విషయము వాసవదత్తకు తెలిసి ఆమె చేటికను ఇతనిని సంగీతశాలలోకి తీసుకు రమ్మన్నది. వదుచు వాళ్ళకు పరిహాస మంటే ఇష్టము. యౌగంధరాయణుడు వత్సరాజును చూచి భావములు విడిచి సజ్ఞచేసినాడు. వత్సరాజు ఇతన్ని తన

మంత్రిగా గ్రహించినాడు. మంత్రి యోగవిద్యచేత ఇతరులకు అదృశ్యుడై వత్సరాజుకు మాత్రము కనిపిస్తూన్నాడు. యువతులు ఆశ్చర్యపడి "ఉన్నట్టే ఉండి ఈవెర్రివాడు ఎక్కడికి పోయినాడో". అనడముచేత తనమంత్రికి యోగమహిమ ఉన్నదని రాజు తెలుసుకొని, వాసవదత్తతో "అమ్మాయీ, సరస్వతీ పూజకు పూజాద్రవ్యాలు తీసుకురావాలి" అన్నాడు. ఆమె చెలికత్తెలతో బయలుదేరింది.

అప్పుడు యౌగంధరాయణుడు రాజుకు బంధనాలు భేదించే యోగాలున్ను, వాసవదత్తను వశీకరించే వస్తువులును వీణాతంత్రులలో దాచియిచ్చి "దేవా, వసంతకుడు ఇక్కడికి వికారరూపముతో వచ్చి ద్వారదేశములో ఉన్నాడు. అతన్ని మన సన్నిధానములో వినోద బ్రాహ్మణునిగా ఉండనివ్వండి. వాసవదత్తకు మీయందు నమ్మకము కలిగిన తర్వాత నేను చెప్పినప్రకారము చేతురుగాని. అందాకా శాంతముగా ఉండండి" అని బోధించి వెళ్ళిపోయినాడు.

ఇంతలో వాసవదత్త పూజాద్రవ్యాలు తీసుకువచ్చింది. ఆమెను చూచి వత్సరాజు "కోటవాకిట బ్రాహ్మణుడున్నాడట. సరస్వతీ పూజలో దక్షిణ ఇవ్వడానికి అతన్ని పిలుపించు" అన్నాడు. నరే అని ఆమె వసంతకుని రప్పించింది. వత్సరాజును చూడగానే వసంతకుడు దుఃఖము పట్టలేక రోదనము చేసినాడు. రహస్యము బయట పడుతుందేమో అని రాజు "బ్రాహ్మణా, ఏడవకు వైద్యము చేయించి నీవ్యాధిని వికారరూపాన్ని పోగొట్టిస్తాను. నావద్దనే ఉండు"అని అభయమిచ్చినాడు. "చిత్తము, మహాప్రసాదము" అని వసంతకుడు అన్నాడు. రాజు అతన్ని చూచి మందహాసము చేసినాడు. వసంతకుడు గ్రహించి నోరు బాగా తెరిచి వికారచేష్టలు చేసినాడు. వినోదము కలిగి వాసదత్త "బ్రాహ్మణోత్తమా, నీకు ఏయేకళలలో ప్రవేశం ఉన్నది?" అని అడిగింది. "దేవీ, నేను కథలు బాగా చెప్పగలను" అన్నాడు.

"అయితే ఏదైనా కథ చెప్పు" అన్నది రాజకుమారి. వసంతకుడు ఇలా చెప్పడము ప్రారంభించినాడు.

లోహజంఘుని కథ

శ్రీకృష్ణుని జన్మస్థాన మయినమధురాగరములో రూపిణిక అనే ప్రసిద్ధవేశ్య ఉండేది. దానితల్లి మృంకరదంష్ట్ర. వేశ్యానక్తు లయిన పడుచు వాళ్ళకు ఆవేశ్యమాత విషప్రాయము. రూపిణిక ఒకనాడు దేవాలయానికి వంతుప్రకారము సేవచెయ్యడానికి వెళ్ళి, దూరముగా నిలుచున్న ఒకపురుషుని చూచి, చేటికతో "నీవు వెళ్ళి ఆయనను ఈరాత్రి మనయింటికి రమ్మని చెప్పవే" అని నెమ్మదిగా అన్నది. చేటి ఆప్రకారమే చేసింది. ఆయువకుడు దానితో "నేను బ్రాహ్మణుడను. నావద్ద ధనము లేదు. రిక్తహస్తాలతో వారాంగన గృహానికి నేను రావడ మెందుకు?" అని ఆలోచనాపూర్వకముగా అన్నాడు. "మాయజమానురాలికి మీ విషయములో ధనాపేక్ష లేదు." అన్నది చేటి. దానికి లోహజంఘుడు సరే అన్నాడు. చేటి వెళ్ళి ఈ సంగతి చెప్పింది. రూపిణిక ఉత్కంఠతో అతనిరాకకు ఎదురుచూస్తూ ఉన్నది. కొంత సేపటికి లోహజంఘుడు వచ్చినాడు. ఎదురుపోయి రూపిణిక అతనిని ఆదరించి కంఠాశ్లేషము చేసి శయ్యాగృహానికి తీసుకుపోయింది. లోహజంఘుని సౌందర్యాలకు లోబడిపోయి రూపిణిక ఆనాటినుంచీ పరపురుషులను చూడడముకూడా మానివేసి అతనిపొందుకన్న ఈ జన్మకు వేరేఫలము లేదని నిశ్చయించుకొన్నది. లోహజంఘుడు ఐహికసుఖాలలో తేలియాడుతూ రూపిణిక మందిరములోనే నివాసము చేస్తున్నాడు. వేశ్యలకు విద్య నేర్పిన మకరదంష్ట్ర చాలా విచారపడి కూతురిని చూచి రహస్యముగా "తల్లీ, ఈ దరిద్రుణ్ణి సేవిస్తున్నావు! జనులు శవాన్ని ముట్టుకోరు. గణికలు ధనహీనుణ్ణి కోరరు. వేశ్యకు ప్రేమ

యేమిటి ! అనురాగ మున్నగణిక సంధ్యానమయమువలె అట్టేసేపు వెలగదు. వేశ్య నటివలె వినునిమిాద నటించాలి. ఈ నిర్భాగ్యుణ్ణి విడిచి పెట్టకపోతే చెడిపోతావు !'' అని బోధ చేసింది.

కోపము వచ్చి రూపిణిక ''అమ్మా, ఏమిటి ఈమాటలు ! ఆయన నాకు ప్రాణంకంటెకూడా ప్రియుడు ! ఇప్పటికే మనకు చాలా ధన మున్నది. ఇంకా ధనమెందుకే ? మళ్ళీ నాకు నీతిబోధ చెయ్యకు'' అని గట్టిగా చెప్పింది. మకరదంష్ట్ర కోపము లోలోపలనే అణుచుకొని లోహజంఘుని వెళ్ళగొట్టడానికి పన్నాగము పన్నుతున్నది. ఒకనాడు ధనము లేని రాజపుత్రుడు ఆయుధపాణు లయినభటులతో ఆతోవన వస్తున్నాడు. వేశ్యమాత అతనిపద్దకు పోయి ''ఆర్యా, ఒకకామికుడు, గర్భదరిద్రుడు మాయిల్లు ఆక్రమించుకొని కదలడము లేదు. మీరు దయచేసి వాణ్ణి బయటికి తరిమి మా అమ్మాయిని స్వీకరించండి'' అని వేడుకొన్నది. రాజపుత్రుడు సమ్మతించి యింట్లో ప్రవేశించినాడు. ఆసమయాన రూపిణిక దేవాలయానికి వెళ్ళింది. లోహజంఘుడు ఎక్కడికో పోయినరిగా ఆవేళకు ఇంటికి వచ్చినాడు. రాజభటులు అతనిని తన్ని కొట్టి మురికిగుంటలోకి నెట్టివేసినారు. లోహజంఘుడు తప్పించుకొని పారిపోయినాడు. రూపిణిక ఇంటికి వచ్చి యావద్వృత్తాంతము విని చాలాయేడ్చింది. దానిరోదనము చూచి రాజపుత్రుడు ఇల్లు విడిచి వెళ్ళిపోయినాడు.

లోహజంఘుడు లంక చేరుట

వేశ్యమాతవల్ల చాలా దీనస్థితికివచ్చి లోహజంఘుడు తీర్థయాత్రలు చేతా మనుకొని బయలుదేరినాడు. రూపిణికతో వియోగము చాలా బాధాకరముగా ఉన్నది. మకరదంష్ట్ర చేయించినపనికి మండిపోతున్నాడు. దీనికి తగినట్లు ఎండకూడా మండిపోతున్నది. నీడకోసము అతడుచూచి

నాడు. ఎక్కడా చెట్టు కనబడలేదు. చివరకు ఏనుగుశవము కనిపించింది. అది ఉత్తడొల్ల. లోహజంఘుడు అందులో ప్రవేశించి నిద్రపోయినాడు. ఇంతలో మబ్బులుకమ్మి కుండపోతగా వాన కురిసింది. వాగు ఒకటి వచ్చింది. రంధ్రము మూసుకుపోయిన డొల్ల ప్రవాహములో కొట్టుకు పోయి గంగానదిలో చేరింది. ఆకళేబరము గంగాప్రవాహముపెంట సముద్రములో పడ్డది. గరుడవంశపక్షి ఒకటి ఆడొల్లను ఎగతన్నుకుపోయి సముద్రపు అవతలి తీరాన వాలి చర్మము ముక్కుతో చీల్చి లోపల మనిషి ఉండడము చూచి బెదిరి పారిపోయింది. పక్షి చేసిన రంధ్ర మార్గాన లోహజంఘుడు ఇవతలికివచ్చి తాను సముద్రతీరాన ఉన్నట్టు గ్రహించి స్వప్న మనుకొన్నాడు.

భయంకరాకారులయిన ఇద్దరు రాక్షసులను చూచి లోహజంఘుడు భయపడ్డాడు. వాళ్ళు మనిషిని చూచి భీతి చెందినారు. మానవుడైన రాముడు వెనక లంకను జయించడము జ్ఞప్తికివచ్చి, ఈ మానవుడు సముద్రము దాటి వచ్చిన వాడనీ, అసాధ్యుడనీ భావించి, అందులో ఒకడు అక్కడే ఉండి, రెండవవాడు విభీషణ ప్రభువుకు ఈ విషయము విన్నవించడానికి వెళ్ళినాడు.

విభీషణుడు లోహజంఘుని సత్కరించుట

రాములవారి ప్రభావము ఎరిగిన విభీషణ మహారాజు భటునితో "నీవు పోయి ఆమానవుని మనయింటికి దయచెయ్యమని నామాటగా విన్నవించు" అని చెప్పి పంపినాడు. లోహజంఘునికి భటుడు ప్రభు వాక్యములు విన్నవించగా అతడు సంతోషించి భటులతో లంకా పట్ట ణము ప్రవేశించి అక్కడి సువర్ణసౌధాలుచూచి ఆశ్చర్యపడుతూ విభీషణ మహారాజు మందిరానికి వెళ్ళి ప్రభువును ఆశీర్వదించినాడు. విభీషణుడు అతిథి సత్కారాలుచేసి "బ్రహ్మణోత్తమా, మాదేశానికి ఎలా రాగలిగి నావు?" అని అడిగినాడు. లోహజంఘుడు ఇలా చెప్పినాడు:

"మాది మధురాపురము. నన్ను లోహజంఘుడు అంటారు. పేదరికమువల్ల బాధలు పడి, ఆలయానికివెళ్లి నిరాహారదీక్షపూని శ్రీ మహావిష్ణువును ఆరాధించాను. స్వప్నములో విష్ణువు సాక్షాత్కరించి, "నీవు విభీషణమహారాజువద్దకు పో అతడు నాభక్తుడు. నీకు నమస్తనంపదలూ ఇస్తాడు" అని అనుగ్రహించినాడు. "నే నెక్కడ! లంకాపుర మెక్కడ! విభీషణ మహారాజు ఎక్కడ! నాకు సాధ్యమా!" అన్నాను. అందుకు శ్రీ మహావిష్ణువు, "భయము లేదు. వెళ్లు. ఇప్పుడే అతనిని చూడగలవు" అని అభయ మిచ్చినాడు. నాకు మెలుకువ వచ్చి చూచే సరికి ఈసముద్రతీరాన ఉన్నాను. ఇంతకంటె నా కేమీ తెలియదు."

ఈమాటలు విభీషణుడు నమ్మినాడు. లంకాపట్టణము మానవులకు అగమ్యము. దేవతామహిమచేతనే బ్రాహ్మణుడు అక్కడికి రాగలిగినాడని యెంచి ప్రభువు "బ్రాహ్మణోత్తమా, నీకు కావలసినద్రవ్యము తప్పకుండా ఇస్తాను. ఇక్కడనే సుఖంగా ఉండు" అని చెప్పినాడు. అభూనురునికి నరమాంసభోజను లయినరాక్షసులను తోడు పంపడము మనవ్యవహారంచక, నమీపములో ఉన్న స్వర్ణమూల పర్వతముమీద గరుడపక్షివంశములో పుట్టిన పక్షిపిల్లను తెప్పించి విభీషణుడు మచ్చిక చేయించడము ప్రారంభించినాడు. కాలక్రమేణ లోహజంఘుడు ఆపక్షి మీద ఎక్కి మధురాపురికి తిరిగి వెళ్లవచ్చునని అతని ఊహ. ఒకనాడు లోహజంఘుడు విభీషణునితో "రాజా, మీలంక కొయ్యబారిపోవడానికి కారణ మేమిటి!" అని అన్నాడు.

లంకా నిర్మాణము

విభీషణుడు ఇలాచెప్పినాడు. "పూర్వకాలములో వినత, నాగమాత కద్రువకు దాసిగా ఉన్నది. ఆమెకుమారుడు గరుత్మంతుడు తల్లి దాస్యమును మాన్పడానికి దేవలోకమునుంచి అమృతము తీసుకురావలసి

వచ్చింది. ఆ దుష్కరకార్యము చెయ్యడానికి అతనికి తగిన బలము చేకూర్చే ఆహారముకోసము తండ్రి కశ్యపప్రజాపతివద్దకు వెళ్లి అడిగినాడు. "శాపమువల్ల సముద్రములో రెండు గజకచ్ఛపములు (ఏనుగు, తాబేలు) పోరాడుతున్నవి. వెళ్ళి వాటిని భక్షించు" అని ప్రజాపతి సూచించినాడు. గరుడుడు వాటిని ఎగదన్నుకుపోయి కల్పవృక్షశాఖ మీద వాలినాడు. భారానికి కొమ్మ విరిగింది. కింద తపస్సుచేస్తున్న వాలఖిల్యమునులు నలిగిపోతారనీ, లోకులమీద పడితే అణగారిపోతారనీ భయపడి గరుడుడు తండ్రి ఆజ్ఞాప్రకారము ఆశాఖను ముక్కున కరుచుకునివచ్చి ఈ నిర్జనప్రదేశాన పడవేసినాడు. తర్వాత కొంతకాలానికి ఆశాఖమీద ఈలంకావట్టణము కట్టినారు. అందుచేత ఇది కొయ్యబారినట్లు ఉంటుంది."

లోహజంఘుడు విహగారూఢుడై మధురాపురము చేరుట

తర్వాత కొన్నాళ్ళకు లోహజంఘుడు మధురాపురము వెళ్ళితానన్నాడు. విభీషణుడు అతనికి అమూల్యరత్నాలనిచ్చి, మధురలో శ్రీ హరిదేవాలయములో సమర్పించమని బంగారుగద శంఖచక్రాలూ ఇచ్చినాడు. మహారాజు ఇచ్చిన వస్త్రాన్ని పుచ్చుకొని ఆబ్రాహ్మణుడు పక్షిమీద ఎక్కి, ఆకాశమార్గాన సముద్రాదులు దాటి, మధుర చేరినాడు. ఆకాశమునుంచి నగరమువెలుపల పాడుపడిన మందిరములో దిగి, రత్నాదులు దాచిపెట్టి, పక్షిని కట్టివేసి అంగడివీధికి పోయి ఒక రత్నము విక్రయించి తనకు కావలసిన వస్త్రాన్ని తెచ్చుకొన్నాడు. అక్కడే భోజనము చేసి పక్షికి మేత పెట్టి, మంచివస్త్రములు ధరించి సుగంధము రాచుకొని పుష్పమాలిక వేసుకొని, అలంకారాలుకూడా పెట్టుకొని చీకటి పడినతర్వాత శంఖచక్రగదలు ధరించి పక్షి నెక్కి రూపిణిక మేడపైన ఆగి, గంభీరస్వరముతో పిలిచినాడు. రూపిణిక ఇవతలికి వచ్చి

శంఖచక్రాదులతో దేదీప్యమానముగా ఉన్న అతనిని చూచి సాక్షాత్ విష్ణువే అనుకొని సాష్టాంగదండప్రణామాలు చేసింది.

"నేను శ్రీహరిని. నీకోసము వచ్చినాను" అని అతడు చెప్పేసరికి "స్వామీ, లోపలికి దయచెయ్యండి" అని వేడుకొన్నది. లోహజంఘుడు దిగి, పక్షిని ఒకమూల నిలిపి, వారాంగనతో కొంతసేపు శయ్యాగృహములో గడిపి, వచ్చి, పక్షి నెక్కి ఆకాశమార్గాన వెళ్ళిపోయినాడు. "నేను దేవతను. శ్రీహరి నాభర్త. ఇక నేను మానవులతో మాటాడను" అని రూపిణిక అమర్నాడు ఉదయమునుంచీ మౌనవ్రతము పట్టింది. "ఏమిటే తల్లీ! ఇలా ఉన్నావు!" అని మకరదంష్ట్ర బహువిధాల మొత్తుకోగా అప్పటికి రూపిణిక తనకూ తల్లికీ మధ్య తెర వేసి గతరాత్రి జరిగిన వృత్తాంతము చెప్పింది. తల్లి నమ్మక ఆరాత్రి ఒక చోట రహస్యముగా దాగి, పక్షివాహనారూఢుడై వచ్చిన లోహజంఘుని చూచింది.

వేశ్యామాతకు తగిన శిక్ష

ప్రాతఃకాలము మకరదంష్ట్ర కూతురితో తెరచాటునుంచి, "తల్లీ, శ్రీహరికి నీమీద అనుగ్రహము కలిగింది. నీవు దేవత వయినావు. నేను నీతల్లినగదా, పెద్దదాన నయినాను. బొందితో స్వర్గానికి పోదామని నాకోరిక. దేవునితో ఈవిషయము మనవిచేసి నన్ను ఆయన అనుగ్రహించేలాగున చూడు తల్లీ" అని బ్రతిమాలుకొన్నది.

రూపిణిక సరే అని మర్నాడురాత్రి వచ్చిన మాయా విష్ణువుతో ఈసంగతి విన్నవించింది. అందు కతడు ఇలా చెప్పినాడు. "నీతల్లి పాపాత్మురాలు. బహిరంగముగా స్వర్గానికి తీసుకు వెళ్ళడానికి వీలు లేదు. ఏకాదశినాడు ఉదయము స్వర్గద్వారము తెరుస్తారు. ఆ సమయములో ప్రమథులు, కాంభవులు ప్రవ్రవధమనులో ప్రవేశిస్తారు. నీతల్లికి

వారివేషము వేసి వారినడుమ ఉంచితే ప్రవేశము దొరుకుతుంది. మీఅన్న తలమీద పంచశిఖలు పెట్టించాలి. కంఠాన ఎముకలదండ వెయ్యాలి. ఒకపక్కన కాటుక, రెండోపక్కన సింధూరమూ పూయవలె. దిగంబర కావలె. ఈవిధముగా గణాచారులవేషము వేసుకొంటే సీతల్లిని శ్రమ లేకుండా స్వర్గానికి తీసుకువెళుతాను."

మర్నాడు మకరదంష్ట్ర గణాచారివేషము వేసుకొని, ఎప్పుడు స్వర్గానికి వెళుదునా అని కనిపెట్టుకుని ఉన్నది. రాత్రి లోహజంఘుడు యథాప్రకారముగా గరుడపక్షిమీద వచ్చేనరికి రూపిణిక తల్లిని అతనికి అప్పగించింది. వేశ్యమాతను తీసుకొని పక్షిమీద ఎక్కించి ఆ మాయావిష్ణువు ఆకాశమార్గాన తీసుకుపోయి దేవాలయ సమీపాన ఉన్నత శిలాస్తంభముమీద నిలిపి, "నేను త్వరలోనే వస్తాను. భూలోకములోకి వెళ్ళి కొందరు భక్తులకు దర్శనము ఇచ్చి వస్తాను." అని చెప్పి వెళ్ళుతూ, అక్కడ రాత్రి జాగరణము చేయడానికి వచ్చిన జనముతో "వెళ్ళండి. వెళ్ళండి. మీమీద మహామారి పడబోతున్నది. అందరినీ సంహారము చేస్తుంది. భద్రము! శ్రీహరిని ఆశ్రయించండి" అన్నాడు. ప్రజలు భయపడి భగవత్సాన్నిధ్యములో స్వస్త్యయనము చేస్తూఉన్నారు. లోహజంఘుడు దేవునివేషము తీసివేసి ఎవరికీ తెలియకుండా వచ్చి జనములో చేరి ఏమి జరుగుతుందో అని చూస్తూ కూర్చున్నాడు. వేశ్యమాతకు క్రమముగా అదుర్దా హెచ్చింది. దేవుడు ఇంకా రాలేదే. నన్ను స్వర్గానికి తీసుకపోలేదే అని మకరదంష్ట్ర అనుకొని అనుకొని, చివరకు నేను పడుతున్నా, పడుతున్నా అని బిగ్గరగా అరిచింది. అమ్మా! పడకు! పడకు! అని జనులు భయముతో మొరపెట్టినారు. పడుతున్నా అంటే వచ్చి ఊరిమీదపడి మహామారి అందరిని హరిస్తుందనే వారిభీతి. చివరకు తెల్లవారింది. సంగతి తెలిసి ప్రభువుకూడా అక్కడికే వెళ్ళినాడు. శిలాస్తంభముమీద వికృతాకారముతోనూ,

దిగంబరముగానూ ఉన్న వేశ్యామాతను గుర్తుపట్టి అంతా నవ్వినారు. రూపిణిక ఈసంగతి యావత్తూ విని అక్కడికి వెళ్ళి ఆశ్చర్యపడి జనుల సహాయముతో తల్లిని కిందికి దింపించింది.

మకరదంష్ట్రను కిందికి దింపినతర్వాత జనము చుట్టూ మూగి ఇదంతా ఏమిటి అని అడిగితే ఆమునలిది జరిగిన దంతా చెప్పింది. సిద్ధులు మొదలయినవారి విచిత్రచర్యగా భావించి అనేకకాముకులను వంచించిన ఈముసలిదానిని మోసగించిన బుద్ధిమంతు డెవరో కనబడితే అతనిని సత్కరిస్తాము అన్నారు అక్కడి వారు. లోహజంఘుడు బయటికి వచ్చి మొదటినుంచి అప్పటివరకూ జరిగిన విశేషాలన్నీ చెప్పి, విభీషణమహారాజు ఇచ్చిన శంఖచక్రగదలు శ్రీహరికి సమర్పించినాడు. ప్రజలు సంతోషించి అతనిని సమ్మానించినారు. లోహజంఘుడు తన ప్రేయసితో సుఖముగా నివాసము ప్రారంభించినాడు.

మారువేషములో ఉన్న వసంతకుడు చెప్పిన యీకథ విని వాసవదత్త చాలా సంతోషించింది.

తరంగము : 13

వాసవదత్తాహరణము

వాసవదత్తకు క్రమేణ తండ్రివిషయములో ప్రేముఖ్యమూ వత్సరాజు మీద అనురాగమూ కలిగినవి. యౌగంధరాయణుడు వచ్చి అదృశ్యకరణిప్రభావమువల్ల అన్యులకు కనపడకుండా వసంతకుని సమక్షములో వత్సరాజుతో ఇలా చెప్పినాడు:

"రాజా, మహాసేనుడు మాయచేసి మిమ్మలిని బంధించినాడు. వాసవదత్తను మీకిచ్చినతర్వాత మర్యాద చేసి పంపవలె ననుకొంటున్నాడు. మనమే ఈమెను హరించుకొని పోదాము. ఇలా చేస్తే ఈపొగరుబోతుకు తగిన ప్రతిక్రియ అవుతుంది. మనకు పౌరుషము లేదనే అవ్వ

తిష్ఠ పోతుంది. మహాసేనుడు తనకుమార్తెకు భద్రవతి అనే యేనుగు నిచ్చినాడు. దానితో సమానముగా వెళ్ళగల యేనుగు లేదు. ఒక్క నడగిరి ఉన్నా భద్రవతిని చూస్తే పోరాడదు. నడగిరి మావటివాడు ఆషాఢకుడు. బాగా ధనమిచ్చి వాణ్ణి వశపరుచుకొన్నాము. మీరు ఆయుధాలు పట్టుకొని వాసవదత్తతో భద్రవతిమీద ఎక్కి రాత్రివేళ రహస్యముగా ఇక్కడనుంచి బయలుదేరాలి. ఏనుగుల సంగతులు బాగా తెలిసిన మహామాత్రుని తప్పకాగిస్తాము. మార్గరక్షణము చెయ్యడానికి మిత్రుడు పులిందకుని వద్దకు నేను ముందుగా వెళ్లి ఉంటాను." ఈప్రకారము చెప్పి యౌగంధరాయణుడు వెళ్ళినాడు.

వత్సరాజు కర్తవ్యము మనస్సులో పెట్టుకొన్నాడు. ఇంతలో వాసవదత్త అతనివద్దకు వచ్చింది. అమెకు ఏకాంతముగా కథలు చెప్పి కాలక్షేపము చేస్తూ, రాజు కథాసందర్భములో మధ్యమధ్య పలాయనము సంగతి సూచించినాడు. అనురాగవివశురాలయిన వాసవదత్త అంగీకరించింది. ఆషాఢకు డనే మావటివానిని పిలిచి ప్రయాణ సన్నాహము చెయ్యమని ఆజ్ఞాపించింది. దేవీపూజ చేసిన తీర్థమనే నెపముతో మత్తువస్తువులు కలిపిన మద్యము మావటివాళ్ళకు అందరికీ కుత్తుక బంటిగా తాగించింది. రాత్రివేళ మేఘగర్జనము వినబడ్డది. వెంటనే మావటివాడు ఏనుగును సిద్ధము చేసుకొని వచ్చినాడు. సన్నాహము చేసేటప్పుడు ఏనుగు ఘీంకారము చేసింది. గజభాష తెలిసిన మహామాత్రుడు ఆశబ్దమువిని "ఈయేనుగు అరవైమూడు ఆమడలు పోతా నంటున్నది" అని తడబడుతూ అన్నాడు. మత్తులో ఉన్న తక్కినవాళ్లు వాని మాటలు గమనించలేదు. వాడుకూడా ఆలోచనాశక్తి కోలు పోయి ఊరుకున్నాడు.

అలికిడికాకుండా వత్సరాజు ఘోషవతిని తీసుకొని, యౌగంధరాయణుడు పూర్వమిచ్చిన యోగాలవల్ల బంధనాలుచేదించి, వాసవదత్త వ్యయ

ముగా ఇచ్చిన ఖడ్గము పట్టుకొని వసంతకునితోసహా ఏనుగునెక్కినాడు. రహస్యము కాపాడే కాంచనమాల అనే చెలికత్తెతో వాసవదత్తకూడా ఆయేనుగునే ఎక్కింది. చివరకు మావటివాడు ఎక్కినాడు. భద్రవతి ప్రాకారము పగులగొట్టి, దారి చేసుకొని, బయట పడ్డది. అక్కడ అడ్డము వచ్చిన వీరభావు, తాళభటుడు అనే కావలివాళ్ళను వత్స రాజు సంహరించి, ఆషాఢకుడు అంకుశము పట్టి ఏనుగును నడుపుతూ ఉండగా ప్రయాణము సాగించినాడు.

ప్రాకారముపద్ద పడిఉన్న పహారావాళ్లను చూచి నగరరక్షకులు కలతపడి ఆరాత్రివేళనే ఆసంగతి చండమహాసేనునికి విన్నవించినారు. వత్సరాజు వాసవదత్తను హరించుకు పోయినాడని ప్రజలు ఆందోళన చేసినారు. మహారాజు వాస్తవము గ్రహించినాడు. ఆయన ద్వితీయ పుత్రుడు పాలకుడు నడగిరి నెక్కి వత్సరాజు వెంట పడినాడు. ఇద్దరికీ పోరు జరుగుతూ ఉండగా రాజుగారి జ్యేష్ఠపుత్రుడు గోపాలుడు ఇంతలో అక్కడికి చేరి తండ్రి ఆజ్ఞానుసారముగా యుద్ధము ఆపుదల చేయించి నాడు. నడగిరి భద్రవతితో పోరాడలేదు. తర్వాత వత్సరాజు నిరాతంక ముగా ప్రయాణముచేసి వింధ్యారణ్యము చేరినాడు. మధ్యాహ్నము అయ్యేసరికి అరవై మూడు యోజనాలు నడిచి భద్రవతి దప్పి కొన్నది. వత్సరాజాదులు దిగగానే ఏనుగు నీరు తాగి కింద పడిపోయి ప్రాణాలు విడిచింది. వత్సరాజు, వాసవదత్త చాలా విచారపడ్డారు. ఇంతలో ఆకాశములోనుంచి ఇలా వినిపించింది: "రాజన్, విచారపడ వద్దు, నేను విద్యాధరాంగనను. మాయావతి నా పేరు. శాపవశాన ఇంతకాలమూ ఏనుగునై ఉన్నాను. ఇప్పుడు నీవల్ల నాకు శాపవిమోచన అయింది. నీకు ఉపకరించాను. నీకుమారునికికూడా ఉపకారము చేస్తాను. నీకొంత వాసవదత్త మానవస్త్రీ కాదు, దేవాంగననుమా! ఏదో కారణముచేత భూమిమీద జన్మించింది."

అతర్వాత వత్సరాజు వింధ్యసానువులో తనమిత్రుడు పుళిందకుని వద్దకు వసంతకుని పంపి, తాను, వాసవదత్త కాలినడకను నెమ్మదిగా వెళుతూ ఉంటే చోరులు చుట్టుముట్టినారు. బాణములతో కొట్టి నూట యేబదిమంది తస్కరులను రాజు హతమార్చినాడు. ఇంతలో పుళింద కుడు వచ్చి చోరులను వారించి రాజుకు ప్రణామము చేసి వాసవదత్తా వత్సరాజులను తనపల్లికి తీసుకు వెళ్ళినాడు. నడకలో వాసవదత్త పాదా లకు వనదర్భలు గుచ్చుకొన్నవి. రాత్రి వారు ఆపల్లెలో విశ్రమించినారు. యౌగంధరాయణుడు పంపిన దూతవల్ల సంగతులు గ్రహించి రుమ ణ్వంతుడు రాజునన్నిధికి వచ్చినాడు. శిబిరము యావత్తూకూడా వచ్చింది. వత్సరాజు శిబిరములో ప్రవేశించి ఉజ్జయినీ వార్తలకోసము ప్రతీక్షిస్తూ ఉన్నాడు. యౌగంధరాయణుని మిత్రుడు ఒకానొక వర్తకుడు వచ్చి రాజుతో " దేవా, చండమహాసేన ప్రభువు మీయాయంను అనురక్తుడు. తన అల్లుడు అయినందువల్ల మీానన్నిధికి ప్రతీహారుని పంపినాడు. అతడు తమఆజ్ఞకు వేచి ఉన్నాడు. నేను ఈవార్త మనవి చెయ్యడానికి ముందుగా వచ్చినాను " అని మనవి చేసినాడు. ఈవార్తకు వత్స రాజు సంతోషించి వాసవదత్తతో చెప్పినాడు. వినోదార్థము కథ చెప్ప మని ఆమె వసంతకుని అడిగింది. బంధువులను విడిచి కల్యాణకాంక్షతో, సిగ్గుతో ఉన్న వాసవదత్తకు పతిభక్తిని వృద్ధిచేసే ఈ కథను చెప్ప నారంభించినాడు :

దేవస్మిత కథ

తామ్రలిప్తి నగరములో ధనదత్తుడనే సంపన్న వర్తకుడు ఉండే వాడు. సంతానము లేనందువల్ల అతడు బ్రాహ్మణ బృందమును సమ కూర్చి ప్రణామము చేసి " ఆర్యులారా, శీఘ్రకాలములో నాకు కుమా రుడు కలిగేలాగున అనుగ్రహించాలి " అని ప్రార్థించినాడు. " ఇది అసా

ధ్యముకాద్దు. నైదికకర్మలచేత ఈలోకములో బ్రాహ్మణులు ఏదైనా సాధించగలరు. పూర్వము ఒకరాజుకు బిడ్డలు లేరు. నూటయిదు మంది రాణులు ఉన్నారు, ఒకరికీ సంతానము కలుగలేదు. పుత్రకామేష్టి చేయించినారు బ్రాహ్మణులు. తర్వాత కొమారుడు కలిగినాడు. జంతువు అని చిత్రమైన పేరు పెట్టినాడు రాజు. అందరికీ కన్నుల పండువుగా ఆబిడ్డఎదుగుతున్నాడు. ఒకనాడు చీను వానితొడలోకుట్టింది. బిడ్డడు ఏడ్చినాడు. కారణము తెలియక రాణివాసమంతా గొల్లుమన్నది. రాజుకూడా విచారపడ్డాడు. తర్వాత తెలుసుకొని చీమను తీసివేస్తే బాలుడు బాగా ఆడుకొన్నాడు. విచారకారణము ఏకపుత్రవిషయము. కాబట్టి బహుపుత్రులుంటే బాగుంటుందని ఎంచి కుమారులనేకులు కలిగే మార్గము చెప్పండని విప్రులను విచారముతో అడిగినాడు. "రాజన్, ఉపాయము లేకపోలేదు. అయితే చాలా బాధాకరము. ధైర్యము చేసి ఈబాలకుని మాంసము అగ్నిలో హోమము చేయించి, ఆహోమగంధము నీరాణివాసము వాసనచూస్తే అందరికీ సంతానము కలుగుతుంది" అని వారు తెలిపినారు. రాజు చివరకు ఆప్రకారము చేస్తే భార్యలందరికీ కుమారులు కలిగినారు. కాబట్టి నీకు సంతానము కలగడము కష్టముకాదు – " అని బ్రాహ్మణులు అంగీకరించి దక్షిణలు పుచ్చుకొన్నారు. వారు చేసిన నైదిక కర్మకు ఫలితముగా వర్తకునికి కుమారుడు పుట్టినాడు. వానికి తండ్రి గుహసేను డని పేరు పెట్టినాడు. గుహసేనుడు పెరిగి పెద్దవా డయిన తర్వాత వివాహార్థము తండ్రి పిల్లను వెతకడము ప్రారంభించి, కుమారుని వెంట పెట్టుకొని వర్తకానికి అని బయలుదేరి ద్వీపాంతరము వెళ్ళినాడు. ధర్మగుప్తు డనే వైశ్యశిఖామణి కూతురు దేవస్మితనుచూచి తనకొమారుని కిచ్చి పెళ్ళి చెయ్యమన్నాడు కూతురిమీది మమకారము చేతనూ, తామ్రలిప్తినగరము దూర మన్నీ ధర్మగుప్తుడు అంగీకరించలేదు. అయితే దేవస్మిత గుహసేనుని చూచి

వలచి బంధుజనాన్ని విడిచి అతనివెంట వెళ్ళిపోవడానికి నిశ్చయించుకొని చెలికత్తె ద్వారా సందేశము పంపించి గుహసేన ధనదత్తుల వెంట రహస్యముగా ఆరాత్రే బయలుదేరి వెళ్ళిపోయింది. తామ్రలిప్తి చేరిన తర్వాత దేవస్మితాగుహసేనులకు మహావైభవముతో వివాహమయింది. ఆదంపతులు ఏకమనస్కులై సుఖముగా కాపురము చేస్తున్నారు.

వాడిపోని తామర పూవులు

కాలక్రమేణ గుహసేనుని తండ్రి దివంగతుడయినాడు. బంధువుల ప్రేరేపణవల్ల వర్తకానికి అతడు కటాహద్వీపము వెళ్ళినాడు. అన్య ప్రదేశానికి వెళితే భర్త వరస్త్రీరతుడు అవుతాడేమో నని దేవస్మిత నమ్మలేదు. ఒకపక్కన బంధుప్రేరణ రెండవపక్క భార్యానిరోధము. ఏమీతోచక గుహసేనుడు దేవాలయానికి వెళ్ళి భగవంతుడు నూచించిన ప్రకారము చేస్తానని నిరాహారదీక్ష పూనినాడు. భార్యకూడా అతనితో పాటు వ్రతము చేసింది. రాత్రి స్వప్నములో మహేశ్వరుడు సాక్షాత్కరించి రెండు ఎర్రతామర పూలు ఇచ్చి "ఉభయులూ చెరి ఒకరి దగ్గర ఉంచుకోండి. ఒకరి వ్రతభంగమయితే రెండోవారి చేతిలో తామర వాడిపోతుంది. మరొకవిధముగా వాడదు" అని అనుగ్రహించి అంతర్ధానమయినాడు. వారికి మెలుకువ వచ్చేటప్పటికి ఇద్దరి చేతుల్లో ఎర్రతామరపూలు ఉన్నవి. గుహసేనుడు ఒకపద్మమునుతీసుకొని ప్రయాణము చేసినాడు. దేవస్మిత రెండవ పుష్పమును తరుచుగా చూస్తూ తామ్రలిప్తిలోనే ఉన్నది. అచిరకాలములోనే గుహసేనుడు కటాహద్వీపము చేర్చి రత్నాలవ్యాపారము మొదలు పెట్టినాడు. అస్లూన కమలమును చూచి ఆశ్చర్యపడి కొందరు వణిక్పుత్రులు అతనికి బాగా మద్య మిచ్చి మైకములో అతనివల్ల పుష్పవృత్తాంతము తెలుసుకొన్నారు.

చాలా కాలానికి గాని అతడు స్వగృహానికి మరలిపో డని గ్రహించి గోమటిబిడ్డలు నలుగురూ కుతూహలముతో తామ్రలిప్తికి రహస్యముగా బయలుదేరి వెళ్ళినారు. గుహసేనుని భార్యావ్రతము భంగము చేయవలెనని వారినంకల్పము. తామ్రలిప్తి చేరినతర్వాత ఉపాయము ఊహిస్తూ, అక్కడి బౌద్ధాయతనములో యోగకరండిక అనే పరివ్రాజికను చూచి, నమస్కరించి, "భగవతీ, మాగోరిక నెరవేరిస్తే నీకు బహుధన మిస్తాము" అని బతిమాలుకొన్నారు. "మీకు ఎవరో స్త్రీమీద గోరిక ఉన్నది. చెపితే సాధిస్తాను. నాకు ధనముతో పనిలేదు. నాశిష్యురాలు సిద్ధకరి చాలా తెలివి కలది. దాని దయవల్ల నాకు కావలసినంత సంపద లభించింది" అని చెప్పింది. "భగవతీ, శిష్యురాలి తెలివివల్ల నీకు ఎలా ధనములభించిందో వినగోరుతాము" అని వారు బతిమాలితే యోగకరండిక ఇలా చెప్పింది:

సిద్ధకరి ప్రజ్ఞ

పూర్వము ఉత్తరదేశాన్నుంచి ఇక్కడికి వర్తకు డొకడు వచ్చినాడు. ఆయన ఇక్కడ ఉన్నరోజుల్లో నాశిష్యురాలు అతనివద్ద మారువేషముతో పనికత్తెగా చేరింది. చల్లచల్లగా అతనికి నమ్మకము కలిగించి చివర కొకనాడు తెల్లవారుజామున ఇంట్లో బంగార మంతా అపహరించుకు పోయింది. మార్దంగికుడు ఒకడు దానిసంగతి యెలాగో గ్రహించి దాని ధనము హరించా లని దానివెంట బడినాడు. ఈలోగా సిద్ధకరి పెద్దమర్రిచెట్టు చేరి వాడు రావడము కనిపెట్టి చాలా విచారము నటిస్తూ "అయ్యా, నాకు జీవితము ఆశ లేదు. భర్తతో కలహించి వచ్చాను. ఊరి పోనుగోడానికి ఈచెట్టుకొమ్మకు గట్టితాడు వేసిపెట్టు" అని ప్రార్థించింది. ఆ డొంబుడు లోలోపల సంతోషించి "నేను స్త్రీహత్య చెయ్యనక్కర లేకుండా ఈస్త్రీ ఆత్మహత్య చేసుకొంటుంది. నారొట్టె

నేతిలో వడ్డది!" అనుకొని కొమ్మకు తాడు వేసినాడు. సిద్ధకరి అమాయకముగా "అయ్యా, ఊరి ఎలా పోసుకోవాలో కాస్త చూపించు" అన్నది. డొంబుడు మద్దెలమీద నిలుచుని ఇలా అని ఊరి పోసుకొనే పద్ధతి చూపిస్తుండగా సిద్ధకరి మద్దెలను కాలితో తన్నింది. వాడు ఊచ్చులో వేలాడుతూ గిలగిల తన్నుకొని ప్రాణాలు విడిచినాడు. ఇంతలో వర్తకుడుకూడా ఆప్రదేశానికి రావడము చూచి సిద్ధకరి చెట్టుమీది కెక్కి పత్రముల చాటున దాగింది. వర్తకుడు తన సేవకులతోవచ్చి ఊరి వేసుకొని చనిపోయిన డొంబుని చూచినాడు. సిద్ధకరి కనబడలేదు. "చెట్టెక్కిందేమో" అన్నా డొక సేవకుడు. ఒకడు చెట్టెక్కినాడు. వానిని చూచి సిద్ధకరి "ఓయి అందగాడా, నాకు నీమీదనే మనసు! ఇక్కడికి నీవే వచ్చినావు. ఈ ధనమంతా నీదే రా, నావద్దకు" అని వాడు దగ్గిరికి రాగానే ముద్దు పెట్టుకో బోయినట్లు నటించి వానినోరు తెరచి, నాలుక పండ్లతో గట్టిగా కరిచింది. నోట నెత్తురు కక్కుతూ విలపిస్తూ వాడు నేలమీద పడిపోయి నాడు. వాని అస్పష్టవాక్కులు విని వర్తకుడు భయపడి ఏదో పిశాచము కొట్టిం దని సేవకులతో సహా అక్కడినుంచి పరుగెత్తి పోయినాడు. సిద్ధకరి నెమ్మదిగా దిగి రహస్యముగా బంగారముతో ఇంటికి వచ్చి నాకిచ్చింది. నాశిష్యురాలు ఇంతశక్తి కలది. ఈవిధముగా నాకు చాలా ధనము సమకూడింది.

పరివ్రాజిక యోగకరండికా వన్నాగము

నరిగా అనమయానికి అక్కడికే వచ్చిన సిద్ధకరిని, కోమటిబిడ్డలకు చూపి "నాయనలారా, చెప్పండి ఎవతె కావాలి మీకు! నేను సాధించి మీకు నమకూరుస్తాను" అన్నది యోగకరండిక. "గుహసేనునిభార్య దేవస్మిత కావాలి. దానిని మాకు సమకూర్చాలి" అన్నారు వాళ్లు.

పరివ్రాజిక సరే అని ఒప్పుకొని వారిని తనయింట్లోనే ఉండమని చెప్పి దేవస్మిత:పరిచారికలకు భక్ష్యాదులు పెట్టి వశము చేసుకొన్నది. ఒక నాడు సిద్ధకరితో కలిసి యోగకరండిక దేవస్మిత యింటికి వెళ్లింది. గుమ్మముదగ్గర గొలుసుతో కట్టివేసిన ఆడకుక్క కొత్తవారిని చూచి మొరిగి అడ్డపడ్డది. దేవస్మిత గమనించి "ఎందుకు వచ్చించో ఈమె" అనుకొని చేటికను పంపి పరివ్రాజికను లోపలికి రమ్మన్నది. అదుర్మార్గురాలు ఆశీర్వదించి ఆదరము అభినయిస్తూ దేవస్మితతో, "అమ్మా, నిన్ను చూడవలె ననుకొంటూ ఉంటాను. నీవు స్వప్నములో కన బడ్డావు. అందుచేత ఉత్కంఠ కలిగి నిన్ను చూడవచ్చాను. భర్తతో విభోగము కలిగిన నిన్ను చూస్తే నాకు జాలి కలుగుతున్నది. కాంతునితో భోగము లేని రూపమూ, యౌవనమూ నిష్ఫలములు గదా!" అని, చాలాసేపు ఏవేవో మాటలు చెప్పి, మళ్ళీ వస్తా నని వెళ్లిపోయింది. మర్నాడు పరివ్రాజిక మిరియాలపొడి చల్లిన మాంస ఖండము తీసుకుపోయి కుక్కకు వేసింది. అది చటుక్కున పట్టుకు తిన్నది. మిరియపుపొడివల్ల దానికళ్ళవెంటా ముక్కువెంటా నీరు కారింది. అధూర్తపరివ్రాజిక లోపలికివెళ్లి "అమ్మా, చూడు. కుక్క ఏడుస్తున్నది. జన్మాంతరములో నేను తన సఖి నని గ్రహించింది. నాకళ్ళుకూడా చెమ్మగిలినవి" అన్నది. దేవస్మిత కుక్కను చూచి ఆశ్చర్యపడ్డది.

తర్వాత పరివ్రాజిక ఇలా చెప్పింది: "అమ్మాయీ, పూర్వజన్మలో నేనూ ఈకుక్కా సవతులము. మాభర్త బ్రాహ్మణుడు. రాజుగారి ఆనతిప్రకారము మా భర్త తరుచుగా ఆ గ్రామమూ ఈ గ్రామమూ వెళ్లుతూ ఉండేవాడు. ఆయన దేశాంతరము వెళ్ళినప్పుడు శరీరారోగ్యము కోసము పరపురుషులతోటి సుఖంగా ఉండేదాన్ని. ఇంద్రియాలను క్షోభపెట్టడము మంచిదికాదు. నేను అందుచేత పూర్వజన్మ జ్ఞాన

ముతో పుట్టినాను. నా సవతి శీలము రక్షించుకొని వృథాక్లేశము పొంది కుక్క అయి పుట్టింది. పూర్వజన్మజ్ఞానముమాత్రము కోలుపోలేదు."

దేవస్మిత మనస్సులో ఆశ్చర్యపడి "గొప్పధర్మము! ఈ పరివ్రాజిక చాలా ధూర్తురాలు" అనుకొని మందహాసముచేసి "తల్లీ, ఇన్నాళ్ళూ నాకు ధర్మస్వరూపము గోచరించలేదు. ఇప్పటికి తెలిసింది. ఏప్రియునితో నైనా నాకు సమాగమము సమకూర్చగలవా! అమ్మా!" అని అమాయికముగా అడిగినట్లు అడిగింది. యోగకరండిక లోలోపల ఉప్పొంగిపోయి "తల్లీ, ద్వీపాంతరమునుంచి మన పట్నానికి వణిక్కుమారులు వచ్చారు. వాళ్ళను తీసుకు వస్తాను" అని చెప్పి వెళ్ళింది.

వణిక్కుమారులకు శిక్ష

దేవస్మిత తనచేటికతో చాటుగా "చూచావా! వణిక్పుత్రులు కటాహద్వీపములో తనయజమానునిచేతిలోఅమ్లానకమలముచూచి రహస్యము ఎలాగో గ్రహించి ఇక్కడికి దుర్బుద్ధితో వచ్చారు. ఈ పరివ్రాజిక వట్టి దొంగాభ్యుదారాలు. ఇది తొందరుక తెత్తే. వీళ్ళకు మనము తగినశాస్తి చేతాము. మీలోఒకరు వెళ్ళి మనకుక్కకు ఇనుపకాలు త్వరగా చేయించుకు రావలి. ఉమ్మెత్తకలిపిన మద్యము తెప్పించాలి" అన్నది. వాళ్ళు ఆప్రకారమే చేశారు. ఒకచేటి దేవస్మితవేషము ధరించింది.

ఆనలువురు వణిక్కుమారులలో మరీ ఉబలాటపడుతున్నవానికి తన శిష్యురాలివేషము వేసి, అతనిని దేవస్మిత యింట్లో చల్లగా విడిచి పరివ్రాజిక వెళ్ళిపోయింది. ఆరాత్రి దేవస్మితవేషము ధరించిన చేటిక అతనిని గుర్తించి, చాలా ఆదరము నటించి మంచిమాటలు చెపుతూ, ఉమ్మెత్తకలిపిన మద్యము బాగా తాగించింది. వాడు ఒళ్ళుమరచి పడిపోయిన తర్వాత వాని వస్త్రాభరణాలు లాగివేసి, కుక్కచేత వానిముఖాన ఇనుపకాలిముద్ర గొట్టించి చేటికలు వానిని తీసుకుపోయి మురికిగుంటలో

పడవేసి వచ్చినారు. తెల్లవారుజామున మెళుకువ వచ్చి వాడు తన స్థితి తెలిసికొని పోయి స్నానముచేసి పరివ్రాజిక యింటికి దిగంబరముగానే వెళ్ళినాడు. స్నేహితులు నవ్వకుండా ఉండేందుకు కథ కల్పించి చెప్పినాడు. తాను వస్తూఉండగా దొంగలుకొట్టి యావత్తూ దోచుకొన్నట్టూ, జాగరణము చేతనూ, విశేషముగా తాగడము చేతనూ తల నొప్పిగా ఉన్నదనీ, చెప్పి ముఖాన ముద్ర కనపడకుండా తలకు గుడ్డ చుట్టుకొన్నాడు. మర్నాడు రాత్రి రెండవవాడు దేవస్మిత యింటికి వెళ్ళి మొదటివానికి జరిగిన శిక్షే పొంది వచ్చి, "ఆభరణాలు ఆమెయింటనే పెట్టి వచ్చాను. కాని తోవలో దొంగలు నన్ను కొట్టకుండా విడువలేదు." అని చెప్పి తలకు గుడ్డ చుట్టుకొని పడుకొన్నాడు. మిగిలిన యిద్దరికీకూడా అటువంటిశాస్తి యథాక్రమముగా జరిగింది. వణిక్పుత్రులు అవమానము పొంది, ముఖాలమీద ముద్రలు పడి ధనము కోల్పోయి చెప్పకుండా తామ్రలిప్తి విడిచివెళ్ళినారు.

పరివ్రాజిక శిష్యురాలితో దేవస్మిత యింటికి వెళ్ళింది. తాను కృతార్థురా లయినట్టు ఆమె లోలోపల మురిసిపోతున్నది. దేవస్మిత వాళ్ళను సాదరముగా ఆహ్వానించి కృతజ్ఞురాలివలె నటిస్తూ, ఉమ్మెత్త కలిపిన మద్యమును మంచిమాటలతో తాగించి, మురికిగుంటలోకి తోయించింది.

వణిక్పుత్రులు కటాహద్వీపము చేరిన తర్వాత తన భర్తకు ఏమి అపకారము చేస్తారో అని భయపడి జరిగిన వృత్తాంతము తన అత్త గారికి వివరించింది. దానికి అత్త సంతోషించి "అమ్మాయీ, నీవు చేసినపని యుక్తమే కాని అక్కడ అబ్బాయికి ఏమయినా కీడు చేస్తా రేమో అనిపిస్తున్నది" అన్నది. "అత్తా, పూర్వము శక్తిమతి తన ప్రజ్ఞచేత భర్తను కాపాడినట్టు నేనుకూడా మీకుమారుని కాపాడు కొంటాను" అన్నది దేవస్మిత. శక్తిమతికథ చెప్పమని అత్తగారు అడిగితే, కోడలు ఇలా చెప్పింది :

శక్తిమతి కథ

మాగ్రామములో పూర్వులు ఊరిమధ్య మణిభద్రస్వామి అనే యక్షవిగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పౌరులు ఆస్వామికి మొక్కుకొని ఆయనపేర ముడుపులు కట్టుతారు. రాత్రివేళ పరస్త్రీతో సహా దొరికిన పురుషుని స్త్రీని పట్టుకుపోయి యక్షాలయ గర్భగృహములో బంధించి, తెల్లవారిన తర్వాత ప్రకటనచేసి, రాజు సన్నిధానానికి తీసుకుపోయి శిక్ష చేయించడము ఆచారము. ఒకరాత్రి కొత్వాలు పరస్త్రీయుతుడైన వర్తకుని పట్టుకుపోయి యక్షాలయములో పెట్టి బయటపెద్దగడియ వేసినాడు. వర్తకుని భార్య శక్తిమతికి ఈసంగతి ఆరాత్రే తెలిసింది. ఆమె ధైర్యము వహించి, చేటికలతో, పూజాద్రవ్యములతో యక్షాలయానికి వెళ్ళింది. పూజారి ధనాశచేత ఆమెకు తలుపు తీయించడానికి కొత్వాలుతో "ఈమెఎవరో పూజార్థము వచ్చింది. లోపలికి వెళ్ళనీయవచ్చు" నని చెప్పి ఒప్పించినాడు, ఆమె పరస్త్రీతోకూడా అందులో వెల వెల లోతున్న భర్తను ఓదార్చి, ఆస్త్రీకి తనవేషము వేసి పంపి, తాను అక్కడే కూర్చున్నది. తెల్లవారినతరువాత రాజపురుషులు వచ్చి వారు భార్యా భర్తలని తెలుసుకొని వారిని విడిచిపెట్టి కొత్వాలును మందలించినారు.

దేవస్మిత కటాహద్వీపమునకు పోవుట

అత్తగారిని సమాధాన పరచి దేవస్మిత పురుషవేషము ధరించి చేటికలకు కూడా వేషాలు వేసి వర్తకానికని కటాహద్వీపానికి బయలు దేరింది. అక్కడికి చేరి యితర వర్తకుల మధ్య తనభర్తను చూచింది. పురుషవేషములో ఉన్న తన భార్యను అతడు చూచి ఎందుకో అనందము కలిగి ఇతడు తనభార్యవలె ఉన్నా డనుకొన్నాడు. దేవస్మిత రాజసన్నిధికి పోయి "దేవా, నా దొంగనువి ఉన్నది. ప్రధానపౌరు

లను ఇక్కడికి రప్పించ ప్రార్థన" అన్నది. కుతూహలము కలిగి రాజు ఆప్రకారముగా ఆజ్ఞయిచ్చినాడు. "ప్రభూ, వీరిలో నాబానిసలు నలుగురున్నారు. దేవరవారు వారిని నాకు ఇప్పించాలి" అన్నది. "మంచిది. నీబానిసలను గుర్తించి తీసుకు వెళ్ళవచ్చును" అన్నాడు రాజు. తామ్రలిప్తిలో తనయింట శాస్తి పొంది వచ్చిన నలుగురు వణిక్పుత్రులను గుర్తించి వీరని చెప్పింది. వైశ్యప్రముఖులకు కోపము వచ్చి "వీరు గొప్పవణిక్పుత్రులు. నీకు బానిస లేమిటి!" అని మందలించినారు. "మీకు నమ్మకము లేకపోతే వీరిముఖాలకు చుట్టిన వస్త్రాలు తీయించి చూడండి. కుక్కటాలితో నేను వేయించిన పాదముద్రలు ఉంటవి." అన్నది దేవస్మిత. ఆప్రకారము చేసి చూస్తే వాళ్ళముఖాల మీద శునక పాద చిహ్నాలు కనబడినవి. అందరూ ఆశ్చర్యపడ్డారు. వర్తకులు సిగ్గుపడ్డారు. ఆశ్చర్యముతో "ఈ వృత్తాంతము యావత్తు వివరించవలసింది" అని రాజు కోరినాడు. దేవస్మిత యావద్వృత్తాంతమూ తెలియచెప్పింది. న్యాయతః వీరు నీకు దానులే అన్నాడు రాజు. వర్తకులు ఆమెకు చాలా ధనమునూ, ప్రభువుకు జరిమానానూ సమర్పించుకొని ఆ నలుగురినీ విడుపించుకొన్నారు. దేవస్మిత భర్తతోను చేటికలతోను ధనముతోను బయలుదేరేటప్పుడు జనుల వీడ్కోలు పొంది తామ్రలిప్తికి వచ్చి సుఖముగా ఉన్నది. అటుతర్వాత భార్యాభర్తలు ఒకరి నొకరు ఎన్నడూ విడిచి ఉండలేదు.

దేవీ, ఉన్నత వంశసంభూతలు పవిత్ర సాహస కృత్యములచేతనూ ఏకాగ్రనిష్ఠచేతనూ భర్తను సేవిస్తూ ఉంటారు. పతివ్రతలకు భర్త పరదేవత.

వసంతకుడు చెప్పిన ఈకథ విని వాసవదత్త చాలా సంతోషించింది. పుట్టిల్లు విడిచి వచ్చి కొద్దికాలమే కావడముచేత సిగ్గు తగ్గలేదు. అది

వరకే ఉదయనునిమీద ఆమెకున్న అనురాగము ఈ కథవల్ల మరింత గాఢమయింది.

తరంగము : ౧౪

ఇంతలో చండమహాసేనునిదూత వచ్చి నమస్కారము చేసి "దేవా, మా మహారాజు తనకు ఇలా నందేశము పంపినాడు. మీరు వాసవదత్తను తీసుకొని వెళ్ళడము సమంజసమే. మిమ్ము మేము ఉజ్జయినికి తీసుకొని వచ్చిన ఉద్దేశము ఇదే. బంధనములో ఉన్నప్పుడు మీకు వాసవదత్తను ఇస్తే మాయెడల మీకు అభిమాన ముండదని ఇవ్వ లేదు. మాబిడ్డకు యథావిధిగా వివాహము అయ్యేలాగున కొంచెము మీరు ఓర్పు వహించవలి. అచిరకాలములోనే మాగోపాలుడు వచ్చి కాశ్మీరయముగా చెల్లెలి వివాహము చేయిస్తాడు" అని విన్నవించి వాసవదత్తకుకూడా నివేదించినాడు. ఆమె చాలా సంతోషించింది. "గోపాలునికోసము మీ యుభయులు ఎదురుచూస్తూ ఇక్కడే ఉండండి. అతనితోకూడా కౌశాంబికి రండి" అని వచ్చిన ప్రతీహారునితో, పులిందకునితో చెప్పి వత్సరాజు వాసవదత్తతో కౌశాంబికి మరునాడు ప్రాతఃకాలము బయలుదేరి మూడురోజులలో స్వరాష్ట్రము చేరి ఒక రాత్రి రుమణ్వంతుని భవనములో విశ్రమించి, పౌరులందరూ తన ఆగమనానికి ప్రతీక్షిస్తూ ఉత్కంఠతో ఉండగా మహావైభవముతో నగరప్రవేశము చేసినాడు. వాసవదత్తతో ఉదయనుడు నగరవీథులలో రథములో వెళుతూ ఉంటే పౌరాంగనలు పుష్పములు చల్లి మంగళ హారతులు పట్టినారు. ఎటు చూచినా, దర్శనార్థము వచ్చిన సామంత ప్రభువులు, వందిమాగధులు, మంగళగీతములు.

త్వరలోనే గోపాలుడు ప్రతీహార, పులిందకులతో కలిసి కౌశాంబికి చేరినాడు. వత్సరాజు అతనికి ఎదురుపోయి ఆదరము చూపినాడు.

వాసవదత్త అన్నను చూచి హర్షవిహ్వల అయినది. గోపాలుడు తండ్రిగారి సందేశాలను తెలిపి చెల్లెలికి ధైర్యము పురికొల్పినాడు. అన్నగారిరాకవల్ల ఆమెకు చిత్తశాంతి కలిగింది.

వాసవదత్త వివాహము

మర్నాడు గోపాలుడు వాసవదత్తా వత్సరాజులకు వివాహము చేయించినాడు. గోపాలుడు ఇచ్చిన రత్నాలవల్లనూ సామంతులు సమర్పించిన కానుకలవల్లనూ కోశము నిండిపోయింది.

గోపాలకుని పుళిందకుని వత్సరాజు న్యాయముగా సన్మానించి, తక్కిన వారిని ఉచితరీతిని సత్కరించడానికి యౌగంధరాయణ రుమణ్వంతులను నియోగించినాడు. "రాజు చాలా కష్టమైన కార్యభారము మనమీద పెట్టినాడు. జనరంజనము మహాకష్టము. మెప్పించలేకపోతే కేవలము బాలునివల్ల కూడా కీడు కలుగుతుంది" అని యౌగంధరాయణుడు ఈ కథ చెప్పినాడు.

బాల వినష్టకుని కథ

పూర్వము రుద్రశర్మ అనే బ్రాహ్మణునికి ఇద్దరు భార్యలున్నారు. అందులో ఒకతె పుత్రుని కని చనిపోయింది. ఆపిల్లవాణ్ణి సవతితల్లి పెంచుతున్నది. వాడు కొంత ఎదిగినతర్వాత అన్నములో నెయ్యి వెయ్యడము మానివేసింది. వాడికి పొట్ట పెరిగింది. ఒంటిమీద బూడిద వన్నె పర్వడ్డది. "ఏమిటి, వీడు ఇలాఉంటున్నాడు?" అని భర్త అడిగితే ఆమె "వీడికి నెయ్యి మొదలయినవి వేసి అన్నం పెట్టుతున్నా ఇలా ఉంటున్నాడు. నేనేమి చెయ్యను!" అన్నది. ఆకుర్రవాడితీరే అంత అనుకొని బ్రాహ్మణుడు ఊరుకొన్నాడు. స్త్రీల తియ్యని మోసపు మాటలకు ఎవడు లొంగిపోడు? బాల్యములోనే వినష్ట డయినాడని వానికి బాలవినష్టకుడు అనే పేరు వచ్చింది. బాలునికి అయిదేళ్లు వచ్చి

నవి. "ఈమె నన్ను ఎప్పుడూ వేధిస్తున్నది. దీని కేదో చెయ్యాలి" అని ఆలోచించి కొలువుకూటమునుంచి తండ్రి యింటికి రాగానే వాడు "నాన్నా, నాన్నా, నాకు ఇద్దరు నాన్నలే!" అని ఒంటరిగా అన్నట్లు ముగా ఒకనాడు అన్నాడు. ఇలా కొన్నిరోజులు తండ్రికి ఎదురుగా వెళ్ళి అనడము సాగించాడు. రుద్రశర్మ భార్యమీద అనుమానపడి ఆమెను తాకడము కూడా మానివేసినాడు. భార్యకు సంశయము కలిగి "చిత్రంగా ఉన్నది! నావల్ల ఏదోషమూ లేనిదే భర్త కోపించి అవ నన్నంగా ఉన్నాడు. ఈ బాలవినష్టకుడు ఏమయినా చేసి ఉంటాడా?" అనుకొని వాడిని ఆదరముతో చూచి అభ్యంగనస్నానము చేయించి బాగా నెయ్యి వేసి అన్నము పెట్టింది. భోజనానంతరము చల్లని వాక్కుతో "నాయనా, నాన్నగారితో నన్ను గురించి ఏమయినా చెప్పావా?" అని అడిగింది. బాలవినష్టకుడు సవతితల్లితో ధైర్యముగా "ఇప్పటినుంచి అయినా నన్ను సరిగా చూడక పోతే నాన్నగారితో ఇంకా ఇంకా చెపుతాను! మీఅబ్బాయిని బాగా ఆడించి పోషణ చేస్తావే, నాకుమాత్రం చెయ్యకూడదేం! నన్ను రోజూ వేధిస్తావు!" అన్నాడు. ఆవిడ ఒట్టుపెట్టుకొని "నిన్ను చక్కగా చూస్తా, ఎన్నడూ కష్టపెట్టను. మరి నాన్నగారికి నామీద కోపం పోగొట్టు" అని బాలుని బతిమాలుకొన్నది. "మానాన్నగారు రాగానే వనికత్తెచేత ఆయనకు అద్దము చూపించమని చెప్పు. తర్వాత సంగతులు నేను ఆలోచిస్తాను" అన్నాడు బాలవినష్టకుడు. ఆనాడు రుద్రశర్మ యింటికి రాగానే అతనికి అద్దము చూపినారు. బాలవినష్టకుడు అద్దములో ప్రతిబింబము కేసి చూపుతూ "నాన్నా, నాన్నా, ఇడిగో రెండోనాన్న!" అన్నాడు. ఆమాటలకు రుద్రశర్మ ఆలోచనావరుడయి, "నిష్కారణంగా భార్యమీద అనుమాన పడ్డానే" అని విచారపడి అప్పటినుంచీ ఆమెను సుముఖముగా చూడడము ప్రారంభించినాడు.

కుర్రవానికి కోపము వచ్చినప్పటికీ ఎంతవని అయినా జరుగుతుంది. కాబట్టి మనము అందరికీ ఉచితనత్కారాలు చెయ్యవలి.

ఈవిధముగా చెప్పిన తర్వాత అందరికీ జాగరూకతతో మర్యాదలు జరిగినవి. యౌగంధరాయణ, రుమణ్వంత, వసంతకులకు రాజు న్యాయముగా వస్త్రాభరణాదు లిచ్చి మైపూతలు పూసి గ్రామము లిచ్చి సత్కారము చేసినాడు.

గోపాలకుడు వివాహోత్సవము జరిగిన కొద్దిరోజులకు ఉజ్జయినికి వెళ్ళడానికి వత్సరాజును సెలవు అడిగినాడు. మళ్ళీ త్వరలో రావలెనుసుమా! అని వీడ్కోలు సమయాన వత్సరాజు అన్నాడు.

బంధుమతీ పరిణయము

గోపాలకుడు ఒకరాజ్యములో పట్టి తెచ్చిన బంధుమతి అనే రాజకన్యను వాసవదత్తకు కానుకగా పంపినాడు. మంజులిక అని మారు పేరు పెట్టి ఆమెను వాసవదత్త రాచనగరిలో గుప్తముగా ఉంచింది. ఒకనాడు వత్సరాజు వసంతకుని సాయముతో మంజులికను కనిపెట్టి పుష్పోద్యానములో పూపొదరింట్లో గాంధర్వ విధానప్రకారము ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. వాసవదత్త కనిపెట్టి వసంతకుని బంధించి తీసుకు వెళ్ళింది. వాసవదత్త పుట్టింటినుంచి వచ్చిన సాంకృత్యాయని అనే పరివ్రాజికను వత్సరాజు ఆశ్రయించినాడు. ఆమె నేర్పుతో వాసవదత్త అలక తీర్చింది. వాస్తవదత్త బంధుమతిని వత్సరాజు కిచ్చింది. వసంతకుని బంధనములోనుంచి విడిపించింది. పతివ్రత హృదయము కుసుమసుకుమారముకదా! వసంతకుడు వచ్చి రాణినముఖాన నిలిచి "దేవీ! బంధుమతి ప్రభువుమనస్సుహరించింది. నేనేమిచేశాను. శాంతపాముమీది కోపములో మీరు రెండుతలలపామును కొట్టినారు." అని నవినాడు.

"ఏమి టాఉపమానము ? కొంచెం వివరించి చెప్పు" అని వాసవ దత్త కుతూహలముతో అడిగింది. వసంతకుడు ఇలా చెప్పినాడు :

రురు డుండుభ కథ

పూర్వము రురువు అనేమునిపుత్రుడు యథేచ్ఛగా సంచరిస్తూ, మేనకకూ ఎవరో విద్యాధరునికీ కలిగిన ప్రమద్వర అనే సుందరిని చూచినాడు. చూచి, ఆమెను పెంచుతున్న స్థూలవేశు డనే మునివద్దకు వెళ్లి ప్రమద్వరను తన కిచ్చి వివాహము చెయ్య మన్నాడు. ముని అంగీకరించినాడు. వివాహకాలము సమీపిస్తుండగా ప్రమద్వరను పాము కరిచింది. రురుడు విచారముతో ఉండగా ఆకాశవాణి "విప్రుడా, ప్రమద్వర ఆయువు మూడింది. నీ ఆయుస్సులో నగభాగమిచ్చి ఆమెను బతికించుకో" అని వినబడ్డది. తక్షణమే రురుడు తన ఆయుస్సులో అర్ధభాగ మామెకిచ్చినాడు. ఆమె జీవించింది. తర్వాత వివాహముజరిగింది.

అప్పటినుంచీ రురుడు ఎక్కడ పాము కనబడినా, ఈ సర్పమే నాప్రియురాలిని కాటువేసి ఉంటుంది, అని కోపముతో కొట్టిచంపేవాడు. ఒకనాడు డుండుభము (రెండుతలల సర్పము) కనబడితే బడితెతో రురుడు కొట్టబోయినాడు. డుండుభము మనుష్యవాక్కులతో "బ్రాహ్మణుడా, నాగుపాముమీద ఉన్న కోపం రెండుతలలపాము మీద చూపిస్తున్నావేమి ! నీభార్యను కరిచింది నాగుపాము. రెండు తలల పాములకు విషం ఉండదు" అన్నది. "నీ వెవరు ?" అన్నాడు రురుడు. "శాపవశాన సర్పజన్మ ఎత్తిన ఋషిని. నీతో సంభాషణవల్ల నాకు శాపవిమోచన మయింది." అని వెంటనే అంతర్ధాన మయింది. నాటినుంచీ రురుడు సర్పసంహారము మానుకున్నాడు.

దేవీ, కాచుపాముమీద కోపముచేత రెండుతలల పామును కొట్టినారు. అని నేను అలంకారరూపముగా అన్నానని వసంతకుడు నవ్వి

నాడు. భర్తసన్నిధానములోనే ఉన్న వాసవదత్త మందహాసము చేసింది.

వత్సరాజు మధ్య మధ్య వాసవదత్తకు కలిగే ప్రణయకోపము పోగొట్టుతూ, వసంతకుని చమత్కార వాక్యాలకు ఆనందిస్తూ, ఉన్నాడు. అతని జిహ్వ మదిరారసముతోనూ, కర్ణములు వీణా కల రవముతోనూ, నేత్రములు ప్రియురాలి ముఖవీక్షణముతోనూ ఆమోదము పొందుతున్నవి.

తరంగము: ౧౫

నిర్విఘ్న విశ్వ నిర్మాణ
సిద్ధయే యదనుగ్రహమ్
మన్యే న వక్రే ధాతాఽపి
తస్మై విఘ్నజితే నమః!

ఆశ్లిష్యమాణః ప్రియయా
శంకరోఽపి యదాజ్ఞయా
ఉత్కంపతే న భువనం
జయ త్యసమసాయకః.

నిర్విఘ్నముగ విశ్వనిర్మాణ మునకు
యదనుగ్రహార్థమై అబ్జసంభవుని
యంతవాడును సైత మర్చించినాడో,
అట్టి విఘ్నేశున కంజలి గూర్తు!

ఎవని యూనతిచేత, ఈశుడు కూడ
కాంతాసమాశ్లిష్ట గాత్రుడే యయ్యె
ఉత్కంప మొందుచు నుండునో, అట్టి
విషమ సాయకుడె ఈ విశ్వవిజేత.

ద్విగ్విజయ సమాలోచన

వత్సేశ్వరుడు వాసవదత్తయందు క్రమముగా సుఖాసక్తుడై మన సంతా ప్రియురాలిమీదే లగ్నము చేసినాడు. యౌగంధరాయణుడూ సర్వసేనాధిపతి అయిన రుమణ్వంతుడూ రాజ్యభారము వహించినారు. యౌగంధరాయణుడు ఒకరాత్రి రుమణ్వంతుడితో ఇలా ఆలోచన చేసినాడు. "పాండవవంశంలో జన్మించిన మనప్రభువు వత్సరాజ్యానికి వల్లభుడు. కులక్రమాగతంగా ప్రభువుల కందరికీ ఎప్పుడూ హస్తిపురం రాజధానిగా ఉండేది. మనవత్సేశ్వరుడికి ఆపట్టణము రాజధానీ నగరం కావాలి. శత్రువులను జయించాలనే ఇచ్ఛ వదిలి, పరిమితమయిన రాజ్యముతో తృప్తి పడి, మనరాజు కామకుడై మృగయాసక్తుడై నిశ్చింతగా ఉన్నాడు. రాజ్యభార మంతా మనమీద పెట్టినాడు. కుల క్రమాగతంగా ఉన్న సమస్తరాజ్యభారాన్ని మహారాజు వహించేటట్లు మనంచేయాలి. అలా చెయగలిగితే మనరాజభక్తి, కార్యాచరణశక్తి చరితార్థ మవుతవి. అది ఎలా సాధ్య మవుతుం దని విచారించవలసిన పనిలేదు. సమస్తకార్యములనూ ధీకౌశలమువల్ల సాధించవచ్చును.

మహాసేనుని కథ

మహాసేను డనే మహారాజు ఉండేవాడు. ఒకసారి అతనిని బలవంతుడయిన శత్రువు ఎదిరించేటప్పటికి, అతడు చలించిపోయినాడు. మంత్రులు మహారాజు పిరికితనము చూచి ఆలోచించి, కార్యము చెడకుండా రక్షించాలని, ఆయనచేత విరోధిరాజుకు నమస్కారము చేయించారు. గండం గడిచి గట్టెక్కినాడు. శత్రువుకు ప్రణామం చేయవలసి వచ్చిందే అని మహారాజు అభిమానంతో విచారించాడు. మనోవ్యధతో అతడు కుమిలి కుమిలి పోగా గర్భములో గుల్మం పుట్టింది. అత డాబాధ పడలేక

చనిపోవడానికి ఉద్యమించేటప్పటికి, మతిమంతు డయిన వైద్యుడు రోగ నిదానం గ్రహించి, ఔషధానికి సాధ్యము కాదని తెలిసికొని రాజుతో యుక్తిగా అబద్ధమాడినాడు: "మహారాజా! పట్టమహిషి మీబాధ చూచి భరించలేక గుండె పగిలి చనిపోయింది" అనే వైద్యుడి మాటలు విని మహాసేనుడు చెట్టు కూలినట్టు శోకంతో నేలమీద కూలినాడు. గర్భగోళం శోకంవల్ల బాగా కదిలింది. గుల్మరోగం దానంతట అదే తగ్గిపోయింది. రోగం కుదరగానే రాజు రాణితో ఇష్టభోగాలు అనుభవించి, శత్రువుల్ని ఎదిరించి విజయము పొందినాడు. సద్యఃస్ఫూర్తితో ఆవైద్యుడు మహాసేనుడికి ఎలా ఉపకారం చేశాడో అలాగే మనంకూడా వత్సరాజు హితంకోరి, బుద్ధిబలంవల్ల కార్యం సాధించాలి. భూమండలం మనకు కావాలి. ప్రస్తుతం మనకు మగధరాజయిన ప్రద్యోతుడు పరమశత్రువు. అతడు మన కెవ్వడూ అనర్థమే చేస్తాడు. అందుకు మనము ఉపాయము ఆలోచించవలె. ప్రద్యోతునికి పద్మావతి అనే పుత్రిక ఉన్నది. ఆమెను మన పత్నేశ్వరుడికి ఇస్తాడేమో వెళ్ళి అతన్ని అడుగుదాము. మనతెలివితేటలు ఉపయోగించి వాసవదత్తను ఎక్కడయినా దాచి, ఆమె నివసించే ఇంటికి నిప్పంటించి ఆమె దగ్ధమై పోయిందని వార్త వ్యాపింపచేయాలి. వాసవదత్త చనిపోయిందనే మాట పెయ్యకపోతే మగధరాజు తనకుమార్తెను మనరాజుకు ఇవ్వడు. మునుపు ఒకసారి నేను ప్రద్యోతునితో పద్మావతీ వివాహ విషయం ప్రస్తావించగా ఆయన, "నా కుమార్తెమీద ప్రాణాలన్నీ పెట్టుకొన్నాను. మాఅమ్మాయిని మీవత్సరాజుకు ఇవ్వను. వత్సరాజుకు వాసవదత్తమీద అనురాగం అధిక మట! "రెండు కొవ్వులు ఒక చోట్ట ఇమడ వంటారు. నవతి ఉండగా సంబంధం చెయ్యను" అన్నాడు. మన వత్సరాజు రాణిఉండగా ద్వితీయం చేసుకోడు. వాసవదత్త అగ్ని దగ్ధ అయిందని వాడు వేస్తే కార్యం చక్కబడుతుంది. మగధరాజు

ప్రద్యోతుడు మనరాజుతో సంబంధం చేసికొని స్నేహితు డవుతాడు. మనకు సహాయంగా ఉంటాడు. మొదట మనం పూర్వదిగ్విజయయాత్ర ఆరంభిస్తే, ప్రద్యోతుడు అల్లుడికి అండగా నడుముకడతాడు. భూమండల మంతా మన వత్సేశ్వరుని వశం అవుతుంది. అదీగాక పూర్వం అశరీర వాణి వత్సరాజు చక్రవర్తి అవుతా డన్నది."

యూగంధరాయణుని మాటలు విని రుమణ్వంతుడు సమాధానము ఇచ్చినాడు: "మంత్రివర్యా! మీరు చెప్పిన పని సాహసంవల్లనే నెర వేరాలి. పద్మావతిని మన రాజేంద్రుడికి ఇప్పించడానికి ఇంత కపట నాటకం ఆడితే ఆమె తప్పక మనదే అవుతుంది. కపటోపాయంవల్ల కార్యసాధన మంచిది కాదంటారు పెద్దలు. అందుకు నిదర్శనంగా కథ వింటారా?"

వైశ్యకన్యా మూనవ్రతుల కథ

పూర్వము జాహ్నవీతీరాన మాకందిక అనే పట్టణంలో మూన నిష్ఠతో ఒకసన్యాసి ఉండేవాడు. అతడు తిరిపె మెత్తుకొని జీవించాలని సంకల్పించేవ్పటికి, కొంతమందిశిష్యులు ఆయనకోసము దేవాలయములో మఠము కట్టించినారు. ఒకరోజు ఆసన్యాసి భిక్షకోసము ఒక వైశ్య నింటికి వెళ్ళినాడు. బిచ్చము వెయ్యడానికి అతనికుమార్తె గుమ్మము దాటి వచ్చింది. ఆ అందాలకుప్పను సన్యాసి చూచి మోహించినాడు. "అబ్బా! ఎంతకష్టం వచ్చింది!" అంటూ ఆయతి మూనము వీడినాడు. వైశ్యుడు ఇంట్లోనుంది యతిమాటలు విన్నాడు. సన్యాసి తిరిపెము తీసుకొని మఠానికి వెళ్లినాడు. యతి ఎన్నడూ లేనిది మూనముద్ర వదిలినా డేమని వైశ్యుడు ఆశ్చర్యపడి, సందేహనివారణ చేసుకోడానికి మఠానికి వెళ్ళినాడు.

"మా యింటికి భిక్షాటనకు వచ్చి మా అమ్మాయినిచూచి ఎంతకష్టం వచ్చిం దన్నా రేమి స్వామీ? మౌనవ్రతం భంగం చేశా రేమి" అన్నాడు. అప్పుడు సన్యాసి "నీకూతురు చక్కని చుక్క. అయితే ఆ అమ్మాయిలో శుభలక్షణాలు కనపడవు. ఆపిల్లను ఎవరికన్నా ఇచ్చి పెళ్ళి చేస్తే నీకుఆపదలు కలుగుతవి. నీవంశం నాశన మవుతుంది. అడిగావు కనక చెప్పాను. నీవు నాభక్తుడివి. ఆందువల్ల నీకీ సంగతి చెప్ప వలె నని మౌనం విడిచిపెట్టాను. ఈరాత్రి నీకూతుర్ని పెళ్ళిలో పెట్టి పెళ్ళిమీద మూకుడులో దీపం వెలిగించి, పేటికను గంగలో వదలిపెట్టు" అని ఉపదేశించినాడు.

సన్యాసి చెప్పినట్లు వైశ్యుడు చేసినాడు. భీరువుల చిత్తాలు అటు వంటివేకదా! ఆరాత్రి సన్యాసి తనశిష్యవర్గాన్ని పిలిచి "మీరు గంగాతీరానికి వెళ్ళి గట్టుసెంబడి దీపంతోకూడా కొట్టుకువచ్చే పెళ్ళి పైకి తీసి నాదగ్గిరికి తీసుకురండి. పెళ్ళిలో సణుగుడు వినిపిస్తే లెక్క చెయ్యకండి" అని చెప్పినాడు. శిష్యులు గంగఒడ్డుకు వెళ్ళి పేటిక కోసం కనిపెట్టుకొన్నారు. అంతకుముందే ఒకరాజపుత్రుడు అనుచర వర్గంతో షికారుగా గంగాతీరానికి వచ్చినాడు. గండదీపముతో మంద నము నీళ్ళలో తేలుతూ వచ్చింది. రాజపుత్రుడు కుతూహలముతో ఆపెళ్ళిను ఒడ్డుకు పట్టించి తెరిపించినాడు. అందులోని వణిక్పుత్రికను చూచి మోహించి గాంధర్వ వివాహము చేసుకొన్నాడు. చమత్కారము చేయా లని అనుకొని ఆపెట్టిలో పెద్దగోతిని ఉంచి, యథాపూర్వముగా పెళ్ళిమీద గండదీపము పెట్టి గంగలో వదిలి రాజపుత్రుడు ప్రియురాలితోకూడా వెళ్ళిపోయినాడు. మౌనస్వామివారిశిష్యులు గంగలో తేలుతూ వస్తున్న మందనము చూచి, తీరానికి తీసుకొని వచ్చినారు. సన్యాసి "శిష్యులారా! ఇందులో యక్షిణి ఉన్నది. నేను మంత్రశక్తివల్ల దాన్ని వశం చేసుకోవాలి. నేను మఠానికి పెళ్ళి

తీసుకుపోయి సాధిస్తాను. మీరీ రాత్రి ఇక్కడ కిక్కురు మనకుండా ఉండండి" అన్నాడు.

కన్య తనచేతుల్లో చిక్కింది గదా అని సన్యాసి సంతోషము పట్ట లేక పెట్టె తెరిచినాడు. తన దుర్నయము మూర్తీభవించినట్లు భీకరాకారముతో కోతి కోపముతో బెదిరి లేచి వాడిగోళ్ళతో సన్యాసి ముక్కూ చెవులూ కొరికి రక్కింది కిచకిచలాడుతూ కోతి కుప్పిగంతులు వేసుకొంటూ పెక్కిరిస్తూ వెళ్ళిపోయింది. గురువు ముక్కూ చెవులూ తెగిపోయి రక్తము స్రవిస్తుంటే శిష్యులు యజ్ఞక్షేత్రప్రభావ మనీ, గురువును బెదిసి కొట్టిందనీ అనుకున్నారు. ఊరంతా సన్యాసిసంగతి పొక్కింది. కుమార్తెకు అనుకూలు డయినభర్త దొరికినందుకు వైశ్యుడు సంతోషించినాడు. ఆమె సుఖముగా భర్తతో కాపరము చేస్తున్నది. కపటోపాయమువల్ల కార్యము సాధించా లని మహాప్రయత్నము చేసి మానసన్యాసి తాను తవ్వుకొన్న గోతిలో తనే పడినాడు.

వాస్తవదత్తా విరహమువల్ల మనమహారాజుకు బాధ సంక్రమించక ముందే మనము మేలుకోవలసి ఉంటుంది."

యౌగంధరాయణు డిలా అన్నాడు: "నీమాట నిజమే. అయితే కార్యసాధనకు మరొకమార్గం కనబడదు. ఏపనీ చేయకుండా ఉంటే ఉన్నతీరుకూడా చెడుతుంది. మనకున్న గారవం పోతుంది. ప్రభువు అనాదరానికి పాత్రులం కావలసి వస్తుంది. సచివాయత్తసిద్ధి అయిన రాజుకు సచివులప్రజ్ఞ కార్యసాధనము. వారు ఉత్సాహశూన్యులయితే సిరిసంపదలకు నీళ్ళు వదలాలి. చండమహాసేనుడూ, మహారాణి వాసవదత్తా మనం చెప్పినట్లు వింటారు. కార్యసాధనకు వెనక్కు తీయవద్దు."

ఆమాటలు విని శంకించి రుమణ్వంతుడు అన్నాడు: "ప్రియురాలి వియోగంవల్ల ఎంతవివేకి అయినా బాధపడక మానడు. ఇక మన వత్సరాజు సంగతి వేరే చెప్పాలా? ఈసందర్భంలో కథ వినండి:

ఉన్మాదినీ దేవసేనుల కథ

పూర్వము బుద్ధిమంతుల్లో అగ్రగణ్యు డయిన దేవసేనుడు అనే రాజు శ్రావస్తి రాజధానిగా చేసుకొని రాజ్యపాలన చేస్తున్నాడు. ఆ నగరములో మహాధనవంతు డయిన ఒకవర్తకుడికి చక్కనిచుక్క కూతు రున్నది. ఆపిల్ల అందచందాలు చూచి చాలామందికి మతులు పోవడమువల్ల ఆ అమ్మాయికి ఉన్మాదిని అని పేరువచ్చింది. లోకాతీత మైన అందము చిదిమిపోనే ఈపిల్లను రాజుకు చెప్పకుండా ఎవరికీ ఇవ్వ కూడదు. అలా సంబంధము ఏ దయినా చేస్తే రాజుకు కోపము వస్తుం దని తండ్రి ఆలోచన చేసినాడు. రాజు దగ్గిరికి వెళ్ళి ఆవర్తకుడు తన కుమార్తెసంగతి నివేదించినాడు. "ఏలినవారు నాకుమార్తెను స్వీక రించాలి" అని. ఆమాట విని రాజు తనకు నమ్మకమయిన విప్రులను పంపి కన్య శుభలక్షణాలు కలదేమో చూచి రమ్మన్నాడు. బ్రాహ్మ ణులు ఉన్మాదినిని చూచి వెంటనే విరహము పట్టలేక మతులు పోగొట్టు కొన్నారు. కొంచెం సేపటికి తెలివి వచ్చింది. "మహారాజు ఈకన్యను వివాహము చేసికొన్న ట్లయితే రాజకార్యములకు సీళ్లు వదలి ఈమె తోనే లోకము ఉన్న దనుకొంటాడు. ఇం కేముంది! అంతా నాశ నమే!" అని ఆబ్రాహ్మణులు ఒకమాటగా కూడబలుకుకుని రాజు దగ్గిరికి వెళ్లి కన్యకు శుభలక్షణాలు లే వని చెప్పినారు. రాజు ఆమెను స్వీకరించక పోవడముచేత వర్తకుడు తనకుమార్తెను సేనాధిపతికిచ్చినాడు.

ఒకనాడు మహారాజు వీధివెంట వెడుతూండగా ఉన్మాదిని అతన్ని మేడమీద మీదినుంచి చూచి ఒయ్యారంగా కనబరచింది. వెంటనే అతనికి మతిపోయింది. రాజమందిరానికి వెళ్ళి అతడు ఆలోచన చేసి ఉన్మాదినిగా గ్రహించినాడు. తాపము అధికమై మదనజ్వరము వచ్చింది. ఉన్మాదిని భర్త అయినసేనాధిపతి రాజు దగ్గిరికి వచ్చి ప్రణామము చేసి విన్నవించినాడు: "దేవా! నాభార్యను దేవాలయములో వదలుతాను.

వలినవారు దాన్ని దాసీగా స్వీకరిస్తే పరస్త్రీదోషము ఉండదు. తమరు అలా అనుగ్రహించండి" అని. "నేను పరస్త్రీముఖం చూడను. ఆమెను నీవు వదిలి వేస్తే అధర్మము ఆచరించినవాడివి అవుతావు. నేను నిన్ను దండించవలసి వస్తుంది." అన్న రాజు మాటలు విని మంత్రులు ఊరు కొన్నారు. క్రమముగా మహారాజు మదనజ్వరము తీవ్రమైపోవడంవల్ల చనిపోయినాడు. ధీరుడయిన ఆరాజే ఉన్నాడని లేక నశించినప్పుడు, వాసవదత్త చనిపోయిం దనుకొని వత్సరాజు వీమవుతాడో!"

యౌగంధరాయణుడు రుమణ్వంతుడి మాటలకు సమాధానము ఇచ్చి నాడు : "భావికాలములో శుభము చేకూరుతుందని రాజులు తాత్కాల క్లేశము సహించగలరు! రావణ నాశనముకోసం, దేవతలు యుక్తిగా శ్రీరాముడికి సీతావిరహము కలిగించలేదా! అప్పుడు రామచంద్రుడు ప్రియావిరహము సహించలేదా!"

రుమణ్వంతుడు పలికినాడు : "రామాదులు దేవతలు. అందువల్ల వారు సర్వమూ సహించగలరు. మానవబుద్ధి అలా సహించలేదు. అందుకు నిదర్శనముగా కథ వినండి :

యజ్ఞిల్లకుని కథ

బహుర శ్రేష్ఠమైన మధురాపట్టణం ఉన్నది. అక్కడ యజ్ఞిల్లకు డనే వైశ్యుడు ప్రియురాలే లోకముగా ఉంటున్నాడు. ఒకసారి అతడు పనిమీద ద్వీపాంతరం వెళ్ళవలసి వచ్చింది. కూడా భార్య ప్రయాణ మైనది. స్త్రీలమనస్సు, భావానురక్తము, విరహసహము. ఆమె అందంగా అలంకరించుకొని ప్రయాణానికి సిద్ధపడుతున్నప్పుడు అతడు తీసుకొని వెళ్ళలేదు. భర్త వెడుతుంటే గుమ్మము దగ్గర నిలుచుని కళ్ళనీళ్ళు పెట్టుకొన్నది. అతడు కంటికి కనపడకుండా వెళ్ళేదాకా చూచి, దృష్టి పథము దాటిపోయినతరువాత ప్రియునిఎడబాటు సహించలేక నిలువునా

ప్రాణాలు విడిచింది. భార్య పోయిన సంగతి అతడు తెలుసుకొని వచ్చి సుందరపాండుర మైన ఆమె ముఖము చూచి, ఆమె శిరస్సు తొడపైన పెట్టుకొని దుఃఖించినాడు. అతని ప్రాణాలుకూడా వెంటనే ఎగిరిపోయినవి. అన్యోన్యవిరహము వల్ల ఆదంపతులు మరణించినారు. అందువల్ల వత్సరాజుకు వాసవదత్తా విరహము కలగకూడదు.'' ఇలా శంకించి రుమణ్వంతుడు చెప్పగానే ధైర్యసాగరుడూ బుద్ధిశాలీ అయిన యౌగంధరాయణుడు: "ఇదంతా నేను బాగా ఆలోచించి నిశ్చయానికి వచ్చాను. రాజకార్యములు సాధారణముగా ఇటువంటివే. అందుకు నిదర్శనము విను'' అని ఇలా ప్రారంభించినాడు :

పుణ్యసేనుని కథ

పూర్వము ఉజ్జయినీనగరములో పుణ్యసేను డనే రాజుమీదికి బలశాలి అయిన పరరాజు దండెత్తి వచ్చినాడు. శత్రువును జయించడము సాధ్యముకాదని మంత్రులు ఆలోచించి, తమ రాజు చనిపోయినాడని మిథ్యావాదము పుట్టించి, అతన్ని ఒకచోట దాచినారు. మంత్రులు శవమును తెప్పించి రాజుకు తగిన రీతిగా దానిని దహన సంస్కారాలు చేయించి, శత్రురాజుతో "ప్రభూ! మాకు రాజు లేడు. నీవే మాకు రాజు కావాలి'' అంటూ దూతను పంపినారు. ఆ శత్రురాజు అందుకు సంతోషించి రాజసింహాసనము అధిష్ఠించినాడు. క్రమక్రమముగా రాజు స్కంధావారములో మంత్రులు భేదోపాయమువల్ల ఐకమత్యము పోగొట్టినారు. సైన్యములో చీలికలు రాగానే మంత్రులు పుణ్యసేనుని బయటకి తెచ్చి శత్రురాజునూ, అతని సేననూ వధించినారు. రాజకార్యాలు ఇలాగే ఉంటూ ఉంటవి. వాసవదత్తాదేవి కాలిపోయిందని వాదు పుట్టించి కార్యము ధైర్యంగా సాధించాలి.

యౌగంధరాయణుడు కృతనిశ్చయుడై అన్న మాటను రుమణ్వంతుడు "కర్తవ్యము ఇదే అని నిశ్చయించుకుంటే వాసవదత్తాదేవి అన్న

గోపాలకుని పిలిపించి, అతనితో సంప్రదించి కార్యము నెరవేర్చవలె" అన్నాడు. యౌగంధరాయణుడు అందుకు సరే నన్నాడు. మరునాడు మంత్రులిద్దరూ గోపాలకుని దగ్గిరికి దూతను పంపి అతన్ని తీసుకురమ్మన్నారు. గోపాలుడు రాగానే యౌగంధరాయణుడు కర్తవ్యము తెలియజేసినాడు. గోపాలుడు చెల్లెలు వాసవదత్త క్షేమమూ, రాజహితమూ కోరి, యౌగంధరాయణుడి ఇంగితము అంగీకరించి "మంత్రివర్యులు వన్నిన వన్నుగడ వసందుగా ఉన్నది. ప్రియురాలు అగ్నిలో కాలిపోయినదని బాధపడే వత్సరాజును కాపాడే ఉపాయము ఆలోచించాలి. ఉపాయసామగ్రి ఎంతయినా ఉండవచ్చును. అయితే మొదట రాబోయేకీడుకు వెంటనే ప్రతిక్రియ చేయవలె" అని చెప్పినాడు.

యౌగంధరాయణుడు చేయవలసినది ఇదివరకే ఆలోచించినాడు. "ఇందుకు విచారించడం అనవసరము. గోపాలకునికి చెల్లె లంటే ప్రాణం. ఇతనికి దుఃఖము స్వల్పముగా ఉండడము చూచి వత్సరాజు వాసవదత్త జీవించి ఉన్న దని ఆసతో మనస్సు చిక్కబట్టి జీవిస్తాడు. త్వరలోనే వత్సరాజుకు పద్మావతి భార్య అవుతుంది. ఆతర్వాత రాజు వాసవదత్తను కలుసుకొంటాడు. వాసవదత్తా వత్సరాజులను యుక్తివల్ల లావాణకప్రదేశానికి తీసుకొనిపోదాము. మగధరాజ్యాన్ని అంటిఉన్న ఆప్రదేశము వేటకు అనుకూలముగా ఉంటుంది. అందుచేత వత్సరాజు వేటకు వెళ్ళినసమయము చూచి వాసవదత్త నివసించే అంతఃపురానికి నిప్పంటించి మనఉపాయము సాధించుదాము. వాసవదత్తాదేవిని యుక్తిగా పద్మావతీగృహములో ఉంచుదాము. గుప్తముగా ఉన్న వాసవదత్తనడవడి కనిపెట్టి పద్మావతి సాక్షిణిగా ఉంటుంది."

ఇలా రాత్రి వారంతా ఆలోచన చేసి రాజసన్నిధానానికి వెళ్ళినారు. రుమణ్వంతుడు వత్సరాజుతో "దేవా! మనము లావాణకము వెళ్ళితే అక్కడ అందమయిన వేటభూములున్నవి. ఆదేశాన్ని మగధరాజు

బాధిస్తున్నాడు. ఆదేశరక్షణకో సమూ, వినోదార్థమూ మనము అక్కడికిపోదాము" అన్నాడు. వత్సరాజు వాసవదత్తతో లోకము కల్పించు కోవడంవల్ల రుమణ్వంతుడి మాటలు నచ్చి, లావాణకము వెళ్ళడానికి ఉద్యుక్తు డయినాడు.

మర్నాడు ముహూర్తము స్థిరపరచినారు. మహారాజు ప్రియాసహితముగా ప్రయాణ మయినాడు. నారదమునీంద్రుడు అతనికి సాక్షాత్కరించి పారిజాత ప్రసవమాల ప్రీతితో ఇచ్చి వాసవదత్తాదేవికి కామదేవాంశసంభూతుడూ విద్యాధరచక్రవర్తి అయ్యేకుమారుడు కలుగుతాడని ఆశీర్వదించినాడు. నారదుడు యౌగంధరాయణుడు వినేవిధముగా వత్సరాజుతో పలికినాడు: "రాజా! నీప్రియురాలిని చూచేప్పటికి నాకొకటి జ్ఞాపకము వస్తున్నది. పూర్వము నీతాతముత్తాతలు ధర్మరాజాదులు ఉండేవారు కదా. వారయిసుగురికీ ద్రౌపది ఒక్కతే భార్య. ఆమెకూ వాసవదత్తవలె సాటిలేని చక్కదనము ఉండేది. అందువల్ల దోష మూహించి వారితో మీరు స్త్రీవైరము రానియ్యక జాగ్రత్తగా ఉండాలి," అన్నాను. అదే లోకంలో ఆపదలకు కారణము అందుకు నిదర్శనంగా ఈకథ విను:

తిలోత్తమ కథ

"పూర్వము సుందోప సుందులనే ఇద్దరు అన్నదమ్ములు రాక్షసులున్నారు. వారు పరాక్రమంవల్ల మూడులోకములూ ఆక్రమించి అజేయులైనారు. వారిని నాశనం చేయడానికి బ్రహ్మ విశ్వకర్మచేత తిలోత్తమ అనే దేవతాంగనను సృష్టిచేయించినాడు. ఆమె బ్రహ్మచుట్టూ ప్రదక్షిణము చేస్తుండగా, నాలుగు దిక్కులా ఆమెఅందము చూడవలె నని బ్రహ్మదేవుడు చతుర్ముఖు డయినాడు. బ్రహ్మ ఆజ్ఞ శిరసావహించి తిలోత్తమ సుందోపసుందులను మోహంలో ముంచెత్తడానికి కైలాస

వనవాటికకు వెళ్ళినది. ఆరాత్రులు కామోద్రేకములో దగ్గరికి వచ్చిన ఆనుందరిని ఆలింగనం చేసుకొన్నారు. తిలోత్తమ నాకు కావా లంటే నాకు కావా లని వారిద్దరూ పరస్పరము యుద్ధం చేసి మరణించినారు.

స్త్రీ అన్ని ఆపదలకూ మూలము. మీపాండవు లందరికీ ద్రౌపది ఒక్కతే భార్య కనుక స్పర్ధరాకుండా మీరు ప్రవర్తించాలి. ఏదో ఒకయేర్పాటు చేసుకొనండి. ద్రౌపది పాండవులలో పెద్దవాడినగ్గిర ఉన్నప్పుడు, చిన్నవాడు ఆమెను తల్లిగా చూడవలసింది. చిన్నవాడి దగ్గిర ఆమె ఉంటే, పెద్దవాడు ఆమెను కోడలిగా చూడమనీ నేను చెప్పినాను. రాజా! మీతాతముత్తాతలు నామాట పాటించినారు. నీకోమాట చెపుతున్నాను. మీతాతలవలె నీవూ నీమంత్రులమాట పాటించు. తనిధముగా చేస్తే నీకు కల్యాణము కలుగుతుంది. కొంత కాలము నీకు దుఃఖము ప్రాప్తించినా అప్పుడు అతిహార్ద్యను కూడదు. ఆదుఃఖము ఆఖరికి సుఖంగా పర్యవసిస్తుంది."

నారదుడు అంతర్ధాన మైనాడు. రాబోయే కల్యాణమును అతడు సూచించి వెళ్ళినాడు. ఆయన అన్నట్టుగా యౌగంధరాయణాది మంత్రి వుంగవులు తమకోరిక సఫలము చేసుకోవలె నని నిశ్చయించి కార్య తత్పరు లయినారు.

యౌగంధరాయణాది మంత్రులు యుక్తిచేత వాసవదత్తా వత్సరాజు లను లావాణకము తీసుకొని పోయినారు. వత్సరాజు సైన్యసమేతముగా వచ్చినా డని మగధరాజు తెలుసుకొని తనమీద దండయాత్ర చేస్తా డేమో నని భయపడి, యౌగంధరాయణుడి దగ్గిరికి దూతను పంపి నాడు. మంత్రి ఆదాత్యము అంగీకరించినాడు. వత్సరాజు లావాణక ములో వేటకై దుర్గమారణ్యాలకు పెడుతూ ఉండేవాడు.

తరంగము : ౧౬

వాసవదత్తా మందిర దహనము

ఒకరోజు రాజు వేటకు వెళ్ళినాడు. యౌగంధరాయణుడు మహారాజుకు చేయవలసిన ఏర్పాట్లు చేసి, గోపాలక, రుమణ్వా, ద్వసంతకులతోకూడా వాసవదత్త దగ్గిరికి వెళ్లినాడు. అన్న గోపాలకుడు చెల్లెలు వాసవదత్తకు హెచ్చరిక చేసి, రాజకార్యములలో సాయము చేయవలె నని కోరినాడు. మంత్రి తలపెట్టిన ఉపాయము, భర్తతో కొంతకాలము ఎడబాటు కలిగించే దయినా వాసవదత్త అంగీకరించింది. కులాంగనలు భర్తలకై కష్టములు సహిస్తారు. యౌగంధరాయణుడు వాసవదత్తను బ్రాహ్మణీ వేషము ధరించ మన్నాడు. రూపము మార్చుకొనే యోగము ఆమెకు ఉపదేశము చేసినాడు. మంత్రి ఆదేశమును అనుసరించి వసంతకుడు ఏకాక్షి, బ్రహ్మచారిగా మారినాడు. యౌగంధరాయణుడు వృద్ధ బ్రాహ్మణరూపము తెప్పించుకొన్నాడు. అనంతరము అతడు వాసవదత్తనూ, వసంతకుణ్ణీ వెంట పెట్టుకొని మగధదేశము వెళ్లినాడు. ఆమె శరీరము మగధకు వెళ్లిందే కాని మనస్సుమాత్రము వత్సరాజు దగ్గిరికే వెళ్లింది. ఈలోగా రుమణ్వంతుడు వాసవదత్తాదేవి వానగృహానికినిప్పంటించినాడు. "అయ్యో! అయ్యో! వాసవదత్తాదేవీ వసంతకుడూ కాలిపోయినారు!" అని గగ్గోలు పెట్టినాడు. ఏకకాలములో పుట్టిన దహనరోదనాలు విజృంభించగా కొంతసేపటికి అగ్ని చల్లారినదేకాని రోదనము తగ్గలేదు.

వాసవదత్తను పద్మావతివద్దకు చేర్చుట

యౌగంధరాయణుడు వాసవదత్తా వసంతకులతో మగధ చేరినాడు. అతడు ఉద్యానపాలకులు అడ్డగిస్తున్నవ్వటికీ లక్ష్యము చెయ్యక వనములో మగధరాజపుత్రికదగ్గిరికి వెళ్ళినాడు. పద్మావతి బ్రాహ్మణీ రూప

ములో ఉన్న వాసవదత్తను కన్నులార కాంచినది. ఆమెహృదయములో వాసవదత్తమీద చెప్పలేనంతప్రీతి పుట్టినది. వృద్ధబ్రాహ్మణవేషములో ఉన్న యూగంధరాయణుడితో పద్మావతి "బ్రాహ్మణోత్తమా! ఈమె నీకే మవుతుంది? ఇక్కడికి ఎందుకు వచ్చావు?" అన్నది. యూగంధరాయణుడు "రాజపుత్రీ, ఈ అమ్మాయి నాకూతురు. ఈమెపేరు అవంతిక. నాఅల్లుడు దుర్వ్యసనాలలోపడి, నాకూతుర్ని విడిచి ఎక్కడికో వెళ్ళిపోయినాడు. ఈపిల్లను నీదగ్గర ఇల్లడగా (న్యాసం) చూచుకో. ఈలోగా అల్లుణ్ణి వెదికితెస్తాను. పిల్లను ఒక్కదాన్నే ఉంచితే బెంగపడుతుందని, సోదరుడయిన ఈ వీణాక్షినికూడా ఇక్కడనే ఉంచుతున్నాను. నీవు అనుగ్రహించాలి" అని వేడి, పద్మావతి దగ్గిర సెలవు పుచ్చుకొని లావాణకము వెళ్ళిపోయినాడు.

అనంతరము అవంతిక అనే పేరుతో ఉన్న వాసవదత్తనూ, బ్రహ్మచారి రూపములో ఉన్న వసంతకుణ్ణీ పద్మావతి ఔదార్యముతో సత్కరించి తన వినోదమందిరానికి తీసుకొని వెళ్ళింది. వాసవదత్త పద్మావతీమందిరములో కుడ్యములమీద చిత్రితమైన శ్రీరామచరిత్రములో అశోకవృక్షముక్రింద కూర్చున్న సీతాదేవిని చూచి, భర్తృవియోగాన్ని కష్టముమీద సహించింది. ఆమెలావణ్యము, నల్లకలువ పలె పరిమళించే తనుసౌరభము, శయనాసనసౌష్ఠవము మొదలయిన వానివల్ల పద్మావతి వాసవదత్తను మహాకులీనగా నిశ్చయించుకొన్నది. ఆమెకు కావలసిన ఉచితోపచారాలు చేస్తున్నది. పద్మావతి తనలో "ఈమె ఎవరో తెలియదు? ఇక్కడ ప్రచ్ఛన్నవృత్తిలో ఉన్నది. పూర్వము విరాటుని గృహములో ద్రౌపది అజ్ఞాతంగా ఉండలేదూ?" అనుకొన్నది. ఒకసారి వాసవదత్త పద్మావతితో అందచందాలు, అలంకరణాల్నీ గురించి మాట్లాడే సందర్భములో, తాను ప్రియుడి దగ్గిర అభ్యసించిన అమ్లానమాలాతిలకములు పద్మావతికి రచన చేసింది.

వద్మావతీదేవి ముఖాన మందు లొలుకుతున్న మాలాతిలకములు ఆమె తల్లి చూచి "అమ్మాయీ, ఎంతచక్కగా ఉన్నదమ్మా తిలకము! ఇంతముద్దుగా ఎవరు తీర్చి దిద్దారమ్మా!" అన్నది.

"అమ్మా, నామందిరములో అవంతిక అనే ఆమె రచించింది."
"అమ్మాయీ, ఇటువంటి శిల్పనైపుణ్యము సామాన్యులకు ఉండదు. ఏదేవతో ఏమో! దేవతలూ మునులూ వంచనచేయడానికి నజ్జనుల గృహాలలో ఉంటారట. అందుకు తార్కాణము విను:

"కుంతిభోజుడనే రాజుగారింటికి వంచన చేయవలెననే ఉద్దేశముతో దుర్వాసమహాముని వచ్చాడట. ఆయన పరిచర్యలోనము రాజు తన కూతురు కుంతిని నియమించినాడు. శ్రద్ధాభక్తులతో ఆమె ఋషికి ఉప చారాలు చేస్తున్నది. ఒకరోజు మునీంద్రుడు ఆమెను పరీక్షించాలని "నేను స్నానము చేసి వచ్చేసరికి క్షీరాన్నము సిద్ధంగా ఉండాలి." అని చెప్పి వెళ్ళి స్నానము చేసి వచ్చి భోజనానికి కూర్చున్నాడు. ఆమె మునికి ఎదుట క్షీరాన్న పూర్ణ మయిన పాత్ర ఉంచింది. వేడివేడిగా క్షీరాన్నము కాలుతుండడమువల్ల పాత్రను ఋషి పట్టుకోలేకపోయి నాడు. అతడు కుంతి వీపుకేసి చూచినాడు. అతని అభిప్రాయమును ఆమె గ్రహించి పాత్రను వీపుమీద పెట్టుకోసేసరికి వీపు కాలి బొబ్బ లెక్కింది. అయినప్పటికీ కుంతి కిక్కురుమనకుండా ఉండడం ముని చూచి సంతోషించి ఆమెకు వర మిచ్చి వెళ్ళినాడు. మునీంద్రుడు ఆమె గృహములో ఏవిధముగా ఉన్నాడో అదేవిధముగా అవంతిక నీవద్ద ఉన్నది. ఆమెను చాలా చక్కగా గౌరవించు" తల్లి మాటలు విని వద్మావతి మారువేషంలో ఉన్న వాసవదత్తను బాగా సన్మా నించింది.

వాసవదత్త ఎన్ని గౌరవాలు పొందుతున్నప్పటికీ ప్రియుణ్ణి ఎడ బాసి విరహపాండిమతో నిశీథములో పద్మినివలె ఉంటున్నది. వసంత

కుని కోతికొమ్మచ్చాయి చేష్టలను చూచేవ్వటికి ఆవిరహించికి కొంచెము చిరునవ్వు వచ్చేది.

ఈలోగా వత్సరాజు అతిదూరంగా ఉన్న వేటభూములు తిరిగి సాయంకాలము లావాణకము వచ్చి బూడిద అయిన అంతఃపురము చూచి, వాసవదత్తా వసంతకులు కాలిపోయినారని విన్నాడు. వెంటనే మూర్ఛవచ్చి నేలమీద పడినాడు. కొంతసేవటికి తెప్పరిల్లినాడే కాని హృదయములో శోకాగ్ని జ్వలించింది. వత్సరాజు ఆర్తితో గిలగిల కొట్టుకొంటూ ప్రాణాలు వదిలేశామని నిశ్చయము చేసుకొనేసరికి "వాసవదత్తవల్ల నాకు విద్యాధర చక్రవర్తి కాబోయే కుమారుడు కలుగుతాడని నారదుడు చెప్పాడు. అతనిమాట అబద్ధ మవుతుందా ! కొంతకాలం నాకు దుఃఖం కలుగుతుందని కూడా నారదుడు అన్నాడు. ఈ గోపాలక, యౌగంధరాయణులు విచారంతో కనపడరే ! బహుశః దేవి జీవించి ఉంటుంది. ఇది మంత్రుల యుక్తి కావచ్చును. ప్రియురాలితో నాకు సమాగమము కలగవచ్చు. అందుచేత పర్యవసానము చూడాలి" అని జ్ఞాపకము వచ్చింది. మహారాజుకు మంత్రులు ధైర్యము చెప్పినారు. వాసవదత్తాదేవి తండ్రి విచారపడకుండా ఉండేటందుకు గోపాలుడు దూతముఖంగా, రహస్యంగా ఆమె సంగతి తెలియజేసినాడు.

పద్మావతీ విజాపనము

మగధరాజు లావాణకవృత్తాంతము సర్వమూ చారులవల్ల తెలుసు కొన్నాడు. అదివరకే తనను యౌగంధరాయణుడు కోరిన ప్రకారము తన కుమార్తె పద్మావతిని వత్సరాజుకు ఇవ్వడానికి ఇష్టపడి, అంగీకారమును వత్సరాజుకూ, అతని మంత్రికీ తెలియ చేసినాడు. వత్సరాజు, మంత్రిమాటమీద పద్మావతిని పరిణయ మాడడానికి ఇష్టపడినాడు. అప్పుడు అతడు "ఇందులోనమే వాసవదత్తను దాచిపెట్టినారు కాబోలు"

అనుకొన్నాడు. వెంటనే లగ్నము స్థిరపరిచి యౌగంధరాయణుడు దూతముఖంగా మగధరాజుకు 'నీకోరిక మేము అంగీకరించినాము. నేటికి ఏడవరోజున పద్మావతిని వివాహమాడడానికి వత్సరాజు అక్కడికి రాగలడు. ఈ పరిణయమువల్ల పరమేశ్వరుడు వాసవదత్తను శీఘ్రముగా మరిచిపోవుగాక!" అని సందేశము పంపినాడు. ప్రతిదూత వెళ్ళి ఆ సందేశాన్ని మగధేశ్వరునికి నివేదించినాడు. మగధరాజు అందుకు అంగీకరించినాడు. అతడు తనకూతురిమీద వాత్సల్యమూ, తన, సిరి సంపదలకూ తగిననట్లు పెళ్ళిసరంజామా సిద్ధము చేయించినాడు. పద్మావతి ఇష్టుడైన వరునివల్ల సంతోషముతో పొంగిపోయింది. వాసవదత్త ఆవార్త విని విచారపడ్డది. వసంతకుడు వాసదత్తకు మాటమాత్రము ధైర్యము కలిగించినాడు. "ఈపద్మావతి పరిణయమువల్ల, వత్సరాజుకూ మగధేశ్వరునకీ మైత్రి ఏర్పడుతుంది. శత్రువయిన మగధరాజు మిత్రుడైనాడు. నీమీద వత్సరాజు ప్రేమతో ఉంటాడు." అని చెప్పినాడు.

వివాహము నడిపించగానే వాసవదత్త ఆమెకు మాలాతీలకరచన చేసింది. ఏడవనాడు వత్సరాజు సైన్యసమేతముగా, మంత్రులతో వివాహానికి వచ్చినాడు. వాసవదత్తావియోగవ్యథతో బాధపడే వత్సరాజు పద్మావతీదేవిని పరిణయ మాడడానికి ఎలా రాగలుగుతున్నా డని శంకించడము అనవసరము. అతడు తిరిగీ వాసవదత్తను పొందుతా ననే ప్రత్యాశ ఉన్నందువల్ల పద్మావతీపరిణయానికి అంగీకరించినాడు. చంద్రోదయమువల్ల సముద్రము ఉప్పొంగినట్లు పరమేశ్వరునిరాకవల్ల మగధరాజు ఆనందపరవశుడై అల్లుడికి ఎదురుగా వెళ్ళినాడు. వత్సవల్ల భుడు పురప్రవేశము చేస్తూండగా పురజన హృదయాబ్ధులలో మహోత్సవము ప్రవేశించింది. ఆమహీరమణుడు విరహముచేత కృశించి, మనోహరంగా ఉన్నపుడు పురకాంతలు అతన్ని రతీదేవి లేని మన్మథు డేమో అనుకొన్నారు. అతడు మగధరాజ ప్రాసాదము ప్రవేశించి

ముత్తైదువులతో కళకళ లాడుతున్న వివాహమందిరంలో పెళ్ళి కుమార్తెను, నిర్జితపూర్ణ చంద్రబింబను పద్మావతిని కౌతుకముతో చూచినాడు. ఆమె ధరించిన తన మాలాతిలకములు చూచి వత్సరాజు "ఈమెకు ఈమాలాతిలకములు ఎవరు రచించారు ?" అని వితర్కించుకొంటూ పరిణయవేదిక ఎక్కి పద్మావతీపాణి గ్రహించినాడు. ఆకర గ్రహణము పృథివీకర గ్రహణానికి ఆరంభముగా ఉన్నది. వాసవదత్తా ప్రియుడు వివాహ సంరంభము చూడలేడన్నట్లు, మంగళహోమ ధూమము అతని నేత్రాలను అశ్రువులతో మూసింది. పద్మావతీ వదనము అగ్నిప్రదక్షిణ సమయంలో ఎర్రనై, భర్త అభిప్రాయము గ్రహించి కోపారుణ మైనట్లు ప్రకాశించింది. వివాహ మయినతరువాత వత్సరాజు పద్మావతీపాణిని వదిలినాడి కాని వాసవదత్తను మనస్సులో నుంచి వదల లేదు. మగధరాజు అల్లుడి కిచ్చిన రత్నరాసులను చూస్తే, భూమిలో ఇక రత్నాలు లేవని అనవలసివస్తుంది ! అప్పుడు యౌగంధరాయణుడు "ఈ అగ్నిహోత్రసాక్షిగా అల్లుడితో మైత్రితో ఉంటా నని మగధరాజు సెలవీయాలి" అన్నాడు. మగధరాజు అందుకు అంగీకరించినాడు. వివాహ మహోత్సవ సమయంలో అందరికీ కట్నాలు వస్త్రాలు లభించినవి. చారణులు గానము చేసినారు. వేశ్యాంగనలు అభినయించినారు. అప్పుడు వాసవదత్తా దేవి తనప్రియుని అభ్యుదయము కోరి ఎక్కడో నిద్రిస్తున్నదానివలె కనపడకుండా పగటివేళ వెన్నెలవలె ఉన్నది.

మహామతి యౌగంధరాయణుడు మంత్రిభేదము శంకించి "వత్సరాజు అంతఃపురంలో ప్రవేశిస్తే వాసవదత్తా దేవిని చూడక మానడు." అనుకొని, వత్సరాజు నిజరాజధానికి తరలి వెడతా డని, మగధరాజుకు తెలియజేసినాడు. ఆయన అంగీరించినాడు. రాజధానికి తరలి వెళ్ళాలని మంత్రి వత్సరాజుకు తెలిపినాడు. ఆయన ప్రయాణానికి సిద్ధపడినాడు.

విందులూ, పానగోష్ఠీ అయిన తరువాత వత్సరాజు, పద్మావతీ సహితంగా, మంత్రులు వెంట రాగా తరలినాడు. వాసవదత్త పద్మావతి ఇచ్చిన సుఖవాహన మెక్కి, సేనవెంట రాగా, వసంతకుడు ప్రచ్ఛన్నముగా వెనుక రాగా, బయలుదేరినది. వత్సేశ్వరుడు లావాణకము చేరి పద్మావతితో మందిరము ప్రవేశించినాడు. తాను మాత్రము దేవి మనస్సులో ప్రవేశించినాడు. వాసవదత్త అర్ధరాత్రి అన్న గోపాలకుని దగ్గిరికి వెళ్ళినది. చెల్లెలిని చూచి ఆదరముతో అన్న కన్నుల నీరు నింపినాడు. ఆమె అన్నను ఆలింగనము చేసుకొన్నది. కన్నీరు మున్నీరుగా దుఃఖించింది. సరిగా అప్పుడే సంకేత ప్రకారము యౌగంధరాయణుడు రుమణ్వంతునితోకూడా రావడంతోటే అతన్ని వాసవదత్త ఆదరముతో చూచింది. ఆమె విరహవ్యథ తీరిన దని ఆయన ఓదార్చినాడు. ఈలోగా పద్మావతీదేవి అనుచరులు అమ్మగారి దగ్గిరికి వెళ్లి "దేవీ! మాతోకూడా ఇంతదూరము దాకా అవంతికమ్మ వచ్చి, మామాట తోసిరాజని గోపాలకుని ఇంటికి పోయింది" అని మనవి చేసినారు. వత్సరాజుముంను పద్మావతితో అనుచరులు విన్నవించగానే, ఆమెకు సంశయము తోచింది. వెంటనే ఆమె అనుచరులతో "వెళ్లి నామాటగా అవంతికతో చెప్పాలి. నాదగ్గిర ఆమె న్యానంగా ఉన్నది. నేను ఎక్కడ ఉంటే ఆమెకూడా అక్కడే ఉండాలి. మరోచోట ఆమె ఉండరాదు" అని చెప్పింది.

వాసవదత్తా ఉదయనుల పునస్సమావేశము

పద్మావతీదేవి ఏకాంతముగా ఉండడము చూచి వత్సరాజు ఆమెను కుతూహలముతో "ప్రేయసీ! నీకు ఈమూలాతిలకములు ఎవరు రచించారు?" అని అడిగినాడు.

"మాయింట్లో ఒక బ్రాహ్మణుడు అవంతికఅనే బ్రాహ్మణిని ఇల్లడము
ంచి వెళ్ళినాడు. ఇ దంతా ఆమెశిల్పనైపుణ్యము." అన్నది
వద్మ. ఆమె వాసవదత్త అయి ఉంటుందని రాజుకు తోచింది. అలాగే
ఎతడు నిశ్చయించుకొని గోపాలకునినివాసానికివెళ్ళేవ్యటికి పద్మావతీదేవి
ఎనుచరులు కనిపించారు. రాజు మందిరములో ప్రవేశించినాడు. అక్కడ
వాసవదత్త, గోపాలక యౌగంధరాయణ రుమణ్వద్వసంతకు లున్నారు.
వత్సరాజు గ్రహణముక్త మయిన చంద్రునివలె వియోగానంతరము
వచ్చినవాసవదత్తను చూచి దుఃఖముతో నేలమీద పడిపోయినాడు.
వియోగాతిశయమువల్ల పరిపాండుదుర్బలశరీరము గలవాసవదత్తాదేవి
హృదయము వియోగదుఃఖముతో పొర్లిపోగా, తన్ను తాను నిందించు
కొంటూ బావురు మన్నది. రాజదంపతులు ప్రవాసానంతరదుఃఖముతో
పలవిస్తుంటే, మహాధీరు డయినయౌగంధరాయణుని నేత్రాలు అశ్రు
పూరితము లయినవి. ఆ కోలాహలము విని పద్మావతి, ఆకులపాటుతో
సంగతి అంతా తెలుసుకొని వాసవదత్తా వత్సరాజులవలె తానుకూడా
దుఃఖించింది. ఇల్లాళ్ళు స్నేహముగ్ధలు కదా! వాసవదత్త పలుసారులు
'అయ్యో! నాభర్తకు ఎంత దుఃఖము కలిగించాను! నేనెందుకు జీవిం
పడం!" అని పలవించింది. ధీరు డయిన మహామంత్రి "దేవా! మగధ
రాజపుత్రికా లాభమువల్ల మీకు సామ్రాజ్యము లభిస్తుం దనిఇదంతా
చేసినాను. దేవికి దోషం చేయలేదు. విరహములో ఉన్నప్పుడు వాస
వదత్తా దేవిశీలానికి సాక్షిణిగా నవతి, ఈ పద్మావతే ఉన్నది" అన్నాడు.
మాత్సర్యరహితబుద్ధితో పద్మావతి "ఈమె శీలాన్ని ఋజువు చేయడా
నికి అగ్నిప్రవేశ మయినా చేస్తాను" అన్నది. వత్సరాజు "నానిమిత్తం
వాసవదత్త మహాబాధ అనుభవించింది. నేనే అపరాధిని. ఆమె
కానే కాదు" అన్నాడు. వాసవదత్త నిశ్చయాత్మికబుద్ధితో "మహా
రాజు సందేహము తీరడానికి నేను అగ్నిప్రవేశము చేస్తాను" అన్నది.

యౌగంధరాయణుడు తూర్పుగా తిరిగి ఆచమనము చేసి శుద్ధుడై "లోక పాలకులారా ! నేను రాజహితము చేసేవాడినే అయితే, వాసవదత్త పవిత్రురాలయితే ఆమాట చెప్పండి. మీరలా చెప్పకపోతే నాశరీరాన్ని వదలివేస్తాను" అన్నాడు. వెంటనే అశరీరవాణి మేఘగంభీరస్వరముతో "వత్సరాజా ! నీపూర్వ పుణ్యమువల్ల యౌగంధరాయణుడి వంటిమంత్రి, అపరదేవత వంటి వాసవదత్త లభించారు. నిజంగా నీవే ధన్యుడవు !" అన్నది. అక్కడివారు అర్రులెత్తి చెవులు రిక్కించి, నంతోషచిత్తులై మయూరవృత్తులయి విన్నారు. వత్సరాజు భావమరిది గోపాలకుడూ యౌగంధరాయణుని పొగడినాడు. భూచక్రమంతా తనచేతికి చిక్కినట్లు మహారాజు నిశ్చయించుకున్నాడు. అనుదినమూ అనురాగముతో పద్మావతీ వాసవదత్త లుండగా ఆనందములో మహారాజు ఓలలాడుతున్నాడు.

తరంగము : ౧౭

వత్సరాజు వాసవదత్తా పద్మావతులతో ఏకాంతములో పానలీలలు అనుభవించిన తరువాత గోపాలక రుమణ్వాద్యనంతక సహితముగా యౌగంధరాయణుని రావించి అందరితో గోష్ఠి జరుపుతున్నాడు. మహారాజు తన విరహప్రస్తావనలో కథ చెప్పినాడు.

ఊర్వశీ పురూరవుల కథ

పురూరవు డనే పరమవైష్ణవరాజు ఉన్నాడు. అతడు అడ్డులేకుండా భూలోక స్వర్గలోకాలలో తిరుగుతున్నాడు. ఒకనాడు ఆయన నందన వనములో విహరిస్తున్నప్పుడు మన్మథుడి అవరమోహనాస్త్రము వంటి ఊర్వశి అతన్ని చూచిన మాత్రాన వివశురాలై మూర్ఛపోయింది. చివరకు మోహము ప్రాణాపాయము తెప్పించేవ్పటికి, ఊర్వశినిచూచి

రంభాది అప్సరసల హృదయాలు గిలగిలలాడినవి. పురూరవుడు లావణ్య రసనిర్ఝరిణి అయిన ఊర్వశిని చూచి, ఆమెను ఆలింగనము చేసుకోవలె ననే తీవ్రవేచ్ఛవల్ల మూర్ఛపోయినాడు. పాలసముద్రములో ఉన్న శ్రీహరికి పురూరవుడిఅవస్థ తెలియగానే, ఆయన నారదుడితో, "నందన వనములో పురూరవుడు ఊర్వశిని చూచి మోహించినాడు. నీవు వెళ్ళి నామాటగా ఇంద్రుడితో చెప్పి, ఊర్వశిని పురూరవుడికి ఇప్పించు" అని చెప్పినాడు. విష్ణుదేవుని ఆనతి శిరసా వహించి నారదుడు పురూరవుణ్ణి మేలుకొలిపి "నీకోసము మహావిష్ణువు నన్ను పంపినాడు. ఆయన తన భక్తుల ఆపదలు చూడలేడు" అని అతన్ని ఓదార్చి ఇంద్రుని దగ్గిరికి తీసుకుపోయి అతనికి ఊర్వశిని ఇప్పించినాడు. ఆ ఊర్వశీ దానము స్వర్గానికి నిర్జీవకరణము, ఊర్వశికి మృతసంజీవనము అయింది.

పురూరవుడు దేవాంగనను భూలోకానికి తీసుకొని వచ్చి, మాన వుల కందిరికీ ఆశ్చర్యము కలుగజేసినాడు. ఒకరిచూపువల్ల మరొకరు బద్ధులయినట్లు ఆ ఊర్వశీ పురూరవులు క్షణముకూడా ఎడబాటు సహించ కుండా ఉన్నారు. ఇలా ఉండగా దేవదానవులకు మహాయుద్ధము సంభ వించింది. అప్పుడు ఇంద్రుడు పురూరవుణ్ణి సాయము చేయమని కబురు పంపించినాడు. పురూరవుడు ఇంద్రుడిదగ్గిరికి వెళ్ళినాడు.

దేవేంద్రపురూరవులు మాయాధరుడనే రాక్షసరాజును సంహరించి, ఉత్సవము చేసినారు. ఉత్సవ సందర్భములో తుంబురుడి సమక్షములో రంభ నృత్యములో పొరపాటు చేసింది. అందుకు పురూరవుడు నవ్వి నాడు. రంభ పురూరవుణ్ణి చూచి "నేను దివ్యనృత్యం చేశాను. నేను దివ్యస్త్రీని. నీవు మానవుడవు. నీకు నాట్యమర్మము ఎలా తెలిసింది?" అని అడిగింది. పురూరవుడు, "నీగురువు తుంబురునికి గూడా తెలియని నాట్యమర్మాలు, ఊర్వశీ సహవాసమువల్ల గ్రహించాను" అన్నాడు. తుంబురుడు కోపముతో "నీకు కృష్ణారాధన పర్యంతము ఊర్వశితో

వియోగము కలుగునుగాక" అని శాపము పెట్టినాడు. ఆ శాపము విని పురూరవుడు అకాలంలో అశనిపాతమువంటి మాట ఊర్వశికి చెప్పినాడు. ఎక్కడనుంచో గంధర్వులు వచ్చి, పురూరవుడికి కనపడకుండా, ఊర్వశిని ఎక్కడికో తీసుకుపోయినారు. ఇదంతా శాప ఫల మని పురూరవుడు గ్రహించి బదరికాశ్రమానికి వెళ్ళి శ్రీహరిని పూజిస్తున్నాడు. ఊర్వశి గంధర్వలోకంలో విరహంవల్ల వివశయై ఉన్నది. విరహదీర్ఘము లయిన నిశలను ఊర్వశిశాపము తీరుతుం దనే ప్రత్యాశతో గడుపుతున్నది. పురూరవుడు తపస్సుచేసి నారాయణుని మెప్పించినాడు. అప్పుడు గంధర్వపురుషులు ఊర్వశిని రాజు కిచ్చినారు. శాపము తీరినతరువాత భూలోకవాసి అయిన పురూరవుడూ, దివ్యాంగన అయిన ఊర్వశీ సుఖభోగాలు అనుభవించినారు.

వత్సరాజు చెప్పిన కథ విని వాసవదత్త తన వియోగసహనానికి సిగ్గుపడ్డది. మహారాజును సంతోషపెట్టడానికి యౌగంధరాయణుడు కథ చెప్పినాడు:

అహితసేనుని కథ

సంపదలతో తులతూగుతూఉండే తిమిరానగరంలో అహిత సేనుడనేరాజు ఉన్నాడు. అతనిభార్య భూలోకంలో అప్సరస. ఆయన ప్రియురాలితో ఎక్కువగా భోగాలు అనుభవించడంవల్ల జీర్ణజ్వరం వచ్చింది. వైద్యులు అతనికి భార్యాసాంగత్యము అవశ్య మని నిశ్చయించారు. దేవితో ఉపభోగము లేనందువల్ల మహారాజు హృదయంలో బిళ్ళ పుట్టింది. వైద్యులు మంత్రులతో రహస్యంగా, ఆవ్యాధి అతిభయంవల్లనో అతిశోకమువల్లనో తగ్గిపోతుం దని చెప్పారు. మంత్రులు ఆలోచన చేసినారు. మహాసర్పము వీపుమీద పడినా, శత్రువులు అంతఃపురం ప్రవేశించినా, కలతచెందని రాజుకు భయ మెలా కలుగుతుంది?

మంత్రులు మహారాణిని దాచిపెట్టి, ఆమె చనిపోయిందని రాజుతో మనవి చేశారు. ఆవార్త విని రాజు విపరీతంగా శోకించేటప్పటికి వ్యాధి తగ్గిపోయింది. మంత్రులు మహారాణిని రాజుకు తిరిగి అప్పగించారు. ప్రియురాలిని గుప్తము చేసినప్పటికీ రాజు మంత్రులను గౌరవించి, తెలివితేటలకు మెచ్చుకొన్నాడు. పతికి హితముచేయడము భార్య లక్షణము కదా!

స్వామి హితము కోరడము మంత్రిలక్షణము. వత్సరాజా, మీకు సమస్తభూమండలం లభిస్తుందని ఆలోచించి ఈ ఉపాయము చేశాము. మీమీద భక్తివల్ల వియోగాన్ని సహించిన వాసవదత్తాదేవి మీకు మహోపకారం చేసింది. ఆమె అపకారిణి కాదు."

మహారాజు మంత్రిమాటలు విని తానే అపరాధిగా భావించుకొని గర్వుకొని, "అవును. వాసవదత్త మూర్తీభవించిన నీతివలె నాకు భూమండల మంతా ఇచ్చింది, అనురాగాంధులకు సహనం ఉండదు. తొందరపడి అనుచితంగా మాట్లాడినాను." అని సల్లాపాలవల్ల, వాసవదత్తాదేవి లజ్జ ఒకసారే పోగొట్టినాడు.

మగధరాజు యౌగంధరాయణుడు చేసిన యుక్తిని గ్రహించి, దూతముఖంగా వత్సరాజుకు "నీమంత్రులు మమ్మల్ని మోసము చేసినారు. మాకు దుఃఖము కలిగించకుండా నీవు ప్రవర్తించాలి." అని సందేశము పంపినాడు. మగధేశ్వరుడికి సమాధానం పంపడానికి వత్సరాజు ఆదూతను పద్మావతిదగ్గిరికి పెళ్లమన్నాడు. ఆమె వాసవదత్తా సన్నిధిలోనే దూతకు దర్శన మిచ్చింది. దూత పద్మావతితో "మీ తండ్రిగారు చెప్పమన్న మాటలు. మిమ్మల్ని మోసంచేసి యౌగంధరాయణుడు తీసుకొనిపోయినాడు. మీ భర్తకు వాసవదత్తమీద అనురక్తి అధికం. రెండుకొప్పులు ఒకచోట ఎలా ఇముడుతవని మీతండ్రిగారు విచారిస్తున్నారు" అన్నాడు.

పద్మావతి "నామాటగా మాతల్లిదండ్రులతోచెప్పు. భర్త నామీద చాలా అనురాగముతో ఉన్నాడు. వాసవదత్త నాతో స్నేహంగా అక్కవలె ఉంటున్నది. సత్యప్రియులైన మానాయనగారు నాప్రాణాలు వదులుకోనిపక్షంలో, నాభర్తనుగురించి విపరీతచింత చేయకుండా ఉండాలి." అని దూతను సత్కరించి పుట్టింటికి పంపింది. దూత వెళ్ళి పోగానే, పుట్టింటిని తలుచుకొని విచారపడ్డది. వాసవదత్తను రంజించ డానికి వసంతకుడు కథ ఆరంభించినాడు:

సోమప్రభా గుహచంద్రుల కథ

పాటలీపుత్ర నగరములో ధర్మగుప్తుడనే ధనాఢ్యవైశ్యుడు ఉన్నాడు. అతనిభార్య చంద్రప్రభకు లేక లేక అందమైన కూతురు పుట్టింది. పుట్టీ పుట్టడంలో ఆపిల్ల శరీరకాంతితో ఇల్లంతా దేదీప్యమానంగా వెలిగిస్తూ లేచి కూర్చుని, స్పష్టంగా మాట్లాడడం మొదలుపెట్టింది. పురుటింట్లో ఉన్న స్త్రీలంతా తెల్లపోయి ధర్మగుప్తుడితో సంగతంతా చెప్పారు. అతడు భయపడి పురుటింట్లోకి వచ్చి, ఏకాంతంలో కూతురికి నమస్కరించి "ఓదేవీ! నీవెవరు? నాఇంట్లో అవతరించావు!" అన్నాడు. అప్పుడు ఆపిల్ల, "నన్నెవరికీ ఇచ్చి పెళ్ళిచెయ్యకు. నీఇంట్లో నేను ఉన్నంతకాలం శుభం చేకూరుతుంది. తక్కిన సంగతులు అడిగి లాభ మేముంది?" అన్నది. బిడ్డ మాటలు విని ధర్మగుప్తుడు భయపడ్డాడు. కుమార్తె చనిపోయిం దని పుకారు పుట్టించి, రహస్యంగా ఇంట్లో పెంచుతున్నాడు. ఆ అందాల కుప్పకు తండ్రి సోమప్రభ అని పేరు పెట్టినాడు. ఒకరోజున ఆమె మేడ మీద పచారుచేస్తూ వసంతోత్సవం చూస్తూన్నది. గుహచంద్రుడనే వైశ్యపుత్రుడు సోమప్రభను చూచి మోహించాడు. అతని అస్వస్థత గ్రహించి తల్లిదండ్రులు పదేపదే అడిగినారు. అతనిస్నేహితులు అస్వస్థతకు కారణము చెప్పారు. గుహచంద్రుని తండ్రి గుహసేనుడు ధర్మ

గుప్తుని దగ్గిరికి వెళ్ళి తన కుమారునికి సోమప్రభను ఇమ్మని కోరినాడు. ధర్మగుప్తుడు అందుకు నిరాకరిస్తూ "నా కొక్కడి దోయి పిల్ల!" అన్నాడు. పిల్లను ఇంట్లో ఉంచుకుని లేదంటున్నా డని గ్రహించి గుహసేనుడు ఇంటికి వెళ్ళి కొడుకుతో, "ఈవిషయంలో రాజును ప్రేరేపిస్తాను. అదివరకు నేను రాజుగారికొలువులో ఉండేవాణ్ణి కూడాను. ఈ అవస్థలో రాజు సహాయం చెయ్యకపోడు" అన్నాడు. వర్తకుడు రాజుకు రత్నం ఇచ్చి నంగతి మనవి చేసినాడు. రాజు సంతోషించి గుహసేనుడికి కొత్వాలును సహాయం ఇచ్చాడు. కొత్వాలు సైన్యం తీనుకువెళ్ళి ధర్మగుప్తుని ఇల్లు ముట్టడించాడు. సర్వనాశనం సంభవిస్తున్న దని భయపడి, కంఠగతప్రాణంతో ఉన్నతండ్రితో సోమప్రభ, "నాన్నా, నన్ను ఇచ్చేసెయ్యి. నావల్ల నీ కెందుకు హాని? నీ వియ్యంకునితో ఒక మాటు చెయ్యి. పెళ్లి చేసుకొన్నతర్వాత భర్తనన్ను శయ్యకు చేర్చ రాదు. అదీ మాటు" అన్నది. ధర్మగుప్తుడు కుమార్తె చెప్పిన మాటలు వియ్యంకుడితో చెప్పినాడు. కుమారుడికి పెళ్లి అవుతుంది గదా అని సంతోషించి గుహసేనుడు అందుకు అంగీకరించినాడు. పెళ్ళి అయింది. సోమప్రభ అత్తవారింటికి వెళ్ళింది. సాయంకాలము తండ్రి కొడుకుతో "నాయనా, నీభార్యను శయ్యకు చేర్చవద్దు." అని, చెప్పినాడు. తన షరతు మామగారికి జ్ఞాపకంచేస్తూ తర్జనితో ఆమె బెదిరించింది. ఆవేలు చూడగానే అతనిప్రాణాలు ఎగిరిపోయినవి. మిగతావారికి భయం వేసింది. గుహసేనుడు చనిపోయాక, కుమారుడు తన ఇంట్లో మహా మారిగా భార్య ప్రవేశించిందని నిశ్చయించుకొన్నాడు. గుహచంద్రుడు ఆమెను తొలక ఇంట్లో ఉంచుకొని అసిధారావ్రతం నడుపుతున్నాడు. అతనికి లోపలవిచారము, భోగాలమీద విరక్తికలిగి అతడు బ్రాహ్మణులకు దానధర్మాలు చేసి, భోజనాలు పెడుతున్నాడు. సోమప్రభ మౌన వ్రతం అవలంబించి, భోజనానంతరం బ్రాహ్మణులకు దక్షిణలు ఇస్తున్నది.

ఒకనాడు మునిబ్రాహ్మణుడు భోజనానికి వచ్చి, జగదేకసుందరి అయిన సోమప్రభను చూచి ఏకాంతములో ఆమెభర్తను అడిగినాడు, "ఈ పిల్ల నీకే మవుతుంది?" అని అడిగినాడు. ఆయన నిర్బంధంవల్ల గుహచంద్రుడు రహస్యము దాచక చెప్పివేసినాడు. ఆ వృద్ధబ్రాహ్మణునికి అతనిమీద దయ కలిగింది. ఈప్సితం నెరవేరడానికి అగ్నిమంత్రం ఉపదేశించినాడు. గుహచంద్రు డామంత్రం పునశ్చరణ చేస్తుండగా, అగ్నిలోనుంచి దివ్యపురుషుడు ఉద్భవించినాడు. అతనిపాదాలమీద గుహచంద్రుడు మోకరిల్లినాడు. అగ్నిదేవుడు "ఈరోజు నీయింట్లో నా భోజనం, రాత్రి ఇక్కడే ఉండి, నీకోరిక ఈడేరేవిధం సాధిస్తాను." అని చెప్పి వెళ్ళిపోయినాడు. తక్కిన బ్రాహ్మణ్యంతోపాటు అతడూ భోజనంచేసి, రాత్రి గుహచంద్రునిదగ్గర జాముసేపు జాగ్రత్తగా శయనించాడు. అంత నిద్రిస్తున్న సమయంలో సోమప్రభ అక్కడికి వచ్చింది. అప్పుడు వృద్ధబ్రాహ్మణుడు గుహచంద్రుని నిద్రలేపి 'రావోయి, నీభార్యనంగతి చూతువుగాని' అంటూ, మోహమాయతో గుహచంద్రుని తుమ్మెదను చేసి, తానూ అలాగే తుమ్మెదగామారి, అతనికి సోమప్రభను చూపినాడు. ఆసుందరాంగి ఊరువెలుపల చాలాదూరం వెళ్ళింది. ఆమెతో కూడా వృద్ధబ్రాహ్మణుడు, గుహచంద్రుడూ తుమ్మెదల రూపాల్లోనే అనుసరించారు. వెళ్ళగా వెళ్ళగా విశాలమయిన మర్రిచెట్టు చూశారు. ఆచెట్టుకింద వీణావేణు మనోహరగానం వారివీనులకు సోకింది. ఆ మర్రిచెట్టు కొమ్మమీద మహాసనంమీద తనభార్యవంటి దివ్యస్త్రీని, గుహచంద్రుడు చూచినాడు. అతనిభార్య ఆ దివ్యస్త్రీ పక్కనే కూర్చున్నది. ఆ రాత్రి సమానకాంతి గల ఆ యిద్దరినీ చూడగా ముగ్గురు చంద్రులు వెలుగుతున్నట్టు తోచింది. "ఏమిటి, ఇది స్వప్నమా? భ్రాంతి కాదు గదా? ఈరెండూకూడానా? నాకు శుభఫలం చేకూరుతుం దని

తోస్తున్నది." అని గుహచంద్రుడు ఆలోచిస్తుండగా, ఆ స్త్రీ లిద్దరూ భోజనానంతరం దివ్యాసనము పానముచేశారు.

"అక్కయ్యా! ఇవాళ మాయింటికి తేజశ్శాలి అయినబ్రాహ్మణుడు వచ్చాడు. నా కేమో భయంగా ఉన్నది ఆయన రాకవల్ల. నేను ఇంటికి పోవాలి" అంటూ గుహచంద్రునిభార్య సోమప్రభ, దివ్యాంగన దగ్గిర సెలవు తీసుకొని, చెట్టు దిగింది. అప్పుడు తుమ్మెదల రూపాలలో ఉన్న బ్రాహ్మణుడూ, గుహచంద్రుడూ ముందుగానే ఇంటికి వచ్చి, ఎప్పటిలాగే పరున్నారు. సోమప్రభ ఇల్లు చేరి ఎవరికీ తెలియకుండా తన మందిరంలోకి వెళ్ళింది.

అప్పుడు బ్రాహ్మణుడు గుహచంద్రునితో "చూచావా, నీభార్య మానవస్త్రీ కాదు! ఇవాళ నీభార్య సోదరిని కూడా చూచావుకదా? ఆమెకూడా దేవతే! నీభార్య దేవత కనుకనే నీపొందు అంగీకరించలేదు. నీకోరిక సిద్ధించేందుకు ద్వారముమీద రాయవలసిన మంత్రం ఒకటి ఉంది. ఆమంత్రానికి తోడు బాహ్యయుక్తికూడా చెప్పాలి. అగ్ని స్వయంగానే జ్వలిస్తుంది. గాలికూడా సాయపడితే ఇంకవేరే చెప్పవలెనా! మంత్రము ఒకటే నీకార్యం సఫలం చేస్తుంది. దానికితోడు. యుక్తి చెపుతున్నాను. మంత్రం అద్భుతంగా పనిచేస్తుంది." అని చెప్పి తెల్లవారగానే శయ్యామందిర ద్వారము మీద మంత్రాన్ని రాసినాడు. సాయంత్రం మంత్రాన్ని ప్రయోగించే యుక్తికూడా సాధించాడు. యుక్తి ప్రకారం గుహచంద్రుడు అలంకారాలు ధరించి సోమప్రభకు కనబడేలాగ వేశ్యతో సరససల్లాపాలు ఆరంభించాడు. ఆమెకు ఈర్ష్య కలిగింది. మంత్రమహిమవల్ల సోమప్రభ మోహనముద్ర వదిలి, "ఎవత్తె అది?" అని ప్రశ్నించింది. "ఇది వేశ్య. నామీద దీనికెంతో ప్రేమ. దీని ఇంటికి పోతాను." అని అతడు చక్కగా అబద్ధమాడాడు. సోమప్రభ భర్త కేసి ఓరచూపులు చూస్తూ, కనుబొమ్మలు ముడివేస్తూ,

ఎడమచేతితో అతన్ని వారిస్తూ "సరి, సరి, తెలిసింది. అందుకా మీ వేషం! వేశ్యతో వెళ్ళకండి. నేను మీభార్యను. నేనుండగా మీ కేం కావాలి?" అని మంత్రమహిమవల్ల ఆవేశంతో పలికింది. ఆమెశరీరం పులకరించింది, వణికింది, సంక్షోభించింది. భార్యాభర్త లిద్దరూ శయ్యా గృహంలో భోగాలు అనుభవించినారు. మంత్రప్రభావం వల్ల గురుహాచం ద్రుడు దేవత అయిన భార్యను వశంచేసుకొన్నాడు. యాగములు, దాన ధర్మాలు మొదలయిన సత్కర్మలు ఆచరించే వారి ఇళ్ళల్లో శాప చ్యుతలయిన దేవతాస్త్రీలు ఇల్లాళ్లుగా ఉంటారు. సజ్జనులు దేవబ్రాహ్మణ పూజే కామధేనువని అంటారు, దానిముందు సామదానాది ఉపాయాలు ఎందుకు వనికి వస్తవి? అలాగే దివ్యపదవిలో ఉన్నవారిని దుష్కృతం అధోగతిపాలు చేస్తుంది.

అహల్యా వృత్తాంతము

పద్మావతికి వసంతకుడు చెపుతున్నాడు. "పూర్వము త్రికాలవేది అయిన గౌతమమహర్షి భార్య అహల్య. ఇంద్రుడు ఆమెరూపము చూచి మోహించి, ఏకాంతంలో తనకోరిక తీర్చ మని ఆమెను ప్రార్థించినాడు. ప్రభువుల చిత్తము ఐశ్వర్యమదమువల్ల యథేచ్ఛగా ప్రవర్తిస్తుంది కదా! అహల్య అతనికోరికకు సమ్మతించింది. గౌతమ మహర్షి నిజతపః ప్రభావంవల్ల భార్యమనోవికారమును గ్రహించ గలిగి నాడు. గౌతముడు అక్కడికి వచ్చేటప్పటికి ఇంద్రుడు భయపడి మార్జాలరూపం ధరించినాడు. గౌతమమహర్షి అహల్యతో "ఇంతకు ముందు ఇక్కడున్నవాడు ఎవడు?" అన్నాడు. ఆమె అపభ్రంశ భాషలో "ఏసో మ్హ మజ్జారో" అన్నది. మజ్జారో అంటే మార్జాల మనీ, మజ్జారుడు అనీ రెండర్థాలు వస్తవి. "నిజానికి ఆవచ్చినవాడు జారుడే" అని మహర్షి నవ్వి, భార్య నిజం చెప్పినందుకు శాపవిముక్తి

అనుగ్రహించినాడు. "వననంచారం చేసి తిరిగి వచ్చే శ్రీరామచంద్రుని దర్శనం కలిగేదాకా నీవు శిలారూపంలో ఉండాలి." అని తర్వాత ఇంద్రుని శపించినాడు. శాప మిచ్చి తపస్సు చేసుకోడానికి మహర్షి వెళ్ళిపోయినాడు. అహల్య శిలారూపిణి అయింది. దుష్కృతానికి ఫలం ఎప్పుడూ ఉంటుంది. ఎవరు ఏగింజ నాటితే, వారు ఆఫలం అనుభవించక తప్పదు. మహానుభావులు కేవల విరుద్ధవిషయాలలో ఉత్సాహము వహించరు. ఉత్తములకు ఇదే విధిసిద్ధ మయిన నియమం. మీరిద్దరూ పూర్వజన్మలో అక్కచెల్లెళ్ళు. శాపమువల్ల ఇలా జన్మించారు. అందు వల్లనే మీహృదయాలు ఏకమై అరమరలు లేకుండా సఖ్యంగా ఉన్నవి.

వసంతకుడు చెప్పినదంతా వాసవదత్తా పద్మావతులు విని, ఈర్ష్య లేకుండా కలిసి మెలసి ఉన్నారు. పద్మావతి జరిపిన దాక్షిణ్యమువల్ల మగధేశ్వరుడు వాసవదత్తాదేవి సహృదయము గ్రహించి సంతోషించినాడు.

దిగ్విజయాలోచన

మరునాడు మంత్రి యౌగంధరాయణుడు రాణి మొదలయినవారి సన్నిధిలో వత్సరాజును సందర్శించి ఇలా పలికినాడు. "రాజేంద్రా! త్రైత్రయాత్రకు మీరు కౌశాంబీనగరానికి వెళ్ళరేమి? మన తంత్రానికి లొంగిపోయి మగధరాజు మనజోలికి రాడు. కన్యాసంబంధ మనే రజ్జువుతో అతన్ని కట్టివేశాము. మనతో పోరి తనకుమార్తెను, ప్రాణాధికను పోగొట్టుకొంటాడా? అతన్ని, మీరు మోసం చేయ్యలేదు. ఇదంతా స్వయంగా నేనే చేశాను. ఇందువల్ల అతనికి చెరుపు ఏమీ లేదు. మగధరాజుకు మనమీద కోపం లేదనీ, ఇష్టమే ననీ దూతల వల్ల తెలియనే తెలిసింది."

సంకల్ప సిద్ధు డయిన యౌగంధరాయణుడు ఇలా వత్సరాజుతో అంటున్నప్పుడు మగధేశ్వరుని దగ్గిరనుంచి దూత వచ్చినాడు. రాజాజ్ఞ పొంది ప్రతీహారి దూతను రాజమందిరంలోకి పోనివ్వగా ఆదూత మహా

రాజుకు ప్రణామం చేసి ఇలా విన్నవించినాడు: "దేవా! పద్మావతీ దేవి పంపిన సందేశానికి మగధరాజు సంతోషించి తమకు తెలియచేయ మన్నారు. మాటలతో పనేమిటి? సర్వమూ తెలిసింది. ఈ వివాహ సంబంధమువల్ల మగధరాజు మీకు వశ్యుడైనాడు." దూత చెప్పిన మాటలు మహారాజు విని మంత్రిని రాజనీతి అనే వృక్షకుసుమముగా అభినందించినాడు. వాసవదత్తా పద్మావతులు వచ్చి బహుమతులతో ఆదూతను సత్కరించి పంపించారు. అనంతరము చండమహాసేనునిదూత వచ్చి మహారాజుకు ప్రణామం చేసి విన్నవించినాడు: "దేవా! మా రాజుగారు తమతో మనవి చేయమన్నారు. మీకీర్తికి చిహ్నము మీ మంత్రి యౌగంధరాయణుడు. మీమీద భక్తి గల వాసవదత్త ధన్యురాలు. ఆమె చేసిన సత్కార్యంవల్ల మాకు చిరకాలం నలుగురిలో తల ఎత్తుకొని ఉండేయోగ్యత కలిగింది. పద్మావతి మాకు వాసవదత్త కన్న వేరు కాదు. ఆసవతు లిద్దరి హృదయాలూ నఖ్యంగా ఉన్నవి. కనుక శీఘ్రమే దిగ్విజయం ఆరంభించాలి." మామగారి సందేశం విని వత్సరాజు సంతోషంతో పొంగిపోయినాడు. వాసవదత్తమీద అతనికి అనురాగం అధిక మయింది. మహామంత్రి యౌగంధరాయణునిమీద మహానురాగం కలిగింది. వత్సరాజు, దేవేరులూ ఆదూతను సత్కరించి పంపించినారు. దిగ్విజయమనే మాహవిషయమై రాజు మంత్రులతో ఆలోచన చేసినాడు. వారి మంత్రప్రకారం మహారాజు కౌశాంబికి బయలు దేరినాడు.

తరంగము: ౧౪

ఉదయనుడు కౌశాంబిలో ప్రవేశించుట

వత్సరాజు లావాణక దేశమునుంచి మంత్రులతోను భార్యలతోను కౌశాంబీ నగరానికి తరలి వెళ్ళినాడు. అకాలములో పొంగిన సము ద్రాలవలె భూమండలంఆక్రమిస్తూ సైన్యంవెంట వస్తున్నది. మహారాజుకు

శ్వేతచ్ఛత్రము పట్టినారు. ఆయనదగ్గిర సామంతరాజులు తమతమ స్థానాలలో ఉండి, ప్రభువు గుణగణములను ప్రశంసిస్తూ పరివేష్టించి నారు. మహారాజుకు వెనుక పిడివేనుగమీద దేవేరులు ఇద్దరూ వస్తు న్నారు. వందిమాగధులు కైవారములు చేస్తూ ప్రయాణం సాగి స్తున్నారు. ఇలా ప్రయాణం చేసి మహారాజు నిజపరివారంతో మహో త్సవముతో కలకలలాడే కౌశాంబీనగరం ప్రవేశించినాడు. ఆ పురలక్ష్మి వత్సవల్లభుని చూచి ఆనందతరంగిత అయింది. మహారాజూ, అతని భార్యలూ, పురస్త్రీలకు కన్నులపండుగ చేసినారు. ఆనగరంలో మేడల మీద కిటికీలలో ఎక్కడ చూచినా పురాంగనలు రెప్ప లార్చక మహా రాజును కుతూహలంగా చూచేవారే! రాజదర్శనేచ్ఛవల్ల ఒకరమణి రవికముడిమీట మరిచి కిటికీదగ్గిరికి పరుగెత్తుకొని వచ్చింది. ఒకామె ముత్యాలహారం గుచ్చుతూ వత్సేశ్వరుణ్ణి దర్శించా లనే తహతహతో కిటికీవద్దకు వచ్చేటప్పటికి హారం పెరిగిపోయి, ఆమె ఆనందాశ్రువులవలె ముత్యాలు రాలినవి. కొంతమంది వాసవదత్తాదేవి అగ్నిదగ్ధ అయి జీవించినవిషయం మాటాడుకొంటున్నారు. వాసవదత్తా పద్మావతుల రూపాలను ప్రశంసిస్తున్నారు కొందరు.

మహారాజు దేవేరులతో నగరప్రవేశము చేసేసరికి రాజమందిరానికి అపూర్వశోభ వచ్చింది. రాజమందిర మంతా సామంతరాజుల కానుక లతో నిండిపోయింది. వత్సరాజు రాజబృందాన్ని సమ్మానించి అంతఃపురంలో ప్రవేశించినాడు. ఆయన దినశేషాన్ని ప్రియలతో, పానగోష్ఠు లతో, లీలతో గడిపినాడు.

నిధిలాభము

మరునాడు వత్సరాజు మంత్రులతో ఆస్థానంలో ఉండగా, ఒక విప్రుడు ద్వారస్థానమునుంచి 'ప్రభూ, ప్రభూ, కాపాడాలి! అడవిలో

పాపు లయినగోపాలకులు నిష్కారణంగా నా కుమారునిపాదము సరికి వేశారు. ప్రభూ, మీరే దిక్కు!' అని మొర పెట్టినాడు. వెంటనే వత్సరాజు ముగ్గురు గోపాలకులను పట్టించి తెప్పించి వృత్తాంతం అడిగినాడు. గోపాలకులు రాజుతో ఇలా విన్నవించారు. "దేవా! మేము పశువులను కాచుకుంటూ, విజనస్థలాల్లో విహరిస్తూ ఉంటాము. మాలో దేవసేను డనే గొల్లవా డున్నాడు. వాడు రాతిమీద కూర్చుని తాను రా జని చెప్పి మమ్మల్ని, పీలుతాడు. వాడిమాట ఎవరూ జవదాటరు. ఈప్రకారం గోపాలురు అరణ్యంలో రాజ్యం చేస్తుండగా దారివెంట పోతూ ఈ బ్రాహ్మణపిల్లవాడు మా గొల్లదొరకు నమస్కారం చెయ్యలేదు. ఎంత చెప్పినా పిల్లవాడు వినలేదు. అప్పుడు గొల్లదొరకు కోపం వచ్చింది. వెంటనే బ్రాహ్మణ పిల్లవాడి కాళ్ళు నరికివేయ మని రాజాజ్ఞ అయింది. రాజాజ్ఞను ఎలా మీరడం?" గోపాలకులు ఇలా విన్నవించే సరికి బుద్ధిమంతుడు యౌగంధరాయణుడు ఆవిషయం చక్కగా ఆలోచించి ప్రభువుతో "రాజేంద్రా! ముమ్మాటికి నిశ్చయం. అక్కడ ఆ గొల్లల కేదో నిధినిక్షేపం దొరికింది. ఆనిధిలాభంవల్లనే గోపాలునికి ఇంత ప్రభుత్వం కలిగింది. మనము అక్కడికి పోదాము" అన్నాడు. మహారాజు గోపాలకులనే దారి చూప మని నియమించి నేనా నమేతంగా ఆఅరణ్యానికి వెళ్ళినాడు. ఆప్రదేశాన్ని పనివాళ్ళు పరీక్షచేసి నిధి కోసం తవ్వడం ఆరంభించినారు. కొంత మేర తవ్వేటప్పటికి శిలామూపు డయిన యక్షుడొకడు బయటకు వచ్చి 'రాజేంద్రా! ఈనిధి నీతాత పాతిపెట్టించినాడు. చాలా కాలం నేను దీన్ని కాపాడినాను. ఈ నిధి తీసుకో!' అని పలికి వెంటనే యక్షుడు అదృశ్య డైనాడు. ఆగోతిలో రత్నసింహాసనం వత్సరాజుకు దొరికింది. అభ్యుదయ కాలంలో కల్యాణ పరంపర కలుగుతుంది గదా! అప్పుడు వత్సరాజు గొప్ప ఉత్సవంచేసి ఆనిధానం తీసుకొని, గోపాలకులను అభినందించి, రాజధానికి వెళ్ళినాడు.

మహారాజు రత్నసింహాసనాన్ని తీసుకురాగా పురజనులు సంతోషం పట్టలేకపోయినారు. మంత్రులు మహోత్సవం చేశారు. ఉత్సవసమయంలో యౌగంధరాయణుడు వత్సరాజుతో తనయభిప్రాయం తెలియచేసినాడు: "దేవా! కులక్రమాగత మయిన మహాసింహాసనం లభించినప్పుడు, మీరు దీనిని ఎక్కి అలంకరించడం సమంజసం" అని. "నా తాతముత్తాతలు భూమండలం జయించి ఈ సింహాసనం అధిష్ఠించినారు. నేను వారివలెనే చక్రవర్తినై సింహాసనం అధిష్ఠించాలి. రాజ్యాలను జయించక రత్నసింహాసనం అలంకరిస్తే నా కేమి కీర్తి? ఈ సాగరాంత భూమండలమును జయించి నాపూర్వుల రత్నసింహాసనం అధిష్ఠిస్తాను." అంటూ మహారాజు సింహాసనము ఎక్కలేదు. గొప్పవారికి అభిమానము ఎక్కువకద్దా! యౌగంధరాయణుడు వత్సేశ్వరునితో "మంచిది మహారాజా! తూర్పుదిక్కున దిగ్విజయము ఆరంభించుదాము" అన్నాడు. "ఉత్తరాది దిక్కు లుండగా, మొదట తూర్పుదిక్కునే జయించడ మేమిటి?" అన్నాడు వత్సరాజు.

అప్పుడు మంత్రి "కుబేరునిదిక్కు గొప్పదయినా, మ్లేచ్ఛసహవాసం వల్ల కలుషమయింది. సూర్యుడు పశ్చిమాన అస్తమిస్తాడు కనుక పశ్చిమదిగ్విజయం ఆదిలో మంచిది కాదు. దక్షిణదిక్కు రాక్షసాక్రాంతము కనుక, అది యోగ్యం కాదు. తూర్పున సూర్యోదయం అవుతుంది కనుక, దేవేంద్రుడు వరిపాలించేది కనుక, గంగ తూర్పు వైపే పారుతున్నది కనుక, తూర్పు శ్రేష్ఠమైనది. హిమవద్వింధ్యపర్వత దేశాలలో గంగ ప్రవహించే దేశాలే శ్రేష్ఠములు. కల్యాణకాంక్షుల మయిన మనము తూర్పువైపే పోదాము. మీపెద్దలుకూడా తూర్పు దిశనే మొదట జయించి, అనంతరం తక్కినదిశలు స్వాధీనం చేసుకొన్నారు. శతానీకుడు కౌశాంబీనగరం రమ్య మైన దనీ, సామ్రాజ్యము పౌరుషాధీనం కాని, దైవాధీనం కాదనీ నిశ్చయించుకొని హస్తినాపురంలో నివసించినాడు.

మంత్రి మాటలు విని మహారాజు శౌర్యధనుడు కావడంవల్ల "సత్యము! సామ్రాజ్యానికి దేశము కారణం కాదు. బలవంతులకు పౌరుషమే సంపత్కారణము. ఏకాకి అయినా, ఆశ్రయహీను డయినా సిరిని చేపట్టగలడు. మీరెప్పుడూ నత్త్వవంతునికథను వినలేదూ?" అన్నాడు. మంత్రులందరూ కథాకర్ణన కుతూహలాయత్తచిత్తు లైనారు. వత్సరాజు దేవేరుల సన్నిధిలో ఇలా చెప్పినాడు :

విదూషకుని కథ

ఉజ్జయినీనగరాన్ని ఆదిత్యసేను డనేరాజు పరిపాలిస్తున్నాడు. ఆయన ఒకరోజు యాత్ర చేస్తూ గంగాతీరాన సేనతో ఉన్నాడు. ఇంతలో గుణవర్మ అనేవైశ్యుడు తనకుమార్తెను రాజుకు కానుకగా తీసుకొనివచ్చి, ప్రతీహారముఖంగా రాజుగారికి సంగతి మనవి చేసినాడు : "నాయింట్లో చక్కని చుక్క పుట్టింది. ఈకన్యను మరొకరికి ఇవ్వదలుచుకోలేదు. ఏలిన వారే నాకుమార్తెను ఏలాలి" అని. మహారాజు ఆసౌందర్యరాశినిచూచి అనురాగమువల్ల ఆమెను పట్టపురాణిగా చేసి, గుణవర్మకు తనతో సమానంగా ఐశ్వర్యం ఇచ్చినాడు. ప్రియురాలితో అహోరాత్రాలు గడుపుతూ రాజు రాజకార్యాలమీద శ్రద్ధ వదలివేసినాడు. ప్రజల ఆక్రందనము అతనిచెవులకు సోకడంలేదు. ఎల్లప్పుడూ అంతఃపురములోనే మహారాజు ఉండడంవల్ల శత్రువుల హృదయాల్లో భయం తొలిగిపోయింది. ఇలా ఉండగా అతనిప్రేయసి తేజస్వతీదేవి ఆడపిల్లను ప్రసవించింది. ఆ పిల్లను అల్లారుముద్దుగా పెంచుతున్నారు. ఆ పిల్ల అందాలకుప్ప. అందరికీ కన్నులపండుగ చేస్తూ అమ్మాయి పెరుగుతున్నది.

ఒకప్పుడు సామంతుడు తిరుగుబాటు చేయగా రాజు అతనిపై దండయాత్ర చేస్తూ, తనసైన్యానికి వెనుక పిడివేసుగుమీద తేజస్వతీదేవిని కూర్చోబెట్టినాడు. ఉత్తమాశ్వము ముంగాళ్ళమీద అతివేగముగా వరు

వెళ్తుతున్నప్పుడు, రాజు తేజస్వితికి ఆహ్వయాన్ని చూపుతూ దానికి పెంచ్చరిక చేసినాడు. అప్పు డాగుర్రము అతని మడమతాకువల్ల మహా వేగంగా ఎక్కడికో పరుగెత్తింది. సైన్యము తల్లడిల్లగా గుర్రపు రౌతులు వెయ్యివిధాల అతన్ని కనిపెట్టవలెనని చాడు తీశారు. ఏమీ లాభం లేకపోయింది. మంత్రులు అనిష్ట భయంవల్ల దేవిని తీసుకొని ఉజ్జయిని చేరి కోటద్వారము మూసివేసి, ప్రాకార రక్షణ చేసి, రాజు ఎక్కడ ఉన్నాడో వెతికిస్తూ, ప్రజలను ఓదార్చుతున్నారు. ఈలోగా గుర్రము రాజును తీసుకొనిపోయి వింధ్యారణ్యములో నిలిచింది. అరణ్యములో రాజుకు దారీ తెన్నూ తెలియక, విచారించి గుర్రము దిగి, అశ్వజాతులను ఎరిగినవాడు కనుక ఆ ఉత్తమాశ్వమునకు ప్రణామం చేసి "నీవు దేవుడవు. నీవంటివాడు ప్రభువుకు ద్రోహము చేయడు. నీవే నాకు దిక్కు. నన్ను మంచిదారికి తీసుకుపో" అని వేడుకొన్నాడు. రాజు మాటలు విని ఆ గుర్రము పూర్వజన్మజ్ఞానంవల్ల పశ్చాత్తాపపడి, రాజును ఎక్కించుకొని, ఏమీ శ్రమ కలిగించకుండా ఉజ్జయినీ నగర సమీపానికి తీసుకొని వెళ్ళింది.

సూర్యుడు అస్తమించినాడు. నగరమంతటా చీకటి కమ్మగా, నగర ద్వారములు మూసి ఉండడమువల్ల ఆగుర్రము ఊరివెలుపల శ్మశానము వద్ద ఉన్న బ్రాహ్మణ మఠంలో రాజును చేర్చింది.

అలసిపోయిన అశ్వాన్ని దిగి ఆదిత్యసేనుడు ఆరాత్రి గడపవలెనని మఠంలో ప్రవేశించబోయేసరికి, అక్కడి బ్రాహ్మణులు అతను శ్మశాన పాలుడో, చోరుడో ఆనే సంశయంవల్ల లోపలికి రానీయక పరుష ములు పలికినారు. ఆ బ్రాహ్మణులలో విద్యాపకు డనే ఒక బ్రాహ్మణుడు, సత్త్వవంతుల్లో శ్రేష్ఠమయినవాడు. మఠంలోనుంచి బైటికి వచ్చినాడు. ఆయన యువకుడు, దృఢకాయుడు. అగ్ని దేవుని ఆరాధించి తలుచుకొన్న మాత్రాన చేతిలోకి వచ్చే ఖడ్గమును పొందినాడు. ఆయన

రాత్రివేళ వచ్చిన మహారాజును చూచి, తక్కిన బ్రాహ్మణులను అదలించి, వినయముతో మఠంలోకి తీసుకొనిపోయి, విశ్రమింపజేసినాడు. దాసీవాళ్ళచేత ధూళి తుడిపించి శుభ్రము చేయించి, విదూషకుడు రాజుకు తగిన ఆహారము ఏర్పాటు చేయించినాడు. గుర్రానికి జీను తీసివేసి గడ్డి వేసి, ఉపచారములు చేయడంవల్ల అలసట తీరింది. అంతట ఆయన రాజుతో "రాజా, మీకు నేను కావుంటాను. మీరు సుఖంగా నిద్రించండి" అంటూ విదూషకుడు రాజుకు పక్కవేసి, అతడు నిద్రించగానే అగ్నిదేవుడిచ్చిన ఖడ్గము చేతబూని రాత్రి ద్వారం దగ్గిర పహారా యిస్తున్నాడు. తెల్ల వారింది. రాజు చెప్పకుండానే, ఆబ్రాహ్మణుడు గుర్రానికి జీను వేసి సిద్ధము చేసినాడు. రాజు అతనికి వీడుకోలిచ్చి గుర్ర మెక్కి ఉజ్జయినీ నగరం ప్రవేశించినాడు. ఆయన రావడంతోనే ఎనురుగా మంత్రులు సంతోషంతో వచ్చినారు. మంత్రులతో మహారాజు రాజమందిరము ప్రవేశించినాడు. తేజస్వతీదేవి హృదయజ్వరము తగ్గింది. మహారాజు నగరప్రవేశము చేసేసరికి ప్రజల దుఃఖాలు తగ్గిపోయినవి. సాయంకాలందాకా వాళ్ళు దేవీ మహోత్సవము చేసినారు.

మరునాడు ఆదిత్యసేనుడు విదూషకుని బ్రాహ్మణు లందరితోకూడా పిలిపించినాడు. మహారాజు కృతజ్ఞతాపూర్వకంగా విదూషకునికి వెయ్యి గ్రామాలు, ఛత్రవాహనములూ బహూకరించినాడు. రాజు అతనిని తనకు పౌరోహితుని చేసుకొన్నాడు. గొప్పవారికి చేసినఉపకారము ఎన్నటికీ వ్యర్థము కాదు. విదూషకుడు సామంతరాజులతో సమానంగా గౌరవము పొందు తున్నాడు. తన కిచ్చిన గ్రామములను మఠబ్రాహ్మణుల కందరికీ సమానము చేసినాడు. ఆయన రాజును సేవించి ఆశ్రయించి తక్కిన బ్రాహ్మణులతో ఆగ్రామనమూహముతో కలిసి మెలిసి ఉంటున్నాడు. కాలక్రమేణ తక్కిన బ్రాహ్మణులు తమలో తాము ప్రాధాన్యము కోరి, ధనమదమువల్ల విర్రవీగి విదూషకుని లక్ష్యం

చెయ్యడం లేదు. వాళ్ళల్లో అంతఃకలహాలవల్ల గ్రామాల్లో శాంతి నశించింది. వారందరూ దుర్మార్గులై ప్రవర్తిస్తుంటే, విదూషకుడు ఏమీ పట్టించుకోకుండా ఉన్నాడు. అల్పులవిషయంలో ధీరులు ఉపేక్ష చేయడం సహజమే!

ఒకనాడు ఆ బ్రాహ్మణులు పోట్లాడుకొంటున్న సమయంలో, చక్రధరుడనే నిస్సురస్వభావు డయిన బ్రాహ్మణుడు వచ్చి "ఇతరులకు నీతులు చెప్పడానికి అంధుడూ స్వచ్ఛదృష్టికలవాడే. కుబ్జుడూ స్పష్టంగా మాట్లాడేవాడే. దరిద్రు లయిన మీకు సిరి పట్టింది. ఈనడమంత్రపు సిరివల్ల కన్ను మిన్నూ కానక, ఓర్వలేక గ్రామాలను పాడుచేస్తున్నారు. విదూషకుడు మీ సంగతిమాచి ఉపేక్షచేస్తున్నాడు. ఈతప్పు అతనిదే. మీకు త్వరలో ముష్టిచెంబు చేతికి వస్తుంది. మీలో ప్రతివాడూ నాయకుడు కావా లని, పోరాడి గ్రామాలను బాధపెట్టడంకన్న ఒకేనాయకుడు చెప్పినట్లు మీరు వింటే సిరిసంపదలు నిలుస్తవి నామాటవిని ధీరుడయినవాణ్ణి నాయకుణ్ణి చేసుకోండి." అని వారికి హితబోధ చేసినాడు.

ప్రతివాడూ నేను నాయకుడు కావాలంటే నేను కావాలని పట్టుపట్టగా, అమూఢులకు చక్రధరుడు హితబోధ చేసినాడు: "ఎందు కిలా తగవు లాడతారు? నేను పందెం ఏర్పాటు చేస్తాను. అందులో ఎవడు గెలిస్తే వాడు నాయకు డవుతాడు. ఇక్కడ శ్మశానంలో ముగ్గురు దొంగలను కొరత వేశారు. ఈరాత్రి ఆదొంగల ముక్కులు ఎవడు కోసుకు రాగలడో వాణ్ణి నాయకుణ్ణి చేసుకోండి. ఎప్పుడూ వీరునికే పట్టం కట్టాలి కదా?" చక్రధరుని మాటలు విని విదూషకుడు "అలాగే చేతాము. ఇందులో దోష మేముంది?" అని పలికినాడు. అప్పుడు బ్రాహ్మణులు "ఈపని మావల్లకాదు" అన్నారు. విదూషకుడు దొంగల ముక్కులుకోసి శ్మశానంనుంచి తీసుకురావడానికి సిద్ధ

పడినాడు. విదూషకుడు ఆసాహసకృత్యము చేస్తే అతన్నే నాయకునిగా ఆబ్రాహ్మణులు అంగీకరిస్తా మన్నారు. విదూషకుడు ఆరాత్రి అగ్ని దేవుని తలుచుకొన్నాడు. తలచుకొన్నమాత్రాన కత్తి చేతులోకి వచ్చింది. ఒంటరిగా శ్మశానంలో ప్రవేశించినాడు. అప్పుడు శ్మశానంలో ఢాకినీదయ్యాలు ఘోష పెడుతున్నవి. గద్దలు, కాకులు రొద చేస్తున్నవి. కొరివిదయ్యాల నోళ్ళలో మంటలూ, చితిమీద మంటలూ వ్యాపిస్తున్నవి. కొరుస్తంభాలుమీద ఉన్న దొంగలు ముఖాలు పైకెత్తుకొని ఉండగా విదూషకుడు వారిని సమీపించినాడు. దగ్గరికి రాగానే బేతాళదయ్యముపల్ల దొంగలు ఆవేశంతో ఆబ్రాహ్మణుని పిడికిలితో గుద్దినారు. విదూషకుడు చలించక ధైర్యంగా కత్తితో వారిని నరికినాడు. దొంగలమీద ఆవేశించిన దయ్యము వదలిపోయింది. వెంటనే అతడు ఆదొంగల ముక్కులు కోసి వస్త్రంలో మూట కట్టుకొన్నాడు.

విదూషకుడు తిరిగి వస్తూండగా శ్మశానంలో శవముమీద జపము చేస్తున్న సన్యాసిని చూచి అత డేమి చేస్తాడో చూతా మని కుతూహలంవల్ల అతనివెనుకకు వెళ్ళి దాగినాడు. క్షణంలో సన్యాసి కింది శవము ఫూత్కారము చేసింది. వానిముఖమునుంచి జ్వాల, నాభినుంచి ఆవాలూ వచ్చినవి. అప్పు డాసన్యాసి ఆవాలు తీసుకొని లేచి శవాన్ని అరిచేతితో కొట్టినాడు. వెంటనే శవము లేచి నిలిచింది. అతడు ఆశవం బుజంమీద ఎక్కగా అది నడిచింది. విదూషకుడు మెల్లిగా వెంబడించి నాడు. కొంతదూరము అతను నడవగా శిథిల మైన దేవాలయంలో కాళీవిగ్రహము కంట బడింది. అక్కడ సన్యాసి శవాన్ని దిగి గర్భగుళ్ళోకి వెళ్ళినాడు. శవాన్ని అధిష్ఠించిన బేతాళుడు నేలమీద పడ్డాడు. విదూషకుడు వాళ్ళకు కనబడకుండా భక్తిగా చూస్తూ అక్కడే ఉన్నాడు. సన్యాసి కాళిని పూజించి,

"దేవీ! నీకు తుష్టికలిగితే నాకు వరం ప్రసాదించు. నీవు తృప్తి పడకపోతే. నీకునేను బలిఅవుతాను. అప్పుడయినా నీకు తృప్తి కలగదా?" అని మంత్రసాధనలో గర్వంతో అన్నాడు. గర్భగుడిలో ఆకాశవాణి "ఆదిత్యసేనమహారాజ పుత్రికను తెచ్చి కానుక అర్పించు. అప్పుడు నీకోరిక ఈడేరుతుంది" అన్నది. ఆమాటవిని ఆతడు శవమును కొట్టి లేపినాడు. అప్పుడు బేతాళుడు పూత్కారం చేస్తూ లేచి నిలుచున్నాడు అతని నోటిలోనుంచి జ్వాలలు వస్తున్నవి. ఆబేతాళునిబుజ మెక్కి సన్యాసి రాజకుమారిని తీసుకు రావడానికి ఆకాశాన పెళ్ళినాడు. అ దంతా విదూషకుడు చూచి, "ఏమిటి! నేను బతికి ఉండగానే వీడు రాజపుత్రిని చంపగలడా? ఈ మూర్ఖుడు వచ్చేదాకా నే నిక్కడే ఉంటాను" అని నిశ్చయంచేసుకొని అక్కడే దాక్కున్నాడు

సన్యాసి ఆకాశమార్గాన వెళ్లి కిటికీలోనుంచి అంతఃపురంలో ప్రవేశించినాడు; రాజపుత్రి నిద్రిస్తున్నప్పుడు ఆమెను ఎత్తుకొని వచ్చినాడు. ఆపిల్ల పెద్దపెట్టున ఏడుస్తున్నది. అతడు ఆకాశమునుంచి దేవీభవనంలో దిగి, బేతాళుని వదలిపెట్టి రాజపుత్రితో గర్భాలయంలోకి వెళ్లినాడు. సన్యాసి కత్తి దూసి రాజకన్యను ఖండించబోయినాడు. వెంటనే వెనుక దాగి ఉన్నవిదూషకుడు ఒరలోనుంచి కత్తి దూసి అక్కడికి వచ్చి "పాపీ! రాజపుత్రిని రాతితోనలగగొట్టివేతామనుకొంటున్నావు." అని సన్యాసిమెడ పట్టుకొని వంగదీసి తల ఖండించివేసినాడు. విదూషకుని గుర్తుపట్టి రాజకుమారి ముణుచుకొని పోతున్నప్పుడు ఆమెను అతడు ఓదార్చి అంతఃపురానికి తీసుకుపోవడం ఏలాగని ఆలోచిస్తున్నాడు. ఆకాశవాణి "విదూషకుడా! నామాటవిను సీచేతుల్లో చనిపోయిన సన్యాసికి, బేతాళుడూ ఆవాలూ దొరికినవి. అందువల్ల అతనికి రాజ్యసంపాదన మీద, రాజకన్యలమీద మనసు పుట్టింది. అది ఆశకు పోయి ఈమూర్ఖుడు చనిపోయినాడు. ఓ వీర

విదూషకుడా! ఆవాలు పుచ్చుకో. వాటిప్రభావంవల్ల నీవు ఆకాశం మీద సంచరించగలవు.'' అని అతనికి సంతోషము కలిగించింది.

విదూషకుడు సన్యాసికొంగున ఉన్న ఆవాలు తీసుకొని, రాజ పుత్రిని ఎత్తుకొని దేవీ భవనంలో బైటికి వచ్చినాడు. అప్పుడు అశరీర వాణి ''వీరుడా! ఇక్కడికే ఈదేవి గృహానికే నెలరోజు లయ్యాక నీవు తప్పకుండా రావాలి. మరిచిపోకు'' అన్నది. అతడు తప్పక వస్తా నన్నాడు. విదూషకుడు రాజకన్యను ఎత్తుకొని ఆకాశాన ఎగిరి అంతఃపురానికి వెళ్ళి అక్కడ ఉంచి ఓదార్చినాడు. అత డామెతో ''అమ్మాయీ! తెల్లవారితే ఆకాశంమీద వెళ్ళలేను. నాకు సెలవియ్యి. వెళ్ళిపోతాను. తెల్లవారితే నన్నంతా చూస్తారు.'' అన్నాడు. రాజపుత్రి భయపడుతూ, ''మహాపురుషుడా! నీవు వెళ్ళిపోతే నేను జీవించను. పూనుకొన్నవని పూర్తిగా నెరవేర్చడం సత్పురుషులవ్రతం.'' అని వేడుకొన్నది. ''ఏ మయినా కానీ. నేను పోను. పోతే ఈమె జీవించదు. అప్పుడు నా రాజభక్తివల్ల ఏమి ప్రయోజనం?'' అని విదూషకుడు ఆలోచించి ఆరాత్రి అక్కడే ఉన్నాడు. భయంవల్ల రాజకన్య నిద్రపోలేదు. అతడు మాత్రం అలిసి నిద్రపోయినాడు. తెల్లవారినా అతనికి మెళుకువ రాలేదు. ''పాపం నిద్ర లేదేమో తెల్లవారు జామున నిద్ర పట్టింది లేపడం ఎందుకు!'' అని ఆమె ఆర్ద్రహృదయంతో ఆలోచించి నిద్రలేపలేదు. అంతఃపురపరిచారికలు అతన్ని చూచి తెల్లపోయి రాజుగారి దగ్గరికి వెళ్ళి విన్నవించారు. విదూషకుని ప్రభావం తెలిసిన మహారాజు కుమార్తె మందిరమునుంచి అతన్ని పిలిపించినాడు. విదూషకుడు రాజుతో జరిగినవిషయ మంతా పూసగ్రుచ్చినట్లు చెప్పి, తన కొంగున కట్టుకొన్న దొంగలనాసికలను, ఆవాలను చూపినాడు. అదంతా నిజమే నని రాజునమ్మినాడు. దీనికంతకూ మతంలో బ్రాహ్మణులు కారణ మని, వారిని చక్రధరునితోసహా పిలిపించి, రాజు

సర్వమూ అడిగి తెలుసుకొన్నాడు. స్వయముగా శ్మశానానికి వెళ్ళి, ముక్కులులేని ఆశవములను చూచి, కాళీదేవ్యాలయానికి పోయి అక్కడ చచ్చిపడిఉన్న సన్యాసిని చూచి, నమ్మకం కలుగగా సంతోషించి, తన కుమార్తెను రక్షించిన విదూషకునికి ఆమె నిచ్చి వివాహము చేసినాడు. అది మొదలు ఆ విదూషకుడు రాజకన్యతో సుఖాలు అనుభవిస్తూ రాజభవనంలోనే ఉంటున్నాడు.

కొన్నిరోజులు గడిచిన తర్వాత రాజపుత్రి విదూషకునితో "నాథా! ఆరాత్రి అశరీరవాణి మిమ్మల్ని మాసాంతమున దేవీ మంది రానికి తప్పక రమ్మన్నది. ఆమాట మరిచిపోయినారా?" అన్నది. ప్రియురాలు జ్ఞాపకము చేసినందుకు విదూషకుడు సంతోషించి, "ప్రేయసీ! అవును. మరిచిపోయినాను. సమయానికి జ్ఞాపకముచేశావు." అంటూ అందుకు ఆలింగన బహుమాన మిచ్చినాడు. ఆమె నిద్ర పోయాక, అగ్నిదేవునివల్ల లభించిన ఖడ్గము చేత పూని స్తిమిత చిత్తంతో దేవి భవనానికి వెళ్ళినాడు. "నేనువిదూషకుణ్ణి వచ్చాను." అని అతడు అరిచేసరికి లోపలికి రమ్మని అశరీరవాణి పలికింది. అతడు లోపలికి వెళ్ళినాడు. అక్కడ దివ్యమందిరము, అందులో అప్సరస కనపడినది. విదూషకుడు ఆదివ్యకన్యను చూచి ఆశ్చర్యపడినాడు. ఆమె అతన్ని స్నేహబహుమాన పూర్వకముగా కుశలప్రశ్నలు వేసింది. ఎవరీమె? ఇంత చనువుగా మాట్లాడుతున్నదే? ఈమె ఎవరో తెలుసుకోవాలి అని అతడు ఉత్సుకుడయి ఉండగా ఆదివ్యకన్య "నేను విద్యాధరకన్యను. నన్ను భద్ర అని పిలుస్తారు. మాది గొప్పవంశము. కామగమనముచేత ఇక్కడికి వచ్చి నే నప్పుడు నిన్ను చూచాను. నీ గుణములకు సంతోషించినాను. నీ సుగుణాలు నన్ను ఆకర్షించడం వల్ల నిన్ను మళ్ళీ రమ్మని, అసమయంలో అశరీరవాణిని సృష్టించాను. నా విద్యాప్రభావమువల్ల ఆదిత్యసేన, మహారాజపుత్రి

మోహింతురాలై, నీవు ఇక్కడికి రావలసిన విషయము జ్ఞాపకము చేసింది. నీకోసము నేను ఎదురుచూస్తూన్నాను. అందగాడా! ఈ శరీరము నీకు అర్పించాను. నన్ను పెళ్ళాడు." అని వేడుకొన్నది. విద్యాధరి మాటలు విని విదూషకుడు అంగీకరించి గాంధర్వవిధిని ఆమెను వివాహము చేసుకొన్నాడు. ఆమెతో భోగములు అనుభవిస్తూ అతడు అక్కడే ఉన్నాడు.

ఈలోగా అంతఃపురములో తెల్లవారుజామున రాజకన్య నిద్రలేచి, భర్త కనపడకపోవడంవల్ల బెంగపడి కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. పదములు తొట్రుపడగా ఆమె తల్లిదగ్గిరికి వెళ్ళి తనభర్త రాత్రి ఎక్కడికో వెళ్ళిపోయినా డనీ, భయపడుతూ, పశ్చాత్తాపముతో తపించి చెప్పింది. కన్నకూతురిమీద ప్రేమవల్ల తల్లి విచారించింది. రాజు సంగతి తెలుసుకొని వ్యాకులపడినాడు. అప్పుడు రాజకుమారి "నాకు తెలుసును. నాభర్త అమ్మవారి గుడికి వెళ్ళినాడు" అన్నది. కూతురు చెప్పినమాటను బట్టి రాజు స్వయముగా దేవ్యాలయానికి వెళ్ళినాడు. అక్కడ విద్యాధరీప్రభావమువల్ల విదూషకుడు అదృశ్యుడై ఉన్నందువల్ల రాజు అతనిని కనిపెట్ట లేకపోయినాడు. ఏమిచేయడానికీ తోచక రాజు వెళ్ళిపోయినాడు. కుమార్తె భర్త లభించనందువల్ల నిరాశ చేసుకొని ప్రాణాలు వదలివేయ సంకల్పించుకొన్నది. ఆసమయములో ముసీంద్రుడు వచ్చి "అమ్మా, నీ కేమీ ఆపద రాదు. నీభర్త దివ్య భోగాలు అనుభవిస్తూ క్షేమంగా ఉన్నాడు. త్వరలో నీదగ్గిరికి వస్తాడు" అంటూ ఓదార్చినాడు. పతిసమాగమము ప్రాప్తిస్తుంది గదా అని ఆమె ఆశతో ప్రాణాలు బిగబట్టి ఉన్నది.

విద్యాధరీదేవితో చెలిక త్తె, యోగేశ్వరి రహస్యముగా "సఖీ! మనుష్యసంపర్కము చేశా వని విద్యాధరులు సీమీద కోపంగా ఉన్నారు. నీకు వాళ్లు అపకారం చేస్తారు. వెంటనే నీవు ఇక్కడినుంచి

వెళ్ళిపో. తూర్పుసముద్రము అవతలిదరి కారోకటక మనేపట్టణము ఉన్నది. దానిని దాటగా శీతోద అనేపుణ్యనది, కనబడుతుంది. దాని అవతల సిద్ధక్షేత్ర మయిన ఉదయమహాపర్వతము ఉన్నది. అక్కడికి నీవు వెళ్ళితే విద్యాధరులు అంతవరకూ రాలేరు. వెళ్లిపో. వస్తే నీ ప్రియుడుకూడా నీతో వస్తాడు." అన్నది. చెలికత్తెమాటలు విని, విద్యాధరి విదూషకుని ప్రేమించినా, ఉదయపర్వతానికి వెళ్ళదలచుకొన్నది. ప్రియునితో ఆమె సంగతియూవత్తూ యుక్తియుక్తంగా చెప్పి, అతనికి తనఉంగరము ఇచ్చి, తెల్లవారుజామున వెళ్ళిపోయింది. విదూషకుడు క్షణంలో దేవ్యాలయముదగ్గిర ఉన్నాడు. విద్యాధరిలేదు. ఆమందిరమూ అక్కడ లేదు. ప్రేయసీప్రపంచమును స్మరిస్తూ ఉంగరము చూచుకొంటూ విదూషకుడు విషాదాశ్చర్యములపా లయినాడు. ప్రియురాలు ఉదయపర్వతానికి వెళుతున్నా నని చెప్పినమాటలు స్వప్నప్రాయముగా స్మరిస్తూ, "నేను కూడా ఉదయపర్వతానికి పోతాను. నేను ఇక్కడ ఉంటే ఆదిత్యసేనుడు కనిపెట్టి నన్నుకదలనీయడు. కార్యసిద్ధికి తగినయుక్తి వన్నడం అవసరం" అని విదూషకుడు ఆలోచించి మారువేషము వేసుకొన్నాడు. చిరిగి పోయిన పేలికలు కట్టుకొని శరీరానికి బూడిదపూసుకొన్నాడు. అతడు అమ్మవారిగుడినుంచి భద్రా అని కేకలు వేస్తూ బయటికివచ్చినాడు. అక్కడున్నజనమంతా అతన్ని చూచి 'అదుగో విదూషకుడు అదుగో విదూషకుడు' అంటూ కోలాహలము చేశారు.పిచ్చివానివలె ఉన్నవిదూషకుణ్ణి రాజు పట్టుకొని అంతఃపురానికి తీసుకొనిపోయినాడు. విద్యాధరిమీద ప్రేమవల్ల విదూషకుడు ఎవరు ఏమి అడిగినా 'భద్రా, భద్రా' అని పలుకుతున్నాడు. వైద్యులు అతనికి అభ్యంగనస్నానము అవసరమన్నారు. విదూషకుడు తల అంటుకొన్నాక మళ్ళీ ఒంటికి బూడిదపూసుకోడం సాగించినాడు. రాజపుత్రి స్వయంగా ఫలహారము తీసుకొని వస్తే విదూషకుడు కాలితో ఒక్క-

తన్ను తన్నే వాడు. కొన్ని రోజులుపాటు అతడు బట్టలుచింపుకోడం పిచ్చిగా ఉండడం సాగించినాడు; అనవసరముగా ఇతనిని బాధపెట్టడం బాగా లేదు. ఈపిచ్చికి మందు లేమీ పని చెయ్యవు. మనము పెట్టేబాధ పడలేక ప్రాణాలు వదులుతాడు. పైగా బ్రహ్మహత్యాదోషం నంభవిస్తుంది. విచ్చలవిడిగా ఇతనిని వదిలిపెడితే కాలక్రమేణ స్థిమితపడతాడేమో." అని ఆదిత్యసేనుడు ఆలోచించి అతనిని వదిలిపెట్టినాడు.

విదూషకుడు విద్యాధరి వద్దకు పోవుట

విదూషకుడు యథేచ్ఛగా తిరుగుతూ మరునాడు విద్యాధరీదేవి ఇచ్చిన ఉంగరము తీసుకొని విద్యాధరికోసం తూర్పు దిక్కుగా ప్రయాణమైనాడు. పోయిపోయి అతను పాండ్రక పట్టణము చేరి వృద్ధ బ్రాహ్మడి ఇంటిలో బస ఏర్పాటు చేసుకొన్నాడు. వృద్ధురాలు అతనికి ఆతిథ్యమిచ్చి, కన్నీరు విడుస్తూ "నాయనా, నాయిల్లు వాకిలీ సర్వస్వం నీకు ధారాదత్తము చేస్తున్నాను. పుచ్చుకో. నేను జీవించను" అన్నది. ఆశ్చర్యంతో అతడు "ఎందు కమ్మా ఇలా అంటావు?" అని ప్రశ్నించినాడు. ఆమె ఇలా అన్నది: "నాయనా, సంగతి విను. ఈ నగరపాలకుడు దేవసేనుడు. రాజుకు లేకలేక కుమార్తె చాలా కాలానికి కలిగింది. చిరకాల దుఃఖము అనుభవించిన తరువాత పుట్టిన పిల్ల కనుక దుఃఖలబ్ధిక అని పేరు పెట్టినాడు. ఆమెకు యౌవనము రాగానే కచ్ఛపనాథు డనేరాజుకు ముడిపెట్టినాడు తండ్రి. కచ్ఛపనాథుడు పడక గదిలో ప్రవేశించి భార్యదగ్గిరికి పోయేసరికి అతనిప్రాణాలు పెంటనే ఎగిరిపోయినవి. రాజు చింతాక్రాంతుడై దుఃఖలబ్ధికను మరొకరాజు కిచ్చి పెళ్ళి చేశాడు. అతడుకూడా యథాప్రకారంగా పెళ్ళి అయిన పెంటనే చనిపోయినాడు. రాజు లెవ్వరూ ఆపిల్లను వివాహము చేసుకోడానికి సాహసించలేక భయపడుతున్నారు. అప్పుడు దేవసేన మహా

రాజు సేనాధిపతిని పిలిచి ఇలా ఆజ్ఞాపించినాడు: "ఈ దేశంలో నీవు రోజూ ప్రతియింట్లోనుంచీ ఒక్కొక్క బ్రాహ్మణుణ్ణి గాని, క్షత్రియుణ్ణి గాని తెచ్చి నాకూతురి పడకగదిలో వదలాలి. ఎంతమంది ఎన్నాళ్ళు చనిపోతారో చూతాము. ఎవరు బతికితే వాడికి నాకూతుర్ని ఇస్తాను. విధిని తప్పించడం మనతరమా!"

"రాజాజ్ఞప్రకారము సేనాధిపతి ప్రతిదినమూ వంతుప్రకారము పురుషుని రాజకన్యకోసము తీసుకుపోతున్నాడు. వందలకొద్దీ మనుష్యులు చనిపోతున్నారు. నిర్భాగ్యురాలనయిననాకు ఒక్కడే కొడుకు ఉన్నాడు. నాయనా! ఇవాళ అతనివంతు వచ్చింది. వాడు లేకపోతే నేను బతికి ప్రయోజన మేమిటి? కనుక నేను జీవించి ఉండగానే, గుణవంతుడవయిన నీకు, తిరిగి నా కిట్టిదుఃఖము కలగకుండా ఉండేటందుకు గృహమూ నాసర్వస్వమూ ఇస్తున్నాను."

అప్పుడు విదూషకుడు "అమ్మా, నీవు బెంగ పెట్టుకోకు. నీయేక పుత్రుణ్ణి పంపకు. నేను ఆరాజపుత్రి దగ్గిరికి పోతాను. నేను చనిపోతానని నన్ను చూసి జాలిపడకు. నాకు యోగసిద్ధి ఉన్నది. ఏమీ భయము ఉండదు." అన్నాడు.

"నీవు ఎవరో మానవమాత్రుడివి కావు నా పూర్వపుణ్యవశాన ఇక్కడికి వచ్చావు. మాకు ప్రాణా లిచ్చి నాయనా, నీవు కుశలంగా ఉండు" అన్నది.

ఈ ప్రకారంగా విదూషకుడు వృద్ధురాలి దగ్గిర అనుమతి తీసుకొని, సందెవేళ సేనాధిపతి సేవకునితో రాజకన్యాంతఃపురానికి వెళ్ళినాడు. ఆరాజకన్య యౌవన మదములో విరియబూచిన పూలతీగెవలె కళకళ లాడుతున్నది. ఆరాత్రి రాజపుత్రి పానుపుమీద పరుండగా విదూషకుడు అగ్ని దేవుణ్ణి ధ్యానించినాడు. వెంటనే అతనికి ఆగ్నేయఖడ్గము చేతిలోకి రాగా లోపలికి వెళ్ళి, "ఇక్కడ పురుషుణ్ణి ఎవరు చంపు

తారో చూస్తాను.'' అని ఆలోచించుకొని రాత్రి మేలుకొన్నాడు. జన మంతా నిద్రించాక రాక్షసుడు ఘోరరూపంతో ద్వారసీమలో విదూషకుని కంటపడినాడు. రాక్షసుడు ద్వారముదగ్గిర నిలిచి బాహువు చాచినాడు. విదూషకుడు కోపంతో ఖడ్గం కత్తి దూసి రాక్షసుని బాహువునునరికినాడు. రాక్షసుడు అతని బలానికి భయపడి మళ్ళీ అక్కడికి అడుగు పెట్టకుండా పారిపోయినాడు. రాజపుత్రి నిద్ర లేచి తెగిన బాహువును చూచి భయసంతోషాశ్చర్యముల పాలయింది. తెల్లవారింది. దేవ సేన మహారాజు కుమార్తె గదికి వచ్చి పడిఉన్న బాహువును చూచి, పరమానందముతో విదూషకునికి కూతు నిచ్చి వివాహము చేసినాడు.

విదూషకుడు అక్కడ కొంతకాలము సుఖలబ్ధికతో భోగములు అనుభవించినాడు. ఒక రాత్రి ఆమె నిద్రిస్తున్నసమయం చూచి అతను విద్యాధరికోసము వెళ్ళిపోయినాడు. రాజపుత్రి నిద్ర లేచి చూస్తే భర్త కనపడ లేదు. తండ్రితో సంగతి చెప్పింది. ప్రియుడు తిరిగి తనకు లభిస్తాడో మో నని ఆశతో ఆమె ప్రాణాలు అరచేత పెట్టుకొన్నది. తండ్రి ఆమెను ఓదార్చినాడు. విదూషకుడు ప్రయాణముచేసి తామ్రలిప్తీ నగరము చేరి, అక్కడ సముద్రము దాట ప్రయత్నించినాడు. స్కందదాసు డనే ఓడలవర్తకునితో విదూషకుడు స్నేహము చేసి, అపారధన పూర్ణ మయిన ఓడ నెక్కి ప్రయాణము చేసినాడు. నౌక కొంత దూరము పోయి ఏదో తగిలేసరికి ఆగిపోయింది. స్కందదాసుడు సముద్రుణ్ణి రత్నాలతో పూజించినాడు. అప్పటికీ నావ కదలక పోవడంవల్ల అతడు బెంగపడినాడు. 'ఆగిపోయిన ఈ నావను ఎవడు పోనివ్వగలడో వానికి నాకూతురి నిచ్చి పెళ్ళిచేస్తా నని ఆవర్తకుడు శపథము చేసినాడు. విదూషకుడు ఆమాట విని "నేను సముద్రములో దిగి, సముద్రోదక మంతా వెలికి క్షణములో ఈనావ కదిలేటట్టుచేస్తాను. మీరు నన్ను కాళ్ళతో పట్టుకొనండి. పడవ కదిలిన తరువాత నన్ను నీటిలోనుంచి

ఉద్ధరించాలి" అని చెప్పినాడు. వర్తకుడు అందుకు అంగీకరించినాడు. అప్పుడు కళానులు అతన్ని తాళ్ళతో చంకలదగ్గిర కట్టివేసినారు. విదూషకుడు సముద్రములో దిగినాడు. అతడు అగ్ని దేవుణ్ణి ఆరాధించేసరికి అగ్నేయఖడ్గము అతనిచేతిలోకి వచ్చింది. నావకింద నీటిలో అతడు ప్రవేశించగా మహాకాయుడు కనపడినాడు. అతడు నిద్రిస్తున్నాడు. అతని పిక్కలో ఓడ ఇరుక్కుపోయింది. తక్షణం విదూషకుడు కత్తి దూసి ఆ మహాకాయుని పిక్కను తెగ నరికినాడు. వెంటనే ఓడ కదిలింది. అప్పుడు పాపాత్ముడయిన వర్తకుడు దురాలోచన చేసినాడు. అన్న మాటప్రకారము విదూషకునికి ధనాధికము ఇయ్యవలసివస్తుం దనే భయమువల్ల, అతనిచంకలకు కట్టినతాళ్ళను కోసివేసినాడు.

విదూషకుడు నీళ్ళలో తేలుతూ వర్తకునిమోసము గ్రహించినాడు. అతను ఎంతమాత్రము అధైర్యపడక, తాను ఖండించిన మహాకాయుని పిక్కనే తెప్పగాచేసుకొని సముద్రము దాటినాడు. అవతలిదరి చేరగానే ఆకాశవాణి పలికింది: "బళీ! విదూషకా! నీకంటె బలవంతుడు ఎవడున్నాడు? ఇప్పుడు నీవు దిగంబరదేశము వచ్చావు. ఏడురోజులు ప్రయాణము చేస్తే కారోటపట్టణము చేరగలవు. నీకోరిక అక్కడ తప్పక నెరవేరుతుంది. నేను నీ ఆరాధనాదేవుణ్ణి, అగ్నిహోత్రుణ్ణి. నావప్రసాదమువల్ల నీకు ఆకలిదప్పికలు ఉండవు. ధైర్యోత్సాహాలతో నీ అభీష్టము నెరవేర్చుకో."

విదూషకుడు అశరీరవాణి విని సంతోషించి అగ్ని దేవునికి ప్రణామము ఆచరించినాడు. ఏడవనాటికి కారోటనగరము చేరినాడు. సత్పురుషులు, నానాదేశాగతులు నివసించిన మఠమునకు వెళ్ళినాడు. ఆమఠాన్ని ఆర్యవర్మ అనే అక్కడిరాజు కట్టించినాడు. ఆమఠములో బంగారు దేవాలయాన్నికూడా అతడు నిర్మించినాడు. అక్కడ విదూషకునికి బ్రాహ్మణులు అతిథ్య మిచ్చి సత్కరించినారు. ఒకబ్రాహ్మణుడు అతన్ని తన

ఇంటికి తీసుకుపోయి మజ్జన భోజనాదికాలతో సంతృప్తుణ్ణి చేశాడు. సాయంకాలము అతడు చాటింపు విన్నాడు: 'బ్రాహ్మణుడు గాని క్షత్రియుడు గాని ఎవడు కేవు ఉదయాన రాజకుమారిని పెళ్ళి చేసుకోవాలనుకొంటాడో, అతడు ఈరాత్రి ఆమె ఇంటిలో ఉండాలోవలెనోయ్' అని. ఆచాటింపు విని విదూషకుడు దాని కేదో కారణమున్న దని ఊహించినాడు. అతడు సాహసికనుక రాజకన్యాంతఃపురములో ప్రవేశించవలె నని ఉద్దేశించినాడు. అప్పుడు మఠంలో ఉన్న బ్రాహ్మణులు "బ్రాహ్మణోత్తమా! సాహసము వద్దు. అది రాజకన్యాంతఃపురము కాదు: మృత్యుముఖము. అక్కడికి వెళ్ళినవాడు జీవించడు. ఎంతమందో సాహసించి వెళ్ళి మళ్ళీ రాలేదు" అని చెప్పినారు.

అక్కడున్న వాళ్ళు వెళ్ళ వద్దని చెప్పినా విదూషకుడు లక్ష్యపెట్టక రాజభటులతో రాజమందిరానికి వెళ్ళినాడు. ఆర్యవర్మ మహారాజు స్వయంగా విదూషకుణ్ణి గౌరవించినాడు. రాజకన్య అతన్ని చూచి బలవుతోనూ, అతడు జీవించడని వగవుతోనూ, కన్నీరువిడుస్తూ ఉండగా విదూషకుడు అగ్ని దేవుడిచ్చిన ఖడ్గము చేత పట్టుకొని మేలుకొన్నాడు. హఠాత్తుగా రాక్షసుడు కనపడినాడు. అతనికి కుడిచెయ్యి లేదు. ఎడమచేతిని వాడు గదిలోకి చాచినాడు. అది చూచి విదూషకుడు "వీడే ఆ రాక్షసుడు. వీడి బాహువునే పాండ్రవర్ధనపురంలో తెగనరికినాను. ఈ బాహువును మాత్రము నరకను. అలా చేస్తే వీడు పారిపోతాడు. వీణ్ణి వధించడమే ఉచితము" అనుకొని వెంటనే రాక్షసుని మీదికి లంఘించి, వాడిజుట్టు పట్టుకొని వంచి చంపబోయినాడు. రాక్షసుడు భయపడి "మహాబలా! నన్ను చంపకు" అని మొరపెట్టినాడు. "నీ పేరేమి? ఎందు కిలాచేస్తావు?" అని విదూషకుడు రాక్షసుని ప్రశ్నించగా వాడు, "నాపేరు యమదంష్ట్రుడు. నాకు ఇద్దరు కుమార్తెలు. వాళ్ళల్లో ఈమె ఒకతె. రెండవది పాండ్రవర్ధనంలో

ఉన్నది. ఈ రాజకన్యలను వీరపురుష సంగమమునుంచి రక్షించాలి. నాకు శంకరుడు ఆజ్ఞ యిచ్చినాడు. మొదట నా శరీరబుజాన్ని పాండ్ర వర్ధనపురములో ఒకడు నరికినాడు. నీ విప్పుడు నన్ను జయించినావు. శంకరాజ్ఞ సమాప్త మయింది" అన్నాడు.

రాక్షసునిమాటలు విని నవ్వుతూ విదూషకుడు "నేనే నీ బాహువును ఇదివరలో నరికినాను" అని చెప్పినాడు.

"నీవు మానవమాత్రుడవు కావు. దేవపురుషుడవు. అవసరము వచ్చినప్పుడు గాని కష్టాల్లో గాని నన్ను తలచినమాత్రాన నీ కష్టాలు గట్టెక్కిస్తాను. నీవు నాస్నేహితుడవు." అంటూ రాక్షసుడు విదూషకునితో స్నేహము చేసినాడు. బ్రాహ్మణుడు ఆ నేస్తమునకు అంగీకరించినాడు. రాజకన్య విదూషకుని పరాక్రమాన్ని వేనోళ్ళ పొగడింది. అందుకతను పరమానందభరితుడై ఆమెతో రాత్రి గడిపినాడు. తెల్లవారగానే రాజుకు సంగతి యావత్తూ తెలిసి సంతోషించి, తనకుమార్తెను అతనికిచ్చి వివాహము చేసినాడు.

ఆ రాజకుమారి క్షణమాత్ర మైనా విదూషకుణ్ణి వదలలేకపోయింది. అతడు ఆమెతో కొన్ని రాత్రులు గడిపి, ఒకరాత్రి తన పూర్వప్రేయసి అయిన విద్యాధరిని తలుచుకొని రాజకుమారితో చెప్పకుండా వెళ్ళిపోయినాడు. నగరము వదలి వెళుతున్నప్పుడు విదూషకుడు తనకు సాయము చేస్తా నని అభయ మిచ్చిన రాక్షసుణ్ణి స్మరించినాడు. వెంటనే రాక్షసుడు వచ్చి ఆ బ్రాహ్మణునికి వందన మాచరించి నిలువబడగా, విదూషకుడు "స్నేహితుడా! నాప్రేయసి విద్యాధరి నివసిస్తున్న ఉదయాద్రిక్షేత్రానికి వెళ్ళవలెను. నన్ను అక్కడికి తీసుకుపో" అన్నాడు.

రాక్షసుడు విదూషకుని తన బుజముమీద ఎక్కించుకొని, ఆరాత్రే ఆరవై యోజనాల దూరము అవలీలగా తీసుకొనివెళ్ళినాడు. తెల్లవారగానే మానవులు దాటలేని శీతోదానదిని దాటి ఉదయపర్వతము చేరి

నాడు. అప్పుడు రాక్షసుడు 'మిత్రుడా, నీవిదుటనే చూచు ఉదయపర్వతము. ఈసిద్ధక్షేత్రంలో నేనపుగు పెట్టలేను. నాకు ప్రవేశార్హత లేదు" అని చెప్పి విదూషకునివద్ద సెలవు తీసుకొని అదృశ్య మైనాడు.

అప్పుడువిదూషకుడు దిగుడుబావిని చూచినాడు. ఆబావిలో చలిస్తున్న తుమ్మెదలరొదతో పద్మములు అతనికి కనపడినవి. దానిగట్టునే స్త్రీల అడుగులజాడలతో ఉన్నతోవ 'ఇదే నీకు ప్రియాగమహేతువు' అని చెప్పేదానివలె విదూషకునికి కనపడినది. 'ఈదారి ఎక్కడికి పోతుందో ? నరులు వెళ్ళడానికి శక్యముగా లేదు. ఈతోవలో ఉన్న అడుగుజాడలు ఎవరివో ? క్షణం నిదానించి చూడాలి' అని విదూషకుడు తలచినాడు. ఈలోగా దివ్యకాంతులు బంగారపుబిందెలు బుజాలమీదపెట్టుకొని దిగుడుబావిలో నీళ్ళు ముంచుకోడానికి వచ్చినారు. వాళ్ళు నీళ్ళు ముంచుకొంటున్నప్పుడు విదూషకుడు మృదువుగా వారితో "ఈనీళ్ళు ఎవరికోసం తీసుకుపోతున్నారు ?" అన్నాడు.

"ఈపర్వతములో భద్ర అనే విద్యాధరి నివాసము చేస్తున్నది. ఆమెకు స్నానార్థము నీళ్ళు తీసుకు పోతున్నాము" అన్నారు దివ్యకాంతలు. వెతకబోయినతీగె అతనికాలికి తగిలింది. బ్రహ్మదేవుడు ధీరుల ప్రయత్నాలకు సంతోషించి కావలసిన సామగ్రిని తానేసమకూరుస్తాడు. ఆదివ్య స్త్రీలలో ఒకతె ఆకస్మికముగా 'మహాభాగా ! ఈబిందెను నా బుజానికి ఎత్తుదూ' అని అడిగింది. ఆలాగే బిందెఆమెబుజానికి ఎత్తినాడు. పూర్వము తనవేయసి విద్యాధరి యిచ్చిన రత్నాలఉంగరమును విదూషకుడు బిందెలోవేసి యథాప్రకారంగా దిగుడు బావి గట్టున కూర్చున్నాడు.

దివ్యస్త్రీలు భద్రకు స్నానము చేస్తున్నప్పుడు బిందెలోనుంచి రత్నాలఉంగరము ఆమె ఒడిలో పడినది. ఆ అంగుళీయకమును చూచి విద్యాధరి భద్రాదేవి చప్పున గుర్తించింది. వెంటనే ఆమె "ఇక్కడ

అపూర్వ మైన పురుషుణ్ణి చూశారా ఏమిటి ?" అని ప్రశ్నించింది. "దిగుడుబావి గట్టున పురుషుణ్ణి చూచాము. అతడు బిందె బుజాన పెట్టి సాయము చేసినాడు." అని వాళ్ళు సమాధాన మిచ్చినారు.

"వెంటనే ఆపురుషుణ్ణి స్నానం చేయించి శీఘ్రంగా ఇక్కడికి తీసుకు రావాలి" అని భద్ర వాళ్ళకు ఆజ్ఞ యిచ్చింది. విదూషకుడు స్నానము చేసి వచ్చినాడు. విద్యాధరి అతనికోసము ఎదురు చూస్తూ నిలువబడింది. ప్రియుణ్ణి చూచి ఆమె ఆనంద బాష్పాలతో అర్ఘ్యం మిచ్చి అతని కంఠమునా, బుజాలమీదనూ పూలదండలు వేసింది. ఆ భార్యాభర్తలు గాఢాలింగనము చేసుకొన్నారు.

బహుకాలానికి వా ళ్ళిద్దరూ కలుసుకోడం వల్ల, ఒకరి నొకరు తనివి తీర ఎంతసేపు చూచుకొన్నారో తెలియదు. ఆ భార్యాభర్తల హృదయాలలో కోరికలు కుప్పతిప్పలుగా బయలుదేరుతున్నవి. భద్రాదేవి భర్తను "ఈచోటికి మీరు ఎలా రాగలిగినారండీ ?" అని ప్రశ్నించింది. అతను "ప్రేమ, ప్రాణాపాయాలను లెక్కచెయ్యదు. నీ మీదఉన్న అనురాగము వల్లనే అపాయములు దాటుకొంటూ వచ్చాను" అన్నాడు. ప్రాణాలు పోగొట్టుకోడానికి వెనకుకు తీయని ఆ అనురాగమును ఆమె గ్రహించి ఆర్ద్రహృదయంతో "ఆర్యపుత్రా! నాకు చెలికత్తెలతో పని లేదు. సిద్ధులతో పని లేదు. మీరే నాకు ప్రాణము ! ఎంత అద్భుత మండీ మీగుణసంపద" అన్నది.

"ప్రేయసీ, అలా గయితే ఈ దివ్యభోగాలు వదిలిపెట్టి నాతో కూడా ఉజ్జయినీ నగరానికి రా" అని విదూషకుడు పలికినాడు. భద్ర అందుకు అంగీకరించింది. ఆమె ప్రియునితో వెళ్ళి పోవడానికి సిద్ధపడి, సంకల్పమాత్రంవల్ల సర్వవిద్యలనూ తృణప్రాయముగా వదిలిపెట్టింది.

ఆ రాత్రి విద్యాధరికి దేవీగౌర్యాది అనే చెలికత్తెనకలోపచారములూ చేసింది. తెల్లవారగానే విదూషకుడూ విద్యాధరీ ఉదయ పర్వతమునుంచి

దిగినాడు. అతడు యమదంష్ట్రుని స్మరించగా ఆ రాక్షసుడు ప్రత్యక్ష మైనాడు. వెళ్ళవలసిన మార్గము చెప్పి అతడు ఆ రాక్షసుని బుజాన ఎక్కగా విద్యాధరి ప్రియుని ఒడిలో కూర్చున్నది. విదూషకుడు అలా తనప్రేయసిని ముందుకూర్చోబెట్టుకొని యమదంష్ట్రునిసాయమువల్ల కాకోటక నగరము చేరినాడు. అక్కడివారు రాక్షసుణ్ణి చూచి భయపడి పోగా, విదూషకుడు ఆ నగరప్రభు వయిన ఆర్యవర్మ దగ్గిరికి పోయి తనప్రేయసిని వంప మని అడిగినాడు. ఆర్యవర్మ తనకుమార్తెను అల్లుడికి ఇచ్చినాడు : విదూషకుడు ఆ రాజపుత్రిని రాక్షసుని బుజము మీద ఎక్కించినాడు. వెంటనే యమదంష్ట్రుడు ఎగిరిపోయి పూర్వము విదూషకుణ్ణి మోసగించిన పాపిష్ఠివర్తకుని దగ్గిర వాలినాడు. ఆ వర్తకుడు ధనం బాగా ఆర్జించి భోగాలు అనుభవిస్తున్నాడు. అతని కుమార్తెనూ అతని ధనమునూ విదూషకుడు పుచ్చుకొన్నాడు. లోభుల సంపదను వారిస్తే అదే వారికి చావు. ఆ వర్తకుని కూతురినీ కూడా రాక్షసునిబుజాన ఎక్కించుకొని ముగ్గురు భార్యలతో విదూషకుడు ఆకాశమార్గాన ప్రయాణము చేసి చేసి పౌండ్రవర్ధన పట్టణము చేరినాడు. ఆ పౌరులు రాక్షస వాహనుడై వచ్చిన విదూషకుని చూచి ఆశ్చర్యపడినారు. ఆ నగరపాలకు డయిన దేవసేనుడు తన కుమార్తెను విదూషకునికి అప్పగించగా అతడు రాక్షసుని సహాయమువల్ల నలుగురు భార్యలతో ఉజ్జయినీ నగరము చేరుకొన్నాడు. ఉజ్జయినీ నగరవాసులంతా పరమాశ్చర్య పడుతున్నారు. ఆ నగరప్రభువు ఆదిత్యసేనుడు విదూషకునికి ఎదురుగా వచ్చినాడు. రాక్షసవాహనము దిగి విదూషకుడు మామగారయిన ఆ మహారాజుకు నమస్కారము చేసినాడు. అతడు నలుగురు భార్యలనూ రాక్షసుని బుజాలమీదనుంచి దింపి, రాక్షసుణ్ణి యథేచ్ఛగా వెళ్ళ మని సెలవిచ్చినాడు. వెంటనే విదూషకుడు భార్యా సమేతముగా ఆదిత్యసేన మహారాజభవనానికి వెళ్ళి, చాలా కాలము

నుంచీ తనకై ఎదురు చూస్తున్న రాజకుమారిని తన ప్రథను భార్యను చూచి ఆనందము కలిగించినాడు. రాజు కుతూహలముతో "ఇంతమంది భార్యలు ఎలా వచ్చారోయి, అల్లుడూ! ఆ రాక్షసు డెవడు?" అని అడిగితే యావద్వృత్తాంతమూ విదూషకుడు పూసగ్రుచ్చినట్టు చెప్పినాడు. అల్లుని అఖండ ప్రతాపము గుర్తించి ఆదిత్యసేనుడు అర్ధరాజ్యము ఇచ్చినాడు. వెంటనే పరిచారకులు వెళ్ళి గొడుగు పట్టినారు. మరి కొందరు వింజామరలు వేసినారు. విదూషకుడు రా జయినాడు. క్రమేణా అతను పృథివీ మండలము జయించి చక్రవర్తి అయి భార్యలతో భోగాలు అనుభవించినాడు.

ఇలాగా దైవము అనుకూలముగా ఉన్నప్పుడు ధీరుల బాహుబలమే లక్ష్మీదేవిని ఆకర్షించడానికి మహామంత్ర మవుతుంది.

వత్సరాజు కథ చెప్పగా మంత్రులూ దేవేరులూ వింటూ ఆనందముతో పొంగి పోయినారు.

తరంగము : ౧౯

యౌగంధరాయణుడు వత్సరాజుకు ఇలా సలహా ఇచ్చినాడు : "రాజేంద్రా! మీకు దైవము అనుకూలము. మీకు శౌర్యమున్నది. మేము రాజనీతి తెలుసుకొని చక్కగా ఆలోచించగా, మీరు వెంటనే దిగ్విజయము చేయడము ఉచితముగా కనపడుతున్నది." అప్పుడు వత్సరాజు, "అవును, బాగున్నది. మంచి చేయబోతే చెడు ఎదురవుతుంది. సత్కార్యాన్ని ఆచరించేటప్పుడు విఘ్నాలు వస్తవి. అంతరాయాలు రాకుండా నివారణార్థము మహేశ్వరునిగురించి తపస్సు చేదాము. శివానుగ్రహము లేకుండా కోరికలు ఎలాసఫలమవుతవి?" అన్నాడు. మంత్రులు రాముని సేతుబంధ ప్రయత్నానికి కపీశ్వరులు సాయంచేసినట్టు, మహారాజు చేయబోయే దిగ్విజయయాత్రకు అంగీక

రించినారు. మహారాజు సత్కార్యాచరణ సఫలము కావడానికి తపస్సు చేసి మూడుదినములు ఉపవసించినాడు. అతనికి స్వప్నములో శివుడు ప్రత్యక్షమై "నీతపస్సుకు మెచ్చినాను. నీకు తప్పక జయము. త్వరలో నీకు విద్యాధరచక్రవర్తి కాబోయే కుమారుడుకలుగుతాడు" అన్నాడు. శివానుగ్రహమువల్ల మహారాజుకు సంతృప్తి కలిగింది. తెల్లవారగానే మంత్రులకూ, వ్రతోపవాసములవల్ల నీరసించిన కుసుమశోభలు లయిన రాణులకూ వత్సరాజు స్వప్నవిషయము చెప్పి వీనులకు విందు చేసినాడు. వాళ్ళనంతోషము చెప్పడానికి మాటలు చాలవు. ఇలా మహారాజు తపస్సుచేసి తాత ముత్తాతలవలె మహిమ సంపాదించి నాడు. దిగ్విజయయాత్రా సమారంభంవల్ల పౌరులు పరమానందము అనుభవిస్తూడగా వత్సరాజు పారణ చేసినాడు. అప్పుడు యౌగంధరాయణుడు, రాజుతో "మహారాజా, నిజంగా మీరు ధన్యులు. ఈశ్వరదర్శనమయినమీకంటె ఎవరు కృతకృత్యులు? శత్రువులనుజయించి, భుజపరాక్రమమువల్ల విజయలక్ష్మిని అనుభవించండి. క్షత్రియోచిత మయిన శౌర్యమువల్లనే లక్ష్మీదేవిని పొందితే అప్పుడు రాజవంశాలలో స్థిరముగా ఉంటుంది. స్వధర్మార్జిత మయిన సంపద కలకాలమూ ఉంటుంది. మీతాతముత్తాతలు సంపాదించిననిధి చిరకాలం భూమిలో మరుగుపడి నప్పటికీ నీకులభించింది. అందుకు నిదర్శనముగా ఈకథ వినండి:

దేవదాను కథ

పాటలీపుత్ర నగరములో కులీనుడూ, ధనవంతుడూ అయిన దేవదాను అనే వైశ్యుడు ఉన్నాడు. అతనిభార్య పౌండ్రవర్ధన పురములో ధనికుని కుమార్తె. దేవదాను తండ్రి చనిపోయాక, వ్యసనాలలో చిక్కి జూదములో డబ్బు పోగొట్టుకొన్నాడు. దారిద్ర్య దుఃఖము వల్ల అతని భార్య కృశించగా, తండ్రి తన కుమార్తెను పౌండ్రవర్ధనపురము తీసుకు

పోయినాడు. ఆస్తియావత్తు కోలుపోయిన దేవదాను మళ్లీ వర్తకము చేయవలెనని నిశ్చయించుకొని, మామగారిని యాచించడానికి పౌండ్ర వర్ధనపురము వెళ్ళినాడు. అత్తవారి ఊరు చేరుకొనేసరికి సాయంకాల మైనది. మాసిన బట్టలతో ఉన్న దేవదాను విచారపడి "మామగారి యింట్లో ఈదశలో ఎలా ఉండడం? అభిమానికి బంధువులయెదట దైన్యముకన్న మరణమే మంచిది." అనుకొని బజారులో ఒకదుకాణములో మూల మునుచుకొని పరున్నాడు. తర్వాత కొంతసేపటికి ఆదుకాణానికి ఎవరో వైశ్యుడు వచ్చి తలుపులు తెరిచి లోపల ప్రవేశించగానే, అప్పుడే ఒకస్త్రీ మెల్లిగా వచ్చి ఆ యింట్లో చేరింది. దీపము వెలుగుతూ ఉండడమువల్ల ఆ కాంతిలో దేవదాను ఆమె తనభార్య అని ఆనవాలు పట్టినాడు. ఆమె లోపలికి వెళ్ళి తలుపు గడియ వేసింది. తన భార్య పరపురుషునితో లోపలికి వెళ్ళగానే దేవదాను తలమీద పిడుగు పడిన ట్లయింది. ధనహీనుణ్ణి దేహముకూడా వదిలివేస్తుంది. స్త్రీలు వదిలివేస్తా రంటే ఆశ్చర్యమా? స్త్రీల చిత్తాలు మెరుపుతీగెలవలె మహా చంచలంగా ఉంటవి. వ్యసనాల్లో చిక్కిన పురుషుల మనస్సులూ చంచలం గానే ఉంటవి. పుట్టిల్లు చేరిన స్వతంత్రురాలు స్వేచ్ఛగా సంచరిస్తుంది. పాపఫలము అనుభవించకపోదు.' అనుకొంటూ దేవదాను చాలా విచారించినాడు. తనభార్య పరపురుషునితో చేస్తున్న నరన సల్లాపములూ అతడు విన్నాడు. తలుపుదగ్గిరికి పోయి చెవి దోరపెట్టి వింటున్నాడు. అతనిభార్య జారునితో ఏకాంతములో మాట్లాడు తున్నది: "నీమీద నాకు మక్కువ ఎక్కువ. ఒక రహస్యము చెప్పాలి. నా భర్తకు వీరవర్మ అనే ముత్తాత ఉండేవాడు. ఆయన గృహప్రాంగణములో నాలుగు మూలలా వరహాలతో నిండిన బిందెలను భూమిలో పూడ్చిపెట్టి ఆ రహస్యము తన భార్యకుమాత్రమే చెప్పినాడు. ఆమె చనిపోయే సమయాన ఆ రహస్యము కోడలికి చెప్పింది. ఆమె తన కోడలికి చెప్పింది.

మా అత్తగారు నా కానంగతి చెప్పారు. ఇలా రహస్యము కోడళ్ళకు మాత్రమే తెలుస్తూ వచ్చింది. ఆ రహస్యము నా భర్తకు చెప్పకుండా దూరుకొన్నాను. ఆయన జూద మాడుతారు. అందువల్ల ఆయనకు చెప్పలేదు. ఆయన పేరు చెపితే నాకు పరమ అసహ్యము. నీవు నాకు ప్రియుడవు. నీవు అక్కడికి వెళ్ళి వరహాల బిందెలు తీసుకురా. వచ్చి నాతో సుఖము అనుభవించు." ఆ జారుడు చానిమాటలకు సంతోషించినాడు. అప్రయత్నముగా ధనము లభిస్తున్నప్పుడు అత నెంతో పొంగిపోయినాడు. దేవదాను భార్యమాటలువిని నిధి దొరుకుతుందిగనా అని సంతోషించి పాటలీపుత్రికు వెళ్ళి స్వగృహంలో ఉన్న వరహాల బిందెలను తవ్వి తీసుకొన్నాడు. ఈలోగా దేవదాను భార్యను చేపట్టిన జారుడు పాటలీపుత్రికు వర్తకము చేయవలె ననే మిషతో వరహాల బిందెలకోసము వచ్చినాడు. దేవదాను ఎక్కువ కిమ్మతుకు ఇల్లు అతనికి అమ్మివేసినాడు. దేవదాను కావరం పెట్టి అత్తవారింటికి వెళ్ళి భార్యను తీసుకొనివచ్చినాడు. శతవర్తకుడు కొనుక్కొన్న ఇంట్లో వరహాలబిందెలు దొరుకత వేమోనని ఎంత తవ్వించినా దొరకలేదు. నిష్ప్రయోజము దొరకక పోవడంవల్ల అతడు ఖిన్నుడై దేవదాను దగ్గిరికి వచ్చి "ఇల్లు నాకు అవసరం లేదు. తీసుకో నీ ఇల్లు. నాధనము నాకిచ్చేసెయ్యి." అంటూ తగాదాచేసినాడు. ఇద్దరూ పోట్లాడుకొని రాజుకు మనవి చేసుకొన్నారు. దేవదాసు తనభార్య వర్తనము రాజుతో పూస గుచ్చినట్లు చెప్పినాడు. రాజు దేవదాను భార్యను పిలిపించి యథార్థము తెలుసుకొని, పర జారను చేపట్టిన వర్తకునికి యావజ్జీవ శిక్ష విధించినాడు. దేవదాను భార్య ముక్కు కోసి మరొక పిల్లను పెళ్ళిచేసుకొని, వరహాలబిందెలవల్ల ధనికు డయి సుఖంగా ఉన్నాడు.

దిగ్విజయము

ఇలా యౌగంధరాయణుడు వత్సరాజుకు రాజధర్మము బోధిస్తున్నాడు. "ధర్మముచేత సంచితసిరి స్థిరంగా ఉంటుంది. అధర్మార్జిత విత్తము నీటి తుంపురులవలె నశిస్తుంది. రాజు ముఖ్యంగా ధర్మముచేతనే ధనార్జన చేయాలి. కార్యసిద్ధికిగాను మంత్రులందరినీ సమ్మానించి సిరి సంపదలు పొందవలె. మీ మామలవల్ల చాలామంది రాజులు మీ అండ చేరుతారు. కాళీరాజు బ్రహ్మదత్తుడు మీకు పరమ శత్రువు. ఆతన్ని ముందు జయించాలి. తర్వాత తూర్పుదిక్కు మొదలు వరసగా అన్ని దిశలూ గెలిచి కీర్తి పొందాలి.

మంత్రి ఈ మాటలు చెప్పినతర్వాత వత్సరాజుకు విజయోత్సాహము కలిగింది. జనమును ప్రయాణము కమ్మని ఆనతిచ్చి తనతో కూడా వస్తున్న బావమరిది గోపాలకుసికి వైదేహరాజ్య మిచ్చి సన్మానించినాడు తనవెంట సైన్యాన్ని తీసుకు వస్తున్న పద్మావతి సోదరుడు సింహవర్మకు చేదిదేశమిచ్చి గౌరవించినాడు తమిత్రుడైన సింహళ్లరాజు పుళిందకుని సైన్యముతోకూడా రావలసిన దని వార్త పంపినాడు. వత్సరాజు రాష్ట్రమంతటా ప్రయాణ సంరంభము ప్రారంభించింది. ఆతని శత్రువుల గుండెలు దడదడ లాడినవి.

బ్రహ్మదత్తుడు ఏమి చేస్తున్నాడో కనిపెట్టడానికి యౌగంధరాయణుడు వారాణసికి ముందుగా చారులను పంపినాడు. మంచిరోజున, నుముహూర్తాన, శుభశకునాలతో వత్సరాజు దైత్రయాత్ర బయలుదేరి మొదట బ్రహ్మదత్తుని మీదికి వెళ్ళినాడు. చతురంగ బలసమేతముగా వెళ్ళుతున్నా ప్రభువును ఇద్దరు రాణులుకూడా అనుసరించి ఉన్నారు.

ఇంతలో యౌగంధరాయణుని చారులు కాపాలిక వేషాలుధరించి కాశికి వెళ్ళినారు. వారిలో గొప్పమోసగాడు గురువువలె నటించి

నాడు. మిగిలినవాళ్ళు అతనికి శిష్యులయినారు. "మా గురువుగారు త్రికాలవేది" అని శిష్యులు మాయగురువును అక్కడక్కడ పొగడుతున్నారు. ప్రశ్న అడిగిన వారికి మాయగురువు ఇచ్చిన కాలిపోతవి అని చెప్పినమాటలు సత్యమయ్యేటందుకు శిష్యులు చాటుగా వెళ్ళి గృహములు తగులబెట్టేవారు. ఆ విధముగా ఆయన మహిమకు ప్రచారము జరిగింది. బ్రహ్మదత్తునికి ఇష్టుడయిన రాజపుత్రుని క్షుద్ర సిద్ధులద్వారా వశపరుచుకుని మాయాగురువు క్రమేణ బ్రహ్మదత్తుని రహస్యాలు గ్రహించినాడు. బ్రహ్మదత్తుని మంత్రి యోగకరండకుడు వత్సరాజు వచ్చేమార్గములో చాలా మాయోపాయాలు అల్లవంబించినాడు. ప్రతిమార్గములోనూ విషప్రయోగము చేయించి వృక్షాలను, పుష్పలతలను, గడ్డిని, నీటిని విషమయము చేయించి, విషకన్యలను, వేశ్యలను వత్సరాజు సేనలో ప్రవేశపెట్టినాడు. రాత్రివేళ శత్రువులను గూఢముగా సంహరించే మనుష్యులనుకూడా పంపినాడు. త్రికాలవేది వేషము ధరించిన గూఢచార నాయకుడు ఈ విషయాలన్నీ తన సహచరులవల్ల గ్రహించి యోగంధరాయణునకు వెంటనే తెలియపరిచినాడు. విషప్రయుక్తాలయిన పదార్థాల కన్నింటికీ యోగంధరాయణుడు విరుగు వేయించి, దండులోకి నూతనస్త్రీలను రానీయ కూడదని ఆజ్ఞయిచ్చినాడు. రహస్య ఘాతుకులను రుమణ్వంతుడు నేర్పుతో పట్టించి ప్రాణాలు తీయించినాడు. బ్రహ్మదత్తుని ఉపాయాలు ఏమీ ఫలించలేదు. అఖండ సేనానమన్వితుడై వస్తున్న వత్సరాజును జయించడము సాధ్యము కాదని గ్రహించి బ్రహ్మదత్తుడు మంత్రులతో ఆలోచించి, ముందుగా దూతను పంపి, తర్వాత తానే వెళ్ళి వత్సరాజుపాదాల మీద పడినాడు. లోబడిన బ్రహ్మదత్తుని వత్సేశ్వరుడు ఆదరించినాడు. వీరులు నమస్కార ప్రియులు కదా!

బ్రహ్మదత్తుడు లోబడినతర్వాత వత్సరాజు తూర్పుదిక్కును వశపరచుకొంటూ, మెత్తనిప్రభువులను వంచుతూ, కఠినులను లాగివేస్తూ, వంగదేశముయావత్తూ ఆక్రమించి, తూర్పునముద్రతీరాన జయస్తంభము నాటించినాడు. కాళింగులు ఎదురు వచ్చి, కప్పము కట్టినారు. పిమ్మట వత్సరాజు అరణ్యప్రదేశము దాటి దక్షిణదిశకు మరలినాడు. సర్వ ప్రాంతరాజులను అందరినీ జయించి, క్రమముగా కావేరీనది దాటి చోళరాజును వశపరచుకొని, మురళదేశీయులను శిక్షించి, వెనుకకు తిరిగి గోదావరీనదిని దాటినాడు. క్రమముగా రేవానదినికూడా దాటి ఉజ్జయినికి వెళ్ళేసరికి ఆయనమామ చండమహాసేనుడు ఎదురు వచ్చి సాదరముగా ఆహ్వానించినాడు. మామగారి సత్కారాలకు అల్లుడు సమస్తమూ మరిచిపోయి అక్కడనే ఉన్నాడు. వాసవదత్త కూడా తండ్రిని విడిచిపెట్టలేక బాల్యము స్మరిస్తూ అక్కడనే ఉన్నది. చండమహాసేనుడు పద్మావతిని తనబిడ్డవలెనే ఆదరించినాడు. కొన్నాళ్లు ఉజ్జయినిలో విశ్రమించి వత్సరాజు మామతోనూ, మహాసైన్యముతోనూ, పశ్చిమదిశకు బయలుదేరి లాటదేశము జయించినాడు.

ఆతర్వాత వత్సేశ్వరుడు ఉత్తరదిక్కుకు బయలువెడలి సింధునాథుని వశవర్తిని చేసుకొని, మ్లేచ్ఛులను హతమార్చి, పారశీకప్రభువుశిరస్సు ఖండించి, హూణులను వేటాడి, హిమాచలము చేరినాడు. కామరూప రాజు ఎదురు వచ్చి, ప్రణమిల్లి, జంగమపర్వతములవంటి ఏనుగులను సమర్పించినాడు. వత్సేశ్వరుడు కామరూపమునుంచి మగధరాజ్యానికి మరలినాడు. ఆయనమామ వాసవదత్తను తనకుమార్తె పద్మావతితో సమానముగా ఆదరించి మహోత్సవములు చేయించినాడు. సర్వజన నయనానందకరుడైనవత్సరాజు కొద్దికాలము మామగారియింట్లో ఉండి, ససైన్యముగా లావాణకము చేరినాడు.

త రం గ ము : 20

లావాణకములో విశ్రాంతి తీసుకొంటూ వత్సేశ్వరుడు యూగంధరాయణునితో "సచివోత్తమా, నీవు బుద్ధిచాతుర్యమువల్ల భూమండలములో రాజులను జయించినావు. వాళ్లెవరూ ఎదురు తిరగలేరు. కాశీరాజు కుత్సితుడు. అతనిని నమ్మలేము" అని పలికినాడు. అందుకు యూగంధరాయణుడు సమాధాన మిచ్చినాడు: "రాజేంద్రా, కాశీరాజు బ్రహ్మదత్తుడు తిరుగుబాటు చెయ్యలేడు. పరాక్రమమువల్ల అతనిని పట్టినాము. పైగా నీవు అతనిని గౌరవించినావు. మేలు చేసినవానికి తెలివి కలవాడు కీడు చేయడు. అందుకు తార్కాణము వినుము.

సోమదత్తుని కథ

పూర్వము వత్సదేశములో అగ్నిదత్తు డనే బ్రాహ్మణుడు రాజు ఇచ్చిన అగ్రహారాన్ని హాయిగా అనుభవిస్తున్నాడు. అతనికి సోమదత్తుడు, వైశ్వానరుడు అని ఇద్దరుకుమారు లున్నారు. పెద్దవాడు చక్కనివాడు, పనికిమాలినవాడు, నీతి నియమాలు లేనివాడు. రెండోవాడు వినయవంతుడు, పండితుడు. తండ్రిపోగానే కొడుకులు ఆస్తి చెరి సగము పంచుకొన్నారు. చిన్నవాడు రాజపూజితుడై నలుగురిలో తల ఎత్తుకొని తిరుగుతూ ఓహో అనిపించుకొంటున్నాడు. పెద్దవాడు కులవృత్తి వదిలి క్షత్రియకర్మ చేస్తూ, నలుగురినోళ్ళలో నానుతున్నాడు; వంశానికి తలవంపు తెస్తున్నాడు. ఒకనాడు సోమదత్తుడు శూద్రులతో గోష్ఠి చేస్తుండగా అతనితండ్రికి స్నేహితు డయిన ఒక బ్రాహ్మణుడు "ఓరీ! నీవు అగ్నిదత్తుని కుమారుడివి. మూర్ఖుడివై శూద్రునివలె సంచరించడం బాగాలేదు" అని మందలించినాడు. అందుకు కోపం తెచ్చుకొని సోమదత్తుడు అతన్ని కాలితో తన్నినాడు. ఆ విప్రుడు కొంతమంది బ్రాహ్మల్ని సాక్ష్యము తెచ్చుకొని న్యాయస్థానములో ఫిర్యాదు

చేసినాడు. రాజాజ్ఞప్రకారము సోమదత్తుణ్ణి కొట్లో పెట్టవలసివచ్చింది. అతన్ని తీసుకువస్తున్న భటులను సోమదత్తుని స్నేహితులు కత్తులూ కఠారులతో పరిమార్చినారు. రాజుకు ఆగ్రహము వచ్చింది. ఎక్కువ బలాన్ని పంపి సోమదత్తుణ్ణి తీసుకొని వచ్చి కొరత వేయుమని రాజ్ఞానన మయింది. తలారులు అతన్ని శూలముమీదికి ఎక్కిస్తున్న ప్పుడు, ఎవరో తోసినట్లు సోమదత్తుడు భూమిమీద పడినాడు. వాడి అదృష్టం అలా కలిసివచ్చింది! మళ్ళీ తలారులు అతని శూలముమీదికి ఎక్కించబోయేసరికి వా ళ్ళంతా అంధు లయినారు. వైశ్వానరుడు తన సోదరుణ్ణి రక్షించవలసిం దని రాజుకు విన్నపము పంపుకొన్నాడు. రాజు వైశ్వానరునిమాటవల్ల దయతలచి మరణాజ్ఞను ఆపించినాడు. చావు తప్పి సోమదత్తుడు రాజావమానము సహించలేక దేశాంతరము పోవ డానికి నిశ్చయించు కొన్నాడు. బంధువులంతా కాళ్ళా వేళ్ళా పడి బతి మాలుకోడంవల్ల సోమదత్తుడు అగ్రహారద్రవ్యం అంటకుండా అక్కడే ఉంటున్నాడు.

బతుకు తెరువు దొరక్క పోవడంవల్ల సోమదత్తుడు వ్యవసాయము చేదా మనీ, అందుకు అనుకూల మయినభూమి సంపాదించా లనీ అడి విికి వెళ్ళినాడు. అక్కడ అతనికి మంచిభూమి కనపడింది. ఆ ప్రదేశము మధ్య పెద్ద రావిచెట్టు ఉన్నది. సోమదత్తునికి ఎక్కడ లేనిభక్తి కలిగి రావిచెట్టుకు ప్రదక్షిణ నమస్కారములు చేసినాడు. "ఈ చెట్టుమీద వున్నభక్తునికి నేను దాసుణ్ణి." అన్నాడు సోమదత్తుడు. రెండుఎడ్లను తెచ్చి అతడు అరక కట్టి, రావిచెట్టుకు బలి ఇచ్చి వ్యవసాయము ఆరం భించినాడు. ఆ చెట్టుక్రిందనే అహోరాత్రాలు నివసిస్తున్నాడు. అతని భార్య అన్నము మూటకట్టుకొని అక్కడికే తీసుకువస్తుంది. సకాలానికి సస్యము చక్కగా ఫలించింది. అతని దురదృష్టమువల్ల అన్యరాష్ట్రము వారు వచ్చి పంట దోచుకొని పోయినారు. శత్రువులు వెళ్ళిపోయిన

తరువాత, సస్యముపోయినందుకు భార్య కన్నీరు మున్నీరుగా ఏడుస్తూంటే ఓదార్చి, మిగిలినధాన్యము ఇంటికి తోలుకొని పోయినాడు. యథాప్రకారముగా రావిచెట్టుకు బలి ఇచ్చినాడు. ధీరులకు కష్టకాలములో దార్ఢ్యము సహజము. మనస్సు చికాకుగా ఉన్నందువల్ల అతనికి రాత్రి నిద్రలేదు. రావిచెట్టునుండి వాక్కు అతనికి వినవడ్డది: "సోమదత్తుడా! శ్రీకంఠదేశంలో ఆదిత్యప్రభా మహారాజు దగ్గిరికి వెళ్ళు. అక్కడ రాజద్వారముదగ్గిర నిలబడి సదా సంధ్యాగ్ని హోత్ర మంత్రములు పఠించు. అప్పుడు ఇలాపలుకు. నేను బ్రాహ్మణుణ్ణి. నాపేరు పులభూతి. నామాట వినండి. మంచిచేసేవాడు, మంచి పొందుతాడు. చెడుచేసేవాడు చెడే పొందుతాడు. అంటూ నీ వక్కడ నిలబడితే రాజునీకు సంపదలు ఇస్తాడు. సంధ్యాగ్నిహోత్రమంత్రాలు చెపుతాను. సోమదత్తుడా! నేర్చుకో. నేను ఎవరో ఎరుగుదువా? యక్షుణ్ణి!" ఇలా అశరీరవాణి చెప్పిన మాటలు విని సోమదత్తుడు మంత్రము నేర్చుకొన్నాడు. రావిచెట్టుమీదనుంచి వాక్కు అంతర్ధాన మయింది.

తెల్లవారగానే సోమదత్తుడు ఫలభూతి అనే కొత్తపేరు పెట్టుకొని భార్యాసమేతముగా ప్రయాణము చేసి అడవులను దాటి శ్రీకంఠదేశము చేరినాడు. అక్కడ రాజద్వారముదగ్గిర అతడు నిలువబడి సంధ్యాగ్ని మంత్రాలు ఏకరువు పెట్టి తనపేరు ఫలభూతి అని వ్యవహరిస్తున్నాడు. 'మంచి చేసేవాడు మంచినే పొందుతాడు. చెడు చేసేవాడు చెడునే పొందుతాడు' అని ప్రజలకు వింత గొలిపే మాదిరిగా అంటున్నాడు. పదే పదే ఫలభూతి పలుకులు విని మహారాజు అతనిని ఆస్థానానికి పిలిపించినాడు. రాజ సమ్ముఖాన కూడా ఫలభూతి యథాప్రకారముగా పలికినాడు. మహారాజుపక్క నున్న వారంతా పకుకున నవ్వినారు. సామంత సమేతంగా ఆదిత్యసేన మహారాజు అతన్ని గౌరవించి వస్త్రాభరణాలూ అగ్రహారాలూ దాన మిచ్చినాడు.

ఈ విధముగా యక్షుని ప్రభావమువల్ల ఫలభూతి సకలైశ్వర్యములూ అనుభవిస్తున్నాడు. ఆదిత్యసేనునికి ఫలభూతి అంటే అమితప్రీతి. కాల క్రమేణ రాజమందిరములోనూ అంతఃపురములోనూ ఫలభూతి మహా రాజుకు ఇష్టు డని అందరూ గౌరవంతో చూస్తున్నారు.

ఒకనాడు ఆదిత్యసేనుడు ఆకస్మికంగా వేటచాలించి అంతఃపురము లోకి పోగా, ద్వారపాలకులు తొట్రుపాటు చెందినారు. లోపలికి వెళ్ళి చూస్తే రాణి కువలయావళి దేవతార్చన చేస్తున్నది. ఆమె జుట్టు విరింప బోనుకుని, ముఖాన పెద్దసిందూరతిలకము పెట్టుకొని, రంగు రంగుల ముగ్గులతో ఉన్నమహామండలము మధ్య కూర్చుని కళ్ళు మూసుకొని పెదవులు కదిలేలాగున జపము చేస్తున్నది. ఆమెప్రక్క, పాత్రలలో రక్తము, మద్యము, మహామాంసము బలి ఇచ్చి ఉన్నవి. దిగంబరముగా ఉన్నకువలయావళి రాజును చూచి చప్పున వస్త్రము చుట్టుకొన్నది. 'ఇదంతా యేమిటి?' అని రాజు అడిగినాడు. "అభయ మివ్వండి. మీశుభము కోసమే ఈ పూజ చేస్తున్నాను. నేను కన్యగా పుట్టింట్లో ఉన్నప్పుడు ఒకసారి వసంతోత్సవములో ఉద్యానవనాన చెలికత్తెలు నాతో ఇలా అన్నారు: "ఈ వనములో చెట్లమాటున ఆకులలో విఘ్నేశ్వరు డున్నాడు. ఆ దేవుడు అడిగినవాని వరము లిస్తాడు. మహాప్రభావసంపన్ను డైనగణేశుని పూజిస్తే నీకు మంచి భర్త లభిస్తాడు." ఆ మాటలు విని చిన్నతనముచేత వాళ్ళతో 'విఘ్నేశ్వరపూజవల్లనే కన్యలకు మంచిభర్తలు దొరుకుతారా?' అన్నాను. 'ఏమిటి! వినాయకపూజ చెయ్యక పోతే ఎవరికీ కోరికలు సిద్ధించవు. ఆ దేవుని ప్రభావం ఎటువంటిదో విను' అని చెలికత్తెలు ఈ కథ చెప్పినారు:

కుమార సంభవ కథ

పూర్వము తారకాసుని సంహరించే కుమారుని కోసము ఇంద్రాదులు శివుని ప్రార్థించినారు. మన్మథుడు శివుని ఫాలనేత్రాగ్నిలో భస్మమయిన తర్వాత పార్వతీదేవి తపస్సు చేసి, మన్మథుని బతికించమనీ, తనకు కుమారుడు కావలెనసీ, మహేశ్వరుని వేడుకొన్నది. విఘ్నేశ్వర పూజ మరచి పోయింది. "పార్వతీ, మన్మథునికి ప్రాణ మిస్తాను ; శరీరము మాత్రము ఉండదు" అని శివుడు సెల విచ్చినాడు. తర్వాత బ్రహ్మాదులు వచ్చి శివపుత్రుని కోసము ప్రార్థన చేశారు. మహేశ్వరుడు అంగీకరించినాడు.

బహుకాలానికి కుమారస్వామి కలిగినాడు. దేవేంద్రుడు కుమారస్వామికి సైన్యాధిపత్య మియ్యడానికి ఉపక్రమించి కలశము ఎత్తేసరికి చెయ్యి బిగిసిపోయింది. "నీవు విఘ్నేశ్వరపూజ చేస్తే ఈ విఘ్నము పోతుంది" అని మహేశ్వరుడు అనుగ్రహించినాడు. ఇంద్రుడు సక్రమముగా గణేశ పూజ చేసి, కుమారస్వామిని సేనాపతిగా అభిషేకించినాడు. స్వామి తారకాసురుని సంహరించి దేవతల కోరిక నెరవేర్చినాడు. కాబట్టి నీవుకూడా విఘ్నేశ్వరపూజ చెయ్యవలసింది.

దేవా, వయస్యలు ఈ ప్రకారము చెప్పినమీదట ఏకాంతముగా గణేశపూజ చేశాను. పూజకాగానే నాచెలిక త్రెళ్ళు ఆకాశములోకి ఎగిరిపోయి విహారము చేశారు. ఆశ్చర్యపడి నేను వారిని భూమి మీదికి రమ్మంటే వాళ్ళు వచ్చారు. 'మీకీశక్తులు ఎలా వచ్చినవి?' అని నేను అడిగితే వాళ్ళు "మహామాంస భక్షణముచేత వచ్చినవి ఈ డాకిని మంత్రసిద్ధులు. కాళరాత్రి అనే బ్రాహ్మణి మాకు ఉపదేశించింది" అన్నారు. 'నాకుకూడా ఉపదేశము చేయించండి' అని ప్రార్థిస్తే వాళ్ళు వెంటనే వెళ్ళి కాళరాత్రిని తీసుకు వచ్చారు. ఆమెది చాలా వికార రూపము: కనుబొమలు కలిసిపోయినవి, గాజు కళ్ళు, చప్పిముక్కు,

పెద్దదెంపలు, మొద్దుపెదవులు, పారపళ్ళు, కొంగమెడ, బానపొట్ట, చీలుకుపోయిన యెగుడుపాదాలు. ఆమె పాదాలకు నమస్కరించాను. అదివరకే విఘ్నేశ్వరపూజ చేసిన నన్ను దిగంబరముగా మండలములో కూచోబెట్టి, భైరవార్చన చేయించి, ఆమె నైవేద్యము పెట్టిన నర మాంస భోజనము నాకు పెట్టింది. మంత్రోపదేశ మయిన తర్వాత నేను ఆకాశము లోకి ఎగిరి కొంతసేపు విహరించేసి ఆమె ఆనతిప్రకారం కిందికి వచ్చి, తర్వాత అంతఃపురానికి వెళ్ళాను. కన్యాత్వములోనే డాకినీ చక్ర వర్తిని నయినాను. కాళరాత్రి సంగతి చెపుతాను :

కాళరాత్రికథ

కాళరాత్రిభర్త విష్ణుస్వామి. ఆయన వేదపండితుడు. ఆయనసన్నిధికి వేదాధ్యయనము కోసము నానా దేశాలనుంచి విద్యార్థులు వస్తూ ఉంటారు. ఆ శిష్యులలో సుందరకు డనే అందగాడు ఉన్నాడు. బంగా రానికి పరిమళ మద్దినట్టు అతని అందానికితోడు శీలము అలంకారముగా ఉన్నది. విష్ణుస్వామి ఇంట్లో లేని సమయము చూచి కాళరాత్రి సుందరకుణ్ణి కామించింది. అతడు అంగీకరించక పెడ ముగము పెట్టినాడు. సత్పురుషుల మనస్సు నిశ్చలము కదా! సుందరకుడు వెళ్ళిపోగానే కాళరాత్రి తనశరీరాన్ని తానే గోపముతొద్దీ చీరుకొని, నఖక్షతాలూ, దంతక్షతాలూ ఒంటి నిండా ఉండగా తల విరియబోసుకొని, చీర సడల్చి భర్త వచ్చే వేళకు ఏమస్తూ కూర్చుని "నాథా! మీ శిష్యుడు సుందరకుడు ఎంత పని చేశాడండీ! నన్ను బలాత్కారము చేయబోయి, నా శరీరమంతా గోళ్ళతో రక్కినాడు" అన్నది. సుందరకుడు తనను అనుభవించలేదని, కాళరాత్రికి ద్వేషము తాండవించింది. విష్ణుస్వామి భార్యమాటలు యథార్థ మని నమ్మి, కోపముతో మండిపడినాడు. అతనికి భార్యమీద విపరీతమైన విశ్వాసము. ఆ విశ్వాసమే అతని

తెలివితేటలను హరించింది. భార్యమాటలు నిజమా అబద్ధమా అని విష్ణుస్వామి ఆలోచించ లేదు. సంజవేళ సుందరకుడు రాగానే విష్ణు స్వామి శిష్యసహితంగా పరుగెత్తి కర్రతో అతన్ని చావాచితక కొట్టినాడు. ఆ దెబ్బలతో సొమ్మసిల్లి పడగానే శిష్యుణ్ణి వీధిలోకి ఈడిపించినాడు.

రాత్రి చల్లనిగాలి వీచేటప్పటికి సుందరకుడికి తెలివి వచ్చింది. తన భంగపాటు తలుచుకొని ఇలా విచారించినాడు: "మనస్సును వికలము చేయడానికి స్త్రీ ముఖ్యకారణము. నా గురువు విద్వాంసు డైకూడా కోపం కొద్దీ ఇంతపని చేయడమా! మునీశ్వరులు మొదలు సామాన్యుల దాకా క్రోధాలు తప్పవు. పూర్వము మునీశ్వరులు తమభార్యల మీద అనుమానపడి దారుకా వనములో ఉంటున్న సాక్షాత్తు శివుని మీద అలగ లేదా! మునీశ్వరులకే తొందరఉంటే విద్వాంసులవిషయం వేరే చెప్పడ మెందుకు!" ఇలా అతడు తలపోసి భయమువల్ల పశువుల శాలలో ఒకమూల నక్కినాడు. సరిగా అప్పుడే కాళరాత్రి వచ్చింది. ఆమె చేతిలో చురకత్తి భీకరంగా ఉన్నది. ఆమె భయంకరంగా ఫూత్కారము చేస్తున్నది. కన్నులలోనుంచీ నోటిలోనుంచీ మంటలు వస్తున్నవి. భయంకర మైన ఢాకినీ రూపము సుందరకుడు చూచి రక్షో హరణ మంత్రము స్మరించు కొంటున్నాడు. భయమువల్ల వణికిపోతూ ముడుచుకొని కూర్చున్నాడు. అతని మంత్రోచ్చారణవల్ల ఆమె ముగ్ధు రాలయి, ఖేచరమంత్రము ఉచ్చరించి ఆకాశమార్గాన ఎగిరి ఉజ్జయినికి వెళ్ళిపోయింది. ఆమె ఉచ్చరించిన మంత్రాన్ని సుందరకుడు విని గ్రహించినాడు. ఆమె పశువులశాలతో ఉన్న మేడను తీసుకుపోయి కూరగాయల తోటలో దింపి, వల్లకాటిలో డాకినీ చక్రమధ్యాన కూర్చుని క్రీడిస్తున్నది. సుందరకుడు ఆకలితో మలమల మాడి అలసి ఆ కూరలతోటలో దిగి ముల్లంగిదుంప తవ్వుకొని తిని మేడ ఎక్కినాడు.

కాళరాత్రి అర్ధరాత్రివేళ మేడ ఎక్కింది. తన అనుచరులను పంపివేసి, ఆమె వడకగదిలో ప్రవేశించింది.

సుందరకుడు పశువులశాల వదలి పెట్టి స్నేహితులదగ్గిరికి వెళ్ళి తన అవస్థ వెళ్ళబోసుకొన్నాడు. పరదేశానికి అతడు పోతానంటే మిత్రులు ఓదార్చినారు. సుందరకుడు గురువుగారిఇల్లువదలి సత్రంలో తిండి తింటూ స్నేహితులతో స్వేచ్ఛగా తిరుగుతున్నాడు. ఒకనాడు బజారువీధిలో కాళరాత్రి అతన్ని చూచి కామించింది. అతడు అంగీకరించక ధర్మ బోధ చేసినాడు. ఆమెకు రోషమువచ్చి తనపైట చింపుకొని భర్త దగ్గిరికి వెళ్ళి "చూడండి, మీశిష్యుడు ఎంతపని చేశాడో! నాకొంగు చింపినాడు !" అంటూ పైటచెరుగు చూపించింది. విష్ణుస్వామి శిష్యుణ్ణి వధార్హుణ్ణిగా తలిచి, సత్రాధికారితో చెప్పి సుందరకుడికి తిండి పెట్ట వద్దన్నాడు. నిలువ నీడ లేక సుందరకుడు పశువులశాలకు వెళ్ళి ఆకాశానికి ఎగిరేమంత్రమును, దిగేమంత్రమునూ జ్ఞాపకము చేసుకోవాలనుకున్నాడు. రాత్రి సుందరకుడు పశువులశాలతో ఉన్న మేడదగ్గిరికి వెళ్ళగా, కాళరాత్రి యథాప్రకారంగా వచ్చి ఆమేడనూ, శాలనూ ఎత్తుకొని ఉజ్జయినికి తీసుకుపోయింది. అక్కడ ఆమె ఆకాశమునుంచి దిగేమంత్రము ఉచ్చరించి, ఆమేడను కూరగాయలతోటలో దింపి, మంత్ర జపము చేయడానికి శ్మశానానికి వెళ్ళిపోయింది. సుందరకుడు ఆకాశము నుంచి దిగేమంత్రము విన్నప్పటికీ గ్రహించలేక పోయినాడు. గురూపదేశము లేకపోతే మంత్రము సిద్ధించదు. ఆకలి వేసేప్పటికి అతడు ముల్లంగిదుంపలు కోసుకొని తిని గోశాలలో యథాప్రకారంగా ఉన్నాడు. కాళరాత్రి వచ్చి గోవాటముతో ఉన్న మేడ ఎక్కి ఆకాశాన ఎగిరి మేడను ఎప్పటిచోట నిలిపి ఇంటికి వెళ్ళింది.

ఉదయము సుందరకుడు గోశాల విడిచి, ముల్లంగి అమ్మకానికి బజారు వెళ్ళినాడు. మాళవదేశజాతులయిన రాజపురుషులు ఆ

ముల్లంగి తమదేశములో దని గ్రహించి, ఖరీదు ఇవ్వకుండా లాగివేసినారు. అతడు ఖరీదు అడిగితే అతనిని పట్టుకొని, రాజునన్నిధికి వెళ్ళి, "దేవా, మాళవమునుంచి ముల్లంగి తెచ్చి కాన్యకుబ్జములో ఎలా అమ్ముతున్నా వయ్యా, అని మే మడిగితే ఈయన మామీద రాళ్ళు రువ్వినాడు" అని ఫిర్యాదు చేసినారు. రాజు ఇదివీమి అని అడిగితే, అతని అనుచరు లైనమిత్రులు ముందరికి వచ్చి "మహాప్రభూ, ఇతనిని మేడఎక్కిస్తే విచిత్రము చూపిస్తాడు." అన్నారు. రాజుకోరికప్రకారము సుందరకుడు సౌధముమీదికి ఎక్కి, మంత్రము ఉచ్చరించి, మిత్రులతోకూడా మేడ కదిలించుకొని ఆకాశాన ప్రయాగకు వెళ్ళినాడు. అక్కడ స్నానము చేస్తున్నప్రభువుని చూచి, సుందరకుడు మేడను ఆకాశములో ఆపి, పైనుంచి గంగానదిలోనికి దుమికి, రాజునమీపానికి వెళ్ళినాడు. అందరూ ఆశ్చర్యపడినారు. "ఎవరు మీరు! ఆకాశములో నుంచి ఎందుకు దిగినారు! "అనిరాజు వినయపూర్వకముగా అడిగినాడు. "నేను మహేశ్వరుని అనుచరుడను, మురజకుడను. ఇహలోకభోగాలు అనుభవించిడానికి శివాజ్ఞ పొంది నీవద్దకు వచ్చినాను" అని సుందరకుడు చెప్పినాడు. ఆమాటలు నమ్మి, రాజు అతనికి పట్టమొకటి బహుమానము చేసినాడు. బంగారపుమంచముమీద పండుకొని, సుందరాంగనలు చామరములతో విసరుతూ ఉండగా యువకుల ఉపచారములతో ఇంద్రభోగాలు అనుభవిస్తున్నాడు సుందరకుడు.

కొంతకాలానికి ఆకాశాన వెళుతున్న సిద్ధుని సుందరకుడు స్తుతించి సంతృప్తుని చేస్తే, అతడు ఆకాశమునుంచి భూమిమీదికి దిగేమంత్రము చెప్పినాడు. ఆ మంత్ర ప్రభావముచేత సుందరకుడు మహావైభవసమేత మయిన నగరముతోకూడా ఆకాశమార్గాన కాన్యకుబ్జానికి వెళ్ళినాడు. రాజు గుర్తుపట్టి, ఎదురు పోయి మర్యాదలు చేసినాడు. అప్పుడు సుందరకుడు కాళరాత్రి వృత్తాంతము చెపితే, రాజు ఆమెను పిలిపించి అడిగి

నాడు. ఆమె అన్ని సంగతులూ ఒప్పుకొన్నది. దీని ముక్కూ చెవులూ కొయ్యండి అని రాజాజ్ఞ అయింది. ఆమె చటుక్కున మాయ మయిపోయింది. కాళరాత్రి తన రాజ్యములో ఉండగూడ దని రాజు శాసించినాడు. రాజమర్యాదలు పొంది సుందరకుడు ఆకాశమార్గాన వెళ్ళినాడు.

ఈ ప్రకారము కువలయావళి ఆదిత్య ప్రభునితో చెప్పి "దేవా, డాకినీ మంత్రసిద్ధులు ఇటువంటివి. మా తండ్రిరాజ్యములో ఇవి అంతటా ప్రసిద్ధము. పాతివ్రత్యముచేత నాసిద్ధులు కాళరాత్రి సిద్ధుల కంటెకూడా గొప్పవి. మీ శ్రేయస్సునకోసము అర్చనచేస్తూ, నరుని ఆకర్షించ బోతు న్నాను. మీరుకూడా ఈ సాధనామార్గములో ప్రవేశించాలి. సిద్ధులు లభిస్తే మీరు సార్వభౌము లవుతారు" అని ఉత్సాహవాక్యాలు పలి కింది. 'డాకినీ సాధన, మహామాంస భోజనము, రాజరికానికి సరిపడవు. ఇది వల్లపడదు' అని రాజు నిషేధము చేసినాడు. రాణి ప్రాణాలు త్యజిస్తా నని పట్టు పట్టింది. చివరకు రాజు అంగీకరించినాడు. కువల యావళి అతనిని మండలము మధ్య కూర్చో బెట్టి, ఇలా చెప్పింది. "మీ సన్నిధిలో ఉండే ఫలభూతి అనే విప్రుని ఆకర్షించాలి. ఆకర్షణ చాలా కష్టము. వంటవాని సాయము కావాలి. వానిని ఈ సాధనలో చేర్చి వానిచేత బ్రాహ్మణుని చంపించి వంట చేయించాలి. అసహ్యపడ గూడదు. ఉత్తమబ్రాహ్మణ మాంసమును అర్పించి భుజిస్తే, మంత్ర సిద్ధులు తక్షణమే అవుతవి." పాపభీతి ఉన్నప్పటికీ రాజు భార్యమాట కాదనలేక పోయినాడు. స్త్రీలమాట విని ఎవడు బాగు పడ్డాడు? సాహసికు డనే వంటవానిని పిలిచి, దీక్ష యిచ్చి, "రాజా, రాణీ కని పెట్టుకొని ఉన్నారు. త్వరగా వంట చెయ్యి — అని ఎవడు నీతో చెపు తాడో వానిని సంహరించి ఆ మాంసము రుచిగా వండి మాకు ఉదయ వేళ భోజనము పెట్టనలెను" అని రాజదంపతులు ఆజ్ఞాపించారు.

చిత్తము అని వంటవాడు ఇంటికి వెళ్ళినాడు. ప్రభాతవేళ ఫలభూతి వచ్చినాడు. "నీవు వెళ్ళి రాజదంపతులు కనిపెట్టుకొని ఉన్నారు. త్వరగా వంటచెయ్యి అని పాచకునితో చెప్పు" అని రాజు ఆన తిచ్చినాడు. ఫలభూతి కొంతదూరము వెళ్ళేటప్పటికి రాజకుమారుడు చంద్రప్రభువు ఎదురుపడి, "ఆర్యా, ఇప్పుడే నాకు చిన్నవని చేసిపెట్టవలి. ఈ బంగారము తీసుకు పోయి, మా నాయనగారికి చేయించిన కుండలముల వంటి కుండలములు చేయించాలి" అని అతనిని ప్రార్థించినాడు. తాను వంటవానికి చెప్పనలసిన మాటలు రాజకుమారునితో చెప్పి ఫలభూతి కుండలములు చేయించడానికి వెళ్ళినాడు. చంద్రప్రభువు సాహసికునికి సందేశము చెప్పినాడు. వెనుకటి సంకేత ప్రకారము పాచకుడు రాజకుమారుని చంపి, వండి, అర్చనానంతరము రాజదంపతులకు వడ్డించినాడు. నిజ మెరుగక వారు భుజించినారు.

మరునాడు ప్రాతఃకాలము ఫలభూతి కుండలములు పట్టుకొని వచ్చి రాజకుమారు డెక్కడ అని ప్రభువును అడిగినాడు. కుండలముల విషయము యావత్తూ విని, రాజపుత్ర మరణము గ్రహించి నేలమీద పడి రోదనము చేస్తూ, రాణిని మధ్య మధ్య దూషించినాడు. మంత్రులు అడిగిన మీదట రాజు యావద్వృత్తాంతమూ చెప్పినాడు. "మేలు చేసిన వానికి మేలు, కీడు చేసిన వానికి కీడు తప్పదు. అని ఫలభూతి రోజూ అంటూనే ఉన్నాడు. ఇతరుల కోసము తలపెట్టిన కీడు గోడమీద కొట్టిన బంతివలె తనకే వచ్చి తగులుతుంది. బ్రహ్మహత్యా మహాపాతకము తలపెట్టినందు వల్ల మాకుమారునే కోలుపోయినాము" అని రాజు చాలా దుఃఖించి ఫలభూతికి రాజ్యాభిషేకము చేసి, పాపపరిహారార్థము భార్యతో కూడా అగ్ని ప్రవేశము చేసినాడు. ఫలభూతి ప్రభువుకై ధర్మ ప్రకారముగా రాజ్యపాలన చేసినాడు. కాబట్టి చేసిన కీడు గాని మేలు గాని తప్పకుండా ఫలిస్తుంది.

వత్సరాజు సమక్షములో ఈకథ చెప్పి యౌగంధరాయణుడు "దేవా, అతడు మిమ్మలిని ఎదిరించడానికి యత్నించి ఓడిపోయినాడు. మీరు అతనికి మేలే చేసినారు. కాబట్టి బ్రహ్మదత్తుడు మీకు కీడు తల తలపెట్టడు; ఒకవేళ తల పెట్టినాడా మీ చేతులలోనే ప్రాణాలు విడుస్తాడు." అని నచ్చచెప్పినాడు. వత్సరాజు మంత్రిమాటలకు మనశ్శాంతి చెందినాడు.

మరునాడు వత్సరాజు లావాణకము నుంచి బయలుదేరి మహావైభవముతో కౌశాంబీ నగర ప్రవేశము చేసినాడు. వందిమాగధులు కైవారములు చేస్తూ ఉండగా, సామంత రాజులు వంగి నమస్కరిస్తూ ఉండగా చారణులు మంగళ గీతములు పాడుతూ ఉండగా వత్సేశ్వరుడు తన మందిరములోకి వెళ్ళి, జయ జయధ్వానముల మధ్య సింహాసనము ఎక్కినాడు. నగర మంతట్లా మహోత్సవము జరిగింది.

దిగ్విజయము చేసి వచ్చిన వత్సరాజు కీర్తి దశదిశలా నిండింది.

నరవాహనదత్త జననము

తరంగము : 10

కర్ణతాల బలాభూత
సీమంతిత కులాచలః
పంథాన మివ సిద్ధీనాం
దిశన్ జయతి విష్ణుజిత్.
కర్ణతాళాధిక భూతలచేత
సీమంతితాద్రియై సిద్ధిమార్గమ్ము
చూపుచున్నవిధాన శోభిలు నట్టి
విష్ణ్వధినాథుండు విజయమ్ము గాంచు!

తర్వాత ఉదయనుడు కౌశాంబి రాజధానిచేసుకొని, వీకచ్ఛత్రాధిపతి అయి, సుఖములు అనుభవిస్తున్నాడు. యౌగంధరాయణ, రుమణ్వాంతులమీద రాజ్యభారము విడిచిపెట్టి, వసంతకుడుసహాయుడుగా భోగములలో మునిగి తేలుతున్నాడు. స్వయముగా వీణ వాయిస్తూ, వాసవదత్తా పద్మావతీ దేవులతో కూడి గాంధర్వములో కాలము గడుపుతున్నాడు. సౌధోపరి భాగమున వారాంగనలు మధుర మద్యములు బంగారు గిన్నెలలో ఇస్తూఉంటే సేవిస్తున్నాడు.

ఒక్కొక్కప్పుడు వత్సరాజు ఆకుపచ్చనిచొక్కా తొడుకొని ధనుర్బాణములు ధరించి వేటకాండ్రతో బయలుదేరి అరణ్యములో మృగములను వేటాడుతాడు. వరాహములనూ, వనమహిషములనూ బాణాలతో పడగొట్టి వేస్తాడు. సింహాలను ఈటెలతో పొడుస్తాడు. మృగయావినోదము ఆయుధాలతోనే అయి పోతుంది. కుక్కలు, వలలు, గోతులు మొదలయిన మృగయా సాధనములు అలంకారార్థమే.

నారదుని రాక

ఈ విధముగా సుఖపరాయణుడై ఉన్నవత్సరాజు వద్దకు ఒకనాడు నారదముని వచ్చినాడు. రాజు వినయపూర్వకముగా మునిని సత్కరించినాడు. నారదుడు సుప్రీతుడై కొంచెము ఆలోచించి ఇలా పలికినాడు:

"వత్సరాజా, క్లుప్తసరిగా నీ కొకసంగతి చెపుతాను. నీకు పూర్వపితామహులలో పాండురాజు ఉండేవాడు. నీ కున్నట్టే ఆయనకూ ఇద్దరు భార్యలు చాలాయోగ్యురాండ్రు ఉండేవారు. పెద్దది కుంతీదేవి, రెండవది మాద్రి. ఒకనాడు పాండురాజు వేటకు వెళ్ళి, మృగరూపము ధరించి భార్యతో క్రీడిస్తున్న కిందమమునిని పొరబాటున బాణముతో కొట్టినాడు. ప్రాణాలు విడవబోతూ కిందముడు, "రాజా, నీవు యథేచ్ఛగా సంచరిస్తూ నామీద బాణము విడిచావు. నాకువలె నీకుకూడా

భార్యతో కలసి ఉన్నకాలములోనే మరణము సంభవిస్తుంది" అని శాపము పెట్టినాడు. శాపభీతిచేత పాండురాజు భార్యలను తీసుకొని తపోవనానికి వెళ్ళిపోయినాడు. కొంతకాలానికి మైమరచి పాండురాజు మాద్రిని బలవంతముగా కూడే సరికి మృతి చెందినాడు. కాబట్టి వేట రాజులకు మహావ్యసనాలలోది. వేటకానికీ, జంతువుకూ, వేటకాని వానానికీ అపాయము సమానమే. కనుక నీవు వేట మానుము.

"నీవు కల్యాణము పొందవలసిన వాడవు. నీ పూర్వులను బట్టి నాకు ఇష్టుడవు. కామదేవాంశమున నీకు కుమారుడు కలుగుతాడు. పూర్వము హరుడు ఫాలనేత్రాగ్నితో మన్మథుని దగ్ధము చేసిన తర్వాత రతీదేవి మహేశ్వరుని ప్రార్థించి, తనభర్తకు దేహము ప్రసాదించ మని వేడుకొన్నది. మహేశ్వరుడు దయార్ద్రహృదయుడై, "రతీ, పార్వతీదేవి నిజాంశమున భూలోకములో అవతరించి పుత్రాపేక్షతో నన్ను సేవించి మన్మథుని కుమారునిగా కంటుంది." అని అనుగ్రహించినాడు. ఆ ప్రకారముగా పార్వతి వాసవదత్తగా చండమహాసేనునికి జన్మించింది; తర్వాత నీకుభార్య అయినది. వాసవదత్త ఈశ్వరారాధన చేసి మన్మథుని కుమారునిగా కనబోతున్నది. అతడు విద్యాధర చక్రవర్తి అవుతాడు."

ఈ ప్రకారముగా నారదుడు చెప్పినమీదట వత్సరాజు ఆనందపరవశుడై తనరాజ్యము యావత్తూ నారదుడికి సమర్పించినాడు. నారదముని రాజ్యము వత్సరాజుకే తిరుగ ఇచ్చివేసి అంతర్ధాన మయినాడు.

పింగళిక వృత్తాంతము

పుత్రేచ్ఛతోఉన్న వాసవదత్తాదేవితో వత్సరాజు ఆరోజు గడిపినాడు. మరునాడు ఆయన ఆస్థానానికి వెళ్ళినప్పుడు యథాప్రకారము ప్రతీహారుడు వచ్చి గోత్రప్రవరలు చెప్పి "దేవా, తమ దర్శనార్థము ఒకానొక

బ్రాహ్మణస్త్రీ ఇద్దరు బిడ్డలతో సహా ద్వారము దగ్గర ప్రతీక్షిస్తున్నది" అని విన్నవించినాడు. రా వచ్చు నని ప్రభువు అనుజ్ఞ యిచ్చినాడు. జీర్ణవస్త్రము ధరించిన బ్రాహ్మణస్త్రీ దైన్యము ఉట్టి పడుతున్న ఇద్దరు బాలకులను ఎత్తుకొని లోపలికి వచ్చి వందనము చేసి "దేవా, నేను ఉత్తమవంశంలో జన్మించిన బ్రాహ్మణస్త్రీని. దౌర్భాగ్యవశాన దారిద్ర్యము అనుభవిస్తున్నాను. తినడానికి తిండి లేదు. ఈ కవలపిల్లలకు పాలు లేవు. శరణాగత రక్షకు లయిన దేవరవారి సన్నిధానానికి వచ్చినాను. ఆ మీద దేవర అనుగ్రహము!" అని విజ్ఞాపన చేసింది. రాజు దయదలచి ఆమెను వాసవదత్తాదేవికి అప్పగించ వలసినదని ప్రతీహారికి ఆన తిచ్చినాడు. ప్రతీహారుడు తీసుకొని వచ్చిన పింగళికను వాసవత్తా దేవి బాగా ఆదరించి, "ఏమి వైపరీత్యము! నాకు ఒక కుమారుడు కూడా కలగలేదు. ఈమెకు కవలబిడ్డలు!" అనుకొని, స్నానానికి లేస్తూ బ్రాహ్మణికి కావలసిన వస్త్ర ఏర్పాటు చేయడానికి చేటికలను నియమించింది. పింగళిక భోజనము చేసి విశ్రాంతి తీసుకొన్నతర్వాత వాసవదత్త ఆమెను, ఏదయినా కథ చెప్పు అని అడిగింది. పింగళిక ఇలా ప్రారంభించింది:

దేవదత్తుని కథ

పూర్వకాలములో జయదత్తు డనే సామంతప్రభువు ఉండేవాడు. అతని కుమారుడు దేవదత్తుడు పెరిగి పెద్దవాడయినాడు. అతనికి పెళ్ళియీడు వచ్చేటప్పటికి తండ్రి ఇలా ఆలోచించినాడు. "రాజ్యశ్రీ వట్టిచపల; బలాత్కారము చేత అనుభవించ దగినది. వణిజులలక్ష్మి కులస్త్రీవలె స్థిరమైనది. మాకు దాయాదులు చాలామంది ఉన్నారు. క్షత్రియ కన్యకంటే వైశ్యకన్యను మావాడికి పెండ్లి చేస్తే సంపద స్థిరముగా ఉంటుంది."

రాజు ఈవిధముగా ఆలోచించి పాటలీ పుత్రములో వసుదత్తు డనే వైశ్యశిఖామణి కుమార్తెను తనకుమారున కిచ్చి వివాహము చెయ్యా

వలె నని అడిగినాడు. దూరదేశ మయినప్పటికీ, సంబంధము మంచిదని వసుదత్తుడు తన పుత్రికను దేవదత్తునికి ఇచ్చి పెళ్ళిచేసినాడు. మామగారిచ్చిన మణికనకరాసులు చూచిన మీదట దేవదత్తునికి తండ్రి వైభవము మీద అభిమానము తగ్గింది. కుమారునికి మంచి సంబంధము దొరికింది కదాయని జయదత్త ప్రభువు నిశ్చింతగా ఉంటున్నాడు.

కొన్నాళ్ళకు వసుదత్తుడు కూతురిని చూతామని కోరికతో వియ్యంకుని మందిరానికి వచ్చి, తర్వాత పుత్రికను స్వగృహానికి తీసుకు వెళ్ళినాడు. ఇంతలో జయదత్తుడు హఠాత్తుగా మరణించినాడు దాయాదులు చెలరేగి రాజ్యము అపహరించినారు. తల్లి కుమారుని రాత్రివేళ రహస్యముగా అన్యప్రదేశానికి తీసుకుపోయి "నాయనా, మన ప్రభువు పూర్వదిక్కున చక్రవర్తి. వెళ్ళి ఆయనను ప్రార్థిస్తే నీకు సహాయముచేసి రాజ్యము స్వాధీనము చేయిస్తాడు." అని హితబోధ చేసింది. "అమ్మా, పరికరాలు ఏవీ లేకుండా నేను వెళితే, అక్కడ నాకు ఆదరము చూపు తారా!" అన్నాడు కుమారుడు. "నాయనా, నీమామగారి యింటికి వెళ్ళు ఆయన మహాధనికుడు కదా! ఆయనవద్ద ద్రవ్యము అడిగి తీసుకొని చక్రవర్తి నన్నిధికి వెళ్ళు" అని తల్లి ప్రోత్సాహము చేసింది. రాచబిడ్డకు సిగ్గుగానే ఉన్నది. విధిలేక దేవదత్తుడు అసాయంత్రమే బయలుదేరి క్రమేణ మామగారింటికి చేరేటప్పటికి రాత్రి పొద్దు పోయింది. తండ్రి పోయి, రాజ్యము పోయి, దీనస్థితిలో ఉన్న దేవదత్తుడు రాత్రి వేళ బంధువులను లేపడము ఎందు కనుకొని సమీపములో ఉన్న నత్రము వెలుపల కూర్చున్నాడు. అత్తవారిల్లు బాగా కనిపిస్తూనే ఉన్నది. కొంతసేపటికి ఆయింట్లోనుంచి తాడు పట్టుకొని నేలమీదకు దిగుతున్న స్త్రీ కనిపించింది. ఆమె రత్నభూషణాల కాంతితో ధగ ధగ మెరిసి పోతున్నది. ఆమె తన భార్య అని దేవదత్తుడు గుర్తుపట్టినాడు. 'ఎవరు నీవు' అని ఆమె దేవదత్తుని అడిగింది. బాటసారిని అన్నాడు

అతడు. భర్తను గుర్తుపట్టకుండానే ఆమె సత్రములోకి వెళ్ళింది. ఏమి జరుగుతుందో అని అతడు చాటుగా ఆమెను కనిపెట్టి చూస్తున్నాడు. ఎవరో పురుషుడు ఆమెను చూచి, ఇంత ఆలస్యంగా వచ్చా వేమి అని రెండు తన్నినాడు. అతని కోపము పోగొట్టి ఆమె కామోద్రేకముతో అతనితో ఉపభోగము ప్రారంభించింది. రాజ పుత్రుడు విచారపడి "క్రోధసమయము కాదు. సాధించవలసిన మహాకార్యమున్నది. ఈఖడ్గము శత్రువులమీద చూపవలసినది కాని స్త్రీలమీద, నరాధములమీద పోనిస్తే ఏమి లాభము? ఈదుష్టభార్యతో ఏమిపని! నరి సమానులు కానివాళ్ళతో సంబంధమువల్ల వచ్చిన నష్టమిది. కాకికి ఎంత సేపూ కాకిమీదనే దృష్టి కాని కోకిల మీదికి పోదు" అని భావించి వివేకముతో ఊరుకొన్నాడు. జయేచ్ఛ కలవారి మనస్సు మగువల మీదికి పోదు. బారునివద్ద సెలవు పుచ్చుకొని ఆమె వెళ్ళేటప్పుడు కర్ణాభరణము కింద పడిపోయినప్పటికీ గమనించకుండా వచ్చినదారినే ఇంటికి పోయింది. ఆబారుడుకూడా త్వరగా ఎటో వెళ్ళినాడు.

దేవదత్తుడు యావత్తూ గమనించి విచారగ్రస్తుడై ఉండి దైవవశాత్తు ఆ ఆభరణముకేసి చూసినాడు. మణులతో తళతళలాడుతున్న కర్ణాభరణము తీసుకొని బయలుదేరి కాన్యకుబ్జము చేరినాడు. బహు మూల్యము కలనగను తాకట్టు పెట్టి లక్షవర్ణములు పుచ్చుకొని, అశ్వములు, గజములు కొని, పరివారముతో చక్రవర్తిసన్నిధికి వెళ్ళి తనరాజ్యాపహరణమును గురించి విన్నవించాడు. చక్రవర్తి సైన్య మిచ్చి పంపగా, దేవదత్తుడు శత్రువులను ఎదుర్కొని జయించి రాజ్యము సంపాదించుకొన్నాడు. తర్వాత తాకట్టు తప్పించి రత్నాభరణము మామగారికి పంపినాడు. కోమార్తెకు తండ్రి ఆ నగ ఇచ్చినాడు. ఆమె చీకాకు పడి, "ఆరాత్రి సత్రములో బాటసారి కనపడినాడు. అతడు నా భర్త అనిపిస్తున్నది. అప్పుడు ఆయనను ఆనవాలు పట్టలేదు. ఈ ఆభరణము

నాచెవినుంచి జారిపోయి ఉంటుంది. తర్వాత వెతికితే కనపడలేదు. నా భర్త తీసుకువెళ్ళి ఇప్పుడు పంపించినాడు. ఏమి గతి!" అని భయపడి పిరికిగుండెవల్ల హృదయస్పందనము ఆగిపోయి మరణించింది. కుమార్తె రహస్యవ్యాపారము చేటికవల్ల గ్రహించి తండ్రి నోరెత్త లేదు.

రాజ్యము లభించినతర్వాత దేవదత్తునికి చక్రవర్తి తనకుమార్తె నిచ్చి పెండ్లి చేసినాడు. అతనితల్లి చాలాఆనందించింది.

సాహాససమయాలలో స్త్రీల హృదయము వజ్ర నిష్ఠురము; భయసమయాలలో కుసుమకోమలము. ఉత్తమవంశ సంభూత లయినస్త్రీలు ఆపదలోకూడా శీలము కోల్పోరు.

బ్రాహ్మణి చెప్పినకథ విని వానవదత్తాదేవి "ఈమె కులీన, వాక్చాతుర్యము కలది. ఉత్తమ గుణముచేతనే ఈమెకు రాజదర్శనము లభించింది" అని భావించి. నీభర్త ఎవరమ్మా? నీవృత్తాంతము చెపు తావా?" అని అడిగింది. ఆమె ఇలా చెప్పింది:

పింగళిక వృత్తాంతము

దేవీ, మాళవ దేశములో అగ్నిదత్తుడనే బ్రాహ్మణోత్తమునికి ఇద్దరు సుపుత్రులు ఉన్నారు. అన్న శంకరదత్తుడు, తమ్ముడు శాంతికరుడు. చిన్నతనములోనే శాంతికరుడు విద్యార్థియై దేశాంతరము వెళ్ళిపోయినాడు. అతనిఅన్న నాభర్త. మా తండ్రియజ్ఞకర్త, సంపన్న గృహస్థు; యజ్ఞదత్తుడని నామధేయము. కొన్నాళ్ళకు మామామగారు చనిపోతే అత్తగారు సహగమనము చేసింది. అప్పుడు నేను గర్భవతిని. నాభర్త తీర్థయాత్రలు సేవించడానికి వెళ్ళి, సరస్వతీనదీతీరాన మరణించారు. ఆయనవెంట వెళ్ళినవారు వచ్చి ఈ సంగతి నాకుచెప్పినారు. నేను సహగమనానికి సిద్ధపడితే గర్భవతిని అనే కారణముచేత నిషేధించారు. తర్వాత కొద్దిరోజులకు బందిపోటుదొంగలు వచ్చి, మానంపద

యావత్తూ హరించి అగ్రహారగ్రామము అంతా దోచుకొనిపోయినారు. ముగ్గురు బ్రాహ్మణస్త్రీలు నా సావాసకత్తెలు. మేము నలుగురమూ దేశాంతరము వెళ్ళిపోయినాము. చేతిలో ఏమీ లేకపోడముచేత పని పాటలు చేసి నెలరోజులు కాలక్షేపము చేశాము. ఇంతలో నాకు ఈ కవలపిల్లలు పుట్టినారు. కొత్తచోటు, పేదరికము, ఈ పిల్లలూ! ఏమీ తోచక, మనమహాప్రభువు అనాథ రక్షకు లని విని, సిగ్గు విడిచి, ఇక్కడికి ఎలాగో వచ్చి మీ అనుగ్రహపాత్రురాలను అయినాను. ఇక నా కష్టాలు గట్టెక్కినవి. చిన్నతనమునుంచీ శిష్టగృహములో అగ్నిహోత్రాల ధూపము తాకుతూ ఉండడముచేత నా నేత్రాలకు పింగళవర్ణము సంక్రమించింది. అందుచేత నన్ను పింగళిక అని లోకులు అంటారు. ఇది నా వృత్తాంతము. మా మరది శాంతికరుడు ఏ మయినాడో ఇంత వరకూ తెలియలేదు. దేవీ!

ఈప్రకారము పింగళిక చెప్పినకథ విని వాసవదత్త కొంచెము ఆలోచించి, "అమ్మా, మా పౌరోహితుని నామధేయము శాంతికరుడు. ఒకవేళ ఆయన నీ మరిది అవునేమో" అన్నది. పింగళిక చాలా అదుర్దాతో రాత్రి గడిపింది. ఉదయము వాసవదత్త శాంతికరుని పిలిపించి ఆయన వంశక్రమము అడిగింది. ఆయనవాక్యాలవల్ల మహారాణి విషయము యావత్తూ గ్రహించి "స్వామీ, ఈమె మీ వదినె పింగళిక" అని చెప్పింది. ఆయన నిదానించి చూచి గుర్తుపట్టి తనయింటికి తీసుకు వెళ్ళినాడు. తనతల్లిదండ్రులూ అన్నగారూ చనిపోయినట్లు విని చాలా విచారించినాడు. వాసవదత్త ఆ బిడ్డలకు శాంతిసోముడు, వైశ్వానరుడు అని పేర్లు పెట్టి తనకు పుట్టబోయే కుమార చక్రవర్తికి వాళ్ళను పౌరోహితు లని నిర్ణయించి వా ళ్ళందరికీ సమృద్ధిగా సంపద లిచ్చింది. సుకృతకర్మలు ఫలసిద్ధికి తీసుకు వెళ్ళేటప్పుడు పురుషప్రయత్నమే నిమిత్త మాత్రము.

ఒకనాడు కులాలవనిత (కుమ్మర స్త్రీ) అయిదుగురు బిడ్డలతో సహా బయలుదేరి అంతఃపురములోకి మూకుడులు తెచ్చింది. దానిని చూచి వాసవదత్త పక్కన ఉన్న పింగళికతో, "చూడు, దీనికి అయిదుగురు కుమార్తెలు. నాకు ఒకడూ కలగలేదు. ఇది పుణ్యము చేసుకొన్నది" అన్నది. "దేవీ, దరిద్రులకు కుటుంబము హెచ్చు. పుణ్యమువల్ల కలిగినసంతానము కాదు. మీకు కలిగేపుత్రుడు ఉత్తముడవుతాడు. వించారించకండి. త్వరలోనే మీకు పుత్రోత్పత్తి అవుతుంది" అని ఓదార్చింది.

శివానుగ్రహము

కుమారుడు కలగలేదు అనేచింతలోనే ఉన్నది వాసవదత్త. భార్య అభిప్రాయము గ్రహించిన వత్సరాజు వచ్చి "దేవీ ఈశ్వరారాధన చేస్తే నీకు పుత్రోత్పత్తి అవుతుం దని నారదముని ఇదివరలోనే చెప్పినాడు. కాబట్టి వరప్రదాత అయిన మహేశ్వరారాధన చెయ్యవలె దేవీ!" అని సూచించినాడు. వాసవదత్త వ్రతము ప్రారంభించేసరికి రాజు, మంత్రులు, రాజ్యములో ప్రజలందరూ శివార్చనలు చేసినారు. మూడురోజులు రాజదంపతులు ఉపవాసము చేసినతర్వాత స్వప్నములో శివుడు సాక్షాత్కరించి "మీకు కాముని అంశవల్ల పుత్రుడుపుట్టి, సకలవిద్యాధరులకూ చక్రవర్తి అవుతాడు" అని అనుగ్రహించినాడు. ఈవరమిచ్చి మహేశ్వరుడు అంతర్ధాన మయినతర్వాత రాజదంపతులు మేలుకొని చాలా ఆనందించినారు. ప్రాతఃకాలము వారు ఈవృత్తాంతము అందరికీ తెలియజేసినారు. అందరూ ఉత్సవము చేసి పారణలు, (భోజనాలు) చేసినారు.

తర్వాత కొద్దిరోజులకు జటాధారి అయిన మహాపురుషుడు వాసవదత్తకు స్వప్నములో సాక్షాత్కరించి ఫలము ఇచ్చినాడు. రాణి భర్తకు ఈవిషయము చెప్పింది. ఫలదోషముగా పుత్రునే మహేశ్వరుడు అనుగ్ర

హించినట్లు మహారాజు భావించి అచిరకాలములోనే తనకు పుత్రలాభ మవుతుం దని పరమోత్సాహముతో ప్రతీక్షిస్తున్నాడు.

తరంగము : 3-3

వాసవదత్తా గర్భదోహదము

వాసవదత్తకు కామాంశవల్ల గర్భము కలిగింది. ఆమె వదనము కొంచెము పాలిపోయినప్పటికీ కమనీయముగా కనబడుతున్నది. మంత్ర సాధనాదులతో సంబంధించిన ఉపాసకుల కథలు వినవలెనని ఆమెకు కుతూహలము కలగడము ప్రారంభించింది. తాను ఆకాశములో సంచారము చేస్తున్నట్టూ, విద్యాధరాంగనలు సంగీతము పాడుతూ తనకు సేవలు చేస్తున్నట్టూ ఆమె కలలు కంటున్నది. జాగ్రదవస్థలో కూడా ఆకాశములో విహారాలు చెయ్యవలెననీ, భూమిమీదికి చూస్తూ ఉండవలెననీ ఆమెకు ప్రబలవాంఛ కలుగుతున్నది. అనేక మోహశక్తులు కల యౌగంధరాయణుడు ఇంద్రజాల, మంత్ర, తంత్రాదులతో ఆమె కోరిక నెరవేర్చుతున్నాడు. వాసవదత్త ఆకాశవిహారాలు చేస్తుంటే పౌరస్త్రీలు ఊర్ధ్వదృష్టితో ఆశ్చర్యముతో ఆమెను విలోకిస్తూ ఉంటారు. విద్యాధరులచరిత్ర వినవలె నని రాణి ఒకనాడు కోరితే, యౌగంధరాయణుడు అక్కడివా రందరూ వినేలాగ ఈకథ చెప్పినాడు.

జీమూతవాహనుని కథ

హిమవత్పర్వతాలలో విద్యాధర చక్రవర్తి అయిన జీమూతకేతువు నివసిస్తున్నాడు. అతని ఇంటిలో వంశపారంపర్యముగా కల్పవృక్షము ఉంటున్నది. కల్పవృక్షము సమస్తకోరికలనూ సఫలము చేస్తుంది. ఒకరోజున విద్యాధరచక్రవర్తి ఆ కల్పవృక్షాన్ని దేవతా

స్వరూపముగా భావించి 'దేవా! నీవల్ల మాకోరికలు నెరవేరుతున్నవి. కుమారులు లేని నాకు పుత్రుణ్ణి ప్రసాదించ' మని ప్రార్థించినాడు. ఆ వృక్షము అందుకు అంగీకరించి, 'ఓరాజా! నీకు దానవీరుడు, సర్వ భూతహితు డయిన కుమారుడు కలుగు లా' డని అనుగ్రహించింది. జీమూతకేతువు కల్పవృక్షానికి ప్రణామము చేసి, ఇంటికి వెళ్ళి పట్టపు దేవితో ఆ వృత్తాంతమును చెప్పి వీనులకు విందు చేసినాడు. తరువాత అతనికి జీమూతవాహను డనేకుమారుడు కలిగినాడు. ఆ కుమారుడు అతి బలవంతు డై సర్వభూతహితు డై దినదినప్రవర్ధమాను డవుతున్నాడు. క్రమేణా కొంతకాలానికి జీమూతవాహనుడు యువరాజై తండ్రిని సంతోషపెట్టి శుశ్రూషచేస్తూ ఇలా అన్నాడు: "తండ్రీ! కనపడే వస్తువులు అన్నీ శాశ్వతంగా ఉండవని నాకు తెలుసును. మహాత్ముల నిర్మల కీర్తి మాత్రము చిరకాలము ఉంటుంది. ఆకీర్తే పరోపకారము వల్ల లభిస్తే ఇక దానిసంగతి వేరే చెప్పవలెనా? పరోపకారముకన్న ఉదారులకు ప్రాణాధిక మైనధనము ఏ మున్నది? మనపెరటిలో ఉన్నకల్ప వృక్షము పరులకు ఉపయోగించినప్పుడే, దానిఫలమును అనుభవించిన వాళ్ళమవుతాము. ఈ కల్పవృక్షమువల్ల పేదవారి కడుపుమంట పోగొడతాను."

అధీరుడు ఇలా పలికేప్పటికి కల్పవృక్షము భూమిమీద బంగారము వర్షించింది. జన మంతా సంతోషించారు. జీమూతవాహనునికీర్తి అన్నిదిక్కులా వ్యాపించింది. 'దయాళువు' బోధిసత్త్వాంశ డయిన జీమూతవాహనుడుతప్ప మరెవ్వడు కల్పవృక్షాన్ని యాచకులకు ఇవ్వగలడు?" అని అంతా అతన్ని పొగడినారు.

జీమూతవాహనుని కీర్తివల్ల జీమూతకేతువు సామ్రాజ్యము సుస్థిరముగా ఉండగా, అది సహించలేక దాయాదులు వైరు లైనారు. శుశ్రూశ్యాళువులు అందరూ కలసి అతన్ని ఓడించవలె నని సమకట్టినారు.

అప్పుడు జీమూతవాహనుడు తండ్రితో, "నాయనా ఈశరీరము సీటి మూది బుడగ వంటిది. పెనుగాలిలో దీపమువంటి ఈ సిరిసంపదల వల్ల ప్రయోజన మేమిటి ? దాయాదులతో యుద్ధము చేయడము అనుచితము. రాజ్యాన్ని వదలిపెట్టి వెళ్ళిపోతాను. ఈదీను లంతా బతికి పోతారు. స్వకులనాశనము తప్పుతుంది." అన్నాడు. కుమారుని మాటలు విని తండ్రి "నాయనా ! నేనుకూడా పోవలసినవాడినే. పడుచు వాడివి నీవే రాజ్యమును తృణప్రాయముగా వదిలితే, మునలివాణ్ణి నా కెందుకు? హాయిగా వనానికి వెళ్ళి తపస్సు చేసుకుంటాను" అని దృఢాభిప్రాయము వెల్లడించినాడు. జీమూతవాహనుడు తల్లిదండ్రులను మలయపర్వతానికి తోడ్కొని వెళ్ళినాడు. గంధపు చెట్లతోను సెల యేళ్ళతోనూ ఉన్న సిద్ధాశ్రమములో అతడు తల్లికీ తండ్రికీ యథావిధిగా శుశ్రూష చేస్తున్నాడు.

అక్కడ జీమూతవాహనుడికి సిద్ధరాజకుమారు డయిన మిత్రావసు చకూ స్నేహ మేర్పడ్డది. ఒకనాడు అతడు మిత్రావసునిచెల్లెలిని, తన జన్మాంతరప్రేయసిని ఏకాంతమందు చూచినాడు. ప్రథమదర్శనములో అతడు ప్రియురాలి చూపులలో చిక్కుకున్నాడు. ఇద్దరిహృదయాలూ అనురాగరసములో మునిగిపోయినవి. హఠాత్తుగా త్రైలోక్యపూజితు డయిన మిత్రావసువు జీమూతవాహనునితో "మిత్రమా ! నాకు మలయవతి అనే చెల్లెలు ఉన్నది. ఆమెను నీకు ఇవ్వవలె నని కోరిక. నామాటకు అడ్డు చెప్పకు," అన్నాడు.

జీమూతవాహనుడు, "యువరాజా ! మీచెల్లెలు నాకు పూర్వ జన్మలో భార్య. అప్పుడు నీవు నాస్నేహితుడవు; నారెండోప్రాణానివి. నాకు పూర్వజన్మజ్ఞానము ఉన్నది," అని పలికినాడు. మిత్రావసువు స్నేహితుని జన్మాంతరకథ వినవలె నని కుతూహలము కనబరచినాడు. అప్పుడు జీమూతవాహనుడు తన వృత్తాంతము చెప్ప నారంభించినాడు:

జీమూతవాహనుని జన్మాంతర గాథ

నేను పూర్వము విద్యాధరుణ్ణిగా ఉండి, ఆకాశ మార్గాన హిమాలయ శిఖరము మీదుగా వెళ్ళుతున్నాను. కైలాసశిఖరముమీద శివుడు పార్వతీదేవితో క్రీడాసక్తుడై ఉండి, తనపైగా ఆకాశాన వెళుతున్న నన్ను మానవుడై జన్మించ మని శపించినాడు. ఓలీ! నీవు విద్యాధరిని వివాహము చేసుకొని, కుమారుణ్ణి సింహాసనము మీద కూర్చోపెట్టి తిరిగీ జన్మాంతర జ్ఞానము కలవాడవు అవుతావు. విద్యాధరుడ వవుతావు." అన్న మహేశ్వరుని శాపవశంచేత భూమండలములో వలభీ నగరములో ధనికవైశ్యపుత్రుడినై వసుదత్తుడు అనే నామముతో పెరుగుతున్నాను.

కాలక్రమేణ నాకు యౌవనము రాగా మాతండ్రి రకరకాల సరుకులు ఇచ్చి, వర్తకానికి నన్ను ద్వీపాంతరము పంపినాడు. కొంతకాలము అక్కడుండి స్వస్థలానికి వస్తూండగా అడివిలో దొంగలు కొట్టి నన్ను పూర్తిగా దోచుకొన్నారు. అంతటితో ఊరుకోక నన్ను చండికకు బలి ఇవ్వడానికి దొంగలు సిద్ధపడి, తమ ప్రభు వయిన పుళిందకుని ఎదుట ఉంచినారు. నన్ను చూచేసరికి పుళిందకుని హృదయముకరిగింది. నిర్హేతుకముగా కలిగిన ప్రేమకు, జన్మాంతర ప్రీతి కారణము. అతడు నాకు స్వేచ్ఛనిచ్చి తాను బలికావడానికి సిద్ధపడగా అశరీరవాణి "వద్దా, అలా చెయ్యకు. నీకు ప్రసన్నురాలను. కోరిన కోరిక నెరవేరుస్తాను." అన్నది. అశరీరవాణి పలుకులు విని అతడు సవినయముగా "దేవీ! నీఅనుగ్రహము చాలు. నీవు ప్రసన్నురాలవు అంతకన్న నాకు ఏమి కావాలి! అయినా చిన్నకోరిక కోరుతున్నాను. ఈవైశ్యునితో నాకు జన్మాంతరములో కూడా స్నేహముకలుగును గాక.' అని వేడినాడు. అశరీరవాణి అందుకు అంగీకరించింది. దొంగల బారినుండి నేను తప్పించు

కొని బతుకు జీవుడా అని బైటవడ్డాను. ఈవిషయమంతా నాతండ్రికి చెప్పగా, ఆయన మహోత్సవము చేసినాడు.

కొంతకాలము గడిచినతరువాత దోపిడిసేరముమీద దొంగలరాజయినపులిందకుని కట్టి మా రాజుదగ్గిరికి తీసుకొని వచ్చినారు. అది చూచి పులిందకుడు నాకు చేసిన మహోపకారమును స్మరించి, అతనికి ప్రత్యుపకారము చేసితీరవలె నని సంకల్పించి, నా తండ్రిని బతిమాలుకొని, లక్షద్రవ్యము దండ మర్పించి, నా స్నేహితునికి మరణశిక్ష లేకుండా తప్పించినాను. అతన్ని మా ఇంటికి అతిథిగా తీసుకుని వచ్చి గౌరవించినాను. అతడు వెళ్ళిపోయేప్పుడు మన సంతా నా మీదనే ఉంచి వెళ్ళినాడు. తనకు ప్రత్యుపకారము నేను చేసినందుకు, పులిందకుడు ఉచిత మయిన కానుక ఇవ్వవలె నని ఆలోచించినాడు. మంచి ముత్యాలు సంపాదించడానికి హిమాలయపర్వతాలవద్ద అడవిలో ఏనుగులవేటకు వెళ్ళినాడు. మంచిముత్యాలు ఏనుగుల కుంభస్థలములో ఉంట వని ప్రసిద్ధి. అందుకోసము, నరస్సులో నీరు తాగడానికి ఏనుగులు వస్తవి గదా అని తలచి, విల్లు ఎక్కుపెట్టి పొంచున్నాడు. ఈలోగా చక్కనిచుక్క సింహవాహనమై పార్వతీదేవివలె శివుణ్ణి పూజించడానికి వచ్చింది. ఆమెను చూచి పులిందకుడు "ఎవరో ఈ కన్య! మానవస్త్రీ అయితే సింహమునెక్కి రాగలదా! దివ్యస్త్రీ అయితే నా కెలా కనపడుతుంది! ఈ చక్కనిదాన్ని నాస్నేహితుడికిచ్చి ముడిపెట్టిస్తే ప్రత్యుపకారము చేసినవాణ్ణి అవుతాను. ఈమె దగ్గిరికి పోతాను." అనుకొని ఆమెదగ్గిరికి వెళ్ళినాడు. ఆదివ్యకన్య సింహము దిగి నరస్సులో పద్మాలు కోస్తున్నది. అత డామెకు నమస్కారము చేసినాడు. ఆమె ప్రీతితో కుశలప్రశ్న వేసి "ఎవరు నీవు! ఈ దుర్గమారణ్యానికి ఎలా రాగలిగినావు! ఎందుకు వచ్చావు!" అని అడిగేసరికి అతడు సమాధాన మిచ్చినాడు, "నేను శబరరాజును. చండికాదేవి భక్తుణ్ణి. ఏనుగులను

వేటాడి కుంభస్థలములలో ముత్యాలు సంపాదించ వలె నని వచ్చాను. దేవీ! నిన్ను చూడగనే నాప్రాణమిత్రుడు శ్రీ మంతు డయిన వసు దత్తుడు జ్ఞాపకము వచ్చినాడు. అతడుకూడా నీలాగే రూపయౌవన ములు కలవాడు. అతడు ఏకన్యకరమును గ్రహిస్తాడో ఆమె ధన్యురా లవుతుంది. నీవు తప్పకుండా అతన్ని చేపట్టాలి." పులిందకునిమాటలు ఆమెహృదయాన్ని చూరగొన్నవి. ఆమె వలపువల్ల "ఏడీ నీస్నేహి తుడు; తీసుకురా అతన్ని. అయినా చూతాము" అని అడిగింది.

పులిందకుడు స్వగ్రామము చేరి ముత్యాలు, కస్తూరి మొదలయినవి చాలా బారువలు పట్టించుకొని మాఇంటికి వచ్చినాడు. అమూల్యములైన ఆకానుకలతో పులిందకుడు మాతండ్రికి బహూకరించినాడు. పగలంతా ఉత్సవములో ఉల్లాసముగా గడిచింది. రాత్రివేళ అతడు నాతో రహస్యముగా ఆ కన్యాదర్శనా వృత్తాంతమును నవిస్తరముగా తెలిపినాడు. అతడు నన్ను కూడా తీసుకొని బయలుదేరినాడు. తెల్లవారగానే మాతండ్రి నేను పులిందకునితో వెంట వెళ్ళిపోయినానని తెలుసుకొని, అతని మీద ప్రీతివిశ్వాసముల వల్ల బెంగ పెట్టుకోకుండా ఉన్నాడు. పులిందకుడు నన్ను మంచుకొండ వద్దకు తీసుకొనిపోయినాడు. సంజవేళకు సరస్సు చేరి, మే మిద్దరమూ స్నానము చేసి, తియ్యని వస్తుతిని ఆరాత్రి వనములో కాలము గడిపినాము. సరస్సులో నీళ్ళు తాగి పూలసెజ్జల మీద పవళించాము. మరునాడు ఆకన్య యథాప్రకారముగా సరస్తీరా నికి వచ్చింది. సింహముమీద ఆకన్య ఆసీనురాలై ఉండగా నేను చూచి భయపడ్డాను. ఆసుందరి సింహము దిగి సరస్సులో పువ్వులు కోసి, స్నానముచేసి, శివుణ్ణి ఆరాధించింది. పూజ పూర్తి కాబోయే వేళ నామిత్రుడు పులిందకుడు ఆమెకు నమస్కరించి తనను తెలియపరుచు కొన్నాడు. ఆమె అతన్ని గౌరవించింది. అప్పుడు అతడు ' దేవీ! నీకు తగిన వరుణ్ణి, నాస్నేహితుణ్ణి తీసుకొని వచ్చాను. సెలవయితే ఇప్పుడే

అతన్ని చూపిస్తాను' అని విన్నవించినాడు. 'సరేచూపు' అనేసరికి నన్ను ఆమె దగ్గరికి తీసుకుపోయినాడు. చూచి ఆకన్య స్నేహమువల్ల వశు రాలై "నీసఖుడు మానవుడు కాడు. ఎవరో నన్ను పంచించడానికి వచ్చిన దేవపురుషుడు. సామాన్యమానవునికి ఈరూపము ఎక్కడిది!" అన్నది.

ఆమాట విని ఆమెకు నమ్మకము కలగడానికి ఇలా నేను పలికినాను. "సుందరీ! నిజముగా నేను మనుష్యుడను. నరళ జనులు కపటులై వర్తించరు. వలభీపురములో ధనికుడయిన వర్తకుడున్నాడు. నేను శివ ప్రసాదము వల్ల అతనికి జన్మించాను. నన్ను వసుదత్తుడని పిలుస్తారు. ఈపుళిందకుడు నాఆపదలు తప్పించి స్వయముగా నాతో స్నేహము చేసుకొన్నాడు. ఇదీ నాసంగతి"

నామాటలు విని ఆకన్య సిగ్గుపడి తలవంచి "నాకు స్వప్నములో మహేశ్వరుడు కనపడి 'రేపు నీకు భర్త లభిస్తా' డని వర మిచ్చినాడు. నీవే నాభర్తవు. నీస్నేహితుడు నా అన్న" అంటూ చక్కగా నోటి ముత్యాలు రాలి పడేట్టు మాట్లాడి నన్ను సంతోషపెట్టింది. నా స్నేహితుడినీ ఆదివ్యకన్యనూ మాఇంటికి తీసుకుపోవదలుచు కొన్నాను.

ఆకన్య కనునన్న చేసి నన్ను తనతోపాటు సింహాన్ని ఎక్క మన్నది. నామిత్రునితో సింహము ఎక్కినాను. తోవలో నామిత్రుడు బాణాలు వేసి సంపాయించిన జింకమాంసమే మాకు భోజన మైంది. క్రమేణ మే మంతా వలభీనగరము చేరినాము. అక్కడ సింహముమీద వస్తున్న మమ్మల్ని చూసి ఊరివా రంతా భయపడి, మాతండ్రికి తెలియజేసి నారు. మానాన్న మాకు ఎదురు వచ్చి సంతోషపరవశుడు కాగా నేను సింహము దిగి ఆయనకు ప్రణామము చేసినాను. నన్ను ఆయన దీవించి నాడు. దివ్యకన్యకూడా సింహము దిగి నాతండ్రికి పాదాభివందనము చేసింది. నాతండ్రి పట్టరానిసంతోషముతో పొంగిపోయినాడు. ఆ

రోజుల్లా మాకు పండగ. పులిందకునితో స్నేహము చేయడము, సకల వృత్తాంతము నాతండ్రి తెలుసుకొని ఉత్సవము చేయించినాడు. మర్నాడు ముహూర్తము చూడగా, బంధుజనసమక్షములో ఆదివ్య కన్యను వివాహ మాడినాను.

నాభార్యకు వాహన మైనసింహము పెళ్ళివా రంతా చూస్తూ ఉండగా ఆకస్మికముగా పురుషాకారము ధరించి దివ్యవస్త్రాభరణాలంకృతుడై నాకు నమస్కారము చేసి ఇలా పలికినాడు. "నాది విద్యాధర కులము. నన్ను చిత్రాంగదు డని పిలుస్తారు. ఈకన్య నాకుమార్తె. నాకు ప్రాణాధిక. ఈపిల్లపేరు మనోవతి. దీనిని ఒడిలో కూర్చోబెట్టు కొని ఎప్పుడూ అడవుల్లో తిరుగుతూ ఒకనాడు గంగానదిదగ్గిరికి వెళ్ళి నాను. గంగాతీరాన తపోవనములు అనేకము ఉన్నవి. నేను నదిని దాటుతూండగా నాపుష్పమాల నీళ్ళల్లో పడినది. ఆనీళ్ళల్లో ఉన్న నారదముని వీపుమీద పువ్వులదండ పడడమువల్ల ఆయన కోపించి ఇలా శాప మిచ్చినాడు. 'ఓరీ పాపీ! ఈగర్వమువల్ల నీవు సింహముగా మారి, హిమాలయాలలో ఈకుమార్తెను వీపుమీద మోసుకొని తిరుగుతావు. నీకుమార్తెని మానవుడు ఎప్పుడు వివాహము చేసుకుం టాడో అప్పుడు నీశాపము విరగ డవుతుంది.' శాపమువల్ల నేను సింహ రూపమెత్తి నాకుమార్తెను మోస్తూ హిమాలయవనాలలో తిరుగుతూ ఉండగా, శబరాధిపతి సహాయమువల్ల జరిగినకళ్యాణము నీకు తెలిసే ఉన్నది. కనుక నేను వెళ్ళిపోతాను. మీరు క్షేమంగా నాలుగు కాలాలపాటు వర్ధిల్లాలి. ఇంతటితో నాశాపము తీరింది."

ఇలా అని విద్యాధరుడు ఆకాశమార్గాన ఎగిరినాడు. మా తండ్రికి పట్టరాని సంతోషము కలిగింది. మంచినంబంధము దొరకినందుకు బంధువు లంతా సంతోషించారు. శబరాధిపతి పులిందకుడు చేసిన ఉప కారము ఎవరుమరిచిపోగలరు! అక్కడ రాజుకూడా ఉదారమయిన పులిం

దకుని చరిత్ర విని అతనితో స్నేహము చేసినాడు. మా తండ్రి రాజుకు రత్నాలు కానుకగా అర్పించగా ఆయన సంతుష్టు డైనాడు. అప్పుడు రాజుచేత మా తండ్రి అరణ్యరాజ్యమును పుళిందకునికి ఇప్పించినాడు. నేను దివ్యకన్య అయిన మనోవతితోనూ పుళిందకునితోనూ సుఖముగా అక్కడే ఉన్నాను. పుళిందకుడు స్వదేశాభిమానము విడిచి పెట్టి, మా ఇంట్లోనే ఉండేవాడు. అన్యోన్య మిత్రులకు కాలము క్షణముగా వెళ్ళిపోతూ ఉంటుంది. త్వరలో నా భార్య మనోవతికి హిరణ్యదత్తు డనే కుమారుడు పుట్టినాడు. వాడు మా కులదీపకుడు. అందరికీ కన్నులపండుగ చేస్తూ పెరిగినాడు. తల్లీతండ్రీ మనుమణ్ణి చూసుకొని కృతార్థులై సంతోషించి, విదేహాముక్తి పొందడానికి భాగీరథీతీరానికి వెళ్ళినారు. మా తండ్రి పోయినశోకమువల్ల నేను దుఃఖములో మునిగినప్పుడు, బంధువు లంతా నన్ను ఓదార్చి ఇల్లు అప్పజెప్పారు. ఆ కష్టకాలంలోకూడా ఒకవైపు నా ప్రియురాలి సుందర వదనము, ఒకవైపు పుళిందకుని సాంగత్యమూ నాకు సుఖము కలిగిస్తూ ఉండేవి.

ఇలా ఉంటూ ఉండగా నాకు ముసిలితనము వచ్చింది. వైరాగ్యము కలిగింది. సంసారము నా కుమారునిమీద పెట్టి కాలంజరపర్వతానికి భార్యా సహితముగా వెళ్ళినాను. నా స్నేహమువల్ల పుళిందకుడుకూడా నాతో సీడవలె వచ్చినాడు. అక్కడికి నేను చేరగానే ఈశ్వరశాపమూ, నా విద్యాధర జాతీ జ్ఞాపకము వచ్చినవి. నేను మానవ శరీరము వదిలి పెట్టా లని సంకల్పించి, ఆసంగతి నా భార్యకూ, మిత్రుడికీ చెప్పాను. నాకు జన్మాంతరములోకూడా మనోవతి భార్య కావా లనీ, పుళిందకుడే స్నేహితుడై పుట్టా లనీ తలచి శివధ్యానము చేసి, కొండమీదినుంది పడి శరీరము వదలివేసినాను.

తరువాత జన్మలో నేను ఈ విద్యాధరకులములో జీమూతవాహను డనే పేరుతో జన్మించినాను. శబరాధిపతి అయిన పుళిందకుడవు మిత్రా

వను వనే నామముతో విశ్వావసు వనే సిద్ధరాజుకు శివప్రసాదమువల్ల జన్మించినావు. నా భార్య మనోవతి మలయవతి అయింది. ఈ ప్రకారముగా నీవు నా పూర్వజన్మ స్నేహితుడివి. మలయవతి నాకు పూర్వ జన్మలో భార్య. మన ఇద్దరికీ మళ్ళీ స్నేహము కలిసే సమయము వచ్చింది. అందువల్ల మలయవతిని వివాహము చేసుకుంటాను. అయినా, నీవు ముందుగా వెళ్ళి నా తలిదండ్రులకు తెలియచెయ్యి. వారు అంగీకరిస్తే నీ చెల్లెల్ని చేసుకొంటాను.

మిత్రాక్షి వసువు జీమూత వాహనుడి మాటలు విని సంతోషించి ఆ ప్రకారమే అతని తల్లిదండ్రులకు పెళ్ళిసంగతి చెప్పినాడు. వాళ్ళు కూడా అందుకు సంతోషించినారు. మిత్రాక్షివసువు, పెళ్ళికి కావలసిన సన్నాహాలు చేయించినాడు. జీమూత వాహనుడు యథా విధిగా మలయవతిని వివాహమాడి, మలయ పర్వతము మీద మహావైభవముతో కాలము గడుపుతున్నాడు.

ఒకరోజున అతడు బాధపడి మిత్రాక్షి వసువుతోకూడా సముద్ర తీరాన ఉన్న అరణ్యము చూడాలని షికారు వెళ్ళినారు. అకస్మాత్తుగా 'హా హా పుత్ర' అన్న ఏడుపు వాడికి వినపడగా వాళ్ళు వెళ్ళి చూస్తే ఒక తల్లి, కుమారుని వెంట వెళుతూ దుఃఖిస్తున్నది. కుమారుడు తల్లిని ఏడవ వద్దని వారిస్తున్నాడు. ఈ లోగా మరొక పురుషుడు అక్కడికి వచ్చి ఆ కుర్రవాణ్ణి పెద్ద రాతి మీద కొట్టించి వదలిపోయినాడు. జీమూత వాహనుడు "ఎందుకు నీ తల్లి ఏడుస్తున్నది? ఎవరి పిల్లవాడివి నీవు? నీవేరేమి" అని ప్రశ్నలమీద ప్రశ్న అడగగా ఆ కుర్రవాడు తన వృత్తాంతము వూసగుచ్చినట్లు ఇలా చెప్పినాడు:

"పూర్వము కశ్యపభార్యలయిన కద్రూ వినతలలో కద్రువ సూర్యుని గుర్రాలు నల్లనిరంగు గలవనీ, వినత తెల్లని వనీ వారాహారీ వివాదపడి, ఓడినది రెండవదానికి దాస్యము చేయవలసినదిగా పందెము

వేసుకొన్నారు. విజయోత్సాహంతో అయిన కద్రువ కుమారులతో చెప్పి సూర్యుని గుర్రాలకు విషపూరిత వాలిన్యము చేయించి, వినతకు చూపి ఆమెను దాసీగా చేసుకొన్నది. వినతకుమారుడు తన తల్లిని దాస్యమునుంచి వదల మని కద్రువను మంచిమాటలతో అడిగినాడు. కద్రువ కుమారులు ఆలోచనచేసి "ఓవినతాకుమారా! పాల సముద్రమును దేవతలూ రాక్షసులూ మథిస్తున్నారు. నీవు బలవంతులలో శ్రేష్ఠుడవు. మాకు అమృతము సంపాయించి తెస్తే నీతల్లికి స్వేచ్ఛ ఇస్తాము" అని వాగ్దానము చేసినారు. ఆమాట విని గరుత్మంతుడు క్షీరసముద్రానికి వెళ్ళి అమృతము కోసము అద్భుతంగా పరాక్రమము చూపినాడు. అప్పుడు శ్రీహరి సంతోషించి గరుడునితో "నీవు మహా పరాక్రమశాలి వోయి! వర మడుగు" మన్నాడు. గరుత్మంతుడు విష్ణువుతో "దేవా, కద్రువ, ఆమె పుత్రులు నాగులూ నాతల్లికి స్వేచ్ఛ ఇవ్వడము లేదు. అందువల్ల నా ఆకలి తీరడానికి నాగు లందరూ ఆహారము కావాలి" అంటే ఆవరమును శ్రీహరి ఇచ్చినాడు. ఇంద్రుడు గరుత్మంతుడితో "ఆమూఢులు అమృతాన్ని తాగకుండా ఉండేటం దుకూ నేనే దాన్ని తిరిగి తీసుకొనేవిధము చూసు" అని హెచ్చరించినాడు. గరుత్మంతుడు నాగులదగ్గిరికి వచ్చి "ఇదిగో అమృతము. దీన్ని ఇక్కడే ఉంచి పోతున్నాను. మా అమ్మకు స్వేచ్ఛ యిచ్చి, మీరు అమృతము పుచ్చుకొనండి!" అని పలికినాడు. అతను అమృత కలశాన్ని దర్భాసనముమీద ఉంచినాడు. నాగులు వినతను వదిలి వేసినారు. గరుత్మంతుడు తల్లిని తీసుకొని వెళ్ళగా, నాగులు అమృత కలశాన్ని గ్రహించబోయినారు. ఇంద్రుడు తన ప్రభావమువల్ల వాళ్లను మోహములో పడవేసి, అమృతాన్ని హరించినాడు. పోయిన అమృత కలశము పోనేపోయింది, దర్భలచాపమీద రసంత అమృతము దించి ఉండదా అని నాగులు దానిని నాలుకతో నాకినారు. వాళ్లనాలుకలు

చీలిపోయినవి. గరుత్మంతుడు అమృతమును పోగొట్టుకొన్న నాగులను తినడము సాగించినాడు. అతని రాకవల్ల నాగలోకము భయపడినది. పాతాళలోక మంతా క్షణములో నాశన మవుతుం దేమో నని నాగరాజు వాసుక్షి భయపడి గరుత్మంతునితో "గరుడా, నీకు రోజుకు ఒక నాగుని ఆహారముగా పంపుతాను. ఒక్కసారే పాము లన్నిటినీ చంపి వెయ్యకు. పాతాళలోకానికి రావద్దు. అలా వస్తే నీకు ఆహారము లభించదు. నీవని పా డవుతుంది" అన్నాడు. వాసుకి చెప్పిన విధానానికి గరుత్మంతుడు అంగీకరించి, దినదినమూ ఒక్కొక్క పామును భక్షిస్తున్నాడు. కొంతకాలానికి చాలామంది నాగులు నశించినారు. ఈరోజు నావంతు వచ్చింది. నన్ను శంఖ చూడు డని పిలుస్తారు. నేను వాసుకి ఆజ్ఞవల్ల గరుత్మంతునికి ఆహారమునిమిత్తము ఈ వధ్యశిల ఎక్కినాను. అందుకే మాఅమ్మ లబోదిబో అంటూ ఏడుస్తున్న ది.

శంఖచూడునిమాటలు జీమూతవాహనుని హృదయాన్ని కరిగించి నవి. అప్పుడు జీమూతుడు "అయ్యో! నాగరాజుప్రభుత్వము ఎంత బలహీనంగా ఉంది! తనప్రజలను తనచేతులతో శత్రువుకు ఆహారముగా అర్పిస్తున్నాడు. నాగరాజే గరుత్మంతుడికి ఆహారము ఎందుకు కాకూడదు. తనకులము నాశన మయిపోతూ ఉంటే సాక్షిగా ఉండి చూస్తున్నాడు! ఏ మయిపోయింది అతని పౌరుషము! కశ్యపుని పుత్రుడై పుట్టి తండ్రికి నామర్దా తీసుకొని వస్తున్నాడు! ఈవాసుకికి శరీరము మీద ఎంత అభిమానము! శంఖచూడుడా! నాశరీరాన్ని నాగరాజయిన వానుకివలె భయపడక గరుత్మంతుడికి అర్పిస్తాను. నాశరీరము నీకోసము త్యాగము చేస్తాను." అన్నాడు.

శంఖచూడుడు ధైర్యముతో "మహానుభావా! వద్దు! ఎంతమాత్రమూ నీశరీరము గరుత్మంతుడికి అర్పించ వద్దు. గాజుముక్కకోసము ముత్యమును పోగొట్టుకో వచ్చునా! నేను కులానికి అపకీర్తి తీసుకు

రాలేను.'' అన్నాడు. ఇలా శంఖచూడుడు జీమూతవాహనుణ్ణి వారించి గరుత్మంతుడు ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూస్తున్నాడు. అవసాన కాలము అంతకంతకు దగ్గిరికి వస్తూవుంటే శంఖచూడుడు సముద్రతీరాన ఉన్న గోకర్ణేశ్వరస్వామికి మొక్కడానికి వెళ్ళినాడు.

కరుణానముద్రు డయిన జీమూతవాహనుడు ఆత్మార్పణమువల్ల అన్యుని రక్షించే అవకాశము లభించింది గదా అని సంతోషించినాడు. మహానుభావులశరీరాలు ఇరోపకారార్థమే. జీమూతవాహనుడు యుక్తి చేత మిత్రావసువును ఏదో పనిమీద ఇంటికి పంపినాడు. గరుత్మంతుడు వస్తున్నాడు. అతనిరెక్కలగాలివల్ల భూమి దద్దరిల్లుతున్నది. నాగులకు శత్రువు వస్తున్నా డని గ్రహించి వెంటనే జీమూతవాహనుడు వధ్యశిల యెక్కినాడు. గరుత్మంతుడు ముక్కుతో అతన్ని పట్టుకొని మలయ పర్వతశిఖరానికి ఎగిరిపోతున్నాడు. జీమూతవాహనుని శరీరమునుండి రక్తము చుక్కలుగా భూమిమీద పడుతున్నది. అతని శిరస్సుమీద ఉన్న చూడామణిని గరుత్మంతుడు పెకలించడంవల్ల, అది నేలమీద పడి పోయింది. గరుత్మంతుడు జీమూతవాహనుణ్ణి తింటూ ఉంటే పుష్ప వర్షము కురిసింది! అందుకు అతడు ఆశ్చర్యపడినాడు.

ఈలోగా శంఖచూడుడు గోకర్ణేశ్వరుణ్ణి దర్శించి, రక్తసిక్త మయిన వధ్యశిలాప్రదేశాన్ని చూచి "అయ్యో! అయ్యో! ఆ మహానుభావుడు నన్ను రక్షించాలని తనదేహాన్ని గరుత్మంతునికి అర్పించి నాడు. జీమూతవాహనుణ్ణి ఎక్కడికి తీసుకు పోయినాడో గద! వెతుకుతాను.'' అంటూ నెత్తురుజాడను అనుసరించి వెళ్లినాడు.

గరుత్మంతుడు తనకు ఆహారమై వచ్చిన జీమూత వాహనుని చూచి పరమాశ్చర్యము పొందినాడు. గరుడుడు ముక్కుతో రక్కి, చీల్చివేస్తున్నా అతనికి రవంతకూడా బాధలేదు. పైగా అతడు ఆనంద పడుతున్నాడు. జీమూతవాహనుడు గరుత్మంతునితో "ఓపక్షిరాజా!

వంతముగా ఇక్కడికి తీసుకువచ్చింది" అని విన్నవించినాడు. వాసవ దత్తా స్వప్నము వాస్తవ మవుతున్నందుకు ఆశ్చర్య పడి వత్సరాజు వానిని లోపలికి తీసుకు రమ్మని అనుజ్ఞ ఇచ్చినాడు. తప్పక తనకు పుత్రుడు పుట్టుతా డని విశ్వాసము కలిగి వాసవదత్త సంతోషించింది. అక్కడివారు అందరూ ద్వారము కాసి కుతూహలముతో చూస్తుం డగా ఆస్త్రీ భర్తతోసహా వచ్చింది; వచ్చి, రాణితోకూడా ఉన్న వత్సరాజుకు నమస్కరించి, దైన్యము నటిస్తూ "దేవా, ఈయన నాభర్త. ఏదోపనీ ఎరుగని నాకు అన్నవస్త్రా లిచ్చి పోషించడము లేదు" అని విన్నవించింది. ఆమెభర్త "దేవా, ఈమె నిష్కారణంగా నామీద నేరము మోపుతున్నది. ఏటికి ఏడాది నడిపోయే సమస్త పదార్థాలూ తెచ్చి ఇంట్లో ఇచ్చినాను. బంధువులతో కలిసి ఈమె నన్ను తుదముట్టించా లని ఆలోచిస్తున్నది. సాక్షు లున్నారు. మహా ప్రభూ!" అని మనవి చేసినాడు. వత్సరాజు అతని వాక్కులు ఆలకించిన తర్వాత "వీరే సాక్ష్యముతో పని లేదు. స్వప్నములో స్వామివారే సెల విచ్చినారు. బంధుసమేతముగా ఈ స్త్రీశిరశ్ఛేదము చేయువలసింది" అని ఆనతిచ్చినాడు. అప్పుడు యౌగంధరాయణుడు "దేవా, సాక్షులను పరీక్షించిన తర్వాత నిర్ణయము చేయడము సముచితము. కేవలస్వప్న వృత్తాంతాన్ని ప్రజలు విశ్వసించరు" అని బోధించినాడు. సాక్షులను రప్పించి విచారిస్తే వారు ఆమెదాని మాటలే అసత్యమని స్పష్టముగా విన్నవించినారు. భర్తకు ద్రోహము తలపెట్టిన దౌర్భాగ్యురాలినీ, దాసిబిడ్డ నూ, బంధువులనూ తనదేశములోనుంచి వెళ్ళగొట్టించి ఆసాధు భర్తను దయదలచి, అతడు అన్యవివాహము చేసుకోడానికి తగినంత ధన మిచ్చి రాజు అతనికి సెల విచ్చినాడు.

దుర్దశలో ఉన్నపురుషుని దుష్టభార్య కాకివలె పీకుతుంది; సద్భార్య చెట్టునీడవలె తాపము పోగొట్టుతుంది. అని వత్సరాజు అంటే వసంతకుడు

"దేవా, మైత్రి కాని, వైరము కాని పూర్వజన్మ కర్మానుబట్టి కలుగుతూ ఉంటుంది." అని ఈకథ చెప్ప నారంభించినాడు :

సింహపరాక్రమని కథ

విక్రమచండు డనే వారాణసీప్రభువుకు సింహపరాక్రము డనే ప్రియ సేవకు డుండేవాడు. వాడు యుద్ధములో ద్యూతములో ఎన్నడూ పరాజయము పొందలేదు. అతని భార్య కలహకారిణి సార్థకనామధేయ. కురూప, దుష్టబుద్ధి అయినప్పటికీ భార్యకు అతడు రాజుదగ్గరనుంచి కాని జూదము లో గెలిచి కాని ధనము తెచ్చి ఇస్తూ ఉంటాడు. దానికి ముగ్గురుకొడుకులు. అది యెల్లప్పుడూ అతనితో కలహిస్తూనే ఉంటుంది. కొడుకులుకూడా తల్లిపక్షమే. "నీవు ఎక్కడో తింటావు, ఎక్కడో తాగుతావు. మాకు ఏమీ తెచ్చి ఇయ్యవూ" అని రోజూ పాటపాడుతుంది. కొంతకాలము ఇలా వినీ వినీ ప్రాణముపోకి సింహపరాక్రముడు చెప్పకుండా ఒకనాడు బయలుదేరి వింధ్యవాసినిదేవిని దర్శించా లని వింధ్యాటవికి వెళ్ళినాడు. అక్కడ నిరాహారవ్రతము పూని ఉన్న అతనికి స్వప్నములో అమ్మవారు కనపడి, "వత్సా, నీ. వారాణసికే వెళ్ళు. ఉన్నత వటవృక్షము కనిపిస్తుంది. దానికింద తవ్వితే నిధి కనిపిస్తుంది. గరుడమాణిక్యపాత్రిక కూడా లభిస్తుంది. దానిలోకి చూస్తే ఏజంతువు పూర్వజన్మ చరిత్ర అయినా నీకే చిత్రపటరూపముగా కనిపిస్తుంది. నీపూర్వజన్మ నీభార్యపూర్వజన్మ అందులో చూచి గ్రహించి సుఖముగా ఉండు" అని ఆదేశించింది. ఉదయము భోజనము చేసుకొని సింహపరాక్రముడు క్రమముగా వారాణసి చేరి, ఉన్నత వటవృక్షము కనిపెట్టి, దానికింద తవ్వి నిధి తీసుకొని మణిపాత్రిక బయటికి తీసినాడు. అందులో తనవిషయమూ తనభార్య విషయమూ చూచి, పెనకజన్మలో ఆమె ఎలుగుగొడ్డు అనీ, తాను సింహమనీ, అందుచేతనే తుజన్మలోకూడా

జాతివైరము తప్పలేదనీ గ్రహించి విచారము విడిచిపెట్టినాడు. ఆనుని పాత్రలో చూస్తూ చివరకు సింహశ్రీ అనేపేరు గల కన్యను నిర్ధారణ చేసుకొన్నాడు. ఆమె వెనకటిజన్మలో ఆడసింగము. తమకు ఆనుకూల్యము ఉంటుందని సంతోషించి ఆమెను పెండ్లి చేసుకొని సుఖపడుతూ, మొదటిభార్యకు అన్నవస్త్రాదులకు లోపము లేకుండా సంరక్షిస్తున్నాడు. ఈవిధముగా దంపతులకు పూర్వజన్మసంబంధాన్ని బట్టి ఆనుకూల్యమో ప్రాతికూల్యమో సంభవిస్తుంది.

వసంతకుడు చెప్పిన కథ ఆకర్ణించి వాసవదత్తా వత్సరాజులు ఆనందించారు.

మంత్రికుమారుల జననము

వత్సరాజు మంత్రులకు శుభలక్షణలక్షితు లైన కుమారులు పుట్టినారు : యౌగంధరాయణునికి మరుభూతి, రుమణ్వంతునికి హరిశిఖుడు, వసంతకునికి కపంతకుడు, సితోదితునికి గోముఖుడూ కలిగినారు. "వత్సరాజు పుత్రునకు వీరు మంత్రులవుతారు" అని ఆకాశవాణి ఆనుమయములో పలికింది.

నరవాహనదత్త జననము

తరువాత కొన్నాళ్లకు వాసవదత్తాదేవికి నెలలు నిండినవి. సూతికాగృహమును బిడ్డలతల్లులు చిత్రవిచిత్రముగా అలంకరించినారు. రక్షణార్థము గవాక్షములలో జిల్లేడు, జమ్మిమండలూ ఉంచినారు. గృహములో రత్నప్రదీపములు పెట్టినారు. ఆయుధములు ఉంచినారు. మాంత్రికులు వచ్చి మంత్ర తంత్రములచేత సూతికాగృహమును భూత పిశాచాది భయములు లేకుండా భద్రము చేసినారు. వాసవదత్త శుభ ముహూర్తాన ఆపురుటింట్లో ప్రవేశించి, శుభక్షణములో కుమారుని

కన్నది. అంతఃపురములోవా రంతా ఆనందకోలాహలము చేశారు. ఆంతరంగికపురుషుడు రాజుకు పుత్రోజన్మవృత్తాంతము నివేదించినాడు. రాజు సంభ్రమముతో అంతఃపురానికి వెళ్లి బహుకాల మనోరథ ఫలముగా పుట్టిన పుత్రుని చూచినాడు. శిశువుముఖము పద్మమువలె ఉన్నది. చిన్ని పాదాలలో ఛత్రచామరాది శుభరేఖలు చూచి రాజు ఆనంద బాష్పములు విడిచినాడు. యౌగంధరాయణాదులు హర్షవివశులయినారు. అప్పుడు ఆకాశవాణి "రాజన్, నీకుమారుడు కామదేవాంశను జన్మించినాడు. నరవాహనదత్తుడని నామము, సర్వవిద్యాధర చక్రవర్తి అయి, దివ్యకల్పముపాటు ప్రభుత్వము చేస్తాడు" అని పలికింది. ఆకాశమునుంచి పుష్పవర్షము కురిసింది. దుందుభులు మోగినవి.

దేవతావాణి చేసిన సూచనవల్ల వత్సరాజు మరింత ఆదరముతో ఉత్సవము చేయించినాడు. ఆశ్రితులకు యావన్మందికీ రాజు బహుమతులిచ్చినాడు. మహావైభవముతో పుత్రోత్సవము కొన్నిరోజులు జరిగింది.

దివ్యవాణి పలికినప్రకారమే రాజు పుత్రునకు నరవాహనదత్తుడని పేరు పెట్టినాడు. శిశువు క్రమక్రమముగా పెరుగుతూ తప్పటడుగులు వేస్తూ, చిన్నిచిన్ని ముద్దుమాటలు అంటుంటే తల్లిదండ్రులు ఆనంద పరవశులయ్యేవారు.

మంత్రులు తమశిశువులను రాజశిశువుకు సమర్పించినారు పౌరోహితుడు శాంతికరుడు, పింగళిక కుమారులు శాంతిసోమ వైశ్యానరులను ననుర్పించినారు. రాజదంపతులు ఆచిన్ని బిడ్డలను సత్కరించినారు. నరవాహనదత్తుడు ఆ ఆరుగురుబాలకులతో ఆడుకుంటూ అందరికీ నయనానందకరముగా దినదినప్రవర్ధమానుడవుతున్నాడు.

ప్రథమ సంపుటి

సమాప్తము